UNIVERSAL
LIBRARY
OU_206047
UNIVERSAL
LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 801 V13V Accession No. G.T. 273

Author వఝ్ఝల చిన సీతారామ స్వామి

Title వసుచరిత్ర విమర్శనము

This book should be returned on or before the date last marked below.

శ్రీరస్తు.

# వసుచరిత్ర విమర్శనము.

శ్రీ విజయనగరమహారాజావారి సంస్కృతకళాశాలాపండితు లగు

వఝ్ఝల. చినసీతారామస్వామిశాస్త్రులవారిచే

రచింపఁబడినది.

---

మ. ధనమే పావనమంచు నెంచ కధికద్రవ్యంబు వెచ్చించి జీ
వనముం గూర్చుచు సత్కవీంద్రులకు గీర్వాణాంధ్రసద్వాఙ్మయం
బును దాఁ బెంచుచు దాని సుస్థిరముఁ గా ముద్రించు వావిళ్ల వం
శ్య నధీతాగము వేంకటేశ్వరుని బ్రోచుం గాక శ్రీశుం డిలన్.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారిచేఁ

ప్రకటితము.

కాపీరైటు.] 1915. [రూ. 0—8—0.

PRINTED BY

V. RAMASWAMY SASTRULU & SONS,

AT THE AUDI SARASWATY NILAYA PRESS,

69, MALAYAPERUMALL STREET, MADRAS—1915.

# ఉపోద్ఘాతము.

సాహిత్యరసపోషణుఁ డగు రామరాజభూషణునిచే రచింపఁబడిన ప్రబంధరాజ మగు వసుచరిత్రమునకు విమర్శనమును వ్రాయ నన్ను సన్మానించి ప్రేరించిన శ్రీ వావిళ్ల. వేంకటేశ్వరశాస్త్రులవారి యెడల నెంతయుఁ గృతజ్ఞుఁడ నయియున్నాను.

మహారాజశ్రీ గురుజాడ. అప్పారావు పంతులుగారు. బి. యే., యెమ్. యే. పరీక్షల కిచ్చిన పత్రికలు విమర్శనరూపములయి గ్రంథవిమర్శనమునకు దారిచూపుచున్నవి. వానిలో నీవసుచరిత్ర విషయమునఁ గొన్ని ప్రశ్నములు గలవు. వానిలోని గొన్నివిషయముల నిందు సంగ్రహించినందుల కయి వారియెడలను గృతజ్ఞుఁడ నగుచున్నాను.

గ్రంథవిస్తరభీతిచే నిందుఁ గొన్ని ముఖ్యవిషయములు మాత్రమె విమర్శింపఁబడిన వని గ్రహింపఁజదువరులను బ్రార్థించుచున్నాను.

గుణగ్రహణపారీణు లగుపండితు లిందలిగుణలేశములను గ్రహించి నన్నుఁ గృతార్థునిజేయఁ బ్రార్థించుచున్నాఁడను.

ఇట్లు సుజనవిధేయుఁడు,

విజయనగరము.
20. 8. 1915.

వఝల. చినసీతారామస్వామిశాస్త్రి,
శ్రీవిజయనగరమహారాజావారి సంస్కృతకళాశాలాపండితుఁడు.

## సుందరీవృత్తము.

శ్లో. సుధియాఽపరిపూతమానసౌ
కలయేఽహంజగతః ప్రియంకరౌ,
పితరౌ మమ వేంకటాంబికా
ముఖలింగేశ్వరజంపతీహృది.

## ఉపజాతివృత్తము.

శ్లో. పితామహభ్రాతృసుతం స్వవిద్యా
గురుం చ చింతామణిసత్సమాఖ్యమ్,
శ్రీవత్సగోత్రోద్ధరణ ప్రశస్తం
నమామి నారాయణ సత్కవీంద్రమ్.

శ్రీ ర స్తు.

# వసుచరిత్రవిమర్శనము

## మొదటి భాగము.

### వసుచరిత్రకథావిషయము.

మహాభారతములోని యాదిపర్వమునఁ గల యుపరిచరవసువుచరిత్రములోఁ గొంతిభాగమును మూలముగాఁ జేసికొని మహాకావ్యలక్షణలక్షిత మగు "వసుచరిత్ర" మను నీశృంగారప్రబంధము ప్రబంధాంక రామరాజభూషణమహాకవి రచించెను. భరతవంశకర్తయు, సంస్కృతమహాభారత కృతికర్తయు నగు వేదవ్యాసమునీంద్రుని మాతామహుండగు నుపరిచరవసు వీప్రబంధమునకుఁ గథానాయకుండు.

"ఇతిహాసోద్భవం వృత్త మన్య ద్వా సజ్జనాశ్రయమ్,
చత్వార స్తస్య వర్గా స్స్యు స్తే ష్వేకం చ ఫలం భవే"

త్తను విశ్వనాథపంచాననుని సూక్తిఁ జొప్పున మహాభారతప్రసిద్ధ మగు కథను దృతీయవర్గఫలకముగను, శృంగారరసప్రధానముగను, గవి వర్ణించియున్నాఁడు.

### మహాభారతములోని యుపరిచర వసువుచరిత్రమునకు సారము.

"చేదిదేశాధీశుఁ డగు వసురాజొకప్పుడు వేఁటకై యడవి కేగి యొక తపోవనమునఁ దపం బొనరించుచుండ నింద్రుఁ డేతెంచి యాతని రాజ్యపాలనమునకును దపఃప్రభావమునకును మెచ్చితి ననియుఁ దనతోఁ జెలిమి చేసి స్వర్గంబునకు వచ్చుచుం బోవుచు నుండుమనియుఁ జెప్పెను. మఱియు నాతనికిఁ గనకరత్నమయంబును, గామగమనంబును నగు విమానంబును, దేవత్వంబును, సకలప్రహారణనివారకం బగు నింద్రమాలయను కమలమాలయు, దుష్టశిక్షణ శిష్టరక్షణ క్షమం బయిన వేణుయష్టియు నిచ్చెను. వసురాజావిమానము నెక్కి యుపరిలోకములఁ జరించుటం జేసి యుపరిచరవసుం డనఁ బరఁగె. మఱియు నింద్రమాలాలాంఛితుఁ డై యవ్వేణుయష్టి కేఁటేఁట నింద్రోత్సవము చేయుచు నీశ్వరునకు నింద్రాదిదేవతలకును నతిప్రీతుం డయ్యె. అది మొదలుగ రాజు లెల్లఁ బ్రతివత్సరంబు నింద్రోత్సవము చేయుచుందురు.

అతఁ డట్లతిప్రీతుం డగు నింద్రుని వరంబున నేవురు పుత్త్రులం గాంచి రాజ్యంబు చేయుచు సుఖం బుండె.

అంత నిజపురసమీపంబునఁ బ్రవహించు శుక్తిమతీమహానదిం గామించి నిరోధించి హిమవత్సుతుం డగు కోలాహలుండు తత్పార్శ్వజనపదంబుల కుపప్లవంబు చేయ వసురాజు తనపాదంబున నక్కొండను దలఁగఁ ద్రోసె.

పిదప శుక్తిమతి తనకుఁ బర్వతనిరోధంబును దప్పించినందులకుఁ గానుకగాఁ దత్పర్వతసమాగమంబునఁ దనకుఁ గల్గిన వసుపదుఁ డను పుత్త్రుని, గిరిక యను కూఁతును సమర్పింపఁగా నాతఁ డావసుపదునకు సైన్యాధిపత్య మిచ్చి గిరికను గృహపత్నిగాఁ బరిగ్రహించె'' యను మహాభారతకథ మనవసుచరిత్ర కథకు మూలం బై యున్నయది.

# వసుచరిత్ర కథాసారము.

## 1-వ యాశ్వాసము.

“చేదిదేశాధీశ్వరుఁ డగు వసురా జధిష్ఠానపురమును రాజధానిఁగాఁ జేసికొని ధరాతలమును బరిపాలించుచుండెను. ఒకానొకసమయమున నుద్యానపాలకులు వచ్చి ఫలపుష్పాదులు రాజునకుఁ గానుకలిడి వసంతర్తువిలసిత మగు నుద్యానము రామణీయకమును వర్ణించిరి. అప్పు డాయుద్యానమున విహరించు నభిలాష పొడమి యామహీపాలుం డచ్చోటికి విచ్చేయ నచటి మహీజంబులు దగుసపర్య లొనరించె. అంత నచ్చట విహరించుచుండు సకలవాగ్విశారదుఁ డగు వసురాజున కాసన్న మగు కల్యాణము నొక కిన్నరమిథునము స్వజాతీయోక్తుల విన్నవించి యాసమీపమున నున్న కోలాహలగిరి కేగెను.”

## 2-వ యాశ్వాసము.

“వసురాజు తన క్రీడాశైల మగు నక్కోలాహలమున కరుదెంచి నర్మసఖునితోఁ గలసి యద్దాని వర్ణించుచు విహరించుచుండ మధుర మగు సంగీతధ్వని యొకటి వినవచ్చెను. దాని కచ్చెరువడి యాతఁ డాసంగీత మెవ్వరిదో యారసి రమ్మని నర్మసఖునిం బనుచుటయు నతఁ డేగి యొక దివ్యభవనంబునఁ జెలులచేఁ బరివేష్టింపఁబడి వీణవాయించుచున్న యొక త్రిలోకసుందరిం గని యబ్బురపాటుతో వచ్చి యామె రామణీయకమును వర్ణించి యాసంగీత మాకలభాషిణిదే యని విన్నవించెను. వసురా జాహిత వాక్యము నాలించి సోత్కంఠుం డై మును దా విన్న కిన్నరమిథునసూక్తిఁ దలంచి ముదమందుచు నామె యున్న కోనకు నర్మసచివునితోఁ జనియె. చని యక్కన్యారత్నముం గాంచి యానందాశ్చర్యముల నోలలాడి యమ్మహీకాంతుఁ డక్కాంతారత్నవృత్తాంతం బరయఁ దనమిత్త్రునిం బనిచె. నర్మసఖుండును బనివిని యతివేషంబున వెడలి యక్కాంతలతోఁ జనవునఁ బ్రసంగించుచు గిరికావృత్తాంతము నరయఁ గోరిన నామెచెలికత్తె యగు మంజువాణి యిట్లు చెప్పఁదొడఁగె. వసుమహారాజు రాజధానియగు శుక్తిమతి యను నది ప్రవహించుచుండును. అత్తరంగిణి పన్మజుం గొల్చి మరలి వచ్చుచుండ నొక్కనాఁడు హిమవత్పుత్త్రుం డగు కోలాహలుం డను పర్వతరా జెదురుపడియె. అప్పు డాశుక్తిమతి యోరఁగాఁ దొలఁగిపోవుచుండ నక్కోలాహలుఁ డాయాపగయొప్పిదముం గని మన్మథవశంవదుఁడై చని వేఱొక సమయమున నానదిలోఁ బ్రాలి తనయభిప్రాయ మెఱింగింప నామె సవినయముగఁ బ్రత్యాఖ్యాన మొనరించెను. అంత నతం డామె నడ్డగించి బలాత్కరించుటయు నవ్వాహిని పొంగి పొరలుటఁ దత్పార్శ్వస్థజనపదంబులు సోపద్రవంబు లయ్యె. పిమ్మటఁ దజ్జనపదవాసులచేఁ బ్రార్థితుండై యవ్వసు

మహీనాథుండు తనకాలిబొటనవ్రేల నక్కొండ నెగమీటి జనపదంబులం బ్రోచి యమ్మహీధరంబుం దనక్రీడాశైలంబుగ ననుగ్రహించి మన్నించె."

## 3-వ యాశ్వాసము.

"అపుడు దేవేంద్రుం డరుదెంచి తన వజ్రాయుధముచేయు పర్వతశాసన మమ్మహీపాలుని కాలివ్రే లొనరించుటకు మెచ్చి యాతని చెల్మి గోరి యొక దివ్యవిమాన మిచ్చి యద్దాని నారోహించుచు దివంబునకు వచ్చుచుం బోవుచునుండు మనిన నప్పార్థివుం డవ్విమానంబుఁ బరిగ్రహించె. అంతఁ గోలాహలుని సమావేశంబున శుక్తిమతి గర్భముం దాల్చి వసుపదుఁ డను కుమారుని నిక్కన్యనుం గనియె. ఈమె గిరిక యను పేరఁ బరఁగుచుండు" నని మంజువాణి విన్నవించిన నమ్మాయామానినియుఁ గొంతతడవు మిథ్యాధ్యానంబు నటించి 'యక్కన్యను వసురాజు పరిగ్రహించు'నని చెప్పి యక్కాంతల నలరించె. అంత వారు మిగుల సంతసించియు "నమ్మహీకాంతుం డిప్పారింతంబున కెప్పు డేల వచ్చు? వచ్చి యుక్కాంత నెట్లు పరిగ్రహించు?" నని సోత్కంఠలై యడిగిరి. అప్పు డక్కపటజటిలుండు తన మంత్రశక్తి 'నిప్పుడ యవ్వసురాజు నిచటకు రప్పింతు' నని పల్కి మాయాజపం బొనరించి 'మద్ధ్యా' యని వచించుటయు నంతవఱకు లతాంతరితగాత్రుండై యాస్వత్తాంత మెల్ల నారయుచున్న వసురాజిదియ యదన యని యచ్చోటున కేగుదెంచె. అపుడు పరస్పరమును సానురాగముగ నీక్షించుకొనుచున్న గిరికావసురాజుల మంజువాణీ ప్రభృతులు సరసముగఁ బ్రశంసించుచుండ నక్కపటమౌని వారి దీవించి యాలఁ జని ఋషివేషంబు డించి నర్మసఖుని రూపంబున మరల రాజునొద్ద కేతెంచెను. అంత కలహంసి యను చేటి యొకతె యరుగుదెంచి ఋషిదత్తంబు లగు కల్పకుసుమంబు లొసంగ శుక్తిమతి నీరాకం గోరియున్నదని విన్నవించి యగ్గిరికం దోడ్కొనిచనియె. గిరికయు సానురాగంబుగ నేమేమో మిషలను గల్పించుకొని రాజువైపు చూచుచు నేగెను. అపుడు వసురాజు విరహాకులుండయి గిరికాకేళీభవనాదులకుం జని పరిపరివిధంబుల విరాళి నొందుచుండఁ గేళీసచివుం డూరడించి యాతనిం దోడ్కొని పురంబునకుం జనియె. గిరికయు వసురాజువియోగంబున నెంతయుం బొగులుచు నొంటిగ నుపవని కేగి యచ్చట విరహాగ్నికిం దాళఁజాలక మేను దొఱఁగంగ నెంచి సాహసంబు లొనరించుచుండ నామె నన్వేషించుచుఁ జెలు లచ్చటికేతెంచి యామెం గని యోదార్చిరి. పిదప నెచ్చెలు లవ్వనరామణీయకము వర్ణించియుఁ, బుష్పాపచయజలక్రీడాదు లొనరించియుఁ గాలంబు గడపుచు నామెం బ్రోవుమని మన్మథు నారాధించిరి. అపు డామదనసేవాసమయంబున నచ్చపలాక్షికిఁ బుష్పాయుధుండు పొడకట్టి నట్లగుట నమ్మగువ సొమ్మసిలినఁ దొట్రుపడి చెలులు శీతలోపచారాదులం చేర్చి కేళీభవనంబునకుం దోడ్కొని చనిరి."

## 4-వ యాశ్వాసము.

"అపుడు సూర్యుఁ డస్తమింపఁ గ్రమ్మిన యిరులు విరియ సుధామరీచి యేతెంచి గగనరంగంబు నలంకరించె. ఆచందమామ వెలుంగుల యంపజల్లున కోర్వఁజాలక యారాజీవలోచన శీతమరీచి మలయానిల మదనుల నుపాలంభించుచు విరాళిఁ దూలి యెల్గెత్తి యేడువసాగెను. అప్పు డత్తన్విని మందలించి మంజువాణి వసురాజుమనం బరయఁ గోరి యాకాశగమనంబున నధిష్ఠానపురి కేగి విరహాకులుం డగు వసున్నృపాలుం గని సంతసించి తన్మంచపాంచాలికలలోఁ దా నొకటియై యప్పార్థివుమాటలు వినఁజొచ్చెను. అపు డాధరాధినాథుం డయ్యచలాత్మజామనఃకాఠిన్యంబు నెంతయు నుపాలంభించుచుండ నమ్మంజువాణి గిరికదగ్గఱనుండి తాను దెచ్చిన హారముచే నానృపాలుకంఠము నలంకరించి నిజ

రూపమున నిల్చి గిరికావిరహావస్థను విన్నవించి గురుపరవశ యగు నక్కన్య యుపాలంభార్హ గానేర దని ప్రసంగించెను. అప్పు డవ్వసుంధరారమణుం డెంతయు నానందించి తనమిత్త్రుం డగు గోత్రశాసనుం డెల్లి వివాహసంఘటనార్థంబుగఁ గోలాహలునొద్దకు రాఁగలం డని వచించి యాత్మానురాగసూచకంబుగ నొక పద్మరాగమణిఖచితం బగు నుంగరం బొసంగె. మంజువాణియు నయ్యంగుళీయకముం గొనివచ్చి యాత్మవృత్తాంత నివేదనపూర్వకంబుగ గిరిక కొసంగ నామె యెంతయు నూరటఁ గాంచి సంతోషపరవశ యయ్యె. శుక్తిమతీకోలాహలులును నీవృత్తాంతము సాంతముగా నాలీముఖంబున విని యానందసాంద్రు లయిరి. అంతఁ బ్రభాతం బగుటయు నరవిందబాంధవుండు ప్రాచీదిశాముఖంబు నలంకరించె."

## 5-వ యాశ్వాసము.

"అంత నింద్రుండు సపరివారంబుగఁ గోలాహలునొద్ద కరుదెంచి యాతనిచేఁ బూజితుండయి పరస్పరోపసర్పణానంతరమున వసురాజునకు గిరిక నిచ్చి వివాహము చేయుమనుటయుఁ గోలాహలుం డంగీకారపురస్సరంబుగ నపరిమితానందసుఖంబు ననుభవించె. పిదప నానానదులును గిరులును దద్వివాహమహోత్సవ దర్శనమునకై తేర నింద్రుండు కోలాహలునకు నచట నొకదివ్యపురంబు నిచ్ఛావశంబునం గల్పించె. మఱియు నమ్మహేంద్రుండు కోలాహలు నామంత్రణంబుచేసి వసురాజు నొద్దకుం జని య వ్వివాహవృత్తాంతమున నాతనికి శ్రోత్రపర్వ మొనరించుటయుఁ దద్వసురాజామాత్యుల యనుజ్ఞచేఁ బురం బలంకృతం బయ్యె. నానాదేశరాజులు నాహూతులై యరుదెంచిరి. పిదప నింద్రానుమతిని సురాంగనలు వచ్చి వసురాజుం బెండ్లికొమరుం జేసిరి. దేవతలు బహువిధాభరణంబు లొసంగ గిరిశాసనుండు నగ్గిరిశాసనునకు దివ్య మగు కమలమాల నొసఁగి యలంకరింప దేవదుందుభులు మొరసె. అటఁ గోలాహలపురంబునఁ దద్ధ్వనిశ్రవణంబునఁ బ్రేరితలయి యంగనలు గిరికం బెండ్లికూఁతుఁ గావించిరి."

## 6-వ యాశ్వాసము.

"అనంతరము శచ్యాదులు గిరికకు నానావిధభూషణము లొసంగి యలంకరింప సూర్యాస్తమయం బగుటయు వసురాజు సపరివారంబుగ గిరివ్రజంబునకుఁ దర్లి వెడలెను. గిరివ్రజపురస్త్రీలు వసురాజుం గని యానందించుచుండఁ గోలాహలుం డెదురేగి సబహుమానంబుగఁ దోడ్కొనిపోయి యథావిధిగ గిరిక నిచ్చి వివాహ మొనరించెను. పిమ్మటఁ బ్రభాతం బగుడు దేవత లనేకవరంబు లొసంగిన నింద్రుండును వసురాజునకు దుష్టశిక్షణ శిష్టరక్షణ క్షమం బగు నొక దివ్యవేణుయష్టి నొసంగెను. వివాహమహోత్సవమున కరుగుదెంచిన బంధుమిత్త్రాదు లందఱును గోలాహలునిచే సత్కృతులయి తమ తమ యిక్కలకుం జనిరి. పిదప శుక్తిమతీకోలాహలులు గిరికకు బుద్ధులు గఱపి గారవించి పలువిధంబు లగు సరణంబు లొసంగి వసురాజుతో నధిష్ఠానపురంబున కనిపిరి. అధిష్ఠానపురస్త్రీ లద్దంపతులను సప్రేమబహుమానంబులం గని యానందించిరి. వసురాజును గృహప్రవేశానంతరమున బంధువులను సత్కారపురస్సరంబుగ ననుపుటయు నొకదివ్యముహూర్తంబునఁ జెలులు కేళీగృహ మలంకరించి గిరికావసురాజులకు సమాగమమహోత్సవం బొనరించిరి. వసురాజును గిరికతోఁ బలువిధంబులగు సౌఖ్యంబు లనుభవించుచు లోకహితంబుగ రాజ్యపాలనం బొనర్చుచు సుఖంబుండె" నని యిట్లు రామరాజభూషణునిచేఁ గథ రచింపఁబడినది.

మొత్తముమీఁద నరయఁగా గ్రంథములోని వర్ణనలయుఁ గల్పనలయుఁ జాతుర్యము మిగుల శ్లాఘ్యముగ నున్నయది గాని కథాసంవిధానమం దంతఁగాఁ బస కానరాదు. ఇందు రసపోషణమునకై మూలకథయందుఁ గొన్ని యలంతిమార్పులు చేయఁబడినవి. ఇంద్రుఁడు వసురాజుతపంబునకు మెచ్చి

విమానాదు లిచ్చె ననుటకంటె వసురాజు కోలాహలు నెగమీటిన యద్భుతకృత్యమునకు మెచ్చి దివ్య విమానంబు నిచ్చె ననుట నాయకప్రతాపసూచకమై సరసముగ నుండునుగదా? ఇట్లే వసురాజు వివాహకాలమున నలంకరణార్థమయి దివ్యమాలయు, వరము లిచ్చుసమయమున వేణుయష్టియు, నిచ్చుట సైతము సరసముగనే యున్నది. వసురాజునకు వేఱుగ సంతానాదికము గల దను మొదలగు విషయములు కథ కంతగా నుపచరింపకుండుటచే విడువఁబడినవి. వసురాజు వేఁటకేగుట యచ్చట గిరికాస్మరణమున నేతశ్శ్వలన మగుట మొదలగు భారతములోని యంశములు కథానాయకుని ధీరోదాత్తతకు భంగము గలిగించునవియు గిరికాసమావేశానంతరభావులును నగుటచే విడువఁబడినవి. కవి శాకుంతలము నందలి కాళిదాసుని రీతి ననుసరించి వలికత్తెచే గిరికాజన్మవృత్తాంతము చెప్పించెను. అందును రాజుతోఁ జెప్పించుటకన్న సరసముగ నుండునట్లు ప్రచ్ఛన్నుఁడై రాజు వినుచునుండ మునివేషధారియగు నర్మసచివునితోఁ జెప్పించెను.

కేవలము కల్పింపఁబడిన కథలు బొంబాయిముత్యములు మొదలగువానివలె విలువ లేనివనియుఁ, గేవలపురాణకథ లనలంకృతము లగుటంజేసి వంకలు తీర్చి బాగుచేయని మంచిముత్యములవలె హృద్యములు కానేర వనియు, మహాకవులు మూలకథల నిట్లు సందర్భానుసారముగ మార్చుచుందురు. ఈయభిప్రాయమునే రామరాజభూషణుఁడు వసుచరిత్రమున వెల్లడిచేసియున్నాఁడు.

ఉ. కేవలకల్పనాకథలు కృత్రిమరత్నము లాప్యసత్కథల్
వావిరి పుట్టురత్నము లవారితసత్కవికల్పనావిభూ
షావహపూర్వవృత్తములు సానలఁ దీరిన జాతిరత్నముల్
గావున నిట్టి మిశ్రకథ గా నొనరింపుము నేర్పుపెంపునన్.

ఆ. 1. ప. 19.

సంస్కృతభాషయందు శ్రవ్యకావ్యములు రచించుటలో నిట్టి మార్పులు లేకున్నను గ్రమక్రమాగత నాగరకతావిశేషంబున దృశ్యకావ్యములందు విపులముగా నగపడుచున్నవి. మఱియు నిట్లు మార్చుట యావశ్యకమని నాటకలక్షణకర్తలు చెప్పియున్నారు.

"యత్తత్స్యా దనుచితం వస్తు నాయకస్య రసస్య వా,
విరుద్ధం తత్పరిత్యాజ్య మన్యథా వా ప్రకల్పయేత్." అని సాహిత్యదర్పణమునఁ జెప్పఁబడియున్నది. ప్రబంధములు రచించుటలో సంస్కృతభాషయందు నయితము కవికిఁ గేవలము స్వేచ్ఛనీయకమున పూర్వులు కొన్నినిబంధనములు చేసియున్నారు. ఈనిబంధనము లప్పటికిఁ బ్రసిద్ధములుగా నుండు మహాకావ్యములలోని రీతుల ననుసరించి లక్షణకర్తలుచేసియుందురు. కాని యట్టి విమర్శనము లేక యిటీవలివారి కవి యనుల్లంఘనీయము లగు విధు లైనవి.

"సర్వే నాటకసంధయో" యను సూక్తిచెప్పున
"ముఖం ప్రతిముఖం గర్భ నిమర్శ ఉపసంహృతి"

యను సంధిపంచకము వెలయునట్లు కథ సందర్భపఱుపవలయును గానఁ దఱచుగా నన్నిశృంగారకావ్యములందును మొదట నాయికానాయకుల యనురాగోత్పత్తియుఁ బిదపఁ గొంతవఱకుఁ దదభివృద్ధియు వర్ణింతురు.

"న వినా విప్రలంభేన సంభోగః పుష్టి మశ్నుతే"

యనుసూక్తి ననుసరించుచు నడుమ నాయికానాయకుల కేదో యొకరీతి వియోగమును వర్ణించి విమర్శసంధిని నిర్వహించెదరు. తుద నుపసంహృతిసంధిరూప మగు నాయికానాయక సమావేశము వర్ణింపఁబడును. ఈరీతిని సుఖపర్యవసాయికావ్యములేగాని యాంగ్లకావ్యములవంటి దుఃఖపర్యవసాయి కావ్యము లుండుటకు వీలుపడకుండుటచే నట్టి యద్భుతకావ్యములు కొన్ని మనవాఙ్మయమున లేక పోవలసివచ్చెను.

"సంధ్యా సూర్యేందు రజనీ ప్రదోష ధ్వాంత వాసరాః,
ప్రాత ర్మధ్యాహ్న మృగయా శైల ర్తు వన సాగరాః;
సంభోగ విప్రలంభౌ చ ముని స్వర్గ పు రాధ్వరాః,
రణ ప్రయా ణోపయమ మంత్ర పుత్త్రోదయాదయః;
వర్ణనీయా యథాయోగం సాంగోపాంగా అమీ ఇహ."

యను కావ్యలక్షణముచొప్పున సంధ్యా సూర్యోదయాది వర్ణనములును పుర శైలాదివర్ణనములును, "సాంగోపాంగా" యనుటచే రథగజతురగాదివర్ణనములును మహాకావ్యమున నుండవలయును.

"ఆదౌ నమస్క్రియాఽఽశీ ర్వా వస్తు నిర్దేశ ఏవ వా,
క్వచి న్నిందా ఖలాదీనాం సతాం చ గుణకీర్తన" మ్మను సూక్తిచెప్పున గ్రంథాది నిష్టదేవ తాస్తుత్యాదికమును, సుకవిస్తుతి కుకవినిందలును, కృతిపతి కృతికర్తృప్రభృతుల వర్ణనంబులును సర్వ ప్రబంధసామాన్యము లై యున్నవి.

పయి నుదాహరించిన విషయములే గాక యనేకములగు మఱికొన్ని వర్ణనములును నాంధ్రప్ర బంధములం దన్నిటియందును సాధారణముగా నొక్కరీతినే యగపడుచున్నవి. ఇట్టి ప్రబంధరచనా మార్గములు పురాణకవుల ప్రబంధములందును గనఁబట్టుచున్నను శ్రీనాథుని శృంగారనైషధము తరువాతి కవులకుఁ బ్రబంధరచనావిషయమున మార్గదర్శక మయిన ట్లగపడుచున్నది. పిమ్మట మఱికొన్ని ప్రబం ధము లున్నను బిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు శ్రీనాథుని మార్గముల ననుసరించి కొన్నిచోట్ల వానికి వన్నెఁ దెచ్చుచుఁ గొన్ని నూతనమార్గములను ద్రొక్కి శృంగారశాకుంతలమును రచించెను. పిదప నల్లసాని పెద్దనార్యుఁడు పయి రెండుకావ్యముల మార్గముల ననుసరించి యందును ముఖ్యముగాఁ బినవీర భద్రుని శృంగారశాకుంతలములోని కథపట్టులను, వర్ణనములను, ననుసరించి మనుచరిత్ర మనుమహాప్ర బంధమును రచించెను. పయి నుదాహరించిన ప్రబంధములకు, నందును ముఖ్యముగా స్వారోచిషమను సంభవమునకుఁ బ్రతిబింబముగా మన వసుచరిత్రము రామరాజభూషణునిచే రచింపఁబడెను. అయిన నిట్టియనుసృతి యొక్క రామరాజభూషణుఁడే చేసి యుండకుండుటచే నిది యాతని కొక గొప్పలోప ముగఁ బరిగణింపఁబడలేదు. అట్లయినను బయిగ్రంథములందుఁగల యనుసృతు లిటఁ గొంతవఱకుఁ జూపుచున్నాను.

# రెండవ భాగము.

## అనుసృతులు.

| శృంగారనైషధము జ్యోతిష్మతీ ముద్రాక్షరశాల. | శృంగారశాకుంతలము కాకినాడ సరస్వతీ ముద్రాక్షరశాల. ఇందులోమాత్రము రెండవది పేజీసంఖ్య. | స్వారోచిష మనుసంభవము. ఆదిసరస్వతీనిలయ ముద్రాక్షరశాల. | వసుచరిత్రము. ఆదిసరస్వతీనిలయ ముద్రాక్షరశాల. |
|---|---|---|---|
| ఇష్టదేవతాస్తుతి. 1-1 | ఇష్టదేవతాస్తుతి. 1-1 | ఇష్టదేవతాస్తుతి. 1-1 | ఇష్టదేవతాస్తుతి. 1-1 |
| ... ... | గురుస్తుతి. 1-2 | గురుస్తుతి. 1-6 | ... ... |
| సుకవిస్తుతి. 1-7 | సుకవిస్తుతి. 1-2 | సుకవిస్తుతి. 1-7 | సుకవిస్తుతి. 1-9 |
| ... ... | ... ... | కుకవినింద. 1-9 | కువికనింద. 1-11 |
| కృతిపతివర్ణనము. 1-9 | కృతిపతివర్ణనము. 1-2 | కృతిపతివర్ణనము. 1-11 | కృతిపతివర్ణనము. 1-13 |
| పతి కృతిచేయుమని కోరుట. 1-13 | పతి కృతిచేయుమని కోరుట. 1-4 | పతి కృతిచేయుమని కోరుట. 1-14 | పతి కృతిచేయుమని కోరుట. 1-16 |
| కృతిప్రశంస. 1-16 | కృతిప్రశంస. 1-3 | కృతిప్రశంస. 1-14 | కృతిప్రశంస. 1-18 |
| ... ... | చంద్రవర్ణనము. 4-84 | చంద్రవర్ణనము. 1-18 | చంద్రవర్ణనము. 1-22 |
| వంశావతారము. 1-18 | వంశావతారము. 1-4 | వంశావతారము. 1-19 | వంశావతారము. 1-22 |
| షష్ఠ్యంతములు. 1-40 | షష్ఠ్యంతములు. 1-9 | షష్ఠ్యంతములు. 1-43 | షష్ఠ్యంతములు. 1-86 |
| వస్తునిర్దేశము. 1-44 | వస్తునిర్దేశము. 1-9 | వస్తునిర్దేశము. 1-49 | వస్తునిర్దేశము. 1-92 |
| పురవర్ణనము. 2-36 | పురవర్ణనము. 1-9 | పురవర్ణనము. 1-49 | పురవర్ణనము. 1-94 |
| ... ... | చాతుర్వర్ణ్యవర్ణనము. 1-10 | చాతుర్వర్ణ్యవర్ణనము. 1-50 | చాతుర్వర్ణ్యవర్ణనము. 1-97 |
| రథగజతురగాది వర్ణనము. 2-37 | రథగజతురగాదివర్ణనము. 1-11 | ... ... | రథగజతురగాదివర్ణనము. 1-101 |
| ... ... | నాట్యవర్ణనము. 1-11 | ... ... | నాట్యవర్ణనము. 1-104 |
| పురస్త్రీలు. 2-37 | పురస్త్రీలు. 1-11 | పురస్త్రీలు. 1-50 | పురస్త్రీలు. 1-107 |
| పూఁదోఁటలు. 2-37 | పూఁదోఁటలు. 1-11 | పూఁదోఁటలు. 1-50 | పూఁదోఁటలు. 1-108 |
| ... ... | పుష్పలావికలు. 1-11 | ... ... | పుష్పలావికలు. 1-109 |
| ... ... | పుళిందవర్ణనము. 1-15 | పుళిందవర్ణనము. 4-15 | ... ... |
| ... ... | వసంతఋతువు. 2-37 | వసంతఋతువు. 6-27 | వసంతఋతువు. 1-125 |
| ... ... | పుళిందు లడవిని వర్ణించుట. 1-15 | ఎఱుకురా జడవిని వర్ణించుట. 4-15 | వనపాలు రుద్యానమును వర్ణించుట. 1-134 |
| నలుఁ డుద్యానమున కేగుట. 1-67 | దుష్యంతుఁడు వేఁట కేగుట. 1-16 | స్వరోచి వేఁట కేగుట. 4-26 | వసురా జుద్యానమున కేగుట. 1-143 |

మొదటిసంఖ్య యాశ్వాసముది. రెండవసంఖ్య పద్యముది.

| శృంగారనైషధము. | శృంగారశాకుంతలము. | స్వారోచిష మనుసంభవము. | వసుచరిత్రము. |
|---|---|---|---|
| ... ... | ... ... | రథవర్ణనము. 4-28 | గుఱ్ఱమువర్ణనము. 1-144 |
| ఉపవనమున వృక్షాదులు రాజునకు సపర్యలు చేయుట. 1-97 | ... ... | ... ... | వనిలో రాజునకు సపర్యలు. 1-151 |
| కృతిపతిసంబోధనములు. 1-109 | కృతిపతిసంబోధనములు. 1-20 | కృతిపతిసంబోధనములు. 1-81 | కృతిపతిసంబోధనములు. 1-164 |
| ఆశ్వాసాంతగద్యము. 1-112 | ఆశ్వాసాంతగద్యము. 1-20 | ఆశ్వాసాంతగద్యము. 1-84 | ఆశ్వాసాంతగద్యము. 1-166 |
| కృతిపతిసంబోధనములు. 2-1 | కృతిపతిసంబోధనములు. 2-21 | కృతిపతిసంబోధనములు. 2-1 | కృతిపతిసంబోధనములు. 2-1 |
| ... ... | ... ... | మనోరమారోదనము వినఁబడుట. 4-67 | గిరికాగానము వినఁబడుట. 2-13 |
| ... ... | ... ... | ప్రవరుఁడు కోనకేగుట. 2-19 | నర్మసఖుఁడు కోనకేగుట. 2-30 |
| ... ... | ... ... | వరూథినీగృహవర్ణనము. 2-22 | గిరికాగృహవర్ణనము. 2-23 |
| ... ... | ... ... | ప్రవరుఁడు స్త్రీలను జూచుట. 2-25 | నర్మసఖుఁడు స్త్రీలను జూచుట. 2-25 |
| ... ... | ... ... | మాయాప్రవరవేషము. 3-71 | నర్మసఖుని యతివేషము. 2-79 |
| ... ... | ... ... | యతిప్రవరుల సంవాదము. 1-61 | కపటయతిగిరికాదులతో ప్రసంగించుట. 2-80 |
| ... ... | వటుఁడు శకుంతలాజన్మవృత్తాంతమును జెప్పుట. 2-34 | ... ... | మంజువాణి గిరికాజన్మవృత్తాంతము చెప్పుట. 2-97 |
| ... ... | విశ్వామిత్రుఁడు మేనకనుజూచి మోహించుట. 2-40 | వరూథిని ప్రవరునిజూచి మోహించుట. 2-51 | కోలాహలము శుక్తిమతిని జూచి మోహించుట. 2-110 |
| ... ... | విశ్వామిత్రుఁడు మేనకతో రమించుట. 2-40 | వరూథిని ప్రవరునిచేఁ బడుట. 2-67 | కోలాహలము శుక్తిమతిని బలాత్కరించుట. 2-137 |
| ... ... | ... ... | స్వరోచి రాక్షసుని వధించుట. 4-116 | వసురాజు కోలాహలుని జిమ్మివేయుట. 2-153 |
| ... ... | ... ... | దేవదుందుభులు మ్రోఁగుట. 4-118 | దేవదుందుభులు మ్రోఁగుట. 2-156 |
| ... ... | శకుంతలా గర్భవర్ణనము. 4-87 | వరూథినీ గర్భవర్ణనము. 3-118 | శుక్తిమతీ గర్భవర్ణనము. 3-119 |

| శృంగారనైషధము. | శృంగారశాకుంతలము. | స్వారోచిష మనుసంభవము. | వసుచరిత్రము. |
|---|---|---|---|
| ... ... | భరతజన్మము. 4-88 | స్వారోచిజన్మము. 4-5 | వసుపద గిరికల జన్మము. 3-22 |
| ... ... | నామకరణము. 4-88 | నామకరణము. 4-6 | నామకరణము. 3-25 |
| ... ... | భరతుని బాల్యవర్ణనము. 4-89 | మనోరమ బాల్యవర్ణనము. 4-76 | గిరికా బాల్యవర్ణనము. 3-27 |
| నలుని దమయంతి చూచుట. 4-2 | దుష్యంతుని శకుంతల చూచుట. 2-33 | ప్రవరుని వరూథిని చూచుట. 2-28 | వసురాజును గిరిక చూచుట. 3-49 |
| దృష్టివర్ణనము. 3-146 | దృష్టివర్ణనము. 2-33 | దృష్టివర్ణనము. 5-81 | దృష్టివర్ణనము. 3-49 |
| దమయంతి తెరచాటున కేగుట. 4-97 | ... ... | వరూథిని పోకబోదెను జేరుట. 2-29 | గిరిక తెరచాటున కేగుట. 3-67 |
| నలవిరహవర్ణనము. 1-83 | దుష్యంతవిరహము 2-43 | ... ... | వసురాజువిరహము 3-79 |
| దమయంతీవిరహవర్ణనము. 2-109 | శకుంతలా విరహవర్ణనము. 3-54 | వరూథినీవిరహవర్ణనము. 3-6 | గిరికావిరహవర్ణనము. 3-99 |
| ... ... | ... ... | వరూథిని వని కేగుట. 3-29 | గిరిక యుపవని కేగుట. 3-116 |
| ... ... | ... ... | వరూథిని శరీరము విడువ సాహసించుట. 3-31 | గిరిక శరీరము విడువ సాహసించుట. 3-117 |
| ... ... | ... ... | చెలులు వరూథిని నోదార్చుట. 3-32 | చెలులు గిరిక నోదార్చుట. 3-121 |
| ... ... | ... ... | చెలులు వనవర్ణనము చేయుట. 3-74 | చెలులు వనవర్ణనము చేయుచుఁ బ్రొద్దు పుచ్చుట. 3-133 |
| ... ... | పుష్పాపచయము. 2-39 • | పుష్పాపచయవర్ణనము (రగడ). 3-84 | పుష్పాపచయము (వృషభగతిరగడ.) 3-149 |
| ... ... | ... ... | జలక్రీడ. 3-85 | జలక్రీడ. 3-156 |
| దమయంతిమూర్ఛ. 2-139 | శకుంతలమూర్ఛ. 3-72 | వరూథినిమూర్ఛ. 3-52 | గిరికమూర్ఛ. 3-179 |
| శిశిరోపచారములు. 2-140 | శిశిరోపచారములు 3-72 | శిశిరోపచారములు. 3-52 | శిశిరోపచారములు. 3-180 |
| ... ... | సూర్యాస్తమయవర్ణనము. 3-66 | సూర్యాస్తమయవర్ణనము. 3-10 | సూర్యాస్తమయవర్ణనము. 4-4 |
| ... ... | ... ... | చక్రవాకవర్ణనము. 3-16 | చక్రవాకవర్ణనము. 4-9 |
| సాయంసంధ్య. 8-152 | ... ... | సాయంసంధ్య. 3-17 | సాయంసంధ్య. 4-7 |
| చీఁకటి. 8-164 | చీఁకటి. 3-66 | చీఁకటి. 3-18 | చీఁకటి. 4-10 |
| చుక్కలు. 8-158 | చుక్కలు. 3-67 | చుక్కలు. 5-34 | చుక్కలు. 4-15 |
| ... ... | ... ... | తూర్పు తెల్లపడుట. 3-20 | తూర్పు తెల్లపడుట. 4-16 |

| శృంగారనైషధము. | శృంగారశాకుంతలము. | స్వారోచిషమనుసంభవము. | వసుచరిత్రము. |
|---|---|---|---|
| చంద్రోదయవర్ణనము. 8-167 | చంద్రోదయవర్ణనము. 3-67 | చంద్రోదయవర్ణనము. 3-21 | చంద్రోదయవర్ణనము. 4-17 |
| ... ... | ... ... | వెన్నెలవచనము. 3-28 | వెన్నెలవచనము. 4-23 |
| చంద్రోపాలంభము. 2-121 | చంద్రోపాలంభము. 3-70 | చంద్రోపాలంభము 3-35 | చంద్రోపాలంభము. 4-26 |
| మన్మథోపాలంభము. 2-134 | మన్మథోపాలంభము. 3-71 | మన్మథోపాలంభము. 3-45 | మన్మథోపాలంభము. 4-37 |
| ... ... | మలయానిలోపాలంభము. 3-71 | మలయానిలోపాలంభము. 3-49 | మలయానిలోపాలంభము. 4-44 |
| దమయంతిఏడ్పు.48-87 | ... ... | వరూథినియేడ్పు. 2-70 | గిరికారోదనము. 4-52 |
| ... ... | ఆకాశయానము (సం) | ... ... | ఆకాశయానము. 4-59 |
| భీమరాజునంతిపురమున నలుని తిరస్కరిణీ స్థితి. 3-82 | ... ... | ... ... | వసురాజునంతిపురమున మంజువాణీ తిరస్కరిణీ స్థితి. 4-88 |
| వేకువ. 8-4 | వేకువ. 3-72 | వేకువ. 3-53 | వేకువ. 4-125 |
| కోడికూఁత. 7-198 | కోడికూఁత. 3-72 | కోడికూఁత 3-55 | కోడికూఁత. 4-126 |
| సూర్యోదయము. 8-8 | సూర్యోదయము. 3-73 | సూర్యోదయము. 3-59 | సూర్యోదయము 4-130 |
| దమయంతిని జూచి దేవతాస్త్రీలు లజ్జించుట. 3-36 | ... ... | ... ... | గిరికను జూచి దేవతాస్త్రీలు లజ్జించుట. 5-14 |
| హంస పెండ్లిమాటలాడుట. 2-50 | ... ... | ... ... | ఇంద్రుఁడు పెండ్లిమాటలాడుట. 5-22 |
| ... ... | ... ... | పెండ్లికాహూతులయి గంధర్వులు వచ్చుట. 5-55 | పెండ్లికాహూతులయి రాజులు,నదులు,కొండలు వచ్చుట. 5-68 |
| నలుని పెండ్లికొమరునిఁ జేయుట. 6-48 | ... ... | స్వరోచిని పెండ్లికొమరునిఁ జేయుట. 5-56 | సురాంగనలు వసురాజును పెండ్లికొమరునిఁ జేయుట. 5-73 |
| దమయంతినలంకరించుట 6-38 | ... ... | మనోరమనలంకరించుట. 5-72 | గిరిక నలంకరించుట. 5-106 |
| సూర్యాస్తమయము. 8-152 | ... ... | సూర్యాస్తమయము. 5-31 | సూర్యాస్తమయము. 6-3 |
| చీఁకటి, చుక్కలు, చంద్రోదయము.8-158 | ... ... | చీఁకటి, చుక్కలు, చంద్రోదయము.5-34 | చీఁకటి, చుక్కలు, చంద్రోదయము.6-4 |
| పురస్త్రీలు నలునిఁ జూచుట. 6-63 | ... ... | పురస్త్రీలు స్వరోచిని జూచుట. 5-60 | వసురాజును గోలాఘల పురస్త్రీలు చూచుట. 6-10 |

| శృంగారనైషధము. | శృంగారశాకుంతలము. | స్వారోచిష మనుసంభవము. | వసుచరిత్రము. |
|---|---|---|---|
| లాజలు చల్లుట. 7-20 | ... ... | లాజలు చల్లుట. 5-71 | లాజలు చల్లుట. 6-17 |
| దముఁ డెదురేగుట. 6-85 | ... ... | ఇందీవరాక్షుఁ డెదురేగుట. 5-74 | కోలాహలుఁ డెదురేగుట. 6-18 |
| మధుపర్కపారణము. 6-88 | ... ... | మధుపర్కపారణము. 5-77 | మధుపర్కపారణము. 6-22 |
| ... ... | ... ... | మనోరమను వివాహవేదికకుఁ దెచ్చుట. 5-73 | గిరికను వివాహవేదికకుం దెచ్చుట. 6-23 |
| ... ... | ... ... | తెరతీయుట. 5-79 | తెరతీయుట. 6-24 |
| ... ... | ... ... | కన్యాదానము. 5-78 | కన్యాదానము. 6-26 |
| ... ... | ... ... | మంగళసూత్రము. 5-88 | మంగళసూత్రము 6-27 |
| ... ... | ... ... | తలంబ్రాలు. 5-84 | తలంబ్రాలు. 6-28 |
| హోమవర్ణనము. 6-101 | ... ... | లాజహోమము. 5-89 | లాజహోమవర్ణనము. 6-30 |
| ... ... | ... ... | సప్తపాదములు. 5-93 | సప్తపాదములు. 6-32 |
| అరుంధతి. 6-101 | ... ... | అరుంధతి 5-95 | అరుంధతి. 6-33 |
| ... ... | ... ... | ఆశీర్వచనములు. 5-95 | ఆశీర్వచనములు. 6-34 |
| కన్యాదానకాలమునఁ గట్నములు. 6-92 | ... ... | కట్నములు. 5-96 | కట్నములు. 6-35 |
| సూర్యోదయము. 8-9 | ... ... | సూర్యోదయము. 5-40 | సూర్యోదయము. 6-41 |
| దమయంతికి బుద్ధులు చెప్పుట. 7-7 | శకుంతలకుఁ గణ్వుఁడు బుద్ధులు చెప్పుట. 4-90, 92 | ... ... | గిరికకుఁ దండ్రి బుద్ధులు చెప్పుట. 6-54 |
| దంపతులను బురస్త్రీలు చూచుట. 7-21 | ... ... | ... ... | పురస్త్రీలు వధూవరుల నీక్షించుట. 6-64 |
| గృహప్రవేశము. 7-25, 145 | ... ... | గృహప్రవేశము. 5-71 | గృహప్రవేశము. 6-70 |
| కేళీగృహము. 7-148 | ... ... | కేళీగృహము. 6-2 | కేళీగృహము. 6-72 |
| దమయంతి కేళీగృహము చేరుట. 7-145 | ... ... | మనోరమ కేళీగృహము చేరుట. 6-5 | గిరిక కేళీగృహమును జేరుట. 6-75 |
| ... ... | ... ... | చెలులువెడలుట. 6-7 | చెలులువెడలుట. 6-77 |
| సరసప్రసంగములు. 7-160 | ... ... | సరసప్రసంగములు. 6-8 | సరసప్రసంగములు. 6-83 |
| రతివర్ణనము. 7-177 | రతిక్రీడలు. 3-75 | రతివర్ణనము. 3-115 | రతివర్ణనము. 6-91 |
| ఉపరతి. 7-181 | ... ... | ... ... | ఉపరతి. 6-94 |
| విహారములు. 8-32 | ... ... | విహారములు. 3-111 | విహారములు. 6-97 |

ఈరీతినే వసుచరిత్రమార్గముల ననుసరించి యిటీవల రచింపఁబడిన ప్రబంధము లనేకములు గలవు. ఈయనుసృతిలోఁ దొలుదొల్తఁ బూర్వపూర్వప్రబంధముల నుత్తరోత్తరప్రబంధములు వన్నె దెచ్చుచుండుట నిజమే గాని యెప్పటికి నదేరీతిగ ననుసరించుచుండుట ప్రబంధవాఙ్మయమున కొక గొప్ప లోప మనుటకు సందేహము లేదు. అన్ని ప్రబంధములు నొక్క మార్గముననే రచింపఁబడుటచేఁ జదువరులకు విసువుపుట్టి యొకటి రెండు చదివిన వెనుక నితరములఁ జదువువేడుక పుట్టనేరదు.

మఱియుఁ గథపట్టులు పయిరీతిని బరస్పరము ననుసరించి యుండుటయేగాక కొన్నికొన్ని వర్ణనములును బరస్పరానుసారులై యగపడుచున్నయవి. పూర్వకవుల వర్ణనములను వన్నెఁదెచ్చుటకుఁ గావలయుఁ దద్వర్ణనములే యుత్తరోత్తరకవులును జేయుచు వచ్చిరి. కొన్నియెడల సంస్కృతకావ్యముల లోని వర్ణనము లాంధ్రీకరింపఁబడియున్నవి. ఇట్లు సంస్కృతకావ్యములలోని వర్ణనము లధికముగా స్వగ్రంథమున మొదటఁ జొనిపినవాఁడు పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు మొత్తముమీఁద మన యాంధ్ర ప్రబంధకర్తలకు స్వపూర్వగ్రంథస్థము లగు కథపట్టులు, కల్పనములు, స్వగ్రంథములఁ జొనుపునట్టియు, నాంధ్రీకరించు నెడల సంస్కృతగ్రంథస్థసమాసాదులుసైతము స్వగ్రంథమునఁ జొనుపునట్టియు వాడుక కలదని చెప్పుట నిర్వివాదాంశము. ఈసంగతి స్పష్టపఱచుటకయి యీక్రింద నట్టి యనుసృతులను జూపుచున్నాను.

## శృంగారనైషధమునందుఁ గల యనుసృతులు.

"గమికర్మీకృతనైకనీవృతా" (నైషధము. స. 2. శ్లో. 41.)

"గమికర్మీకృతనైకనీవృతుఁడనై" (శృం. నై. ఆ. 2. ప. 21.)

"ఈశాణి మైశ్వర్యవివర్తమధ్యే" (నై. స. 3. శ్లో. 65.)

"త్రైయక్షాణిమభూతిసూక్ష్మతరమధ్యా" (శృం. నై. ఆ. 8. ప. 193.)

"అశ్రాంతశ్రుతిపాఠపూతరసనావిర్భూతభూరిస్తవా
జిహ్వా బ్రహ్మముఖౌఘవిఘ్నితనవస్వర్గక్రియాకేళినా." (నై. స. 2. శ్లో. 103.)

"శా. వేదాభ్యాసవిశేషపూతరసనావిర్భూతభూరిస్తవా
సాద బ్రహ్మముఖౌఘవిఘ్నితనవస్వర్గక్రియాకేళిచే" (శృం. నై. ఆ. 2. ప. 41.)

పద్యములలోఁ గవి తనకవితాపాటవమును జూపుటకై యట్లనువదించినాఁ డందమన్నను గద్యములలోసయితము నిండియున్న యిట్టి యనువాదముల కేమిలాభమో తెలియకున్నది.

"స ధయా ధుతపక్షతిః క్షణం క్షణమూర్ధ్వాయనదుర్విభావనః,
వితతీకృతనిశ్చలచ్ఛదః క్షణమాలోకకదత్తకౌతుకః." (నై. స. 2. శ్లో. 69.)

"ఒక్కొక్కమాఱు విధూతపక్షతియును, నొక్కొక్కసారి యూర్ధ్వాయనదుర్విభావనంబును, నొక్కొక్కమాటు వితతీకృతనిశ్చలచ్ఛదంబును నగుచు". (శృం. నై. ఆ. 3. వ. 35.)

"వేలాతిగస్త్రైణగుణాబ్ధివేణి" (నై. స. 3. శ్లో. 50.)

"వేలాతిగకాంతకాంతాగుణాబ్ధివేణి వగు నీవు" (శృం. నై. ఆ. 2. వ. 57.)

ఇట్లు మూలగ్రంథములోనివాని ననుసరించుటయేగాక గ్రంథాంతరవాక్యములనుసైత మనుసరించియున్నాఁడు.

"యా కుందేందుతుషారహారధవళా"

"వ. కుందేందుతుషారహారధవళంబును నగు దివ్యరూపంబు" (శృం. నై. ఆ. 6. వ. 13.)

"శ్లో. అనిర్భిన్నగభీరత్వా దంతర్గూఢఘనవ్యథః,
పుటపాకప్రతీకాశో రామస్య కరుణో రసః." (ఉత్తరరామచరిత్ర.)

"వ. సఖులార! యేప్రకారంబునం బుటపాకప్రకాశం బైన కరుణారసంబునఁ బురపురం బొక్కెదరు.
(శృం. నై. ఆ. 1. వ. 108.)

"నా దయ్యము నెత్తికోలు తుదిఁ దాఁకుట గాదె భుజంగభంజనా!" (భార. ఉద్యో.)

"నా దయ్యము నెత్తికోలు తుదిఁ దాఁకుట గాదె సరోజలోచనా!" (శృం.నై.ఆ. 5. వ. 21.)

## శృంగారశాకుంతలమునందలి యనుసరణములు.

"తదోజస స్తద్యశస స్థితా విమా వృధేతి చిత్తే కురుతే యదా యదా,
తనోతి భానోః పరివేషకైతవా త్తదావిధిః కుండలనాం విధో రపి." (నై. స. 1. శ్లో. 15.)

"ఉ. ఆజననాథయూథమణియం దుదయంబును బొంది దిగ్జయ
వ్యాజమునం బ్రతాపవళినాప్తుఁడు కీర్తివిధుండు రాఁ దదు
ద్వేజితు లౌటఁ గాదె పరివేషమిషంబున నాత్మగుప్తికై
యోజ నమర్చికొండ్రు రవియుం గమలారియు నింగి వప్రముల్. (శృం. శా.ఆ. 1. పేజీ. 13.)

(ఇచట శ్లోకార్థ మొకరీతిని మార్పఁబడెను.)

"అ స్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయో నామ నగాధిరాజః,
పూర్వాపరౌ వారినిధీ విగాహ్య స్థితః పృథివ్యా ఇవ మానదండః."(కుమారసంభ. స.1.శ్లో.1.)

"గీ. అలరి పెంపొందుఁ బూర్వాపరాంబునిధుల, నడుమ ధరణికి మానదండంబుపోలె
దేవతాత్మధరాధీశదిగ్విభూష, పుణ్యనిలయంబు నీహారభూధరంబు". (శా. ఆ. 2. పేజీ. 34.)

" అస్యా స్సర్గవిధౌ ప్రజాపతి రభూ చ్చంద్రో ను కాంతిప్రద
శ్శృంగారైకరసః స్వయం ను మదనో మాసో ను పుష్పాకరః,
వేదాభ్యాసజడః కథం ను విషయవ్యావృత్తకౌతూహలో
నిర్మాతుం ప్రభవే న్మనోహర మిదం రూపం పురాణో మునిః" (విక్రమోర్వశీయము.)

"శా. ఆదిం జంద్రుఁడు చంద్రికారుచుల నయ్యబ్జాస్యఁ గల్పించెనో
లేదేఁ గంతుఁడు చెల్వము ల్వెరఁజి యాలీలావతిం జేసెనో
కాదేఁ జైత్రుఁడు తావు లెల్లఁ గొని యాకాంత న్వినిర్మించెనో
వేదాభ్యాసజడుం డజుం డెటులఁ గావించుం దదీయాకృతిన్." (శృం. శా. ఆ. 2. పేజి. 45.)

"శ్లో. గ్రహై స్తతః పంచభి రుచ్చసంస్థితై రసూర్యగై స్సూచితభాగ్యసంపదమ్,
అసూత పుత్రం... ... ... ... ... (రఘువంశము.)

"క. భానుని బొందక యుచ్చ, స్థానంబున గ్రహము లైదు దనరఁగ ఫలదం
బైన శుభయోగమునఁ దే,జోనిధి భాగ్యోన్నతుండు సుతుఁ డుదయించెన్."
(శృం. శా. ఆ. 4. పేజి. 88.)

## మనుచరిత్రమునందలి యనుసరణములు.

“సీ. బండికండెనతోడఁ బ్రతివచ్చు మైచాయ.” (శృం. నై. ఆ. 7. ప. 93.)

“సీ. బండికండెనచాయ బైసిమాలిన మేన.” (మను. ఆ. 4. ప. 73.)

“సీ. భోగించువారలఁ బుల్కుపుల్కునఁ జూచి, మెల్లనఁ గ్రుక్కిళ్లు మ్రింగువారు”
(శృం. నై. ఆ. 7. ప. 53.)

“చ. కనలుచు నీరు దేఱు తెలికన్నుల నాతనిఁ బుల్కుపుల్కునన్ గనుఁగొని........”
(మను. ఆ. 2. ప. 66.)

“సీ. అచ్చవెన్నెలచాయ నవఘళింపఁగఁ జాలు” (శృం. నై. ఆ. 6. ప. 22.)

“సీ. ఆరకూటచ్ఛాయ నవఘళింపఁగఁజాలు.” (మను. ఆ. 1. ప. 59.)

“ఉ. ఓమిహిరాంశువంశకలశోదధికౌస్తుభరత్న.” (శృం. నై. ఆ. 3. ప. 63.)

“ఉ. ఓచతురాస్యవంశకలశోదధిపూర్ణశశాంక” (మను. ఆ. 1. ప. 79.)

“మ. సనిక ల్దాఁచినఁ బెండ్లి మాను నొకో” (కాశీఖండము.)

“శా. గుండ్రా డాఁచినఁ బెండ్లి యేమిటికిఁ జిక్కున్” (మను. ఆ. 5. ప. 17.)

“చ. ముల్లువుచ్చి కో, త్తడఁచినచండ మయ్యో.” (ఉత్తరహరివంశము.)

“చ. ముల్లువుచ్చి కో, త్తడఁచినచండ మాయె” (మను. ఆ. 3. ప. 34.)

“సీ. నలినసంభవ వాహనమువారువంబులు, కులముసాములు మాకుఁ గువలయాక్షి!
చదలేటి బంగారు జలరుహంబుల తూండ్లు, భోజనంబులు మాకుఁ బువ్వుఁబోణి!
సత్యలోకముదాఁక సకలలోకంబులు, నాటపట్టులు మాకు నబ్జవదన!
మధురాక్షరము లైన మామాటలు వినంగ, నమృతాంధసులు యోగ్యు లనుపమాంగి!
గీ. భారతీదేవి ముంజేతి పలుకుఁజిలక, సమదగజయాన! సబ్రహ్మచారి మాకు;
వేదశాస్త్రపురాణాది విద్యలెల్ల, తరుణి! నీయాన ఘంటాపథంబు మాకు.”
(శృం. నై. ఆ. 2. ప. 49.)

“సీ. చిన్నివెన్నెలకందు వెన్నుఁ దన్ని సుధాబ్ధిఁ, బొడమిన చెలువ తోఁబుట్టు మాకు;
రహిపుట్ట జంత్రగాత్రములరా ల్గరఁగించు, విమలగాంధర్వంబు విద్య మాకు;
ననవిల్తుశాస్త్రంపుమినుకు లావర్తించు, పని వెన్నతోడఁ బెట్టినది మాకు;
హయమేధ రాజసూయములు నాఁ బేర్వడ్డ, సవనతంత్రంబు లుంకువలు మాకుఁ;
గీ. గనకనగసీమఁ గల్పవృక్షముల నీడఁ, బచ్చరాచట్టుగమి రచ్చపట్టు మాకుఁ;
బద్మసంభవ వైకుంఠ భర్గ సభలు, సాముగరిడీలు మాకు గోత్రామరేంద్ర!”
(మను. ఆ. 2. ప. 43.)

“సీ. గిరినికుంజములఁ గుంజరపుంజ మను శంకఁ, గంఠీరవంబు లుత్కంఠ నెగయఁ;
బల్వలంబుల గిరిప్రకరంబు లను శంక, నెఱుకురాజులు విందు లెక్కపెట్టఁ;
గడలిమధ్యంబునఁ గాకోల మను శంక, జలదేవతలు భీతి సంభ్రమింప;
నదములఁ గువలకాననవాటి యనుశంక, నిందిందిరశ్రేణు లెదురుకొనఁగ......

గీ. రజతగిరియందుఁ దాండవారంభ రభస, భంగి పతిత పరశ్వధపాణి వికట
కంధరారుద్ధ గజకృత్తికంఠశంక, ప్రమథులకుఁ దోఁప నంధకారంబు ప్రబలె." (భీమఖండము.)

"సీ. ఉరుదరీకుహర సుప్తోత్థ శార్దూలముల్, ఘురవారి శోణితశంకఁ ద్రావ;
వనకుంజమధ్యశాద్వల చరన్మృగపంక్తి, దావపావకభీతిఁ దల్లడిల్ల;
నాశ్రమాంతరభూరుహాగ్రముముల్ మునికోటి, బద్ధకాషాయవిభ్రాంతిఁ జూడ;
ఘనసాను శృంగశృంగాటకంబులఁ గాంచి, యమరులు హేమాద్రి యనుచు వ్రాలఁ;
గీ. గాసెఁ బేశలరుచిఁ గింశుకప్రవాళ, ఘుసృణకిసలయ కంకేళికుసుమగుచ్ఛ
బంధుజీవ జపా రాగ బాంధవంబు, లన్నగంబున జరఠారుణాతపములు." (మను. ఆ. 3. ప. 11.)

"సీ. పతిపాణిపల్లవచ్యుతనీవిబంధన, వ్యగ్రబాలాహస్తవనరుహంబు;
ధవకృతాధరబింబదశనక్షతివ్యథా, భుగ్నలీలావతీభ్రూలతంబు;" (శృం. నై. ఆ. 7. ప. 177.)

"సీ. సహసానఖంపచ స్తనదత్తపరిరంభ, మామూలపరిచుంబితాధరోష్ఠ;
మతిశయప్రేమకల్పితదంతసంబాధ, మగణితగ్లానిశయ్యానిపాత;ము..." (మను. ఆ.3. ప. 116.)

"మ. జననీ స్తన్యము గ్రోలుచుం జరణకంజాంతంబునం గింకిణీ
స్వన మింపారఁగఁ దల్లిమేన మృదులస్పర్శంబుగాఁ దొండ మ
ల్లన యాడించుచుఁ జొక్కు విఘ్నపతి యుల్లాసంబుతో మంత్రివె
న్ననికి న్మన్నన లొప్పమీఱ నొసఁగుఁ భద్రంబు లెల్లప్పుడున్." (శృం.శా.ఆ.1.పేజీ.1.)

"ఉ. అంకముఁ జేరి శైలతనయా స్తనదుగ్ధము లానువేళ బా
ల్యాంకవిచేష్టఁ దొండమున నవ్వలిచ న్గబళింపఁ బోయి యా
వంకఁ గుచంబు గాన కహివల్లభహారముఁ గాంచి వే మృణా
ళాంకురశంక నంటెడు గజాస్యునిఁ గొల్తు నభీష్టసిద్ధికై." (మను. ఆ. 1. ప. 4.)

"సీ. పులివల్లఁ డడవిపోతులరాజు గరుడుండు, గాలివేగంబు పందేలపసిఁడి;
విష్ణుప్రసాదంబు వెండిగుండులపరి, పచ్చిమిరియము వెట్టిపుచ్చకాయ;
వేఁటమాణిక్యంబు వీరవాది మెడబల్లి, పెట్టుఁగాఁడు వకారిపిడుగుగుతునుక;
జిగురుఁడు చిత్రాంగి శ్రీరామబాణంబు, పులియందు కస్తూరి బొందుమల్లె;
గీ. యనఁగ మఱియును బెక్కుతోయములపేళ్లు, దారకులు దేర వచ్చె నుద్దండవృత్తి
వేఁటకుక్కలు మృగరాజవిగ్రహములు, వటుకనాథుని వాహ్యాళి వాహనములు."
(శృం. శా. ఆ. 1. పేజి. 16.)

"చ. పులియఁడు బూచిగాఁ డసురపోతులరా జనుమంతిగాఁడు చెం
గలువ సివంగి భైరవుఁడు గత్తెర సంపఁగి వెండిగుండు మ
ల్లెలగుది వాయువేగి చిటిలింగఁడు సాళ్వఁడు వత్సనాభి యే
కలములమిత్తి గబ్బి యనఁ గాఁ గలవాని గ్రహించి యుద్ధతిన్." (మను. ఆ. 4. ప. 32.)

"సీ. జడ లల్లి ముడిచి పాగడఁ జొల్లెములు దీర్చి, తలముళ్లు బలువుగా నెలవుకొల్పి;
... ... ... ... ... ...
కుఱుచగాఁ గట్టిన కఱకదట్టీదిండు, నంతరమ్మునఁ బిడియాలు దోఁపి;

... ... ... ... ... ...
గీ. ... ... ... ... ... ...
... ... వచ్చి రలరి, రక్షకులు తాతతరములప్రాంతవారు."
(శృం. శా. ఆ. 1. పే. 17.)

"చ. జడలు మలంచి చొళ్లెముగ సన్నపుఁ బాగ లడంగఁ జుట్టి చ
ల్లడములు పూని మీఁదఁ బదిలంబుగఁ గట్టిన పట్టికాసెలం
బిడియము లంటదోఁపి పృథుభీషణబాహుల సాళువంబులన్
దడవి కెరల్చుచుం జనిరి నాథునిమ్రోల నృపాలనందనుల్." (మను. ఆ. 4. ప. 30.)

"మ. పురికిం బోయెద నన్నమాత్రమున నంభోజాస్య! యి ట్లాదురే
ధరణీనాథులు భూమిపాలనము చేత ల్గాని క్రీడారతిన్
సర వింటం గొనియున్నఁ బూజ్య యగు రాజ్యశ్రీ కొనల్ సాఁగునే
యరయంగా మెడఁబెట్టు కొయ్యఁ దిరుగన్ హారంబులే భామినుల్."(శృం. శా.ఆ. 3. పే.80)

"శా. ధీరస్వాంతవు వంత నీకుఁ దగునే దివ్యాంగనల్ కోవిదల్
గారే యోగవియోగముల్ సతములే కర్తవ్యముల్ సేయరే
పోరే రారె ప్రియంబు గల్గిన జనుల్ పోరామి పోఁ బోవునే
పోరాకుండఁగ నేమి కాళ్లు దెగెనే ఫుల్లాంబుజాతేక్షణా." (మను. ఆ. 3. ప. 138.)

"సీ. గిరిజావిభుండు ముంగిటి పెన్నిధానంబు, కృత్తివాసుండు తంగేటిజున్ను;
గోరాజగమనుండు గుజ్జుమామిడిపండు, కుసుమాస్త్రహరుఁడు ముంగొంగుపసిఁడి;
శీతాంశుధరుఁ డఱచేతిమాణిక్యంబు, కద్రూజకటకుండు గాదెకొలుచు;
కరటిదానవవైరి పెరటికల్పద్రుమం, బసమనేత్రుఁడు సిద్ధరసముచెలమ;
గీ. విషగళుఁడు గాఁడిఁ గట్టిన వేల్పుటావు, హాటకాచలధన్వి సిద్ధాంజనంబు
పురహరుఁడు పెట్టెలో నున్న పరుసవేది, ప్రమథభర్త చింతామణి భక్తులకును."
(శృం. శా. ఆ. 4. పే. 82.)

"సీ. కలఁకులనున్న తంగేటిజున్ను గృహమేధి, యజమానుఁ డంకస్థితార్థపేటి;
పండినపెరటికల్పకము వాస్తవ్యుండు, దొడ్డిఁ బెట్టిన వేల్పుగిడ్డి కాఁపు;
కడలేని యమృతంపునడబావి సంసారి, సవిధమేరునగంబు భవనభర్త;
మరుదేశపథమధ్యమప్రప కులపతి, యాఁకటి కొదవు సస్యము కుటుంబి;
గీ. బధిర పం గ్వంధ భిక్షుక బ్రహ్మచారి, జటి పరివ్రాజ కాతిథి క్షపణ కావ
ధూత కాపాలికా ద్యనాథులకుఁ గాన, భూసురోత్తమ! గార్హస్థ్యమునకు సరియె."
(మను. ఆ. 1. ప. 66.)

గ్రంథవిస్తరభీతిచే విరమించితిని గాని యిట్టి యనుసృతు లనేకములు పూర్వప్రబంధములం గలవు. కొందఱు పండితులు మనుచరిత్రములోని వర్ణనములును, గథపట్టులును, వసుచరిత్రమున నగపడుచుం డుటచే నది రామరాజభూషణున కొక లోప మని యుదాహరించి చర్చించి యుండుటచే నీలోప

మాంధ్రప్రబంధకర్తృసామాన్య మనియు, నిది యొక కవిసమయమువంటిదిగాఁ బరిగ్రహింపఁబడి యందఱిచేతను నవలంబింపఁ బడి యుండె ననియుఁ జదువరులకు విశద మగుటకై యిచ్చట నితరగ్రంథముల విషయమున వ్రాయఁబడెను. ఇట్లే ముందును వ్రాయుచున్నాఁడను. వసుచరిత్రమునకుఁ బూర్వమున నున్న ప్రబంధములలో నివి మిగులఁ బ్రసిద్ధములగుటచే వీనినుండిమాత్ర ముదాహరించితిని.

## వసుచరిత్రములోని యనుసరణములు.

పయి నుదాహరించిన వాడుకచొప్పుననే రామరాజభూషణుఁడును వసుచరిత్రమునఁ బూర్వగ్రంథస్థము లగు ననేకవర్ణనములు జొనిపియున్నాఁడు. కాని కొన్నిచోట్లయందుఁ బూర్వవర్ణనములకు వన్నెదెచ్చియున్నాఁడు.

మహాభారతమున వర్ణింపఁబడిన మయసభాదర్శనమునందలి దుర్యోధనుని యవస్థ మనంబున నిడికొని వసురాజుగృహమున మంజువాణీస్థితి వర్ణింపఁబడినదని తోఁచుచున్నది.

"వ. అట దుర్యోధనుండు, . . . . . వివృతంబైన ద్వారదేశంబు సంవృతంబుగా వగచి చొరనొల్లక సంవృత ద్వారంబు వివృతంబని చొరఁబోయి తత్కవాటస్ఫటికశిలాఘట్టితలలాటుండయి సమప్రదేశంబు న్నతంబుగా వగచి యెక్క సమకట్టి, నీలాశ్మస్థగితంబైన విమలమణిస్థలంబు జలాశయంబుగా వగచి పరిధానంబు సెగఁద్రోచికొని, స్ఫటికదీప్తిజాలపరివృతంబయిన జలాశయంబు స్థలంబుగా వగచి కట్టినపుట్టంబు తడియం జొచ్చి... ..." (భార. సభా. ఆ. 2.)

"సీ. ఒకవంక నిర్మలోదకశంకసంకుచ, త్పరిధాన యై రిత్తఁ బాఱఁ దలఁతు;
నొకచోట విఘటితోరుకవాటగృహవాట, మని మిన్నకయ తూఱి చనఁ దలంతు;
నొకయిక్క యిది వితర్దిక నిక్క మని పదా, గ్రము నిక్క రహి నెక్కఁ గాఁ దలంతు;
నొకచాయఁ జిత్రభిత్తికఁ గా యనుచు సోయ, గమునఁ బాయక డాయఁ గాఁ దలంతు;

గీ. నిట్లు గృహరాజకీలితానేకరత్న, వివిధరుచివైభవంబులు వెగడుపఱుప
... ... ... ... ... ..." (వసు. ఆ. 4. ప. 73.)

## సంస్కృతశాకుంతలమునుండి సంగ్రహించినవి.

గిరిక తల్లియాజ్ఞచొప్పునఁ గలహంసికవెంట నేగుచు నేవో మిషలను గల్పించుకొని సానురాగముగ వసురాజు నీక్షించుటయుఁ బిదప వసురాజట్టి చర్యలఁ దలంచి గిరికను స్వానురక్తఁ గా నూహించుటయుఁ గాళిదాసుని శాకుంతలనాటకములోని వర్ణనముల ననుసరించి యున్నవి.

"(శకుంతలా.) అనసూయే! అభినవకుశసూచ్యా పరిక్షతం మే చరణమ్, కురవకశాఖాపరిలగ్నం చ వల్కలమ్; తావ త్పరిపాలయ మాం యావ దేనం మోచయామి. (ఇతి రాజాన మవలోకయంతీ సహసఖీభ్యాం నిష్క్రాంతా)." (అభిజ్ఞానశాకుంతలము. అం. 1.)

" చ. కలికియు నానృపాలకునిఁ గ్రమ్మఱఁ జూచుచు నేగ నేర్పుతో
సలఘుపదాంగదధ్వనికి నంచలు మూఁగిన నిల్చి నెయ్యపుం

జెలువలఁ గూడఁ బిల్చుగతిఁ జిల్కకుఁ బార్శ్వలతాంచలంబులన్
ఫలము దెమల్చు రీతి నళిపంక్తికి మోము మలంచుకై వడిన్." (వసు. ఆ. 3. ప. 78.)

" (రాజా). సహ సఖీభ్యాం మిథః ప్రస్థానే పునః శాలీనతయాపి,
మయి భూయిష్ఠ మావిష్కృతో భావ స్తత్రభవత్యా. తథాహి;—

శ్లో. దర్భాంకురేణ చరణః క్షత ఇ త్యకాండే తన్వీ స్థితా కతిచి దేవ పదాని గత్వా,
ఆసీ ద్వివృత్తవదనా చ విమోచయంతీ శాఖాసు వల్కల మసక్త మపి ద్రుమాణామ్."
(అభి. శాకుం. అం. 2.)

" చ. అళులకు మోము ద్రిప్పుగతి నంచలః రాఁ జెలిఁ బిల్చురీతి రా
జిలుకకుఁ బండ్లు గోయుక్రియఁ జిత్రగృహంబుననుండి పోవుచున్
సోలపున నీవు న న్మరలి చూడఁ ద్రిశుద్ధిగ నేలి తంచు నే
నలరితిఁ గాని భావజుని కగ్గముసేయు టెఱుంగఁ గోమలీ!" (వసు. ఆ. 4. ప. 84.)

గిరికాజన్మవృత్తాంతము కాళిదాసునిశాకుంతలమార్గము ననుసరించి మంజువాణిచేఁ బ్రౌఢముగ నర్మసచివునితోఁ జెప్పించెను. అయ్యది ప్రచ్ఛన్నుం డగు రాజు వినునట్లు సందర్భపఱచెను. ఇంతవఱకు మిగుల సారస్యముగనే యున్నది. కాని స్త్రీచేత యతీశ్వరునితో నాయికయెదుటఁ జెప్పించుచున్న సంగతి మఱచినాఁడేమో యనునట్లు కవి యౌచిత్యమును విడిచి బట్టబయలుగ సంభోగశృంగారమును వర్ణించుట సరసముగా నుండలేదని కొందఱ యభిప్రాయము.

"మాటిమాటికిం గూటములం బాటింపుమని .............. మౌక్తికంబులుజడియం బయోధరంబులం బట్టుచు, విశదాంశుకాంతస్థితి దొరలంగ నతివిపుల పులినజఘనారోహణంబుల నుత్పలపత్త్రంబుల నెఱపుచు" (వసు. ఆ. 2. ప. 140.)

[నని యిట్లు కోలాహలుఁడు శుక్తిమతిని బలాత్కరించినతెఱంగు మంజువాణిచేఁ జెప్పింపఁబడెను. ఇట్టియెడలఁ గాళిదాసుఁడు శాకుంతలమున నతిమృదువుగా వర్ణించియున్నాఁడు.]

"తతో వసంతావతారసమయే ఉస్యా ఉన్మాదయితృరూపం ప్రేక్ష్య (ఇ త్యర్ధోక్తే) లజ్జయా విరమతి. (రాజా) పురస్తా దవగవ్యత యేవ, సర్వ థా ప్సరస్సంభ వైషా" (అభి. శాకుం. అం. 1.)

కాని మహాభారతమునందు శకుంతలాజన్మవృత్తాంతము రాజుతో శకుంతలచేతనే చెప్పింపఁబడెను. అందును నౌచిత్య మేమియుఁ బాటింపఁబడలేదు.

"చ. అలసత యొప్పఁగాఁ దరుణి యమ్మునివల్లభుమ్రోల నున్న నా
మిళితసుగంధబంధురసమీరవశంబునఁ దూలి బాలపై
వలు వెడలన్ బయల్పడియె వల్గకుచంబులు కక్షయుగ్మమున్
లలితకృశోదరంబుఁ దరలత్రివళీయుతరోమరాజియున్.

............ మేనకయు విశ్వామిత్రు నిష్టంబునకుం దగిన కామోపభోగంబులఁ బెద్దకాలంబు రమించిన ... ..." (భార. ఆది. ఆ. 4. ప. 7.)

పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁ డిక్కథను మార్చి యొకబ్రహ్మచారిచే రాజునకుఁ జెప్పించెను. కాని యట్టిశృంగారవర్ణనమునకు బ్రహ్మచారియు ననర్హుఁడే యని చెప్పవచ్చును.

ఈపట్టున రామరాజభూషణుఁడే నిజముగాఁ గొంతవఱకు నాచితిని బాటించె నని చెప్పవలసి యున్నది. ఇచ్చట నదీరూపశుక్తిమతిని బర్వతరూపకోలాహలుఁడు బలాత్కరించి యుపభోగించె నను నర్థమే ముఖ్యార్థము. ఈయర్థమున నశ్లీల మంతగాఁ గానరాదు. నాయికానాయకవ్యవహార రూపార్థము వ్యంగ్యార్థమగుటచే నందలి శృంగారము బట్టబయలు కానేరదు.

కాళిదాసు శాకుంతలనాటకమున రథ మాకాశమునుండి క్రిందికి దిగునపుడు రథస్థులయనుభవ మును వర్ణించియున్నాఁడు. అయ్యది మనంబున నిడికొనియే రామరాజభూషణుఁడు మీఁది కెగిరినపు డుండు ననుభవముల నిట్లు వర్ణించి యుండు నని తోఁచుచున్నది.

"(రాజా.) వేగావతరణా దాశ్చర్యదర్శన స్సంలక్ష్యతే మనుష్యలోకః; తథాహి:—

శ్లో. శైలానా మవరోహ తీవ శిఖరా దున్మజ్జతాం మేదినీ
పర్ణాభ్యంతరలీనతాం విజహాతి స్కంధోదయా త్పాదపాః,
సంతానా స్తనుభావనష్టసలిలా వ్యక్తిం వ్రజం త్యాపగాః
కే నా ప్యుత్క్షిపతేవ మర్త్యభువనం మత్పార్శ్వ మానీయతే." (అభి. శాకుం. అం. 7.)

"సీ. బడివాయు కిల నగప్రతతితో ఁజివ్వన, నెగిరినట్లె తోఁచు మగువలార!
పైపై సమీరణార్భటి నింగి భోరున, నణఁచినట్లె తోఁచు నతివలార!
నిఖిలభూములు జననికవాప దారున, నెదిరినట్లె తోఁచు నింతులార!
చనఁజన వెడఁదలై శశిమేను గ్రక్కునఁ, బెరిఁగినట్లె తోఁచుఁ దరుణులార!

గీ. కొండ లచ్చనగండ్లయి నిండుచెఱువు, లెల్ల నద్దంపుబిల్లలై యేర్లు ముత్తి
యంపుసరులై యరణ్యంపుగుంపులెల్ల, నారులై తోఁచుఁ బోడవున నారులార!"
(వసు. ఆ. 4. ప. 59.)

కథపట్టులు మార్చుకొనియుండుటచే నిట్టిరసవంతము లగు రచనలు పినవీరభద్రుఁ డాంధ్రీకరింప లేదు.

## నైషధకావ్యమునుండి సంగ్రహించినవి.

"శ్లో. య దంబుపూరప్రతిబింబితాయతి ర్మరు త్తరంగై స్తరళ స్తటద్రుమః,
నిమజ్య మైనాకమహీభృత స్సత స్తతాన పక్షాన్ ధువత స్సపక్షతామ్." (నై. స. 1. శ్లో. 117.)

"సీ. ప్రతిబింబితోపాంతబహుళపాదపములు, గర్భస్థశైలసంఘములు గాఁగ..."
(శృం. నై. ఆ. 1. ప. 96.)

"తే. నృపు నెదుట తేనెవాఁకలో నిబిడవిచల, దతనుపత్త్రాళిఫలసాంద్ర మగుచు నొక్క
నగము కైవ్రాలి యేటిలో నాటియున్న, నాఁటి యున్నతనగరాజు నలుఁవుఁ దెలిపె."
(వసు. ఆ. 1. ప. 161.)

"శ్లో. క్షణనీరవయా యయా నిశి శ్రితవప్రావళి యోగపట్టయా,
మణివేశ్మమయం సనిర్మలం కి మపి జ్యోతి రబాహ్య మిజ్యతే." (నై. స. 2. శ్లో. 79.)

దీనిని శ్రీనాథుఁ డాంధ్రీకరింపలేదు.

"ఉ. సాలము యంత్రపీఠము విశాలకవాటికఘట్టనంబు దృ
జ్జాలన మైందవామృతసమేతపతాకిక జిహ్వ చంద్రికా
జాలము భూతిపూఁత నవచంద్రశిలాంబువు లశ్రుధారగాఁ
బ్రోలు ప్రశాంతఘోష మయి పూర్ణసమాధిఁ జెలంగె నయ్యెడన్." (వసు. ఆ. 4. ప. 64.)

ఇందు నైషధశ్లోకము బాగుగా వివరింపఁబడినది.

"శ్లో. అస్తి త్వం కార్యసిద్ధేః స్ఫుట మథ కథయన్ పక్షయోః కంప్రభేదా,
దాఖ్యాతా వృత్త మేత న్నిషధనరపతౌ సర్వ మేకః ప్రతస్థే...." (నైష. స .3. శ్లో. 133.)

"శా. ఆచార్యోదితలగ్నమంగళ మహార్యస్వామికిం దెల్పి యా
ప్రాచీపాలుఁడు చేదిభర్త కెఱిఁగింప న్వచ్చెఁ జంచత్పతా
కాచాంచల్యము కార్యసిద్ధియు సురీగానంబు కల్యాణచ
ర్యాచారంబును దూర్యఘోషము వరాహ్వానంబు సూచింపఁగాన్." (వసు. ఆ. 5. ప. 54.)

"ఉ. ఆదిమశక్తి యైన తుహినాచలరాజతనూజవోలె ము
త్తైదువ వై నిజేశ్వరుని యర్ధశరీరము పాలుగొమ్ము నీ
పాదసరోరుహంబు లతిభక్తి భజింతురు గాక యెప్డు బ్ర
హ్మాదికదేవతాసదృశు లైన మహామహిమండలేశ్వరుల్." (శృం. నై. ఆ. 6. ప. 14.)

"మ. చరణాగ్రానమితాచలేశ్వరునిఁ గా సన్మార్గసంచారిఁ గా
స్థిరకల్యాణసమాఖ్యుఁ గా హరికృపన్ శీఘ్రంబ చేపట్టి యో
గిరికన్యా! యరలేక నీ పతఁడు నేకీభావముం జెందు మా
గిరికన్యామణికన్నధన్య వయి యక్షీణానుమోదంబునన్." (వసు. ఆ. 5. ప. 16.)

శ్రీనాథునికల్పన మిందుఁ బ్రౌఢముగా నలంకరింపఁబడెను.

"శ్లో. సా నిర్మలే తస్య మధూకమాలా హృది స్థితా చ ప్రతిబింబితా చ,
కియ త్యమగ్నా కియతీ చ మగ్నా పుష్పేషుబాణాళి రివ వ్యలోకి." (నైష. స. 14. శ్లో. 52.)

"తే. ధారుణీపతి నిద్దంపుఁ జేరురమున, నమరెఁ బ్రతిబింబమును దాను నలరుచుండ
బాహ్యమునఁ గొంత గొంత యభ్యంతరమునఁ, గీలుకొనియున్న మదనబాణాళివోలె."
(శృం. నై. ఆ. 6. ప. 5.)

"ఉ. మానవనాథుఁ డయ్యమృతమౌక్తికహారము పేరురంబునం
బూనె నగాత్మజాభజనభూరిసుఖాచిరలాభహర్షసం
ధానవిశల్యకౌషధ మన న్మది నాటిన పంచసాయకా
నూనలతాంతకోరకసముత్కరము ల్వెలిఁ బర్వెనో యనన్." (వసు. ఆ. 5. ప. 89.)

నైషధకావ్యమున నేడవసర్గమునందు రెండవశ్లోకము మొదలుగ దమయంతిని జూచు నలుని దృష్టులు వర్ణింపఁబడినవి. వసుచరిత్రమునందును దచ్ఛాయల ననుసరించి గిరికావసురాజుల పరస్పరావలోకనములు వర్ణింపఁబడినవి.

"సీ. సోయగంబున వీణవాయింప మాయంపు జటిలుఁ డెప్పటికి నేమిటికి వచ్చె?
వచ్చెఁ గా కేమి యవ్వసుమహీపాలబాలామనోభవుని నేలా తలంచె?
... ... ... ... ..." (వసు. ఆ. 3. ప. 116.)

"శా. మత్తుల్ క్రూరమతుల్ గతత్రపులు కామవ్యాప్తితశీలుల్ వృషా
విత్తుల్ నిత్యసమాస్వభావులు శఠుల్ విశ్వాసహీనుల్ చల
చ్చిత్తుల్ సారపదార్థకాంక్షులు బహుస్త్రీలోలుపుల్ క్రూరకా
యత్తుల్ రాజు లటంగి విందు మది సత్యం బయ్యె నీపట్టునన్." (శృం. శా. ఆ. 4. ప. 96.)

"శా. మాయాశీలురు చంచలాత్ము లనుకంపాహీన్యు లాత్మైకకా
ర్యాయత్తుల్ సమయానుకూలహృదయవ్యాపారగోపాయనో
పాయజ్ఞుల్ మగవారి లాపయి మహీనాథు ల్మహోద్వైభవ
శ్రీయోగాంధులు సెప్పనేల మగవారి స్వస్సుఁ గా విన్చునే." (వసు. ఆ. 4. ప. 90.)

ఈపద్యముకీతి ననుసరించి చూడఁగా నీక్రింద నుదాహరింపఁబడు శ్లోకము స్ఫురణమునకు వచ్చుచున్నది.

"శ్లో. మాయాశీలాః ప్రకృతిచపలా నిర్దయా ధూర్తవాచ
స్స్వార్థాయత్తా స్సమయహితకృద్గోపనోపాయదక్షాః,
సాధారణ్యా దతి హి పురుషా స్తత్ర చాఽపి క్షితీశా
శ్శ్రీయోగాంధా ఇతి మతి పురుషా నైవ విశ్వాసయోగ్యాః."

"శా. ప్రఖ్యాతంబును మిశ్రబంధమును నుత్పాద్యం బనం గాఁ ద్రిధా
వ్యాఖ్యాతం బగు వస్తు వందు మతి యత్యాహార్యముం జేయఁగాఁ
బ్రఖ్యాతం బితి వృత్త మున్న కృతి సెప్ప న్వక్తకున్ శ్రోతకున్
విఖ్యాతిం గలిగించుఁ బుణ్యమహిమన్ విశ్వంభరామండలిన్." (శృం. శా. ఆ. 1. ప. 4.)

"ఉ. కేవలకల్పనాకథలు కృత్రిమరత్నము లాద్యసత్కథల్
వావిరి పుట్టు రత్నము లవారితసత్కవికల్పనావిభూ
షావహపూర్వవృత్తములు సానలఁ దీరిన జాతిరత్నముల్
గావున నొక్క మిశ్రకథఁ గా నొనరింపుము నేర్పు పెంపునన్." (వసు. ఆ. 1. ప. 19.)

రామరాజభూషణుఁ డీయనుస్మృతిలోఁ దక్కినవారి గ్రంథములకంటెఁ దత్కాల సుప్రసిద్ధుఁ డగు నాంధ్రకవితాపితామహుని స్వారోచిషమనుసంభవము నధికముగ ననుసరించును ననేకచోట్ల నద్దాని నలంకరించుచు వచ్చెను. వే యేల! పేరుపెట్టుటయందును దాని ధిక్కరించి మెఱుఁగుమాప సమకట్టెను.

స్వారోచిషమనుసంభవమున స్వారోచిషమనువునుత్పత్తి యత్యల్పపద్యములతో మాత్రము వర్ణించుటనో మఱి యేకారణముననో దానికి మనుచరిత్ర మను పేరు రూఢమయ్యెను. "మనుచరిత్రం బందుకొనువేళఁ బుర మేఁగఁ, బల్లకి తనకేలఁ బట్టి యెత్తె" నని పెద్దనార్యుఁడే చెప్పియున్నాఁడు. ఈపేరైన నంతగా సరిపడి యుండలేదు. స్వారోచిషమనుచరిత్రము సైత మల్పముగనే వర్ణింపఁబడెను. ఆ గ్రంథమునఁ బ్రవర వరూధినీ స్వరోచిః ప్రభృతులవర్ణనమే యధికముగ నున్నది. ఇట్టి వస్త్వైక్యము లేని యా తాశ్వాసముల మనుచరిత్రమును ధిక్కరించుటకుఁ గావలయు రామరాజభూషణుఁడు దానును

నాఱాశ్వాసముల ప్రబంధము రచించి "వసుచరిత్ర"మని పేరుపెట్టి సకలాశ్వాసములును నాయకవసు రాజ కథాసంభరితములే యగునట్లు సంఘటింపఁజేసెను.

మఱియు నిష్టదేవతాస్తుతి వంశావతారాదులు గాక కేవలవసురాజచరిత్రము నెనుశత (800) పద్యములతో వర్ణించుటచే నీగ్రంథమునకు వసుచరిత్ర మను పేరు సార్థక మగుచున్నది. ఇంతియకాక నామైకదేశగ్రహణన్యాయమున "వసు=వసురాజుయొక్క, సుచరిత్రము=మంచిచరిత్రము" అను నర్థవిశేషలాభము గలిగియున్నది ఇట్టి మెఱుఁగు లీక్షింపఁగా;

"శ్లో. సర్గబంధో మహాకావ్యం తత్రైకో నాయకస్సురః,
సద్వంశః క్షత్రియో వాఽపి ... ...
ఏకవంశభవా భూపాః కులజా బహవోఽపి వా." యను మహాకావ్యలక్షణము వసుచరిత్రమునకు వర్తించును గాని మనుచరిత్రమునకుఁ జెల్లదుగదా! ఇఁక మనుచరిత్రకు సరియగు వర్ణనములు నుదాహరించెదను.

"సీ. ... ... ... ... ... ...
గీ. ... ... ... ... ... సాహిణి యొకండు
కర్త యెదుటికిఁ గొనివచ్చె గంధవాహ,బాంధవం బను నొక మహాసైంధవంబు."
(మను. ఆ. 4. ప. 28.)

"సీ. ... ... ... ...
గీ. ... ... ... ... అరసి యొకటి
మనసుతోఁజన మెలఁగు సామ్రాణికాల్వ, రత్నములఁ గ్రొన్న తెచ్చె సాదియొకండు."
(వసు. ఆ. 1. ప. 144.)

ఇందు వసుచరిత్రపద్యమునందుఁ గల "మనసుతోఁజన మెలఁగు" అను విశేషణము మిగుల సరస మైయున్నది. మనుచరిత్రపద్యమునఁ గల 'గంధ' యను పద ముచితముగ లేదు. 'శీఘ్ర' యని యుండిన బాగుగనుండును గాని వృత్తభంగ మగును.

క్రూరముగ వేఁటాడుచు మనోరమ గానము విని యామెం గాంచి క్రమంబున నామెను స్వరోచి పరిగ్రహించె నని మనుచరిత్రసంప్రదాయమునకు వన్నెపెట్టి వసంతర్తు విభాసురము, శృంగార రసోద్దీపకము నగు నుద్యానమున నర్మసచివునితో విహరించుచుఁ క్రీడాశైలమున కేగి యచట గిరికా మధురగానము నాలించి యామెం గాంచి తుదకామెను వసురాజు పరిగ్రహించె నని వసుచరిత్రమున వర్ణించెను.

మనుచరిత్రమునఁ బ్రవరుఁడును, వసుచరిత్రమున నర్మసచివుఁడును, నొక కోనం గని యందొక కేళీవనంబున విహరించు నాయికలఁ గని దాని నిక్కపుఁ బ్రశంసలు మిగుల సరస మైయున్నది.

"సీ....గీ. [illegible] సారసస్వనిఁ బసలోని చంద్రకాంత
పరుల ప్రతిశబ్ద మీనఁ గంధర్వయక్ష, గానఘూర్ణిత మగు నొక్క కోనఁ గనియె."
(మను ఆ. 2. ప. 19.)

"సీ....గీ. ఎండకన్నెఱుఁగని కప్పురము లేనసి, ముడిగొనిన ద్రాక్షపందిళ్ల నడుమఁ గిన్న
రీనినాదానుకాంతాకేళికాద్రి, ఘూకఘుమఘుమితం బైన కోనఁ గనియె." (వసు. ఆ. 2. ప. 21.)

"శా. ...పూవుందీవల నొప్పు నొక్క వనసంబుం గాంచె నత్యున్నతమున్." (మను. ఆ. 2. ప. 22.)

"సీ....గీ. నిరుపమం బైన దివ్యమందిరముఁ గనియె." (వసు. ఆ. 2. ప. 23.)

నందనభూమి భూమిసురనందనుఁ డుండకపోఁడు రమ్ము నీ
చందము నందముం గనిన జవ్వని యవ్వని వెఱ్ఱి సేయదే." (మను. ఆ. 3. ప. 63.)

"చ. జనపతి యిట్లు పంచశరశాతశరాహతి సంచలింపఁ గాఁ
గని హితమంత్రి పల్కు మహికాంత నిరంతరచింత నింత విం
త నెగులు పూన నేల లలనానలినాస్త్రుఁడ వీవు నిన్నుఁ గ
న్గొని చలతాంగి యీలువు మనోభవుఁ డింతకుఁ గొల్లలాడఁడే." (వసు. ఆ. 3. ప. 87.)

"ఉ. అంచెలుగట్టి కాలితొడుసై చననీవు గదన్న ప్రోదిరా
యంచ లినేటిసంగడము లయ్యెను దయ్యమ! యేటివేడ్క నా
కంచుఁ బదంబున న్మొరయు నందియ యూడఁగఁ దన్ని పోయి వీ
క్షించె లతాంగి యోర్తు మురజిన్నిభు సాగరమేఖలావిభున్." (మను. ఆ. 5. ప. 61.)

"ఉ. డించఁ గఁ బ్రొద్దు లే కెవ ఘటించిన రత్నవిపంచితో సున
గ్గాంచితమూర్తి యోర్తు ముఖరాంఘ్రిసమాశ్రితసత్కలాప యై
యంచల నచ్చు సోయగపుటంచలఁ దోలుచు మిన్కుచేడె యా
వంచు నుతింప వచ్చె వెస నాచతురాస్యుని మోము గన్గొనన్. (వసు. ఆ. 6. ప. 12.)

ఇంకను గొంతవఱకు సాజాత్యముగల పద్యము లనేకములు గలవు. గ్రంథవిస్తరభీతిచే వాని నెల్ల నుదాహరింపలేదు. పద్యములసంఖ్యలు మాత్ర ముదాహరించెదను.

| మనుచరిత్ర. | | వసుచరిత్ర. | | మనుచరిత్ర. | | వసుచరిత్ర. | |
|---|---|---|---|---|---|---|---|
| ఆశ్వాసముల సంఖ్య. | పద్యముల సంఖ్య. | ఆశ్వాసముల సంఖ్య | పద్యముల సంఖ్య. | ఆశ్వాసముల సంఖ్య. | పద్యముల సంఖ్య. | ఆశ్వాసముల సంఖ్య. | పద్యముల సంఖ్య. |
| 1 | 18 | 1 | 21 | 3 | 17 | 4 | 7 |
| 1 | 28-34 | 2 | 63-69 | 3 | 16 | 4 | 9 |
| 3 | 90-91 | 3 | 49-51 | 3 | 19 | 4 | 12-13 |
| 3 | 71 | 2 | 79 | 3 | 20 | 4 | 16 |
| 5 | 7 | 2 | 102 | 3 | 21 | 4 | 17 |
| 3 | 29-34 | 3 | 116-124 | 3 | 27 | 4 | 22 |
| 3 | 33 | 3 | 121 | 3 | 28 | 4 | 23 |
| 3 | 34 | 3 | 122 | 3 | 36 | 4 | 27 |
| 3 | 73 | 3 | 132 | 3 | 51 | 4 | 47 |
| 3 | 73-82 | 3 | 133-148 | 3 | 54 | 4 | 128 |
| 3 | 75 | 3 | 136 | 5 | 60 | 6 | 10 |
| 3 | 82 | 3 | 138 | 5 | 63 | 6 | 11 |
| 3 | 83 | 3 | 148 | 5 | 64 | 6 | 14 |
| 3 | 84 | 3 | 149 | 1 | 61 | 2 | 87 |
| 3 | 10-14 | 4 | 4 | 3 | 74 | 2 | 26 |

మఱియు నొక్కొక్కకల్పనమే యనేకులు సంగ్రహించుచు నుత్తరోత్తర మలంకరించుచుందురు.

"శా. నల్లిల్లుం గుడియు న్వసంబును నిధానంబుం దటాకంబు రం
జిల్లుం గొండొకకాల మేగ నవి విచ్ఛేదంబునుం బొందు నే
పొల్లుం బోనిది కీర్తికిం గృతియ పో భూమండలిం దానికిం
దెల్లం బిప్పుడు రామభారతకథాదివ్యప్రబంధావళుల్." (శృం. శా. ఆ. 1. పే. 3.)

"గీ. సప్తసంతానములలోఁ బ్రశస్తిఁ గాంచి, ఖిలము గానట్టిది ధాత్రిఁ గృతియ కానఁ
గృతి రచింపుము మాకు శ్రీకరముగను, పేశలసుధామయోక్తులఁ బెద్దనార్య!" (మను. ఆ. 1. ప.14.)

"గీ. చెరుతటాకాదిసంతతుల్ ధరణి నెచట, నిలిపి రచటనె యుండు వానికిని గృతియు
ఖంబునను విశ్వవిఖ్యాతి గావఁగృతియె, సంతతినతంస నది మాకు సంఘటింపు" (వసు.ఆ.1.ప.18.)

"సీ. కాననేత్రంపుల ముక్తము లైన ముత్యాలు ముగిరి పండిన మంచివెదురుఁబ్రాలు;
నిరములోఁ గ్రొత్తయొత్తిన కస్తూరిజవ్వాజి మురియని మొగిలిపవ్వఁ;
జంద్రికాయచిఁ బొల్చు చమరవాలంబులుఁ బొందుగాఁ గాఁచిన పూతివుడువు;
లంతి పంటింపఁగామల పీలిసురటులు శోధించి నడిచిన వంటితేనె;

గీ. ...నాదిగాఁ దెచ్చి పతి కుపాయనము లిచ్చి......" (శృం. శా. ఆ. 1. పే. 15.)

"ఆ. ఒక్కయొకటి కేఁడు నక్కొమ్మను నిట్టి, గోఅజంబు జున్నుఁ జాఅపవ్వు
పీలిగఱుల యంపకోలలు సెలవిండ్లుఁ, గాను కిచ్చి కరయుగమ్ము మొగిచి." (మను.ఆ.4. ప. 14.)

"సీ....గీ. అనుచు నాగంపహులని శౌర్యములు దెలుపు, లీల విరిసినవిరులు రాలిన రజంబు
మెలికివరసంబు లురిలినఫలము లధిపు, మ్రోల నిడ పల్కిరుద్యానపాలు రపుడు." (వ.ఆ.1.ప.134.)

నాయికకు వివాహ మయినవెనుక నందఱు కవులు నవసరము గల్పించుకొని వధువు సత్తవారింటి కంపునెడల బుద్ధులు గఱపించుచుందురు ... ... ... ... ...

"శ్లో. యాస్యత్యద్య శకుంతలేతి హృదయం సంస్పృష్టముత్కంఠయా
కంఠః స్తంభితబాష్పవృత్తికలుషశ్చింతాజడం దర్శనమ్,
వైక్లబ్యం మమ తావదీదృశ మిదం స్నేహా దరణ్యౌకసః
పీడ్యంతే గృహిణః కథం ను తనయా విశ్లేషదుఃఖై ర్నవైః." - (అభి. శా. అం. 4. 6.)

"శ్లో. శుశ్రూషస్వ గురూన్ కురు ప్రియసఖీవృత్తిం సపత్నీజనే
భర్తుర్విప్రకృతాఽపి రోషణతయా మా స్మ ప్రతీపం గమః,
భూయిష్ఠం భవ దక్షిణా పరిజనే భాగ్యే ష్వనుత్సేకినీ
యాంత్యేవం గృహిణీపదం యువతయో వామాః కుల స్యాధయః" (అభి. శా. అం. 4.శ్లో.18.)

"ఉ. ఎంచ మునీంద్రులందు విజితేంద్రియుఁ డైన తపస్వి కూర్మిగా
వించి శకుంతలం బెనిచి విస్మృతి నొందిన మోహపాశముల్
త్రెంచుకొనంగ లేక తియతీపులఁ జిత్తముఁ గాసివెట్టె నీ
లించిన నెవ్వఁ డింక నదలింపఁ గ నోపెడు మోహబంధముల్." (శృం. శా. ఆ. 4. పే. 91.)

"సీ. అత్తమామలను నీయపనేమి వెట్టుచుఁ గనుసన్నఁ జేయుమీ పను లెఱింగి;
ప్రాణమిత్త్రములుగా భావించి యేప్రొద్దు ననరింపుమీ ప్రేమ సవతులందు;
భర్త యొక్కొకవేళ బహుమాన మొనరింపఁ గదియ రానీకుమీ గర్వరేఖ;
పరిచిత్త మెఱిఁగి తత్పరిజనంబులమీఁదఁ జేయుమా మిగుల దాక్షిణ్యగరిమ;

బసిఁడిగాజులు పైకి వేసఁ ద్రోసి నునుఁదీఁగఁ గెరలించు సురిత్రాడు నెమకుకరణి;
మొలనూలు బిగియించి వెలఁది వెన్నెలఁ జొచ్చుఁ బిఱుఁదీయ కేటిలో నుఱుకుకరణి;
గీ. జడియ సిరులకుఁ గుఱియగు పుష్పాడుల కునుఁగు, మావికపె నిల్చి విరుల సుస్తావిఁ గ్రోలు
వికసనాసాయుక వేఁపుల విసివి విసివి, తనువు హోమాంగం గఁ బలుచి యుష్ట్విసరుహాక్షి."

(మను. ఆ. 3. ప. 31).

"సీ. పవమానమానవప్లవమానకైరవచ్యవమానరజము పైకంటఁ దివురుఁ;
గరసారసాగ్రతామరసాదిసాంద్రసీధురసాప్తిఁ గన్నీరు తుడువఁ గోరుఁ;
మదనావిలప్రభాసదనాభ్రకోమలచ్ఛదనార్చిపైఁ జూపుఁ బఱపఁ జూచు;
సలయాహితలతాకిసలయాగమలయాగనిలయానిలుఁడు కూర్పు దలఁపఁ దలఁచుఁ,
గీ. గుంజపుటగుంజవళీపుంజశింజితంబు, వెగ్గలం బైనఁ జెవియొగ్గి వినఁ గడంగుఁ
బంచశరభూతిపరభూతపంచభూత, ములఁ బదీయస్థలంబులఁ గలుపుకరణి."(వసు.ఆ.3. ప. 118.)

"శ్లో. ఇమా గిర స్తస్య విచింత్య చేతసా తథేతి సంప్రత్యయ మాససాద సా,
నివారితావగ్రహనీరనిర్ఝరే నభో నభస్యత్వ మలంభయ ద్దృశౌ."

"శ్లో. అథోద్భ్రమంతీ వదతీ గతక్షమా ... ... ...
... ... ... వృథాని మానాపరదేవితాని." (నై. స. 9. శ్లో. 84-87.)

"సీ. ప్రవిమలాక్షీనభోనభస్యాంబుదములకు నవవృష్టిధార లై యవతరిల్లి;
... ... ... ... ... ...
గీ. వేఁడియశ్రులు నిగుడంగ వెక్కి వెక్కి, యేడ్వఁ దొడఁగె లతాంగి పృథ్వీశుమ్రోల
మృదులపరిదేవనాక్షరోన్మిశ్రమధుర, కంఠకాకువికారకాకలిక యలర."

(శృం. నై. ఆ. 4. ప. 87.)

"చ. కొసరి వసంతకాలమునఁ గోయిల క్రోల్చిన భంగి నేడ్చె న
బ్బిసరుహనేత్ర కొండచఱిఁ బెద్దయెలుంగున వెక్కి వెక్కి వె
క్కసమగు మన్యువేగమునఁ గాటుకకన్నుల నీరు సోన లై
యుసిరికకాయలంతలు పయోధరము ల్దిగువారుచుండఁగాన్." (కాశీఖండము.)

"ఉ. పాటున కింతు లోర్తురె కృపారహితాత్మక నీవు ద్రోవ ని
చ్చోట ఘనన్నఖాంకురము సోఁకెఁ గనుంగొను మంచుఁ జూపి యా
ప్పాటలగంధి వేదన నెపం బిడి యేడ్చెఁ గలస్వనంబుతో
మీటిన విచ్చు గుబ్బచనుమిట్టల నశ్రులు చిందువందఁ గాన్." (మను. ఆ. 1. ప. 70.)

"ఉ. ఈసునఁ బుట్టి డెందమున హెచ్చిన శోకదవానలంబుచేఁ
గాసిలి యేడ్చెఁ బ్రాణవిభు కట్టెదుటన్ లలితాంగి పంకజ
శ్రీసఖ మైన మోముపయిఁ జేలచెఱం గిడి బాలపల్లవ
గ్రాసకషాయకంఠకలకంఠవధూకలకాకలీధ్వనిన్." (పారిజాతాపహరణము. ఆ. 1. ప. 133.)

"శా. ఆజాబిల్లి వెలుంగువెల్లికలు దాయన్ లేక రాకానిశా
రాజశ్రీ సఖ మైన మోమునఁ బటాగ్రం బొత్తి యొత్తి యా

రాజీవానన యేడ్చెఁ గిన్నరవధూ రాజత్కరాంభోజ కాం
భోజీమేళవిపంచికారవసుధాపూరంబు తోరంబుగాన్." (వసు. ఆ: 4. ప. 52.)

ఇట్టి యేడ్పుపద్యము లన్నియు విని తెనాలి రామకృష్ణకవి "యల్లసాని పెద్దన యటునిటు నేడ్చె. ముక్కు తిమ్మన్న ముద్దుముద్దుగా నేడ్చెను. భట్టుమూర్తి భావురని యేడ్చె" నని పల్కె నను నైతిహ్యము గలదు.

పయి యేడ్పువర్ణనములందు నైషధమున సత్యభామలు వర్ణింపఁబడినవి. కాళిఖండమునందును, మనుచరిత్రమునందును, సత్యవులును, నేడ్చునప్పటి కంఠధ్వనియు సామాన్యముగ వర్ణింపఁబడెను. పారిజాతాపహరణమున సత్యవర్ణనము విడిచి కేవలరోదనమే సకారణముగ వర్ణింపఁబడెను. ఇందుఁ బద్మసదృశ మగు మోమును గుప్తి వేసికొని యవ్యక్తమధుర మగు కోకిలధ్వనివంటి ధ్వనితో నేడ్చె నని వర్ణింపఁబడినది. ఈవర్ణనమే రామరాజభూషణునిచే నలంకరింపఁబడినది.

రామరాజభూషణుని యేడ్పువర్ణనము నలంకరింపఁగోరి కొందఱు దీనిప్రతిబింబముగా సంవరణచరిత్రమున నొక యేడ్పువర్ణనము గలదు గాని యది రామరాజభూషణునిపద్యమును మీఱఁ జాలదయ్యె.

"మ. బలవద్దర్పకశస్త్రికాహతులఁ బైపైన్ లేక యవ్వేళ న
య్యలినీలాలక యంబరాంతపరిణీతాత్మీయఖిన్నాననో
త్పలినీబాంధవ యాచు నేడ్చెఁ గడు భూపాలైకరాగంబునం
గలకంఠీకులకంఠకోమలకుహూకారంబు తోరంబుగాన్." (సంవరణచరిత్రము.)

"ఇందు 'బలవద్దర్పకశస్త్రికాహతుల' కనఁగా బలవంతుం డగు మదించిన మన్మథునియొక్క శస్త్రముల దెబ్బలకుఁ దాళఁజాలక యేడ్చె నని సకారణముగ వర్ణింపఁబడెను. మొదటనే ఖిన్నుఁ డగు ముఖచంద్రునకు మఱియు ఖిన్నత గల్గునట్లుగఁ గోకిలకలధ్వనివంటి చంద్రవిరోధి యగు కుహూధ్వని మించున ట్లేడ్చె నని చమత్కరింపఁబడెను. ఇంతియకాక భూపాలునియందలి రాగముతో నేడ్చె నను నర్థాంతరము మిక్కిలి ప్రౌఢముగ నున్నది" యని చెప్పుదురు.

కాని బలవద్దర్పకశస్త్రికాహతుల నోర్వఁజాలక యేడ్చుట వింతగాదు నాయికాశరీరసౌకుమార్యము నంతగా స్ఫురింపదు. కాఁబట్టి రామరాజభూషణుఁడు వర్ణించినట్లు వెన్నెలలకు వేఁగుచున్నదనుటయే స్వారస్యముగ నున్నది. మఱియు రామరాజభూషణుని పద్యమునం దాకాశమందలి చంద్రకాంతుల కోర్వఁజాలకయున్న నాయికకు ముఖచంద్రకాంతులను బీడించు నని యామె ముఖచంద్రుని బైఁట చెఱఁగునఁ గప్పె నని సాభిప్రాయముగా వర్ణింపఁబడినది. మఱియు నాయిక రాజీవానన యనఁగాఁ బద్మమువంటి ముఖము గలది కావున నె చంద్రకాంతికి నోర్వఁజాలక యేడ్చె నను వర్ణనము మిగుల సందర్భముగానున్నది. ఇఁక నామె యేడ్చుచుండఁగా నట్టి రోదనధ్వని కిన్నరస్త్రీలచే మేళగింపఁబడిన కాంభోజీరూప మగు వీణానినాదమువలె నుండె ననుట సారస్యముగా నుండును గాని భూపాలరాగముతో నేడ్చె ననుట సారస్యముగ నుండదు. రాగ మేళనముచేసి యేడ్చుట యనుభవవిరుద్ధము. అట్లేడ్చుటయు నొక యసాధ్యకార్యము గాదు. రాగజ్ఞానము స్వల్పముగఁ గలవారునైత మాపని చేయఁగల్గియుందురు. ఇచట భూపాలునియం దనురాగముతో నేడ్చె నను నర్థాంతరప్రాప్తికై యిట్టి యసంగతార్థము లభింపవలసివచ్చెను.

విరహవేదన సహింపలేక మూర్ఛిల్లి నాయిక శీతలోపచారములచేఁ దేఱునట్లు వర్ణించుటయు నొక కవిసమయముగ నగపడుచున్నది.

“శ్లో. స్ఫుటతి హారమణౌ మదనోష్మణా, హృదయ మప్యనలం కృత మద్య తే;
సఖి! హతాఽస్మి తదా యది హృద్వ్యథా, ప్రియతమ స్సను మన్యవిధాపితః.

శ్లో. ఇతి ముదీర్య తదైవ ముమూర్ఛ సా, మనసి మూర్ఛితమన్మథపావకా;
క్వ సహతా మనిలంబలవచ్ఛిదా, మనసిజస్త్రిమృతీ హతగుప్తితా.

శ్లో. అధిత కాఽపి ముఖే సలిలం సఖీ, ప్యధిత కాఽపి సరోజదళై స్తనౌ;
వ్యధిత కాఽపి హృది వ్యజనానిలం, న్యధిత కాఽపి హిమం సుతనో స్తనౌ.

శ్లో. ఉపచచార చిరం మృదుశీతలై, ర్జలజనాళమృణాళజలాదిభిః;
ప్రియసఖీనివహ స్స తదా క్రమా, దియ మవాప యథా లఘుచేతనామ్.”

(నై. స. 4. శ్లో. 109-112.)

“వ. అని పలికి లీలోద్యానమందు సరసరసాల కోమలకిసల యాస్వాద కషాయకంఠ కలకంఠకామినీ కుహూకార కోలాహలసంచయంబు పైతెంచిన నప్పల్లవాధరి యుల్లంబు జల్లన నొల్లంబోయి మూర్ఛిల్లిన.

ఉ. గొజ్జఁగినీరు సల్లె నొక కోమలి ద్రిప్పె లతాంగి యొత్తు లా
మజ్జికతాళవృంత మొక మానిని చందనకర్దమంబునన్
మజ్జన మాచరించెఁ గుచమండలి నొక్క వధూటి యెంతయుం
బుజ్జన మొప్పఁ బాదములఁ బుప్పొడి యొత్తె విదర్భకన్యకన్.”

(శృం. నై. ఆ. 2. ప. 139-140.)

‘చెలియా! నీహృదయమందలి హారమణి విరహాగ్నిచే బ్రద్దలు కాఁగా నీహృదయ మనలంకృత మగుచున్న’ దనునర్థము గల సంస్కృతవాక్యమున నీహృదయము నలంకృత మగుచున్న దను నర్థాంతరము స్ఫురించుటచే దమయంతి మూర్ఛిల్లెనని సంస్కృతమున నుండఁగా నట్టి చమత్కారమును దెనుఁగులోనికి శ్రీనాథుఁడు తేలేదు. సంస్కృతమునన్న యనలంకృతశబ్దమే గ్రహించి యెప్పటివాడుకప్రకారము కవి దాఁటి పోఁ దలఁచిన వీలుపడదు గాని యిచట సంస్కృతమునఁ గల యర్థద్వయమును దెప్పించుట మాత్రమంతగా దుర్ఘటము గాదు. శ్రీనాథుఁ డీసందర్భమునఁ గల సరసవర్ణనము లాంధ్రీకరింపకున్నను మూర్ఛను మాత్రము విడువక యెట్టెటో తెచ్చిపెట్టెను. ఇట్లే కాళిదాసున కవసరము లేకున్నను బిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు మాత్రము శకుంతలకు మూర్ఛను వర్ణింప మానలేదు. ఈయాచారమునే పెద్దనార్యుఁడును, రామరాజభూషణుఁడును నడిపిరి కాని యందు రామరాజభూషణుఁడు వర్ణించిన మూర్ఛావర్ణనము సంస్కృతనైషధమునందువలె మిగుల హృద్యముగా నున్నది.

“వ. ఇట్లు బహుప్రకారంబుల .......... అసురుసురనుచు నుసురుసురనుచు నుల్లం-బొల్లంబోయి మూర్ఛిల్లిన నప్పల్లవాధరిం గనుంగొని.

గీ. వరుస ననసూయ యును బ్రియంవదయుఁ జేరి, యల్లనల్లన శిశిరకృత్యములు సేయఁ
గ్రమముతో డుల వెడవెడఁ గనులు దెఱచి, సమధికామోదతాళవృంతములు సూచి.”

(శృం. శా. ఆ. 3. పే. 72.)

"వ. అని పలికి యక్కలకంఠకంఠి దీపించు తాపంబుపెల్లున మూర్ఛిల్లినం దోడిపల్లవోష్ఠు లల్లనల్లన హల్లకంబుల హిమాంబు.............. జలువ పుట్టింప నెట్టకేలకుం దెలిసె."

(మను. ఆ. 3. వ. 52.)

"చ. అఱిమి సమాకుమారుఁ డపు డగ్రతలంబున వచ్చి నిల్చినఁ
ట్లఱిముఱిఁ జూచినం గువలయాక్షి నవాంకిరవాంకుఁ దూలి పై
మఱచి సగంధగంధగిరిమారుతపాతితవల్లికాకృ త్రయై
మొఱఁగిన సంభ్రమించి చెలు లుద్గతబాష్పతరంగతాక్షు లై.

సీ. మోహోపదేశతమోముద్రితము లైన కనుదమ్ముల హిమాంబు లునుపరాదు;
శ్రమబిందుతారకాగమఖిన్నకుచకోకములఁ జంద్రనామంబు తలఁపరాదు;
నిర్యద్దాశాప్యంత్రశిథిలతాసులతాంత మసియాడ వీవన ల్విసరరాదు;
పటుతాపపుటపాకపరిహీణతను హేమ మింకఁ జల్లన పుటా ర్చిడఁగరాదు;

గీ. లలన కాయంగకేలికీలాకలాప, సంతతాలీఢహృదయపాత్రాంతరాళ
పూరితస్నేహపూరంబుపొంగి పొరలఁ, జల్లని పటీరసలిలంబుఁ జల్లరాదు.

క. ఏ మండ మేమి సేయుద, మే మం పని మందలింత మే మందము యిం
దే మందయాన నడుగుడ, మే మందఱ మనుచుఁ దరళహృదయాంబుజ లై.

సీ. జవరాలియడుగులఁ జిగురాకు లంటించి పొలఁతి యూరు లనంటిపొరలఁ బొదివి;
కొమ్మచేదోయి చెందమ్ముల హత్తించి లేమబాహులు మృణాళికలఁ బెనచి;
యతివగుత్తపుగుబ్బ లలరుగుత్తులఁ గూర్చి కాంతచెక్కులఁ జంద్రఖండ మలది;
కలికిక్రేఁగన్నులు కలువరేకులఁ గప్పి లలనపెన్నెఱుల వాలంబు ముడిచి;

గీ. నవనవగుణానుబంధబాంధవము లైన, చలువ లెన్నేనిఁ గావించి చెలువ చెలులు
నెలఁత కీవసులాభంబు నించు మంచు, నించువిల్కాని మరలఁ బ్రార్థించుటయును.

శా. ఆవాక్యంబులలో సుధామయసుఖైకాయత్తచిత్తేశసం
జ్ఞానర్ఘంబు లొకింత వీను లెనయన్ సంజాతచైతన్య యై
పూవుంబోఁడి సుధాంశుబింబసుషమాపూర్ణాభిషేకప్రమీ
లాపీతోత్పలవల్లి పోలెఁ గనుగల్వ ల్విప్ప నా జనుల్."

(వసు. ఆ. 3. ప. 179-183.)

రామరాజభూషణుని యీమూర్ఛావర్ణనము కొంతవఱకు శ్రీహర్షుని నైషధచ్ఛాయ నలంకరించుచున్నది. నైషధకావ్యమున శ్లేషభంగిని దమయంతి కామెహృదయము నలనిహిత మగుచున్న దని స్ఫురించుటచే నామె మూర్ఛిల్లె నని వర్ణింపఁబడినది. వసుచరిత్రమున మన్మథమూర్తిచే గిరిక మూర్ఛిల్లినదనియు 'నెలఁత కీవసులాభంబు నించుమంచు' నను వాక్యముచేఁ బదగుంభనచాతుర్యమున సభంగశ్లేషమూలమున ఘటింపఁబడిన వసులాభశబ్దస్ఫురణముచే మూర్ఛనుండి తేఱె ననియుఁ జమత్కరింపఁబడినది. మఱియు నైషధాదులందు శీతలోపచారములు యథేచ్ఛముగా వర్ణింపఁబడినవి. ఇందట్లుగాక మిగుల చమత్కార

''ఉ. ఇంతలు కన్ను లుండఁ దెరు వెవ్వరి వేఁడెదు భూసురేంద్ర, యే
కాంతమునందు నున్న జవరాండ్ర నెపం బిడి పల్కరించులా
గింతియ కాక నీ వెఱుఁగవే మును వచ్చినత్రోవచొప్పు నీ
కింత భయంబులే కడుగ నెల్లిద మైతిమె మాట లేటికిన్." (మను. ఆ. 2.)

ఈపద్య మెంతసరసముగా నున్నదో తిమ్మకవిపద్య మంతవిరసముగా నున్నదనుటకు సందేహము లేదుగదా!

నర్మసఖున కీరీతి పరాభవము జరుగుచుండు మహావినోదసందర్భమున ఋతుధ్వజుని ప్రవేశ పెట్టుటయు, రాజు తనప్రేమమును జులుకనగా వెల్లడిచేయుటయుఁ జెలులు రాజునకు బుద్ధిచెప్పి సుశ్యామను దోడ్కొనిపోవుటయు, రాజు వెంబడించి బోధించి ప్రార్థించుటయుఁ జెలులు రాజుం గసరి యచటినుండి నాయికం దోడ్కొనిపోవుటయు మున్నగువిషయము లతివైరస్యముగా వర్ణింపఁ బడెను.

''గీ. అవనినాయక ! సుశ్యామయనెడుపేర, నలరు గంధర్వరాజకన్యాలలామ
యివ్వెలందుక దీనికై యిట్లు నగలఁ, దగులఁ దగునయ్య మీవంటి తగవరులకు."

... ... ... ... ... ...

''క. అనుమాన మడిగి వినుమా, నను మారునిబారిఁ ద్రోచి ననఁబోఁడి వెసం
జనఁ జూచెద వలవిధి నెక్కొను నిక్కల నిన్నుఁ గట్టికుడిపెడిఁ జుమ్మీ !"

... ... ... ... ... ...

''క. అని పలుకు నెడలఁ జెలు లెల్ల నిదేమిటి జోలి సరి బళా ! పదపదరే !
యని చెలిఁ దోడ్కొని గొబ్బునఁ, జని రంత విభుండు గుండె ఝల్లన లీలన్."

తుట్టతుద శుభములను సమావేశపఱుపఁ దలఁచినప్పు డీరీతి విరసప్రసంగము చేయించుట రసిక జనమనోభిరామముగా నుండునా ?

మఱియు, నీనాయిక పరకీయయనియు నిట్టిదానికై యింతవలపు తగదనియు, నర్మసచివుండును నాయికచేఁ దిరస్కరింపఁబడినవాఁ డగుటచేఁ గావలయును రాజునకు బుద్ధిచెప్పినట్లు వర్ణింపఁబడెను.

''క. వేలాగుల నన్యవధూ,లోలుఁడవై నాన యుడిగి మోఁగెదు ధరణీ
పాల విను 'కాముకస్య కుతో లజ్జా' యనెడు నుడువు తుది నిజ మయ్యెన్."

... ... ... ... ... ...

''క. పురములు విడిపాఱవె? కుల, తరుణులు వెతపడరె? బుధులు తప్పెన్నరె? నీ
సరిదొరలు నగరె? వంతలఁ, గరమడలరె? ప్రజలు నీప్రకారము విన్నన్."(రసిక. ఆ. 3. ప. 39.)

ఏనర్మసఖుఁడైన రాజున కీరీతిని బుద్ధిచెప్పెనా? వసుచరిత్రమున గిరికకై పరితపించు వసురాజును నర్మసఖుఁ డెట్లూరడించెనో యరయుఁడు.

''చ. జనపతి యిట్లు పంచశరశాతశరాహతిఁ జంచలింపఁ గాఁ
గని హితమంత్రి పల్కు మహికాంత నిరంతరచింత నింత విం
తనొగులు పూననేల? లలనానలినాస్త్రుఁడ వీవు నిన్నుఁ గ
న్గొనినలతాంగియీలువు మనోభవుఁ డింతకుఁ గొల్లలాడఁడే.

చ. అతివగురుండు తావకపదానతుఁ, డంగనఁ గన్నతల్లి య
ద్భుతభవదీయశౌర్యగసపోషితజీవన, కొన్న నెచ్చెలుల్
సతతము నీకథ ల్వొగడ జాణలు, బాల భవద్విలాసమో
హిత, హితకార్యసంగతికి నియ్యెడ సందియ మంద నేటికిన్." (వసు. ఆ. 3. ప 87, 88.)

మఱియు నిందు సుశ్యామ విరహపీడిత యయియుండఁ జిలుకరాయబారమును గల్పించినాఁడు. ఇది వసుచరిత్రములోని మంజువాణిమాత్యమును బూర్తిగాఁ బోలియున్నది.

"చ. పకపకనవ్వి యోనసున్నపాలక బాలిక చూఱెదేల ? సా
రెకుఁ బరతంత్ర లింతులు నరింతురె కాంతులఁ దమ్ముఁదామ క
న్యకలను నేరమా? యది యనన్యగతిన్ సుదతిన్ మనోజుబా
రికి నెరఁజేసి లోఁ గనికరింపనివారివికాక నేరముల్." (వసు. ఆ. 4. ప. 89.)

"ఉ. తావకశైలభేదనకథాబిరుదాంకము లేమ పేర్కొ-నం
దా విని వెచ్చ నూర్చి వనితామణి నిత్యకఠోరముల్ కుల
గ్రావము లంద్రు వానిఁ బవఘట్టనఁ గీటడఁగించినట్టి గో
త్రానరుఁ డింక నేమిటఁ గరంగు నయో యని నించు బాష్పముల్." (వసు. ఆ. 4. ప. 109.)

"శా. ఏమేమీ! జగతిం గఠోరములు శైలేంద్రంబు లౌఁ గాఁ దదీ
యామేయస్మయభేది యంతకుఁ గఠోరాకారుఁ డౌనే కదా
యామేటిన్ ధృతివాపి చూపులనె యూటాడించువా రెంతవా
రో మీనేత్రుణ తా నెఱుంగదె తదారూఢప్రభావోన్నతుల్." (వసు. ఆ. 4. ప. 113.)

"చ. కటకట రాజచంద్ర! యిది కర్జమె నిర్జరకన్యకామణిన్
దటుకున ఘోరమారనిశితప్రదరంబుల పాలు చేసి యి
చ్చటి కిటుచేరి నీవును విశంకటతాపభరాలసుండ వై
యటమటఁ జెందదేల? పదమా మున మార నెఱంతెంతకున్."

(రసికజనమనోభిరామము ఆ. 5. పే. 70.)

"శా. ఏమేమీ! రమణీశిరోమణి భళా! యిట్లాడి ని న్నంపెనా?
నామీఁదం గలకంఠకంఠి కెపలోనం గూర్మి వాటిల్లెనా?
భామారత్నముబోటు లిప్పనికిఁ దోడ్పాటై విడంబించిరా?
నీమేల్వ ల్కిఁ-క దాఁచనేల? చెపుమా నీరోష్ఠవశ్రేష్ఠమా." (రసిక. ఆ. 5. పే. 71.)

పయిపద్యముల నరసిచచో రామరాజభూషణుని కవితాధోరణికిని దిమ్మకవి కవితాధోరణికిని గల తారతమ్యము స్పష్టపడును ఇఁక మణిహారసందర్భములోనిపద్యము లరయుఁడు.

"మ. కమనీయద్యుతిధామమా! విమలముక్తాదామమా! నేమమా!
కమలామోదకుఁ దత్సఖీసమితికిం గల్యాణమా! తన్మరా
శమయూరీకుకశాబశారికలకెల్లన్ భద్రమా తెల్పుమా
ప్రముదారత్నముపేరుగా నెద నినుం బాటించి ప్రార్థించెదన్."

"ఉ. గ్రానసుతాకుచాగ్రపరిరంభనిగుంభసుఖోపలంభసం
భావితభావిమత్కరవిమర్దన కోడకుమీ విశుద్ధము
క్తావళి! బాలికానవసమాగమయోగ్యమహోపలాలన
శ్రీ నెలయింతుఁ గాని నినుఁ జిక్కఁ బెట్టఁ గుమీ రయంబునన్.'

"శా. శుక్తిక్రోడకుటీసహావసతి నై సూచ్యగ్రసంస్థాయి నై
ముక్తాహారమ వై భజించితి గదా ! ముగ్ధాకుచద్వంద్వసం
సక్తిం దాదృశభూతి తావకకృపాసంసిద్ధి లే కబ్బునే
ముక్తాహారత నున్నయంతనె తలంపు ల్నింపు నా కింపుగాన్."

(వసు. ఆ. 4. ప. 100, 104. 10?.)

"ఉ. నేమమె గోముమీఱు రతిచేతి నిగారపుఁబైఁడిబొమ్మ క
య్యామని పువ్వుఁగొమ్మకు నొయారపువేలుపురాచకొమ్మకుం
గాముని గీముతోఁట పలిగప్రపుదిమ్మకు ముద్దుగుమ్మ క
ద్దామవచోనిరూఢి మణిదామమ ! ప్రేమ మెలర్పఁ జెప్పుమా."

"ఉ. అక్కమలాయతాక్షి నను నక్కున నొక్కి కవుంగలించుచోఁ
జిక్కులఁ బెట్టి నిన్నడలఁ జేయుదు నంచుఁ దలంపఁ బోకు నా
యక్కఱఁ దీర్చి యాదుకొనుమా మణిహారమ ! పేరు మీఱ న
మ్మక్క ! పరోపకారవిహితాత్మ లిలం దమసేగి యెంతురే ?"

"గీ. కలికియురమున నెత్తావికలప మలఁది, విరిసరంబులు దమి నించువేళఁ జాల
మఱలఁ జేయుదుఁ గాని మే ల్మఱచి యేను, నిన్నుఁ జిక్కుల నిడఁ జుమీ పన్నసరమ !"

"ఉ. సాంకవగంధసార ఘనసార మృగీమదసార సౌరభా
లంకృతమైన వేల్పునవలాతలమున్న యురంబుపై నిరా
తంకగతిన్ సుఖింపు మమితమ్మగు భాగ్యము నీకు నబ్బె నా
కింక మఱెన్నఁడబ్బు వచియింపఁ గదే మణిహారరాజమా !" (రసిక. ఆ. 5. పే. 71, 72.)

ఇంక నిట్టికథపట్టులందలి యనుసృతులేగాక పద్యకల్పనములందును ననేకములు గనుపట్టుచున్నవి. వానిలోఁ గొన్నిటి నిట నుదాహరించెద.

"మ. చతురాస్యు ల్పురుషోత్తము ల్బుధగురు ల్సర్వజ్ఞమూర్తుల్
... ... ... ... ... ...
క్షితిదేవుల్ పురి దేవతావిహిమలం జెన్నొందుట ల్చిత్రమే." (వసు. ఆ. 1. ప. 97.)

"సీ. బుధవత్సలులు కళాపూర్ణులు పరిచక్రహరణులు కువలయాహ్లాదకరులు;
వసుసమన్వితులు సర్వజ్ఞశిరోమణుల్ ... ... ...
గీ. ... ... ... రాజు లలరుదు రప్పురరాజమునను."
(రసిక. ఆ. 1. పే. 6.)

"సీ. రాగంబు మూర్తమై రహిఁ ద్రోవఁ జూపుపెంపునఁ బడచ్ఛాయ మున్మున్న నిగుడ;
... ... ... ... ... ...

నీవిఁ జుట్టిన భోగి నిట్టూర్పుగమి నుబ్బి సడలెనా నొడ్డాణ మెడలి తూల

... ... ... ... ... ...

తే.గీ. కటికరటి కంకపీఠిపైఁ గంతుఁ డనెడి, బిరుదుమానంతుఁ జేసిన పీలిజల్లి
పెంపు గను పెన్నెరులగుంపు ప్రిదిలి జాఱ, వచ్చె నొకసతి వసుమతీవరుని జూడ."

(వసు. ఆ. 6. ప. 11.)

"చ. కులుకుమిటారి గబ్బిచనుగుబ్బల ప్రేఁగుసుఁ గొంగుదీఁగ కం
పిసి యసియాడ ముంగురులు బిట్టు మొగంబుసఁ జిందులాడఁ గం
చెలముడి వీడఁ దత్తరిపుఁ జెయ్వుల నించుక నీవి యూడ వి
చ్చలవిడిఁ జూడ వచ్చె నొకచంద్రనిభాస్య నృపాలమన్మథున్." (రసిక. ఆ. 1. పే. 12.)

"చ. తరువులపొంతఁ బొంచి వసుధావరమిత్త్రుఁడు గాంచె నచ్చటం
దరుణిఁ దమోవినీలకచఁ దామరసోదరసోదరప్రభన్

... ... ... ... " (వసు. ఆ. 2. ప. 25.)

"మ. తరుమూలంబులపొంతఁ బొంచి సచివోత్తంసంబు వీక్షించె భా
స్వరకార్తస్వరవిగ్రహన్ సమదచంచచ్చంచరీకాలకన్
... ... ... ..." (రసిక. ఆ. 2. పే. 23.)

"సీ. ఘనులఁ గొండలపాలుగాఁ జేసిన కొఱంత ద్విజరాజు నెపుడుఁ గుందించు కొదువ;
కువలయంబు దినంబు కూల్చు నాడిక ... ... ...

తే. నలువ వారించుకొనియెఁ దన్నగరిసతుల, నెఱికురులు ముద్దుమోములు నిడుదకన్ను
లలఁతిమోవులు బిగిగుబ్బ లరిదినాభు, లలరుఁదొడలును మృదుపదంబులు నొసర్చి."

(వసు. ఆ. 1. ప. 107.)

"సీ. చందమామకు లోనఁ గం దొసర్చినతప్పు పసిఁడికిఁ దావి కూర్పనికొఱంత;
దొండపంటికిఁ దీపి నిండఁజేయని రట్టు, ... ... ....

గీ. వలపుకోనఁ జాలు నద్దిర! జలజభవుఁడు, పూని యిమ్ముద్దుతెలిరాకుఁబోఁడి వదన
తను రదాంశుక లోచన స్తన కపోల, సక్థి పద యుగ్మకము సొం పెసఁగ నొనర్చి."

(రసిక. ఆ. 2. పే. 23.)

"ఉ. ఏగతి యోగిరూపము వహించెదొ? యేగతిఁ బ్రౌఢి మించెదో?
యేగతి వేళ గాంచెదవొ? యేకత మున్న వధూజనంబు నీ
వేగతిఁ బల్కరించెదవొ? యిష్టసఖా! భవదీయనీతికా
ర్యాగతి నేఁడు చూతముగదా! యని యంపిన నాక్షణంబునన్." (వసు. ఆ. 2. ప. 78.)

"శా. ఏఛందంబున నింతిచెంత కఱిగే కీవేగి దర్శించెదో?
యేచందంబున మాటలాడి మదిలో నింపొందఁగాఁ జేసెదో?

యాచంద్రాననపొందు నా కెటువలెన్ హత్తించెదో? మేలు నీ
వాచాప్రౌఢిమ నేఁడు చూతముగదా బాలేందులీలాసఖా!" (రసిక. ఆ. 3. షేజీ. 30)

"చ. కటకట! మమ్ము నొక్కత్రుటికాలముఁ బాయనిదాన వొంటిమై
నెటువలె వచ్చితమ్మ! చెలి! యిచ్చటి వ్రేఁకపుఁదేనెవాఁక లీ
వెటువలె నీదితమ్మ తెరు వెల్లను బుప్పొడి నీపదాంబుజం
బెటువలె నోర్చితమ్మ! తరుణీ! తగునమ్మ కెంతవిస్మయముల్." (వసు. ఆ.3. ప. 121.)

"ఉ. కొమ్మరో! ముమ్మరంపురసతంఁ గుందుదు నిల్లెంఁబోసి యిమ్మెయి
న్నమ్మిచేసి యొంటిగ వనంబున కేటికి వచ్చితమ్మ! నె
త్తమ్ములఁ గేరు నీమృదుపదంబులు కందఁ గదమ్మ! మేలు మే
లమ్మకచెల్ల! నీ బెలుగయాళితనమ్ములు చెప్పఁ జిత్రముల్." (రసిక. ఆ. 4. షే. 52.)

"సీ. పవమానమానవల్లవమానసక్తైరవచ్యవమానరజము మై వంటఁ దివురు;
... ... ... ... ..." (వసు. ఆ. 3. ప. 118.)

"సీ. అసమానవాసనాలసమానవల్లికాప్రసవమంజరులపై ముసరి ముసరి
... ... ... ... ..."

(రసిక. ఆ. 5. షే. 76.)

ఇట్లె వసుచరిత్రములోని కల్పనములను గథపట్టులను ననుసరించి చెప్పినవారిలో ముఖ్యులగ్రంథములు పిల్లవసుచరిత్రము లని ప్రసిద్ధిని జెందియున్నవి. వానిలోఁ గనుపర్తి యబ్బయామాత్యుని కవిరాజమనోరంజన మను నామాంతరము గల పురూరవశ్చరిత్రము మిగుల రసవంతముగా నున్నది. కాని వసుచరిత్రము వంటి ప్రౌఢిమ గలిగియుండలేదు. అడిదము సూరకవి ప్రణీత మగు కవిజనరంజనము లోని వర్ణనములును సరసముగనే యున్నవి. కాని యిందుఁ గథాభాగ మేమియుఁ గానరాదు. పురవర్ణనము, హరిశ్చంద్రవర్ణనము, చంద్రమతీవర్ణనము, విరహవర్ణనము, చంద్రాద్యుపాలంభస్తుతులు, వివాహవర్ణనము, చంద్రమతికి బుద్ధులు గఱపుట, కేళీగృహ రత్యుపరతి వర్ణనములు, ననునవి మాత్రమే గలవు. మొత్తముమీఁద నిందుఁ గథాభాగము హరిశ్చంద్రుఁడు చంద్రమతిని బెండ్లాడి సుఖించుట. అబ్బయామాత్యుఁడు కవిజనరంజనమునకు వన్నెఁ దెచ్చుచుఁ గవిరాజమనోరంజనమును రచించెను. కాని యిందును వర్ణనాభాగము లన్నియు వసుచరిత్రమును జూచి చేసినవే యని స్ఫురింపకపోదు. కల్పనావిషయమున నిందుఁ గొన్నిచోట్ల వసుచరిత్రచ్ఛాయ లున్నను దద్భిన్నము లగు కల్పనావిశేషములును ననేకము లున్నవి. కృష్ణకవి శకుంతలాపరిణయమునుసైతము పిల్లవసుచరిత్రముతోఁ బోల్పఁ దగి యుండలేదు. కాని యిందు వసుచరిత్రములోని పద్యములయుఁ గల్పనలయు రీతు లత్యధికముగ సంగ్రహింపఁబడుటచే దీనికీపేరు వచ్చినదని తోఁచుచున్నది. పై మూఁడుగ్రంథములలోని వసుచరిత్రరీతులు కొంతవఱ కుదాహరించి యీయనుస్మృతి ప్రదర్శనమును విరమించుచున్నాను.

మొదట నొక్కొక్కరి యనుసరణములును, పిదప నేకాధికానుసరణములును నుదాహరించుచున్నాను.

"మ. జననాథోత్తముఁ డింతిఁ జూడ ననిమేషత్వంబుఁ గాంక్షించు న
య్యనిమేషత్వము కాంత కాంతముఖచంద్రాసేవనానందహ

సనఁ బ్రాపించినఁ గోరు నప్పు డనిమేషస్వామిభావంబుఁ గ
న్గొన నెందుఁ స్పృహ లుత్తరోత్తరపదానూనస్పృహాచంచలుల్." (వసు. ఆ. 2. ప. 64.)

"తే. ఇంతిసౌందర్యరేఖాదిదృక్షచేత, నెపుడు తెఱ వంతు రను పంచినపుడు గోరు
నిమిషపరికల్పితాంతరాయము విదిర్ప, భూమిసతులందు వాంఛాప్రవృత్తి గలదె!"

(కవిజనరంజనము. ఆ. 3. ప. 37.)

పయి రెండుపద్యములందును వసుచరిత్రపద్యమే మిగుల సరసముగ నున్న దని వేఱుగ వ్రాయ నక్కఱలేదుగదా! ఇట్లె తెలియుగ నంతటను గ్రహించునది. ఈపద్యచ్ఛాయనే కొంతవఱకు సూరకవి రెండవయాశ్వాసమునందలి పదునేనవ పద్యమును సైతము రచించెను.

"చ. అలికులవేణి యిట్లు వలయాంకబిసాంకురపన్నగాళికిన్
జల మరి చల్లగాలికిని జక్కొరభూజపుఁటేజఁ దోలు పూ
విలుతు హయాళికిం జిగురువిందుల నీలి గయాళికిన్ హలా
హలగుళికాభ దుర్మద ఘనాళికి నాళికి లోఁగి యాత్మలోన్." (వసు. ఆ. 3. ప. 112.)

"క. అలుకొందె నప్పు డాత్మో,య్యలి మధుకరనికరశుకపికావళికిన్ జా
బిలికిన్ జిలిబిలి వలికరు,వలికిన్ విరివిలుతు నెక్కువ హాళాహళికిన్."

(కవిజనరంజనము. ఆ. 2. ప. 19.)

"సీ. నటదీశహాసవిస్ఫుటితవేధోండరేఖలఁ దోఁచు వరణాంబుకణిక లనఁగఁ;
బె ల్లుబ్బు నిర్గమె న్వెల్లి నెల్ల పదార్థములు మున్గఁ బొడము బుద్బుదము లనఁగ;
రవికి వందేహనిర్మథనసాధనము లై నచ్చిన ద్విజమంత్రవర్ణ ము లన;
హరిపదంబును నీశుశిరము నైన నభంబున నభోగతులు నించు నన లనంగఁ;
తే. జరమగిరి యను మరకాఁడు జలధిసరణిఁ, దరణి డంచిన నతఁడు తత్సలిలమగ్న
విమలముక్తాఫలంబులు వెలికిఁ జోనిపె, ననఁ గ నవతారకానికాయంబు లడరె."

(వసు. ఆ. 4. ప. 15.)

"సీ. ధ్వాంతదంతావళోత్కరపుష్కరోద్ధూతగగనగంగాపయఃకణము లనఁగ;
శర్వతాండవదిదృక్షాసమాగతనిర్జరహారముక్తికశ్రేణు లనఁగ;
నభ్రకళిందజాప్రవమున నిండార విరిసిన తెల్ల గల్వవిరు లనంగ;
భావినిశాచంద్రపరిణయంబున కిడు దిక్కుడ్యములపిండిచుక్క లనఁగఁ;
గీ. గ్రిక్కిఱిసె నొక్కమొగి నెల్ల దిక్కులందు, క్షీరఘనసారపాటీరతారహార
హీరపారదనారదశారదాభ్ర, గౌరరుచి మీఱఁ దారకావార మపుడు."

(కవిజనరంజనము. ఆ. 3. ప. 62.)

## కవిరాజమనోరంజనము.

"సీ. పొన్నపూపొడి నేల పొదివితె చెలి యది పొడమె బల్దీవిపైఁ బొదువవలదె;
చెలువ మాటలి వేల? కలువచా లవియుఁ గప్పఁగ రాదె మిన్నులబావికడది;

"సీ. పోఁగూడ దీదారి పుల్లహల్లకసారకాసారనీసారకర్దమంబు......
తే. నాథ! యిది కప్పురంపుటనంటికోన, మహిప! యిది గో స్తనీకాయమానసరణి
నృపకులాగ్రణి! యిది మాలినీప్రవాహ,మధిప! యిదె చూడుము శకుంతలావసథము."
(శకుంతలాపరిణయము. ఆ. 3. ప. 29.)

ఇట్లే కొన్నిచోట్ల వసుచరిత్రపద్యము లీపిల్లవసుచరిత్రములలో రెండుమూఁడుగ్రంథములం దును ననుకరింపఁబడియు నున్నవి.

"సీ. తన యశోవిశదముక్తాసౌధపాళికి, నంబుదాయనము వాతాయనముగఁ;
దన శౌర్యశిఖిశిఖాతతికి జాంబూనద, భూధరం బపరంజిపూదె కాఁగ..."
(వసు. ఆ. 1. ప. 116.)

"సీ. తన పృథుకీర్తి ముక్తాతపత్రమునకు స్వర్ణధరంబు కనకదండంబు గాఁగ
నన ప్రతాపసమగ్రదావాగ్నిశిఖకు వ్యోమంబు తదగ్రధూమంబు గాఁగ..."
(కవిజనరంజనము. ఆ. 1. ప. 28.)

"సీ. తన కీర్తికర్పూరమునకు బ్రహ్మాండక,టాహంబు దగు కరాటంబు గాఁగఁ;
దన భుజాకర్బుర స్తంభంబునకు ధరా,సతి ఘటన్మరకతప్రతిమ గాఁగ..."
(కవిరాజమనోరంజనము. ఆ. 3. పే. 34.)

"చ. తలు లరనిక్కఁ బూఁత నెఱతావియు చిక్క నపాంగమాలికల్
మెఱుఁగులుగ్రక్క నూరుపులమేలిమిఁ దేఁటులు చొక్క హారముల్
కుఱుచలుద్రొక్క ముంగుఱులు గ్రొంజెమటం బద నెక్క వేలుపుం
దెఱవ యొకర్తు చేదిజగతీపతికిన్ శిర సంటె వేడుకన్." (వసు. ఆ. 5. ప. 75.)

"చ. జిలుఁగుపయంట మూల నునుఁజెక్కుల లేఁజెమ రంకురింప గు
బ్బలు నటియింపఁ దాళగతి బంగరుగాజులు మ్రోయ హారము
ల్మెలిగొన నూర్పు లుప్పతిల లేనడు మల్లలనాడ మెల్లనే
యలికులవేణి యోర్తు శిర సంటెను గెంజిగురాకుఁ బోఁడికిన్." (కవిజనరంజనము.ఆ.3.ప.26)

"ఉ. కంకణనిక్వణంబు ఘలుఘల్లన మ్రోయఁ గపోలపాళిఁ దా
టంకరుచు ల్వెలుంగ నుదుటం జెమటెస్పుట గ్రమ్మ హారముల్
కుంకుమగంధపున్వలపుగుబ్బలపై నటియింప నొక్క యే
ణాంకనిభాస్య భూపతికి నంటె సుగంధపునూనె యత్తటిన్."
(కవిరాజమనోరంజనము. ఆ. 5. పే. 69.)

"సీ. లలనాజనాపాంగ వలనావసదనంగ, తులనాభికాభంగ దోఃప్రసంగ;ము." (వసు.ఆ.1.ప.126.)

"సీ. సరసాతిశయసార సరసానుభవధీర, తరసార ఝంకారకరమవాళి;..."
(కవిరాజమనోరంజనము. ఆ. 4. పే. 51.)

"సీ. ప్రసవాసవాసంగ లసమానమదభృంగ, విసర్గకశృంగారరసలవంగ; ము..."
(శకుంతలాపరిణయము. ఆ. 1. ప. 110.)

"ఉ. కొం డడఁట విల్లు వేడలలకుండలిరా జఁట నారి యమ్మనం
తుం డడఁట బైటిపల్లియలు దున్మినవాఁ డఁట యొండురెండు భ

ర్గుం డిది నిండుపౌరుషమొకో యని గెల్వవె ముజ్జగంబు లు
ద్దండత నొక్క తుంటవిలు దాలిచి యంటినఁ గందు తూపులన్.” (వసు. ఆ. 3. ప. 174.)

“ఉ. నా రఁట తేఁటి జోకనలి నా రఁట తే రఁట చిల్క సౌరభో
ద్గా రఁట విల్లు పూఁతనయగా రఁట చుట్టము శైత్యపుఙ్గసదా
చా రఁట కమ్మగాడ్పుపరిచా రఁట కోయిల కేతువాలయ
ద్వా రఁట యిట్టి నీ కొదుగు వా రఁట లోకు ల దేమిచిత్రమో?”

(కవిరాజమనోరంజనము. ఆ. 3. పే. 40.)

“ఉ. తుం టఁట కార్ముకంబు కరదొట్టిన తేం ట్లఁట వింటినారి చే
యంటిన వాడు తూపు లఁట యప్పులపా లఁట కేతనంబు వా
ల్గంటిపులుంగు గుజ్జు మఁట కాయము లే దఁట నీకు లోకముల్
కొం టెతనంబునం గెలిచికో లిది యచ్చెరియంబు మన్మథా.”

(శకుంతలాపరిణయము. ఆ. 2. ప. 179)

ఇటులనే యనేకస్థలములందుఁ బరస్పరానుస్మృతులు గలవు. వాని నెల్ల నిట నుదాహరించుటయొ యావశ్యకము గాని విస్తరభీతిని విరమించితిని. అట్లయినను నిచ్చట నట్టియనుస్మృతిగల పద్యముల సంఖ్యలనుమాత్రము చూపుచున్నాను.

| వసు చరిత్రము. | | కవిజన రంజనము. | | కవిరాజ మనోరంజనము. | | శకుంతలా పరిణయము. | | వసు చరిత్రము. | | కవిజన రంజనము. | | కవిరాజ మనోరంజనము. | | శకుంతలా పరిణయము. | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఆ. | ప. | ఆ. | ప. | ఆ. | ప. | ఆ. | ప. | ఆ. | ప. | ఆ. | ప. | ఆ. | ప. | ఆ. | ప. |
| 2 | 64 | 2 | 15 | | | | | 1 | 36 | | | | | 1 | 77 |
| 4 | 34 | 2 | 39 | | | | | 1 | 80 | | | | | 1 | 116 |
| 5 | 3 | 3 | 12 | | | | | 1 | 22 | | | | | 1 | 125 |
| 3 | 67 | | | 5 | 65 | | | 2 | 7 | | | | | 1 | 184 |
| 1 | 108 | | | 4 | 63 | | | 2 | 25 | | | | | 2 | 3 |
| 2 | 65-67 | | | 5 | 61 | | | 2 | 32 | | | | | 2 | 14 |
| 3 | 149 | | | 4 | 51 | | | 3 | 67 | | | | | 2 | 47 |
| 4 | 39 | | | 3 | 42 | | | 3 | 116 | | | | | 2 | 184 |
| 6 | 60 | | | 3 | 40 | | | 4 | 7 | | | | | 2 | 189 |
| 3 | 116 | | | 3 | 35 | | | 4 | 15 | | | | | 2 | 191 |
| 2 | 47 | | | 2 | 24 | | | 3 | 116 | | | | | 3 | 70 |
| 2 | 32 | | | 2 | 15 | | | 3 | 46 | | | | | 3 | 113 |
| 1 | 34 | | | | | 1 | 29 | | | | | | | | |

తే. పట్టి వాణీగురుత్వమహత్త్వఖనుల, ఘనులఁ బ్రాచేతస, వ్యాస, కాళిదాస,
దండి, భవభూతి, మాఘసత్కవి, మయూర, భారవుల, భాసుల నాత్మఁ బ్రస్తుతింతు."
(వసుచరిత్రము. ఆ. 1. ప. 9.)

ఇచ్చట సైతము నరసభూపాలీయపద్యమును వసుచరిత్రపద్యకల్పనము చమత్కరించుచునే యున్నది.

"మ. వసనాగ్రంబున వాణి యున్నది సుమీ వ్యాప్తున్న నీ దిందిరా
మదిరాక్షీమణి యున్న దక్షుల సుమీ మన్నించి వీక్షింపనీ
పదియుం గాన నృసింహ! నీవిపులబాహాశ్లేషమే నొందు నో
ర్వదు భూదేవి బహుప్రియారత నినుం బ్రార్థింప నింకేటికిన్."
(నరసభూపాలీయము. ఆ. 3. ప. 141.)

"చ. జలనిధిరాజకన్య కనుసన్న మెలంగుచునుండు వాణియున్
మెలఁగును మాటలోన నెలమిం జెయిసన్నఁ జరించుఁ గీర్తి నీ
లలితభుజాసగూహానివాసము మానదు ధాత్రి సద్గుణో
జ్జ్వల నరసింహ మంత్రబలవంతుల కింతులు చిక్కుటబ్రమే. (నరసభూపాలీయము. ఆ.5.ప.187)
ఇట్లే యీగ్రంథమున సరస్వతీవ్యభిచారము పెక్కొన్నిచోట్లను.
(ఆ. 3. ప. 40, 129.) వర్ణింపఁబడినది.

"సీ. అనఁగుఁబమ్మునఁ బాసి కనుసన్నల మెలంగు నిందిరఁ బ్రాణముగా నెంచు ననిన
గూర్త్యాసనాభ్యాసకర్మఠ యై భజించు ధరిత్రిఁ జులుకగాఁ జూచు ననిన
మధురాధరస్పందవిధివశంవద యైన భారతి నొండొకమాఱు పల్కఁ దనిని
నాత్మపాణిస్పర్శనాయత్తమగు కీర్తి నెనసి దిక్కులకంపు ననుచు ననిన
"తే. జగతిఁ గొఱనోమునోఁచిన జలజముఖులఁ, గూరిమి గణించి యతఁ డేల గారవించు
వరుని బహువల్లభానోహరుని గోరు, ముదిత ముదితయె యని బాల మోము వాంచు."
(వసుచరిత్రము. ఆ. 4. ప. 111.)

(ఇట్లే 3. ఆ. 94 వ పద్యమునందు శక్తిత్రయవ్యభిచారముగలదు.)

ఈవర్ణనములందును నరసభూపాలీయపద్యమును వసుచరిత్రపద్యగతకల్పనముల చమత్కరించుచునే యున్నవి. నైషధగీతుల ననుసరించుట రామరాజభూషణునకు స్వభావమని యిదివఱకు వివరపఱచి యేయున్నాను. అట్టి యభిప్రాయము నరసభూపాలీయరచనాకాలమునకే యీతని కున్నదని తోఁచుచున్నది.

"శ్లో. శృణ్వన్ సదారస్తదుదారభావం హృష్యన్ముహుర్లోమ పులోమజాయాః;
పుణ్యేన నాలోకత నాకపాలః ప్రమోదబాష్పావృతనేత్రమాలః.
శ్లో. సాపీశ్వరే శృణ్వతి తద్గుణౌఘాన్ ప్రసహ్య చేతోహరతోఽర్ధశంభుః;
అగా దపర్ణాంగుళిరుద్ధకర్ణా కదా న కండూయనకైతవేన.
శ్లో. అలం సజన్ ధర్మవిధౌ విధాతా రుణద్ధి మౌనస్య మిషేణ వాణీమ్;
తత్కంఠమాలింగ్య రసస్య తృప్తాం న వేద తాం వేదజడ స్స్వవక్త్రామ్.

శ్లో. శ్రియ స్తదాలింగనభూ ర్న భూతా వ్రతక్షతిః కాపి పతివ్రతాయాః ;
సమస్తభూతాత్మతయా న భూతా తద్భర్తు రీర్ష్యాకలుషాణునాఽపి."

(నైషధము. సర్గ. 3. శ్లో. 29,30,31,32.)

మహాకవియగు శ్రీహర్షుఁడును ననౌచిత్యశంక విడిచి స్వభావప్రకటనమున కై యిట్లు వర్ణించి యుండుటచేతనే గావలయు రామరాజభూషణుఁడు పై రీతి వర్ణించియున్నాఁడు. అందుఁ గొంతవఱ కౌచిత్యపోషణమున కై యర్థాంతరరహితములను శచీ, పార్వతీ, వ్యభిచారరూపవర్ణనములను విడిచి యంతటను నర్థాంతర ముండునట్లుగనే సంస్కృతగ్రంథములందును రామరాజభూషణుఁడు వర్ణించినాఁడు. సరస్వతికిని భూదేవికిని శ్రీదేవికిని నిట్లు శ్లేషగర్భితములగు వ్యభిచారవర్ణనములు కవిసమయసిద్ధములే యగుటచేత నంతగా నౌచిత్యహాని కల్గించవని తలఁపఁజనును.

"శ్లో. కస్మై చి త్కపటాయ కైటభరిపుః పీతదీర్ఘాలయః
దేవి! త్వాం ప్రణిపత్య కుప్యసి న చే ద్వ్యత్యంచి దాచక్ష్వ హే,
యత్తే మందిర మంబుజన్మకి మిదం విద్యాగృహం యచ్చ తే
నీచానీచతరోపసర్పణ మహా మేత త్క మాచార్యక"మ్మని యిట్లు మురారికవి వర్ణించియున్నాఁడు. ఇట్లనేకకవులవర్ణనములు గలవు. గ్రంథవిస్తరభీతి నిట నుదాహరింపలేదు.

శ్రీనాథుఁడు పై నైషధశ్లోకముల నాంధ్రీకరింపలేదు. ఔచిత్యహానికి సంశయించియిట్లు విడిచిపెట్టె నని యందమన్న శ్రీనాథుఁడు శృంగారనైషధమున మఱికొన్నిచోట్ల నట్టినియమమును బాటింపలేదు కాన నీవిషయమునను గారణము వ్యాగ్యము.

"శ్లో. న కా నిశి స్వప్నగతం దదర్శ తం జగాద గోత్రస్ఖలితే చ కా న తమ్;
తదాత్మతాధ్యాతధవా రతే చ కా చకార వా స్వస్య మనోభవోద్భవమ్." (నైష. స.1. శ్లో.30)

"తే. వానిఁ గలలోనఁ గానని వనజముఖియు, వాని మార్పేర జేర్కొని మానవతియు
వానిఁ గా నాత్మ భావించి వరునిఁ గవయ, నుప్పళింపని సతియు లేదయ్యె నచట."

అని యిట్లు శ్రీనాథుని శృంగారనైషధమునందును బతివ్రతల కందఱకును వ్యభిచారము వర్ణింపఁబడియున్నది. నరసభూపాలీయరచన కాలమునకే యిక్కవికి శ్రీహర్షమార్గానుస్మృతి యంకురించె ననుటకు మఱియొక యుదాహరణము నిచ్చుచున్నాను.

"శ్లో. అపి ద్విజిహ్వాభ్యవహారపౌరుషే ముఖానుషక్తాయతివల్గువల్గయా;
ఉపేయివాంసం ప్రతిమల్లతాం రయస్మయే జితస్య ప్రసభం గరుత్మతః."(నై. స. 1. శ్లో. 64)

"వ. ... ... వల్గువల్గానుషక్తవదనతావిడంబితవక్రస్థభుజగవైనతేయంబును,
... ... అగు నొప్పవాహ్యంబు నారోహంబుచేసి...." (శృం. నై. ఆ. 1. వ. 85.)

"మ. వరవల్గావిభవంబు దష్టభుజగవ్రాతంబు గా సింగిణుల్
గురుపక్షద్వితయంబు గాఁగ నరసక్షోణీశ్వరారూఢ మా
తురగోత్తంసము నిందిరాహృదయనాథుం డాల్చు ప్రత్యక్షబం
ధురపక్షీంద్రునిలీలఁ జూచు నహితస్తోమంబు భీమంబు గాన్." (నరసభూపాలీయ.ఆ.5.ప.201.)

నరసభూపాలీయమునందలి యిట్టి నైషధానుస్మృతులు మూర్తి రామరాజభూషణుల, యైక్యవాదమునకుఁ గొంతయాధారములే యనవచ్చును.

"మ. వరవక్త్రేందువిలాసకృన్నవపయోనర్హావసాసంబునం
దరుణీశైశవసింధు లింకు నెడఁ దత్తత్కాలలక్ష్యంబు లో
సరసాంతస్థితగండశైలములనం జందోయి యంతంతకుం
బరగుం దత్క్రిమశోషరేఖలనఁ గన్పట్టు న్వళీపుంజముల్." (నరసభూపాలీయము. ఆ. 3. ప. 30)

"చ. కలికిముఖేందుకాంతి కరకాంతపయోజలదాంతవేళ న
ర్తులకుచగండశైలములు దోఁప నళిత్రయశోషరేఖ లిం
పలరఁగ మధ్యసీమ బయలై కటిసైకత మొప్ప బాల్యమన్
బలుపది యింకుచో మెఱసె నాభిగభీరజలాశయం బనన్." (వసుచరిత్రము. ఆ. 2. ప. 39.)

ఇచ్చటను నరసభూపాలీయపద్యముకన్న వసుచరిత్రపద్యమే విశేషకల్పనావిషయభాసుర మై దానిని జమత్కరింప రచించిన ట్లగపడుచున్నది. ఇట్టి పదైక్యములు కవులయభిన్నతకుఁ బ్రబలాధారము లనవచ్చును.

"క. వాలిక లై తెలిదమ్ముల, పోలిక లై చందమామపులుఁగులకును దా
మేలిక లైన నిరీక్షణ, మాలికల నృసింహుఁ జూచె సుదతి వేడ్కన్."
(నరసభూపాలీయము. ఆ. 2. ప. 86)

"చ. తొలుదొలుతన్ విలోలగతిఁ దొంగలిఱెప్పల నాని కర్ణముం
దలగుచి ధాళధళ్యములడాఁపున నల్లనఁ బొంచి మించు లై
వెలువడి పూర్ణచంద్రుపయి వెన్నెలపుల్గులచాలు వ్రాలు లీ
లల విభుమీఁద వ్రాలె ననలా పనలాలితదృష్టిజాలముల్." (వసు. ఆ. 3. ప. 49)

ఇచ్చట నరసభూపాలీయపద్యములోని "చందమామపులుఁగులకును దామేలికలైన" యనునది వసుచరిత్రమున నెంతసొగసుగఁ జమత్కరింపఁబడెనో చదువరులే గ్రహింతురుగాక; శ్రీవీరేశలింగము పంతులుగారు గ గుఱుతుముక్తులను వ్రాసిన యనుబంధములో నిట్లే రెండు గ్రంథములందలి వేఱొకచోటఁగల పదైక్య ముదాహరింపఁబడెను. (ఆమోదంబున ... ... (నరసభూపాలీయము. ఆ-2. ప-135. రామస్త్రీవరు ... (వసుచరిత్రము ఆ. 1. ప. 78) ఇట్టి యభిప్రాయైక్యపదైక్యములును నుత్తరోత్తరచాతుర్యమును విమర్శించినచోఁ గవు లభిన్నులనియు, వసుచరిత్రమే ద్వితీయగ్రంథమనియుఁ దోఁపక పోదు.

ఒకపక్షమునఁ బిల్లలమఱ్ఱిపినవీరభద్రుని శకుంతలాపరిణయములో నున్న

"క. వాలిక లై విరిదమ్ముల, యేలిక లై భావభవుని యెలమావులకుం
బోలిక లై యుత్పలికల, మాలిక లై యబలఁ దాఁకె నొగి నృపుచూపుల్. (ఆ-2.)

అనుపద్యము ననుసరించి నరసభూపాలీయమున (వాలిక లై. ...... (ఆ-2. ప. 86.) అనునది విరచింపఁబడినట్లును, శ్రీనాథపినవీరభద్రులరీతులను బెద్దనాదు లనుసరించినట్లును, విభిన్నులైన భట్టుమూర్తి రామరాజభూషణు లిట్లు పరస్పరానుసృతిగ రచించియుందు రనఁ జనదాయని యందమన్న నది సరికాదు. పూర్వోదాహృతములగు గ్రంథములలోని యనుసృతులు నరసభూపాలీయవసుచరిత్రముల యనుసృతులవంటివి కావు. పద్యములనడకలరీతులును, గల్పనారీతులును, గథాసంవిధానమార్గములును, వానిలో ననుసరింపఁబడినవి కాని యిట్లభిప్రాయైక్యపదైక్యములు వేర్వేఱుకవులు గ్రహించియుండలేదు. మఱియుఁ దమకుఁ బూర్వులయి తమగౌరవమునకుఁ బాత్రులయి సుప్రసిద్ధులయి యుండువారిగ్రంథముల ననుసరించుట సహజముగాని సమకాలికుఁడు విశేషించి జ్ఞాతియు మఱి

యుఁ డనకంటె నప్రాజ్ఞుఁడు నగువానిగ్రంథమునుండి పద్యచౌర్యము నభిప్రాయచౌర్యమును రామ రాజభూషణునివంటి మహాకవి చేయఁగోరునా ?

"గీ. అసమసాహిత్యరసమును వసువుపాలు, చేసి తత్పోషణార్థంబు వాసి నరస
రాజు సద్గతి భజియించి రామరాజు, శివపదముఁ జేరెఁ బేరును భువిని విడిచి."

యనుచాటువువలన వసుచరిత్రరచనకుఁ బరమున నరసభూపాలీయము రచింపఁబడిన ట్లగపడునని కొంద అందురు. కాని యీనిరాకరణగు చాటువు నమ్మఁదగినది కాదు. నమ్మినను దీని కర్థమే లేదు. మఱియు నిదివసుచరిత్రముచేసినపిమ్మట దానిపోషణమునకు నరసరాజునే భజించెనని స్ఫురింపఁజేయునుగాని నరస భూపాలీయము ద్వితీయగ్రంథమని సూచింపఁజాలదు. ఇంతియకాక సార్వభౌములగు రామరాజ తిరు మలదేవరాయలు తనకగ్రహారము లిచ్చి విశేషముగ సన్మానించిరట్లు కవి చెప్పుకొనియుండుటచే నిది విశ్వ సనీయముగ నుండలేదు.

## జ గుఱుతుయుక్తివిమర్శనము.

అనేకులు పూర్వగ్రంథకర్తలు వీ రభిన్నులని వ్రాసియున్నారా ?

ఈవిషయమున నాంధ్రకవులచరిత్రములో రామరాజభూషణునిచరిత్రమునకుబంధమునందు 2, 4, 5 వ విషయములను శ్రీవీరేశలింగముపంతులవారు ప్రబలముగ వ్రాసియున్నసంగతు లిదివఱకు నుదాహరించియున్నందున నిట వేఱుగ వ్రాయలేదు. రామరాజభూషణునకు సమీపకాలమువారలు సోమనాథకవి మండలక్ష్మీనరసింహాచార్యుల వ్రాఁతలును, లక్షణదీపికాగ్రంథములోని నిదర్శనములు శ్రీ వీరేశలింగముపంతులవా రుదాహరించియుండఁగా బయివానికిఁ బ్రతిపక్షులు సమాధానము వ్రాయ లేదు. కాని మఱియొవ్వరో యీయభేదమును వ్రాసినవారు చరిత్రవిషయములలోఁ దప్పులువ్రాసిరి గనుక నిట్టివి నమ్మరాదని శ్రీపూండ్ల రామకృష్ణయ్యపంతులుగారు వ్రాసినారు. "పైవిధముగ వ్యాఖ్యా నములలో వ్రాసినవారిని మేమెఱుఁగము గాని వారినలెనే వ్రాసి ప్రకటించిన యొక్కరిద్దఱివ్రాఁతలసా్వ రస్యమును జూడుఁడ"ని వ్రాసి యొనమండ్రము వేంకటరామయ్యగారి వ్రాఁతలను రామకృష్ణయ్యపం తులవారు విమర్శించిరి.

మఱియు నప్పకవి "ఓలంబాలక" యను వసుచరిత్రములోని పద్యమునందలి యతివిషయమున స్వగ్రంథమునఁ జర్చించునపుడు "లోలంబాలక" యను పదము రామరాజభూషణకవిహృదయ" మని వ్రాసియున్నాఁడు గాని బట్టుమూర్తికవిహృదయమని వ్రాసియుండఁడయ్యె నను కారణము నుదాహ రించి వసుచరిత్రము మూర్తికవి విరచితము గాదని శ్రీపూండ్ల రామకృష్ణయ్యపంతులుగారు వ్రాసి యున్నారు. మూర్తికవియే రామరాజభూషణుండై యున్నప్పు డొకపే రప్పకవి గ్రహించినంతమాత్ర మున రెండవపే రాతనిదికాదని యెట్లు స్థిరపడును? ఇట్టి బలహీనములగు యుక్తులు గ్రంథోదాహరణ ములతో వ్రాసిన శ్రీవీరేశలింగముపంతులవారి యుక్తులను ఖండింపఁజాలవుగదా ! ఇఁక నీవిషయమున గురజాడ శ్రీరామమూర్తిపంతులుగా రేమియు సమాధానమునే చెప్పలేదు. ఒక్కచోట నిట్టివ్రాఁతలు గతానుగతికము లని మాత్రము వ్రాసియున్నారు.

## చ. ఛ. గుఱుతుయుక్తుల విమర్శనము.

రామరాజభూషణునకు శుభబిరుదముగలదా ?

రామరాజభూషణుఁ డనునది బిరుదమా ?

నరసభూపాలీయమున "శుభమూర్తినామధేయుం" డని కవి తన్నుఁగుఱించి చెప్పుకొనియుండి హరిశ్చంద్రనలోపాఖ్యానమున "రామవిభుదత్తశుభచిహ్నవిభవయుతుఁడ" నని చెప్పుకొనుటచే రామరాజభూషణునకు 'శుభ'యనుబిరుదము గలదని వీరేశలింగముపంతులవారు వ్రాసియున్నారు. ఈవాదము వలన హరిశ్చంద్రనలోపాఖ్యానసరసభూపాలీయము లేకకర్తృకము లనుట స్థిరపడును గాని రామరాజు శుభచిహ్నము నిచ్చెనని వాదించుటచే రామరాజభూషణుఁ డనునది రామరాజదత్తమగు బిరుదనామమనుట కనుపడదు కావుననే "రామవిభుదత్తశుభచిహ్నవిభవయుతుఁడ" ననుదానిచే నిక్కవికి రామరాజు "రామరాజభూషణుఁ" డను బిరుదము నిచ్చెననువాదము స్వరసోక్తిగా గ్రహింపక కేచిన్మతముగా వీరేశలింగముపంతులవా రుదాహరించిరి. కాననే రామరాజభూషణుఁ డనఁగా రామరాజున కలంకారమువంటివాఁడని విశేషణముగా వీరర్థముచేసిరి. అట్లయినచో నాశ్వాసాంతగద్యములందు "సాహిత్యరసపోషణ రామరాజభూషణ" యను వాక్యాంతిమపదముక విశేషణనామములేయైనఁ గృతికర్త యెవ్వరో యెట్లుతెలియునని శ్రీపూండ్లరామకృష్ణయ్యపంతులుగా రాక్షేపించిరి. ఆశ్వాసాంతగద్యములందైన కవినామమును చేర్కొనకుండుట యప్రసిద్ధముగాన నీయాక్షేపణము సరిగనేయున్నది. మఱియు "రామనృపభూషణాఖ్యసుకవి" యనుచో నాఖ్యాశబ్దము వీరేశలింగముపంతులవారి వాదమునకు బాధకమనియు, నీ "శుభ" యనుబిరుదము నొసంగిన రామరాజునకుగాని, స్వీకరించిన రామరాజభూషణునకుఁ గాని పౌరుషాతిశయమైనను విద్యాతిశయమైనను, నేమైనఁ గనుపడుచున్నదా యనుఁ"డనియు నిట్లు వీ రాక్షేపించిరి. ఈయాక్షేపణములును సయుక్తికముగనే యున్నవి. కాన వీరేశలింగముపంతులవా రస్వరసముగా వ్రాసినవాదమే సయుక్తికముగ నున్న ట్లగపడుచున్నది. "రామవిభుదత్తశుభచిహ్నవిభవయుతుఁడ" ను దానిచే రామరా జిక్కవికి రామరాజభూషణుఁ డనుబిరుదము నిచ్చెనని గ్రహించుట యుచితము కావుననే రామభూషణకవియనియు, రామనృపభూషణుఁడనియు, రామరాజభూషణుఁడనియు నిట్లు గ్రంథములం దుపయోగింపఁబడెను.

కాని పూండ్లరామకృష్ణయ్యపంతులవా రీవాదమునుసైత మంగీకరింపలేదు. రామరాజభూషణుఁ డనునది "రామరాజుయొక్క యాస్థానమునం దుండుటచేత నిచ్చినబిరుదాంకము" అని వాక్రుచ్చు నెడ బట్టుమూర్తితండ్రిపే రగునట్టి 'వేంకటరాయభూషణ'శబ్దమునకును నిట్లే యర్థముచెప్పి సమర్థింపవచ్చును గదా! ఇంతదనుక వేంకటరాయభూషణుఁ డొకయనామకుఁడుగాఁ గనుపడుచున్నాఁడు గాని యేసంస్థానమునందైన విద్యాతిశయముచేఁ బ్రఖ్యాతినొందినట్టు గానము. గాన రామరాజభూషణుఁ డనునపుడు వేంకటరాయభూషణుఁడనునపుడును, నిందలి "భూషణ" శబ్దములు వారివంశములోనివారు సామాన్యముగ వాడుకొను నామములని తలఁపవలయు" నని వ్రాసియున్నారు. ఇట్లే రామరాజభూషణుఁ డనుదానిలోని రాజశబ్దమును బట్రాజులకు సహజముగ నుండఁదగినరాజశబ్దముగ సమర్థించిరి. "రామవిభుదత్తశుభచిహ్నవిభవయుతుఁడ" ననుచో రామరాజుచే నీయఁబడిన మంగళకరములైన యాందోళికాదిచిహ్నములు గలవాఁడని యర్థము చెప్పిరి. కాని "రామవిభుదత్త" యనుదానికి రామరాజభూషణబిరుదమే యియ్యఁబడిన ట్లర్థముచేయుటసరసముగానుండునట్లగపడుచున్నది. భూషణశబ్దము వీరికి వంశనామమైయున్న ట్లగపడదు. నరసభూపాలీయమున,

"గీ. ...ప్రబంధాంకసింగ, రాజసుత తిమ్మరాజపుత్త్ర ప్రసిద్ధ, సరసవేంకటరాయభూషణసుపుత్త్ర."

అని చెప్పఁబడినది. ఇందు వివాదస్థితవేంకటరాయభూషణునకే భూషణబిరుద మున్నదిగాని తక్కినవారికి లేదు. పద్యమునందేగాక యాశ్వాసాంతగద్యమునందును "ప్రబంధాంక వేంకటరాయభూషణసుపుత్త్ర తిమ్మరాజపౌత్త్ర" యని యున్నదిగాని తిమ్మరాజునకు భూషణపదము చేర్పఁబడలేదు. ఇట్లే హరిశ్చంద్రనలోపాఖ్యానమునందును,

"గీ. శ్రీకరమహాప్రబంధాంకసింగరాజ, తిప్పరాజప్రియతనూజధీరసూర, పాత్మజుఁడ......"
నని చెప్పఁబడినదిగాని యెవ్వరికైన భూషణపదము చేర్పఁబడలేదు. కాన భూషణపదము వీరికి వంశానుగతమనుట యుక్తియుక్తముగాలేదు. వేంకటరాయభూషణుఁడనామకుఁడనుటకుఁ బ్రబలాధారములేవియు లేవుగదా! కాఁబట్టి వేంకటరాయలయాస్థానమున రామరాజభూషణుని తండ్రియగు సూరపరాజుండుటచేత నాతనికి వేంకటరాయభూషణబిరుదము వచ్చియుండును. నరసభూపాలీయమున గద్యమునందును పద్యమునందును "వేంకటరాయభూషణ" యనియే వ్రాయఁబడినది గాని పూండ్ల రామకృష్ణయ్యపంతులుగారు చెప్పినట్లు బట్రాజుల కుండురీతి "వేంకటరాజభూషణ" యని లేనందున నీపేరు వేంకటరాయలయాస్థానమునం దుండుటచే లభించిన బిరుదమే యనియు భూషణపదము వీరికి వంశానుగతము కాదనియుఁ జెప్పుట సమంజసముగానున్నది.

## ఝ. గుఱుతు యుక్తివిమర్శనము.

రామరాజభూషణుఁడు దత్తుఁడగునా?

ఆశ్వాసాంతగద్యములందును, గవి తన్నుఁగూర్చి చెప్పుకొనిన పద్యములందును స్వనామపితృనామములు నరసభూపాలీయమున నొకరీతిగను, వసుచరిత్రహరిశ్చంద్రనలోపాఖ్యానముల నొకరీతిగను నుండుటచే నట్టివిరోధమును సరిపుచ్చుకొనుటకయి రామరాజభూషణుఁడు సూరపరాజునకౌరసుఁడనియు వేంకటరాయభూషణునకు దత్తుఁడనియుఁ బాలకపితయగు వేంకటరాయభూషణుఁడు రామరాజభూషణునకు శారదామూర్తియని నామాంతరమ్ముంచుకొనె ననియు శ్రీవీరేశలింగముపంతులవారు సమర్థించియున్నారు. ఇట్టికల్పనకు హరిశ్చంద్రనలోపాఖ్యానములోని "సూరపాత్మజుఁడ" ననుదానిని, నరసభూపాలీయములోని "వేంకటరాయభూషణసుపుత్త్ర" ననుదానిని, నాధారముగ గ్రహించిరి. మఱియుఁ "దాగడించిన వసుచరిత్రమున" ననుచాటువుచే నీదత్తతను స్థిరపఱచిరి గాని యీవిషయమును శ్రీపూండ్లరామకృష్ణయ్యపంతులుగా రంగీకరింపక కొన్ని ప్రబలములగు నాక్షేపణములు చేసియున్నారు.— "ఆత్మజుఁడనఁగాఁ దనవలనఁబుట్టినవాఁడనిగాని లేక తానే పుత్త్రరూపముగ జన్మించినవాఁడనియుఁ, బుత్త్రుఁడనఁగా బుం యను నరకమువలన సంరక్షించువాఁడనియు నిటుల శబ్దవ్యుత్పత్తు లుండఁగా నాత్మజశబ్దముమాత్ర మౌరసునియందు నిర్ణయించి వ్రాయుటకు రావుబహద్దరుగారి కేమియాధారములున్నవో వాని నీనుటకు సంతసించుచున్నారము. ........."ఆత్మా వై పుత్త్రనామాసి" యనుశ్రుతి యాత్మజుఁడేపుత్త్రుఁడని నిర్ణయించుటంబట్టి......సుపుత్త్రశబ్దము. దత్తునియం దన్వయించుట యనర్థకము. మఱియుఁ బున్నామ మనునరకమునుండి రక్షించువాఁడు దత్తుఁడేయయి కన్నవాఁడు కాకపోయినయెడలఁ గొడుకులఁ గనియున్నవారు నరకసంరక్షణమునకు నిఁక దత్తుఁజేసికొనినఁగాని పునర్గతి లేదు కాఁబోలు" ననియు,

"గీ. తాగడించిన వసుచరిత్రమునఁ గన్న, తండ్రి సూరన వెలయించి తలఁపఁ దయ్యె
నన్ను మనశారదామూర్తి నాఫలంబె, దత్తుఁ డగువానిఁ జేపట్టఁ దరమె నాకు."

అను నీపద్యములోనివిషయముల నాలోచింపఁగాఁ గన్నతండ్రియగు సూరనను వసుచరిత్రమునం దెచటను రామభూషణకవి యుదహరించియుండనందునఁ బాలకతండ్రియగు వేంకటరాయభూషణుని యార్థధ్వనులన్నియు మిథ్యార్థధ్వనులని గ్రంథమునుబట్టి తీర్మానించవలసినది" యనియు నిట్లాక్షేపించి యీచాటువు నమ్మఁదగినది కాదని వ్రాసియున్నారు. ఈవిషయమున శ్రీపూండ్ల రామకృష్ణయ్యపంతులుగారు వ్రాసినయాక్షేపణములలోఁ బైనుదాహరించినవి సయుక్తికముగనున్నవి. కాన నీదత్తౌరసకల్పనము సరిగాదని విశదమగుచున్నది. కాఁబట్టి రామరాజభూషణబిరుదమువిషయమున నాచే వ్రాయఁబడినట్లు

వేంకటరాయభూషణనామము సూరపరాజునకు బిరుదనామముగ గ్రహించినయెడల నిట్టి దుర్బలకల్పనమున కవసరముండదు. ఇచ్చట శ్రీపూండ్లరామకృష్ణయ్యపంతులుగారు వసుచరిత్రహరిశ్చంద్రనలోపాఖ్యానములనుబట్టియు నరసభూపాలీయమునుబట్టియు సంగ్రహించివ్రాసిన బట్టుమూర్తి రామరాజభూషణుల వంశవృక్షము వ్రాయుచున్నాను.

ప్రబంధాంక సింగరాజు.

|

ప్రబంధాంకతిమ్మరాజు.

| ప్రబంధాంక వేంకటరాయభూషణుఁడు. | ప్రబంధాంక సూరపరాజు. |
|---|---|
| ప్రబంధాంక బట్టుమూర్తి<br>ఇతఁడు నరసభూపాలీయమును<br>రచించినకవి. | ప్రబంధాంక రామరాజభూషణుఁడు<br>ఇతఁడు వసుచరిత్రమును,<br>హరిశ్చంద్ర నలోపాఖ్యానమును<br>రచించినకవి. |

ఇందుఁ దిమ్మరాజున కిద్దఱుపుత్త్రు లనుటకు బదులుగాఁ దిమ్మరాజు కుమారుఁడు సూరపరాజనియు నాతనికి వేంకటరాయభూషణుఁ డనునది బిరుదనామనియుఁ దత్పుత్త్రుఁడు మూర్తియనియు నాతనికి రామరాజభూషణుఁడనునది బిరుదనామమనియుఁ బయినివ్రాసినకారణములచే నంగీకరించిన నిర్బాధకముగ నుండును. మొదట సామాన్యముగ బట్రాజగు బట్టుమూర్తి నరసభూపాలీయమును రచించిన పిదప నన న్యసామాన్యమగు రామరాజభూషణుఁడను బిరుదము నందియుండుటచేఁ దదభిరుచి ననంతరగ్రంథములం దట్టిబిరుదమునే వ్రాసికొనియుండును. కాఁబట్టి తద్గ్రంథత్రయమునఁగల గద్యపద్యములు విభిన్నరీతుల నున్నవని శంకింపఁ బనిలేదు. మఱియు హరిశ్చంద్ర నలోపాఖ్యానమునందలి సీసమునఁ దండ్రిపేరు సూరపరాజని చెప్పుటకును జోటు చాలనందున సూరపుఁడని చెప్పినాఁడు. కావున నందు నామాంతరమును జెప్పుకొనకుంట శంకాస్పదము కానేరదు. రామరాజభూషణుఁ డక్కాలమున మహాప్రసిద్ధుఁడయి యుండుటచే నాతనికిఁ దననామధేయమునకే యిట్టిసంశయావస్థ దటస్థించునని స్ఫురింపకపోవచ్చును. అట్లె స్ఫురించినచో మూఁడుగ్రంథములందును మఱియొక్కొక్కపద్యమును జేర్చి స్పష్టముగాఁ జెప్పునా? మఱి రజిస్టరు (Register) చేయించునా?

## ఘ. గుఱుతుయుక్తివిమర్శనము.

బట్టుమూర్తియే రామరాజభూషణుఁడను జనశ్రుతి నమ్మఁదగినదా ?

ఈవిషయమునఁ బూండ్ల రామకృష్ణయ్యపంతులుగారిట్లాక్షేపించియున్నారు. "విషయమును సంపూర్ణముగా లోకము విచారింపక పోవుటయే యీజనశ్రుతి వ్యాప్తియగుటకుఁ గారణము. కారణమున్నను లేకపోయినను రావుబహద్దరుగారు యిక్కడిపట్ల మాత్రము జనశ్రుతిని శాసనసమానముగా నెంచి నన్నయ తిక్కనాదుల చారిత్రములలో జనశ్రుతిం బరిపాటింపకుండుటకుఁ గారణమేమిచెప్పెదరో తెలియకున్నది. 'ఇఁక బట్టుమూర్తి రామరాజభూషణు'లొక్కరేయని పండితపామరులెల్ల నీయంశమునఁ బొరఁబడుటకుఁ గారణ మేమియన నీయిరువురు నేకకాలీనులగుటవలన; హనుమదుపాసకులగుటంబట్టి పెదతండ్రిపినతండ్రిబిడ్డలగుటచేతి బట్టువంశజు లగుకతమున కవిత్రయం బించుమించుగ సములగుటం జేసి

లోకమున కియ్యిరువురి గ్రంథము లొకపరి సంప్రాప్తములయి కవులభేదములు సంపూర్ణముగఁ దెలియక, బట్టుమూర్తియను నామాంతరముగలిగి రామరాజభూషణకవి వసుచరిత్రమును రచించినాఁడను పుక్కిటి పురాణమును నిఘంటువులయందును బత్త్రికలయందును, బండితులు ధారాళముగ వ్రాయుటంబట్టి" యని యిట్లభేదతాభ్రమకు గారణముల నుడివిరి. కాని యివి యైక్యవాదమునే బలపఱచుచున్నవి. ఉభయుల కవిత యొక్కరీతినే యున్నదను మొదలగునవి యభేదవాదమునకే సాధకములుగదా. ఇఁక వీరు విభేదవాదమునకు మూలాధారముగాఁ జూపుచున్నది యాశ్వాసాంతగద్యల విభిన్నప్రవృత్తియే. ఇది చదువరులు గ్రహింపరానియంతటి మాఱుమూల విషయము కాదే! ఆశ్వాసాంతగద్యమును జదువనట్టియు నది యర్థముచేసికొన లేనట్టియు జదువరు లుందురా? పోనిండు. తక్కినభాగము లెట్లైనను స్పష్టముగాఁ దెలియు కవిపేరు గ్రహింపలేకుందురా? అరయనరయ నీగద్యల విభిన్నప్రవృత్తి కవుల విభేద ప్రతీతినే పుట్టింప వలసియున్నది. అట్లయినను రామరాజభూషణుఁడు సుప్రసిద్ధుఁడగుటచే నట్లు కాక పోయెనని గ్రహింపవలసియున్నది. ఇఁక సన్నయతిక్కనాదుల చారిత్రములందుఁ గొన్నిజనశ్రుతులు ప్రబలములగు కారణాంతరములచే నమ్మఁబడకుండుట యిచ్చట జనశ్రుతి నమ్ముటకు సాధకమగునా? లోకప్రసిద్ధములగు జనశ్రుతుల నిరాకరించుట కిట్టి బలహీనములగు యుక్తులు సాధకములగునా? మఱియు శ్రీవీరేశలింగముపంతులుగా రుదాహరించిన రీతిని రామరాజభూషణునకు సమకాలికుల గ్రంథములందును నిటీవలివారి గ్రంథములందును బట్టుమూర్తి వసుచరిత్రమును రచించినట్లు వ్రాయఁబడియుండుట కేమిసమాధానము.

ఈజనశ్రుతియేగాక వేలువేలుసందర్భములలో వాడఁబడుచున్న మఱికొన్ని జనశ్రుతులుసైత మీవిషయమును సూచించుచున్నవి. ఏడ్పుపద్యములవిషయమునఁ దెన్నాలిరామకృష్ణకవి పలికినట్లు ప్రసిద్ధమైయున్న "యల్లసానిపెద్దన యటునిటు నేడ్చెను. ముక్కుతిమ్మన్న ముద్దుముద్దుగా నేడ్చెను. బట్టుమూర్తి బావురనియేడ్చె" ననునైతిహ్యముసైతము బట్టుమూర్తియే వసుచరిత్రమును రచించినట్లు వెల్లడిసేయుచున్నది. వసుచరిత్రములోని "యాజాబిల్లి" యనుపద్యమునకేగదా! రామకృష్ణకవి యిట్టి యభిప్రాయ మిచ్చెను.

"సీ. ప్రౌఢదీర్ఘసమాసపదములఁ గూర్చి శ్రీనాథుండు కూలార్చ నైషధంబు;
దానితల్లన నల్లసానిపెద్దన చెప్పె మది వదిదప్పి యాముక్తమాల్యద;
దూహించి తెలియరాకుండ సూరపరాజు భ్రమఁ గళాపూర్ణోదయము రచించ;
నతిశ్లేష శబ్దవాగాడంబరం బొప్పఁ బస ఘటించెను మూర్తి వసుచరిత్ర..." యను తెనాలి రామకృష్ణుని చాటుపద్యము సైతము పైవిషయమునే చెప్పుచున్నది.

మఱియు నల్లసానిపెద్దనకుమారుఁడు విద్యాభ్యాసమున రుచిలేక తిరుగుచుండఁగాఁ జూచి పెద్దనార్యుఁడు శిక్షించెననియు నందుపయిని విదుషియగు పెద్దనార్యునిభార్య "మీశిష్యుఁడగు బట్టువానిపాటి శ్లేషముక్కలు చెప్పుకొనుశక్తి గలుగకపోదు ఏల? యంతకఠినముగా శిక్షించెద" రనిపల్కెనని యొకయైతిహ్యముకలదు. శ్లేషకవనమున రామరాజభూషణుఁ డదిపఱకే నిపుణుఁడై యుండెననియు నితఁడే బట్టుమూర్తియనియు నీయైతిహ్యము సూచించుచున్నది. "మత్ప్రత్యయాభావస్య అల్లసానిపెద్దనార్యశిష్యేణ బట్టుమూర్తిమహాకవినా విరచితే వసుచరిత్రే" యను పూర్వోదాహృతమగు మండలక్ష్మీనరసింహాచార్యులుగారి యాంధ్రకౌముదీసూక్తి పై యైతిహ్యమునకు గొంతవఱకు బలపఱచుచున్నది. ఇట్టివి మఱికొన్ని జనశ్రుతులుకలవు గాని గ్రంథవిస్తరభీతిచే నిట నుదాహరింపలేదు.

*

# నాల్గవ భాగము.

---

రామరాజభూషణుఁడు నరసభూపాలీయమునఁ దెనుఁగున లక్షణములు రచించి వానికిలక్ష్యముగ వసుచరిత్రమును రచించెనను జనశ్రుతియుఁ గలదు. అయ్యది కొంతవఱ కిచ్చట విశదపఱుపఁ బడుచున్నది.

" తే. ఇంకఁ గావ్యస్వరూపంబు లేర్పరింతు, విగతదోషములును గుణాన్వితము లధిక
లసదలంకారభావోపలక్షితములు, నైన శబ్దార్థములు కావ్యమునఁ జెలంగు.

కం. తనువగు శబ్దార్థంబులు, ధ్వని జీవ మలంక్రియావితానము సొమ్ముల్
తనరుగుణంబులు గుణములు, ఘనవృత్తులు వృత్తులౌర కావ్యేందిరకున్."

(నరసభూపాలీయము. ఆ. 2. ప. 52, 53.)

" తే. వ్యంగ్యము ప్రధాన మైనను నప్రధాన, మైన నస్ఫుట మైన గావ్యము త్రిసంఖ్య
నమరు నుత్తమమధ్యమాధమత ధ్వనిగు, ణీకృతవ్యంగ్యమును జిత్ర మై కడంగి."

(నరసభూపాలీయము. ఆ. 2 ప. 91.)

"తే. ఇంకఁ గావ్యప్రభేదంబు లేర్పరింతు, నరుస నష్టాదశవిశిష్టవర్ణనములు
గలుగవలయు మహాకావ్యతిలకమునకు, నెలమిఁ దన్నామధేయంబు లెట్టివనిన.

కం. పుర సింధు నగర్తువన శశి, సరసీ వన మధు రతిప్రసంగ విరహముల్
పరిణయ తనయోదయ నయ, విరచన యాత్రాజి దౌత్య విభువర్ణనముల్.

తే. ఇందు నొకకొన్నికడ మైన నెంచిచూడ, నదియు నవని మహాకావ్య మనఁగఁ బరగు..."

(నరసభూపాలీయము. ఆ. 2. ప. 165, 166, 167.)

పై నుదాహరించిన మహాకావ్యలక్షణముల కీవసుచరిత్రము లక్ష్యమనుట సర్వసమ్మతమేగదా? ఇందలి ధ్వనిప్రధానతయు వ్యంగ్యప్రాచుర్యమును ముందు వివరింపఁబడును. నగరాదివర్ణనము లిదివఱకుఁ జూపఁబడియున్నవి.

వసురాజునం దుత్తమనాయకలక్షణములు గిరికయం దుత్తమనాయికాలక్షణములును జూపఁబడినవి. శుక్తిమతీకోలాహలవర్ణనములు వసురాజును జూచునప్పటి పురస్త్రీలవర్ణనములు నితరములగు మఱికొన్నినాయికాలక్షణములకు లక్ష్యయుతములయియున్నవి. ఇక్కావ్యము శృంగారరసప్రధాన మైన దగుటచేత నిం దోజఃప్రభృతిగుణంబులు నారభటీవృత్తియు, గౌడీరీతియు నంతగా నగపడవు. ఇఁక మాధుర్యప్రసాదాదిగుణములకును, కైశిక్యాదివృత్తులకును, వైదర్భీప్రభృతిరీతులకును, నిది యాలవాలమై యున్నదనవచ్చును.

" తే. కైశికి చెలంగు శృంగారకరుణలందు, నారభటి రౌద్రభీభత్సహారిణియగు
నలరు భారతి హాస్యశాంతాద్భుతముల, నమరు సాత్వతి వీరభయానకముల." నని నరసభూపాలీయమునఁ జెప్పఁబడియున్నది.

" శ్లో. చిత్తద్రవీభావమయో హ్లాదో మాధుర్య ముచ్యతే,
సంభోగే కరుణే విప్రలంభే శాంతేఽధికం క్రమాత్.

శ్లో. ఓజ శ్చిత్తస్య విస్తారరూపం దీప్తత్వ ముచ్యతే,
వీరభీభత్సరౌద్రేషు క్రమే ణాధిక్య మస్య తు."

అని సాహిత్యదర్పణమున నున్నది. (606, 607, 609.)

వృత్తులలోఁ గైశిక్యారభటులును, రీతులలో వైదర్భీగౌడులును, గుణములలో మాధుర్యౌజః ప్రసాదములును, ముఖ్యములై యున్నవి. ఇందును మాధుర్యకైశికీవైదర్భులకును, నోజ ఆరభటీగౌడుల కును బరస్పరభేద మంతగా లక్ష్యవిషయమున నగపడదు.

ఈ క్రిందవ్రాయఁబడు సంఖ్యలుగల వసుచరిత్రములోని పద్యము లయ్యై వాని కుదాహరణములని యెఱుంగునది.

| వృత్తులు. | రీతులు. |
|---|---|
| కైశికి. ఆ. 3. ప. 49.<br>సాత్వతి. ఆ. 2. ప. 153.<br>భారతి. ఆ. 2. ప. 152.<br>ఆరభటి. ఆ. 2. ప. 102.<br>వృత్తులనుగుఱించి నరసభూపాలీయమునఁ (ఆ. 2 - 1. ప. 72) జెప్పఁబడియున్నది. | వైదర్భి. ఆ. 3. ప. 40.<br>పాంచాలి. ఆ. 2. ప. 151.<br>గౌడి. ఆ. 2. ప. 102.<br>రీతిలక్షణములు నరసభూపాలీయమునఁ (ఆ. 2. ప. 79.) జెప్పఁబడియున్నవి. |
| **గుణములు.** | **పాకములు.** |
| మాధుర్యము. ఆ. 2. ప. 128.<br>శ్లేషము. ఆ. 1. ప. 140.<br>ప్రసాదము. ఆ. 4. ప. 67.<br>సౌకుమార్యము. ఆ. 3. ప. 159.<br>సమత. ఆ. 2. ప. 63.<br>అర్థవ్యక్తి. ఆ. 2. ప. 64.<br>ఔదార్యము. ఆ. 2. ప. 156.<br>ఓజము. ఆ. 2. ప. 150.<br>కాంతి. ఆ. 3. ప. 83.<br>సమాధి. ఆ. 2. ప. 26.<br>గుణములనుగుఱించి నరసభూపాలీయమునఁ (ఆ. 4. ప. 56.) జెప్పఁబడియున్నది. | ద్రాక్షాపాకము. ఆ. 3. ప. 79.<br>నారికేళపాకము. ఆ. 3. ప. 67.<br>శయ్య. ఆ. 4. ప. 36.<br>నరసభూపాలీయమునఁ బాకమునుగుఱించి (ఆ. 2. ప. 65.) శయ్యనుగుఱించి (ఆ. 2. ప. 68.) యును జెప్పఁబడియున్నది. |

ఈ ప్రబంధము శృంగారరసప్రధానము కాఁబట్టి "ఆద్యః కరుణభీభత్సరౌద్రవీరభయానకైః, ... ... ...ఇ త్యాఖ్యాతా విరోధితా." యను (3. పరి. 242.) విశ్వనాథసూక్తిచొప్పున నిందుఁ గరుణాదిరసము లంతగా వర్ణింపఁబడలేదు. అట్లయినను శుక్తిమతిని గోలాహలుఁ డాపఁగా నయ్యాపగ పొంగుటచే జనులు తల్లడిలి వసురాజుతో మొఱపెట్ట నాతఁ డాగిరి నెగమీఁటె నను సందర్భమునందును మఱికొన్నిచోట్లను, గరుణాదిరసము లరుదుగ వర్ణింపఁబడినవి.

వసుచరిత్రమునందు:—

కరుణరసము. ఆ. 2. ప. 141, 142, 143; ఆ. 1. ప. 123.

భయానకరసము. ఆ. 2. ప. 155.

రౌద్రరసము. ఆ. 2. ప. 150.

వీరరసము. ఆ. 2. ప. 151, 152, 153, 156; ఆ. 2. ప. 102.

భీభత్సరసము. ఆ. 2. ప. 153, 155. (దీనిలోఁ గబంధముయొక్కయుఁ, గోలాహలుని విశీర్ణ పక్షతాదులయొక్కయు, వర్ణనము భీభత్సరసాత్మకమని గ్రహించునది.)

"రసౌ శృంగార భీభత్సౌ......వైరిణౌ మిథః." యనుచొప్పున శృంగారభీభత్సరసములు, కేవలము పరస్పరవిరుద్ధము లగుటచే నతిసూక్ష్మముగ నిందు భీభత్సము చూపఁబడెనని యెఱుంగునది.

హాస్యరసము. ఆ. 2. ప. 3, 4; ఆ. 3. ప. 65, 66; ఆ. 5. ప. 122.

అద్భుతరసము. ఆ. 4. ప. 96; ఆ. 3. ప. 45, 46; ఆ. 2. ప. 82, 83, 98.

శాంతరసము. ఆ. 4. ప. 64; ఆ. 6. ప. 95.

వత్సలరసము. ఆ. 3. ప. 27 మొ. 32 వఱకు.

విప్రలంభశృంగారము. ఆ. 3. ప. 74 మొ. ఆ. 4. ప. 123 వఱకు.

మన్మథదశావస్థలు. ఆ. 3. ప. 94 మొ. 99 వఱకు; ఆ. 3. ప. 106.

సంభోగశృంగారము. ఆ. 6. ప. 77 మొ. 97 వఱకు. ఆ. 3. ప. 48 మొ. 70 వఱకు. (ఇంకను నాయికానాయకుల పరస్పరదర్శనాదులును సంభోగశృంగారములోనివేగాన నిం దియ్యది పెక్కుచోట్లఁ గలదు. విస్తరభీతిచే నుదాహరింపలేదు.)

ఉద్దీపనవిభావములు. ఆ. 3. ప. 46,102,111; ఆ. 5. ప. 73; ఆ. 6. ప. 72,73,74,106.

సాత్త్వికభావములు. ఆ. 3. ప. 98, 100, 106, 111; ఆ. 4. ప. 81; ఆ. 6. ప. 79.

సంచారిభావములు. ఆ. 3. ప. 82 మొ. 93 వఱకు; ఆ. 3. ప. 106,111, 118, 119; ఆ. 4. ప. 51; ఆ. 6. ప. 11, 16.

రసాభాసము. ఆ. 2. ప. 110 మొ. 140 వఱకు.

రసాభాసశబ్దము లోకవ్యవహారమున మిగుల నికృష్టమైన యభిప్రాయమున వ్యవహరింపఁబడుచున్నది. కాని యిది మనుచరిత్రాదిప్రబంధరాజములందును వర్ణింపఁబడియుండుటచే నట్టినికృష్టవర్ణనము కానేరదు.

" అనౌచిత్యప్రవృత్తత్వే, ఆభాసోరసభావయోః,
ఉపనాయకసంస్థాయాం, మునిగురుపత్నీగతాయాం చ.
బహునాయకవిషయాయాం, రతౌ తథానుభయనిష్ఠాయామ్,
ప్రతినాయకనిష్ఠత్వే, తద్వ దధమపాత్రతిర్యగాదిగతే.

శృంగారేఽనౌచిత్య" మ్మను దర్పణసూక్తి (3-పరి. 247.) చొప్పున వసుచరిత్రములోని శుక్తిమతీకోలాహలసమాగమ వర్ణనమున ననుభయనిష్టరతియుఁ, దిర్యగాదిగతరతియు,వర్ణింపఁబడెను గాన నది రసాభాసమని యెఱుంగునది. ఇట్టివర్ణనము కథానాయకవిషయమున నైనచో దుష్టమేయగునుగాని యన్యవిషయమున దుష్టముకానేరదు. ఇయ్యది మూలకథలోనిదే యగుటచేఁ దదనుసరణార్థ మిందును.

వర్ణింపఁబడినది. ఇట్టివి వర్ణనీయములే కానిచో నాలంకారికులచే నేల యలంకారములుగ గ్రహింపఁబడును?

“ రసాభావౌ తదాభాసౌ భావస్య ప్రశమ స్తథా, గుణీ భూతత్వ మాయాంతి యదాలంకృత యు స్తదా, రసవత్ప్రేయఊర్జస్వి సమాహిత మితి క్రమా” త్తనుచొప్పున నీరసాభాసాదులు గౌణములైనచోఁ బ్రేయఃప్రభృత్యలంకారములగునని సాహిత్యదర్పణమునఁ (10. పరి. 753.) జెప్పఁబడియున్నది. పై నుదహరించినరసాదిస్వరూపములు నరసభూపాలీయమున మూఁడవయాశ్వాసమునఁ జెప్పఁబడియున్నవి.

పై వానికి గ్రంథవిస్తరభీతిచే దిక్ప్రదర్శనముగ వసుచరిత్రములోని పద్యసంఖ్య లుదాహరించితిని గాని శృంగారరసాలవాలమగు తత్ప్రబంధమునందలి ప్రతిపద్యము నేదోయొకదానికి లక్ష్యమయియే యుండునని చెప్పవచ్చును.

## నాటకరీతులు.

రామరాజభూషణుఁ డీవసుచరిత్రమునఁ గొన్నిచోట్లను వాక్యోపవాక్యములతోడనే కథపట్టులను నాటకరంగములందువలె నడిపించెను. సుకియుఁ గిరికాదులవరిఁ గపటయతి వసురాజాదుల ప్రవేశములను మంజువాణి వసురాజున కగపడుట, హారము వేయుట మొదలైనవియును, హావాదాక్షిప్తములుగ నద్భుతరీతిని సందర్భపఱచియున్నాఁడు. ఇంతియగాక సూచ్యార్థసూచనము, పాత్రప్రవేశసూచనము మొదలగు నాటకరీతు లనేకములుగలవు.

## పాత్రప్రవేశసూచనము. (పాత్రప్రవేశము.)

“తే. గంధగజయాన గీతప్రబంధకలన, నలరి యతి వియ్యమై వచ్చు నరిది మగువ
లార కనుఁగొంటిరే యను నాలివాక్య, మొకటి వినవైన నదె వేళ యొదవె ననుచు.

ఉ. మేలు లతాంగి! నీపలుకు మెచ్చితి నే యతి వచ్చుజాడ యే
లీల నెఱింగి తమ్మ బహుళీకృతచాతురి మించు నీవిపం
చీలలితారవామృతము చిత్తము సోఁకినవార లీకళా
శాలిని జూచి దీవెన లొసంగక పోవరుసుమ్ము నావుడున్.” (వసు. ఆ-2. 81-82.)

“చ. విని కలకాకుఘోష మొదవించు మదాళిని పక్షగౌరవం
బెనయ నడల్చి మంజుగతి నీవనజాతములో మదీయఖే
లనములకెల్లఁ దోడయి మెలంగఁగ నాకలహంసి రాదొకో
జనని నయస్య యంచు నగజాత మదిం దలపోయుచున్నడన్.

ఉ. ఆకలహంసి వచ్చి యచలాత్మజఁ గాంచి కుమారి! తాపసా
నీకము నీ కమూల్యశుభనిర్వహణంబు ఘటిల్లఁ గల్పకా
నోకహనూనరాజము లనూనమనూక్తులతో నొసంగినం
గైకొని తల్లిని న్వెలువఁగాఁ బనిచెన్ విరులిచ్చువేడుకన్.” (వసు. ఆ-3. ప-71-72.)

“మ. లలనా! యీయొలనాఁగ బెండ్లియగు వాలాయంబు చేదిక్షమా
తలనాథుం డిది నమ్మవేని నిజమంత్రప్రౌఢి రప్పింతు నా
నలనాసత్యసమానుఁ జూడుమని పంతం బొప్ప మాయాజపా
కేలనాదంభము పూన మాని దిశ లాకర్ణించి మజ్ఞాయనన్.

మ. ఇది సంధింపఁగ వేళయంచు వసురాజేంద్రుండు నీరంధ్ర నీ
రదవారప్రతిసీర వెల్వడిన తారాభర్తలీలన్ లతా
చ్ఛదసంఛాదికఁ బాసి నిల్చె నెదుటన్ సారంగరాగభ్రమ
న్మదభృంగీరుతి వందిమాగధకథామాధుర్యముం దెల్పఁగాన్." (వసు. ఆ. 3. ప. 44-45.)

కొన్నియెడల సంస్కృతనాటకచ్ఛాయల ననుసరించియున్నాఁడు. నాయకుఁడు లతాంతరిత గాత్రుఁడయి నాయిక నీక్షించుచు వర్ణించుట.

"మ. లతికాసంవృతగాత్రుఁడై నిజకథాలాపంబు లాలించుభూ
పతి యచ్చో హితు నేర్పు బోటినచనప్రాగల్భ్యముం గన్యయు
న్నతగోత్రోద్భవసన్నభసంబును మది న్వర్ణించి యూహించె ధ
న్యత నాకు క్తినుతీఝరీజనిపరత్వం బాత్మవిత్తంబుగాన్." (వసు. ఆ. 3. ప. 37.)

నాయిక నాయకునొద్దనుంచి వెడలిపోవునపుడు ప్రేమసూచకముగ మిషకల్పించుకొని నాయకు నీక్షించుట.

"చ. కలికియు నానృపాలకునిఁ గ్రమ్మఱఁ జూచుచు నేగ నేర్పుతో
నలఘుపదాంగదధ్వనికి నంచలు మూఁగిన నిల్చి నెయ్యపుం
జెలువలఁ గూడఁ బిల్చుగతిఁ జిల్కకుఁ బార్శ్వలతాంచలంబులన్
ఫలము దెమల్చురీతి నళిపంక్తికి మోము మలంచుకై వడిన్." (వసు. ఆ. 3. ప. 78.)

గిరికాసంఘటనావిషయమున నర్మసఖుఁడనువిదూషకునిసహాయము వర్ణించుటయు నాటకమార్గమే యనవచ్చును.

" శృంగారస్య సహాయా విటచేటవిదూషకాద్యా స్స్యుః,
భక్తా నర్మసునిపుణాః, కుపితవధూమానభంజనా శ్శుద్ధాః.
... ... ... ... ... ...
కుసుమవసంతాద్యభిధః, కర్మవపు ర్వేషభాషాద్యైః,
హాస్యకరః కలహరతి ర్విదూషక స్స్యాత్ స్వకర్మజ్ఞః."

అని విదూషకలక్షణము సాహిత్యదర్పణమునఁ (3 పరి. 77, 79.) జెప్పఁబడియున్నది.

"చ. అన మునిరాజువల్కు వనితాజనతావినుతాభిధేయుఁ డై
యొనరినగౌతమున్ మునికులోత్తముఁ జెప్పఁగ విందువే కదా!
యనఘ తదన్వవాయకలశాంబుధిఁ బుట్టినవాఁడ గౌతమా
ఖ్య నెసఁగువాఁడ నేఁ బరమహాసరసప్రతిభానుభావుఁడున్." (వసు. ఆ. 2. ప. 91.)

నాటకములయందుఁ దఱచుగఁ గృత్యాదిని నాందియుఁ, దుదను ప్రశస్తి యను నిర్వహణసంధ్యంగమును నిలుపఁబడును. ఇందును నట్లే వానిఛాయలు కొంతనఱకుఁ గలవు.

"శా. శ్రీభూపుత్త్రి వివాహవేళ నిజమంజీరాగ్రరత్నస్వలీ
లాభివ్యక్తి వరాంఘ్రిరేణుభవకన్యాలీల యంచు న్మదిం
దా భావింప శుభక్రమాకలనచేఁ దద్రత్నముం గప్ప నీ
తాభామాపతి ప్రోవుతం దిరుమలేంద్ర శ్రీమహారాయనిన్."

ఇందుఁ దక్కిన కొన్ని నాందీలక్షణములె గాక భావ్యర్థసూచనమును గొంతవఱకుఁ గలదు. సీతావివాహవర్ణనము, గిరికావివాహమును, రత్నములందలి కన్యకాస్ఫూర్తి కోలాహలునకు గిరికపుట్టుటను, రామపాదక్రమణము వసురాజపాదనఖక్షిప్త కోలాహలకథను సూచించుచున్నవి.

“సీ. ఆరాజు విమలవిఖ్యాతిచంద్రిక నిచ్చ రహి కెక్క జాఱె జారప్రసంగ;
మాఘనుదానధారాపూర్ణవర్ష ముర్వరఁ బర్వ డిగియె నవగ్రహార్తి;
యాలోకహితుప్రతాపాతపం బవిరతోదయరూఢిఁ బగ నింకె దస్యుపంక;
మాసద్గుణాబ్ధిచర్యామృతం బెల్లచో దయివారఁ దెరలె నామయవిభూతి;
తే. యమ్మహాశైలదనాను రాజ్యమున నిట్లు, ఫలము లీనెడు చెట్లతోఁ బాలవెల్లి
కాన్పుపసితో నఖండభోగములతోడఁ, బ్రజలు గాంచిరి భూరివైభవసమృద్ధి.”
(వసు. ఆ. 6, ప. 99.)

ఇయ్యది వసుచరిత్రకథాభాగములోని తుదిపద్యము, ఇందు దేశసుఖస్థితిరూపశాంతి వర్ణింపఁబడెను.

“స్వపదేశాదిశాన్తిస్తు ప్రశస్తి రభిధీయతే” యని ప్రశస్తియను నిర్వహణసంధ్యంగమునకు లక్షణము సంస్కృతనాటకములలో నాందిలోని యాశీర్వచన మేకరాజవిషయక మయియుండదు. ప్రశస్తిలోని శాంతియు, నాశీర్వచనరూపముగనుండును. ఇందట్లుగాక శ్రవ్య ప్రబంధరీతి కవిరుద్ధముగ నుండుటకై కృత్యాదిపద్యములోని యాశీర్వాదము కృతిపతివిషయకముగ వర్ణింపఁబడెను. కృత్యంతమునఁ గథానాయకుని సామర్థ్యాతిశయస్ఫూర్తికై దేశశాంతి సిద్ధమె యయినట్లు వర్ణితమయ్యెను. మఱియు దృశ్యకావ్యములందుఁ గథావస్తువు పురాతనమే యైనను నప్పుడు జరుగుచున్నట్లు వర్ణించుట యావశ్యకముగాన నం దాశీర్వాదరూపశాంతి యుండుట సహజముగనుండును. శ్రవ్యకావ్యమందుఁ గథావస్తువు పూర్వకాలమున జరిగినట్లు వర్ణింపఁబడును గాన నందు దేశశాంతి సిద్ధించినదని వర్ణించుటయె సరసముగ నుండును. ఇట్లిందు నాటకరీతు లనేకములుగలవు గాని గ్రంథవిస్తరభీతి నిట విపులముగ నుదాహరింపనైతిని.

చుటలో రామరాజభూషణునికి శ్లేషకవనమునం గల పాటవము వ్యక్తమగుచున్నది. అయ్యది విశదీకరించుటకై యిచ్చట రెండుపద్యములుమాత్ర ముదాహరించుచున్నాను. రాఘవపాండవీయమునందువలెం గాక పేరులను శ్లేషించుటలోనయిత మిందు నిరంకుశప్రజ్ఞ యగపడుచున్నది.

"గీ. భువనసంత్రాణకీర్తితో బుధగణేయు, సత్కళారాజితో హరిశ్చంద్ర యనుచు
దేవతావర్గములు వినుతింప నలసు, మాఖ్యం దగు సార్వభౌమైకముఖ్యుం డలరు."
(హరిశ్చంద్రనలోపాఖ్యానము. ఆ. 1. ప. 14.)

హరిశ్చంద్రపదమున కర్థాంతరసంఘటన తెనుఁగువాక్యమున దుర్ఘటమగుటచే నలపరమగు నర్థాంతరము పక్షమున దానిని సంస్కృతభాషలో నిల్పి యతిప్రౌఢిమతో సరిపెట్టియున్నాఁడు.

"సీ. ఎన్న నేరికిఁ దరంబే గురుసంగర విజయైకనిధులయి వెలయు నీన;
లవసుమతీశ్వరుల యరీణగుణములు లనుచు సారెకుఁ దదీయంబులైన;
నానావిపక్షఖండనధుర్యచాతుర్యములు మరున్మిత్రతాస్ఫురణములు మ;
హార్యమతనయభావానుభావంబులు భువనసంభరణవైభవములును బ్ర;
తే. కామఘనసత్కరణధామతామహత్వ, విలసనంబులు నొక్కటఁ దెలియఁ బలికెఁ
గాశికానుగగీర్వాణగణము మదికి, సంభ్రమసమాకులత్వంబు సంభవింప."
(హరిశ్చంద్రనలోపాఖ్యానము. ఆ. 2. ప. 111.)

ఇప్పద్యంబున హరిశ్చంద్రకథాపక్షమగు నర్థమును నిర్వహించుకొనుచు నలకథాపరమగు నర్థమునందు సంస్కృతనైషధరీతి నతిప్రౌఢముగఁ బంచనైషధీవర్ణనము చేయఁబడెను. సంస్కృతనైషధమున నీపంచనైషధీసందర్భము పదుమూఁడవసర్గయం దంతటను బదునాల్గవసర్గమున మొదటియిరువదిరెండు శ్లోకములవఱకును వర్ణింపఁబడినది. గ్రంథవిస్తరభీతిచే వానినన్నింటినిట నుదాహరింపక తత్కల్పనారీతి నుదాహరించుచున్నాను.

దమయంతి నలు నేవరించెద ననునిశ్చయముతో నున్నదని విని యింద్రాగ్నియమవరుణులు నలుగురును స్వయంవరసభయందు నలునిరూపముతో నలునియొద్దనే కూరుచుండిరి. సరస్వతి వారిని వర్ణించి చెప్పుటలో నింద్రుని వర్ణించునపు డింద్రనలపరముగ నర్థద్వయ ముండునట్లును, నిట్లే యితరదేవతలను వర్ణించునపుడును దత్తద్దేవతాపరముగాను, నలపరముగాను, నర్థద్వయ ముండునట్లును నొక్కొకదేవతను నాలుగేసిశ్లోకములతో వర్ణించెను. దమయంతి నలుని గ్రహింపలేక దేవతలను బ్రార్థించి వారిప్రసాదమునఁ దెలివొంది నలుని వేఱుపఱచుట కవకాశము గల్గియున్న సరస్వతీవర్ణనములను విమర్శింపఁగల్గి నలుని దేవతలనుండి వేఱుపఱచి గ్రహించెను. వానిలో నలవర్ణనమందును దేవతావర్ణనమందును బ్రతిశ్లోకమును నలుఁడు వర్ణింపఁబడియుండఁగా నలవర్ణనాపద్యచతుష్టయములో నొక్కొక్కశ్లోకమున నొక్కొక్కదేవతమాత్రము శ్లేషగుంభితముగా వర్ణింపఁబడుటచేత నలమహారాజితఁడని గ్రహించుటకవకాశ మున్నది గదా! నలుఁడు లోకపాలాంశసంభూతుఁడుగానఁ బ్రతిపద్యమునందును గల లోకపాలనలపరరూపార్థద్వయము స్వారస్యముగనుండును. దేవతాప్రార్థనానంతరమున నిట్టి విమర్శనమె దమయంతి చేసినట్టు కవి చెప్పియున్నాఁడు.

"శ్లో. ప్రసాద మాసాద్య సురైః కృతం సా సస్మార సారస్వతసూక్తి సృష్టేః,
దేవా హి నాన్య ద్వితర న్తి కిన్తు ప్రసద్య తే సాధుధియం దద న్తే." (స. 14. శ్లో. 8)

"శ్లో. శేషం నలం ప్ర త్యమరేణ గాథా యా యా సమర్థా ఖలు యేన యేన,
తాం తాం త దన్యేన సహాలగ న్తీం తదా విశేషం ప్రతి సందధే సా." (స. 14. శ్లో. 9).

"శ్లో. శ్లిష్యంతి వాచో యదమూ రముష్యాః కవిత్వశక్తేః ఖలు తే విలాసాః,
భూపాలలోలాః కిల లోకపాలాః సమావిశంతి వ్యతిభేదినోపి." (స. 14. శ్లో. 14)

అనియిట్లు రామరాజభూషణుఁడు ద్వ్యర్థికావ్యమగు హరిశ్చంద్రనలోపాఖ్యానమునందు నింత విపులముగా వర్ణింపకున్నను, బయినుదాహరించిన సీసపద్యమునందు సంస్కృతనైషధరీతిగనే పంచనలి నతిప్రౌఢముగ వర్ణించెను. పైసీసపద్యమునందు నలపరముగాను నేకైకదేవతాపరముగాను నర్థద్వయముం డునట్లుగ నొక్కొకవాక్యమున నొక్కొకదేవత వర్ణింపఁబడెను. సత్యనలవర్ణనవాక్యమున దేవతాచతుష్టయ పరముగాను నలపరముగాను నర్థపంచక ముండునట్లు వర్ణింపఁబడెను. ఈయైదవవాక్యరీతి సంస్కృతనై షధరీతికన్నను, బ్రౌఢముగానున్నది. ఇట్లైదర్థములతో నలకథాపరార్థమును వర్ణించియు హరిశ్చంద్రకథా పరమైన యర్థముసైతము లోపములేకుండ నిర్వహించెను. ఈసందర్భమున దమయంతి యిట్టిశ్లేషగుంభిత వాక్యములవల్ల మొదట నలుని గ్రహింపలేక దేవతలను బ్రార్థించి వారిదయచే బుద్ధి వికాసము నొంది సర స్వతీవాక్యముల విమర్శింపఁగల్గి నలుని గ్రహించి దేవతాకటాక్షమున నపుడు దేవతలందును నలునియం దును గనఁబడిన దేవతామనుష్యలక్షణభేదములచే దృఢపఱచుకొని నలుని వరించినట్లు వర్ణింపఁబడెను.

" గీ. అపుడవరనిశ్చయంబుతో నవనిజాని, మణిజనాకులవినుతి సంపదలఁ దగ భ
జించి సుమనఃప్రసాదసంసిద్ధిచే న,నంతభూస్పర్శనవిచార మాత్మఁ బొడమ."
(హరిశ్చంద్రనలోపాఖ్యానము. ఆ. 2. ప. 112)

"చ. అమరవరలక్షమావరవరాంచితవృత్తులవింగడించి నే
ర్పమరఁగ... ... ..." (హరిశ్చంద్రనలోపాఖ్యానము. ఆ. 2. ప. 113)

పయిపద్యములలో "ననంతభూస్పర్శనవిచారమాత్మఁ బొడమ" ననుదానికి సరస్వతీవాక్యముల లోని నలేంద్రాదిపరార్థవిమర్శనము (అనంతభూ=అంతము సంభవము లేనిదగు సరస్వతియొక్క,స్పర్శన= నలేంద్రాదులను స్పృశించువాక్యములయొక్క, విచారము = అర్థవిమర్శనము, ఆత్మన్ =మనస్సునందు, పొడమన్ = అంకురింపఁగా, అమరవరలక్షమావరవరాంచితవృత్తులన్ = దేవతామనుష్యలక్షణములచే, వింగడించి= వేఱుపఱచి,) మనసులో నంకురింపఁగా నని యర్థముచేసి యట్టిదేవతామనుష్యలక్షణముల చేత నలుని వేఱుపఱచికొనె నని తరువాతి పద్యభాగమున కర్థము చేయవలెను. ఇందు విమర్శనప్రకా రము ద్వ్యర్థికావ్యమున దుర్ఘటమగుటచే విడువఁబడెనని గ్రహింపవలెను. హరిశ్చంద్రనలోపాఖ్యాన వ్యాఖ్యాత పైపద్యముల కిట్లర్థముచేయకుండుట శృంగారనైషధమాత్రపఠనాజన్యమగు ప్రమాదమని తోఁచుచున్నది. ఇచట "ననంతభూస్పర్శనవిచార" మనఁగా నాకాశభూమిపాదస్పర్శనవిషయకమగు విచారమని వ్యాఖ్యాత యర్థముచేసియున్నాఁడు; దేవతాప్రసాదముచే నిట్టివిమర్శనముమాత్రమె గల్గి యందువలన దేవతామనుష్యలక్షణములచే నలుని గ్రహించెననియే కవిహృదయ మైనచో దేవతలను నలుని వర్ణించిన సీసపద్యములో దేవతానలపరముగ శ్లేషించుట కేమిసార్థక్యము గలదు. అందును సత్యనలవర్ణన వాక్యమున నర్థపంచక ముండునట్లు రచించినరచన కేమిఫలము! దేవతలును నలునిరూపముతోన యుం డఁగా దమయంతి దేవతలను బ్రార్థించి తత్ప్రసాదమున దేవతామనుష్యలక్షణములను గనుపట్టి నలుని గ్రహించెనని వర్ణించినఁ జాలునుగదా! నలునివేఱుపఱచుట కనువుగ శ్లేషల రచించియు నట్టిశ్లేషములను నిష్ఫలములుగఁ జేయునా?

ఇట్లే నూటపదుమూఁడవపద్యమున వ్యాఖ్యాత గ్రహించిన "యమరవరలక్షమావరవరాంచితవృత్తు" లనుపాఠమును విడిచి "యమరవరలక్షమావరవరాంచితవృత్తుల" నని సవరించుట యుక్తముగానున్నది. ఇట్లు సవరించినను హరిశ్చంద్రకథాపరమగునర్థమునకు భంగములేదు. (అమరవరలక్షమావరవరాంచితవృత్తులన్ = దేవతాశ్రేష్ఠమాన్యములను, వింగడించి = వేఱుపఱచి.)

సంస్కృతనైషధమును దెనిఁగించిన శ్రీనాథుని శృంగారనైషధమున నీపంచనలీసందర్భములో నిట్టిచాతుర్య మగపడదు. కాని సంస్కృతనైషధకర్తని శృంగారనైషధమునందును నింద్రాదిదేవతలను వర్ణించుటలోఁ బ్రతిదేవతలను నొక్కొక్కపద్యముతో వర్ణించి యందుఁ దత్తద్దేవతాపరముగాను నలపరముగాను నర్థద్వయ ముండునట్లు వర్ణించెను. (శృంగారనైషధము. ఆ. 5. ప. 166, 167, 168, 169.)

ఇట్టివర్ణనములలో సంస్కృతగ్రంథములోని శ్లిష్టపదములె శ్రీనాథుఁడు తఱచుగా సంగ్రహించుచు వచ్చెను. అందును సత్యనలవర్ణనమున శుద్ధశ్లేషతో లోకపాలనలపరార్థద్వయమును నిల్పక శ్లేషోపమలను నిల్పెను. ఇందును శ్లిష్టపదములు తఱచుగా సంస్కృతమునుండి సంగ్రహించినవే యనవచ్చును.

"శ్లో. అత్యాజిలబ్ధవిజయప్రసవ స్త్వయా కిం విజ్ఞాయతే రుచిపదం న మహీమహేంద్రః,
ప్రత్యర్థిదానవశతాహితచేష్టయాసౌ జీమూతవాహనధియం న కరోతి కస్య."(స. 13. శ్లో. 27.)

"శ్లో. యే నామునా బహువిగాహసురేశ్వరాధ్వరాజ్యాభిషేకవికసన్మహసా బభూవే,
ఆవర్జనం త మను తే నను సాధు నామ గ్రాహం మయా నల ముదీరిత మేవ మత్ర."
(స. 13. శ్లో. 28.)

"శ్లో. య చ్చండిమా రణవిధివ్యసనం చ త త్త్వం బుధ్వారయా శ్రిత మముష్య చ దక్షిణత్వమ్,
సైషా నలే సహజరాగభరా వపుష్మి న్నాత్మాఁ మర్పయితు మర్హసి ధర్మరాజే."
(స. 13. శ్లో. 29.)

"శ్లో. కిం తే తథా మతి రముష్య యథాశయ స్స్యా ద్వ్యత్ త్వత్పాణిపీడనవినిర్మితయేః పాశః,
కాన్తానవా నవతి నో భువనం చరిష్ణు ర్నాసా వముత్ర న రతాఽస్య తీతి యుక్తమ్."
(స. 13. శ్లో. 30.)

అను వీనికి శ్రీనాథుని యాంధ్రీకరణము సరిగా లేదని విశదముగుట కిచ్చట నయ్యది వ్రాయుచున్నాను.

"తే. నలిననేత్ర ప్రత్యర్థిదానవశతాహి, త త్త్వచేష్టాగరిష్ఠత సరిసి చూడ
నితఁడు జీమూతవాహనుఁ డింత నిక్క, మింపు పొంపిరివోవ వీక్షింపు మితని."
(శృంగారనైషధము. ఆ. 5. ప. 172.)

"వ. మఱియు నితండు హుతవహుండునుంబోలె బహువిగాహమానునవధ్వరాజ్యాభిషేకవికస్వరతేజోవిరాజితుండు; నీశానమూర్తిభేదంబును, దండధరుండునుంబోలెఁ బరప్రాణోత్క్రాంతిదానసమర్థశక్తిసంపన్నుండును, సంజ్ఞానందనుండును, వరుణుండునుంబోలెఁ బ్రతికూలపాతప్రచారచటులవాహినీసహస్రసంసేవితుండును, బ్రచేతసుండును, నితనిం గనుంగొను మిప్పురుషపంచకంబునందు నీకుం గన్నిచ్చకు వచ్చునతని వరియింపుము..."(శృం. నై. ఆ. 5. వ. 173.)

పయివానిలోని వరుణనలసమానవిశేషణముసందలి శ్లిష్టపదములును సంస్కృతనైషధములోని

"సస్యందనైః ప్రసహనైః ప్రతికూలపాతం కా వాహినీ న తను తే పున రస్య నామ."

యనుదానినుండి సంగ్రహింపఁబడెనని గ్రహింపవలయును. ఇందుఁ "బ్రతికూలపాత" మ్మనుచోటఁ "బ్రతికూలవాత" యని ముద్రితమగు శృంగారనైషధమున గ్రహింపఁబడియున్నది. అయ్యది వరుణపక్షమున స్వారస్యముగాలేదు. ఇఁకఁ బంచనైషధవర్ణనములోని చాతుర్యమును విచారింతము.

•పయిగీతపద్యమునందు నింద్రనలపరములగు రెండర్థము లున్నను భేదసూచకముగ నారోపణము చేసి రూపకాలంకారముతో వర్ణింపఁబడెను. ఇట్లే పయివచనముసందును హుతవహాదులవర్ణనాపరముగను నలపరముగను నర్థద్వయ మున్నను హుతవహాదులతో నలునకు సామ్యము వర్ణింపఁబడెను. ఈసంద

ర్భమున దమయంతి కెట్లు సందేహముగల్గెనో తెలియకున్నది. "తద్భిన్నత్వే సతి తద్గతభూయోధర్మవత్త్వమునమానత్వ"మ్మనుచొప్పున నుపమానము భేదసూచకముగదా! ఇట్టిస్థితిలో "వెలయఁగఁ బంచనైషధివిభేదము నేర్పఱుపంగలేక... ... ..." (శృం. నై. ఆ. 4. ప. 176.)

అని యిట్లు నలుని గ్రహింపలేకపోయెనని వర్ణింపఁబడియున్నది. సంస్కృతనైషధమున రెండర్థములను సంపూర్ణముగ శ్లేషగుంభితములగుటం జేసి నలుని వేఱుపఱచుకొనలేకపోయె ననుట యుక్తముగనున్నది గాని యి ట్లుపమాశ్లేషము భేదమును వెల్లడిచేయుచుండఁగా నలుని గ్రహింపలేక పోయెననుట యుక్తముగానుండునా?

మఱియు నట్లు మొదట శ్లేషగుంభితములగు సరస్వతీవాక్యములను విమర్శింపఁజాలక దమయంతి దేవతల స్తుతియించి వారిప్రసాదమున బుద్ధివైశద్యము నొంది సరస్వతీవాక్యములను వెనుక వ్రాసినరీతిని విమర్శించి నలుని గ్రహించి దేవతాప్రసాదమునఁ దత్కాలమున దేవతలందు నగపడిన భూస్పర్శనాభావాదిలక్షణములు నలునియందు లేకుండుటచే స్థిరపఱచుకొనె నని సంస్కృతనైషధమున నతిసందర్భముగ నున్నది.

"ప్రసాద మాసాద్య సురైః కృతం సా సస్మార సారస్వతసూక్తిసృష్టేః,
దేవా హి నాన్య ద్వితరన్తి కిన్తు ప్రసద్య తే సాధుధియం దదంతే." (స. 14. శ్లో. 8.)

"శేషం నలం ప్రత్యమరేణ గాథా యా యా సమర్థా ఖలు యేన యేన,
తాం తాం తదన్యేన సహాలగన్తీం తదా విశేషం ప్రతిసందధే సా." (స. 14. శ్లో. 9.)

"పరస్య దారాన్ ఖలు మన్యమానై రస్పృశ్యమానా మమరై ర్ధరిత్రీమ్,
భక్త్యైవ భర్తు శ్చరణౌ దధానాం నలస్య తత్కాల మపశ్య దేషా." (స. 14. శ్లో 16.)

"సురేషు నాపశ్య దనైతక్షు దక్ష్ణో ర్నిమేష ముర్వీభృతిసమ్ముఖే సా..." (స. 14. శ్లో. 17.)

"నాబుద్ధ బాలా విబుధేషు తేషు క్షోదం క్షితే ర్దత్తతనైషధే తు..." (స. 14. శ్లో. 20.)

"స్వేదః... ... ...... నలే తదాలోకి న దైవతేషు." (స. 14. శ్లో. 19.)

"సురేషు మాలా మమలా మపశ్య న్నలే తు బాలా మలినీభవన్తీం..." (స. 14. శ్లో. 20.)

"చిహ్నై రమీభి ర్నలసంవి దస్యా స్సంవాద మాప ప్రథమోపజాతా,
సా లక్షణవ్యక్తిభి రేవ దేవప్రసాద మాసాదిత మ ప్యబోధి." (స. 14. శ్లో. 22.)

అను నీసందర్భమును శ్రీనాథుఁ డాంధ్రీకరించుటలో సరస్వతీశ్లేషవాక్యవిమర్శనశక్తి దేవతాప్రసాదమునఁ గల్గెనని వర్ణింపలేదు. దేవతాలక్షణములగుధరణీస్పర్శనాభావాదులు దేవతలునలుగురియందు మాత్రము గనుపట్టుటం జేసి నలుని గ్రహించెనని చెప్పియున్నాఁడు. మఱియు నొకవిశేషముగనుఁడు.

"క. మంచకమధ్యస్థితమ,ద్వంచకపంచకమునందు పరుసమెయిఁ బరీ
క్షించెద నే నొక్కించుక, పంచజనసుపర్వలక్ష్యపర్వశ్రేణిన్." (ఆ. 5. ప. 180.)

"వ. అనుచు నేవురం గలయంగనుంగొని యందు. (ఆ. 5. ప. 181.)

"మ. ధరణిం బొందని కోమలాంఘ్రికమలద్వంద్వంబులున్ ఘర్మశీ
కరయుక్తంబులు గానిఫాలములు వక్షఃక్షోణులం బత్త్రకే
సరము ల్గందనిపూవుదండలు నిమేషవ్యాఖ్య గై కోనిదృ
క్సరసీజంబులు నల్వురందుఁ గనియెం గాంతాలలామం బొగిన్. (ఆ. 5. ప. 182.)

"వ. కని రైదవవాఁడు నిషధరా జగుట యెఱింగి, దేవతాప్రసాదంబులేక యేకార్యంబును ఫలింప నేరదు...అనుచు...దివిజసభాజనంబునకుం బ్రారంభించి...తత్ప్రసాదలబ్ధంబైన బుద్ధివైభవం బున నమర్త్యవిలక్షణంబులగు...చిహ్నంబులను సందేహంబు వాసి..." (ఆ. 5. వ. 183.)

అని యిట్లు శ్రీనాథుఁడు శృంగారనైషధమునఁ జెప్పియున్నాఁడు. దేవతలఁ బ్రార్థించి వారి ప్రసాదమున బుద్ధివైశద్యము నొందకముందే నలునిగ్రహించి పిదప మఱల దేవతాస్తుతి చేయనేల? దేవతాప్రసాదమునకు ముందే యుప్ప బుద్ధివైశద్యమే పిదప దేవతాప్రసాదమునఁ గల్గెనని వర్ణించుటలో స్వారస్య మేమో తెలియవున్నది?

పయిరీతి ననేకస్థలములందు శ్రీనాథుఁడు సంస్కృతనైషధము నాంధ్రీకరించుటలో నందలి మెఱుఁగులను సాధ్యమగునంతవఱకైన నేకారణముననో దీసికొనిరాఁ బ్రయత్నింపఁడయ్యె. అట్టి మెఱుఁగుల నీసందర్భముననేగాక రామరాజభూషణుఁడు వసుచరిత్రమునం దనేకస్థలములలో యథాసందర్భ ముగఁ జూపియున్నాఁడు. వాని నిదివఱకే యుదాహరించియున్నాను.

హరిశ్చంద్రనలోపాఖ్యానము ద్వ్యర్థికావ్యమెయయిన నిందును రామరాజభూషణుఁడు శ్రీహర్షకల్పనానుసృతియందలి యభిరుచిని జూపకపోలేదు.

"అముష్య విద్యా రసనాగ్రనర్తకీ త్రయీవ నీతాఙ్గగుణేన విస్తరమ్..." (నై. స. 1. శ్లో. 5.)
అనుదాని ననుసరించి,

"సీ. ...తనరసజ్ఞామృతబాకవిద్యానియూఢి
తే. కంగగుణజాతపరిణాహ మనువుపఱచి..." (హరిశ్చంద్రనలోపాఖ్యానము. ఆ. 1. ప. 15.)

"శ్లో. అచీకర చ్చారు హయేన యా భ్రమీ ర్నిజాతపత్రస్య తల స్థలే నలః,
మరు త్కిమద్యాఽపి న తాసు శిక్షతే వితత్య వాత్యామయచక్రచంక్రమా" (నై. స. 1. శ్లో. 74) ననుదాని ననుసరించి

"ఉ. నేమ మెలర్పఁ గా గొడుగునీడ వహించు వసుంధరాస్థలీ
సీమ నె యెక్కి యాడెను విచిత్రగతిం దురగోత్తమంబు నా
భూమివిభుండు తద్భ్రములుపో యెడత్రెవ్వక యభ్యసించు వా
త్యామయచక్రచంక్రమవిహారములన్ సుడిగాడ్పు లీడ్పుచున్." (శృం. నై. ఆ. 1. ప. 90.)

"క. పలువగ తురగముల మహా, బలచిత్రప్రాఢిఁ ద్రోలి బహుచక్రశ్రీ
వెలయు మహావిభువరుఁ డా, బలియుఁడు తనగొడుగునీడఁ బఱపుచు నడరున్."
(హరిశ్చంద్రనలోపాఖ్యానము. ఆ. 1. ప. 17)

అనియు రచింపఁబడెను. వ్యాఖ్యాతమతముచొప్పున ద్వ్యర్థికావ్యమగుటచే నిట శ్రీనాథునిపద్యమునందువలె మూలములోని యభిప్రాయము సరిగా నిమిడియుండలేదు. కాని "మహాబలచిత్రప్రాఢి" యనుదానిచే సుడిగాలులవలె నని యర్థముచేసిన బాగుగ నుండునని తోఁచుచున్నది. వ్యాఖ్యాత యట్లు చేయకుండుటకుఁ గారణ మేమో తెలియకున్నది. పయిశ్రీనాథునిపద్యమున సంస్కృతశ్లోకములోనిపదములే ప్రయోగింపఁబడినవి. అది యాతనియాంధ్రీకరణమునఁ బ్రతిపద్యసాధారణమగు రీతియయి యుండుటచే నిట వింతగాదు.

# ఆఱవ భాగము.

---

## పిల్లవసుచరిత్రములు, సంస్కృతవసుచరిత్రము.

శ్రీమద్రామాయణమునకు బాలరామాయణమువలెను, సిద్ధాంతకౌముదికి లఘుకౌముదివలెను, నీవసుచరిత్రమునకుఁ బిల్లవసుచరిత్రమను నొక యేకాశ్వాసప్రబంధము గలదు. గ్రంథము సదాపఠనీయమను గౌరవము పండితుల కున్నప్పుడుగాని యిట్టిగ్రంథము పుట్టనేరదు. వసుచరిత్రములోని 287 పద్యములతోఁ బ్రధానకథ విడువకుండ నిది కూర్పఁబడియున్నది. ఇయ్యది రామరాజభూషణునిచేతనే యేకాశ్వాసముగఁ గూర్పఁబడినట్లా గ్రంథములోని యాశ్వాసాంతగద్యమువల్ల స్పష్టపడుచున్నది. అందులోని మూఁడవగద్యము నీవిషయమునే స్థిరపఱచుచున్నది. "అభ్యుదయపరంపరాభివృద్ధిగా నాయొనర్పంబూని వసుచరిత్రంబను మహాప్రబంధంబునందు సంక్షేపరూపకథాక్రమం బెట్టిదనిన" యని యిట్లు గ్రంథాదియందును "ఇది శ్రీమద్రామచంద్రచరణారవింద... రామరాజభూషణప్రణీతంబైన మహాప్రబంధంబునందు సర్వంబును సంక్షేపరూపంబున నేకాశ్వాస" మని యిట్లు గ్రంథాంతమందును నుండుటం బట్టి యిట్లు రామరాజభూషణుఁడే సంఘటించినట్లగపడును కాని పద్యములను సందర్భపఱచుటలో ననేకస్థలములయందుఁ గొన్నిలోపములు గనఁబట్టుచున్నవి. మఱియు గ్రంథకర్తకుఁ దాను రచించినదానిలోఁ గొంతభాగము విడువఁ దగినదను నభిప్రాయము గల్గియుండదు గదా! ఈపిల్లవసుచరిత్రమున శుక్తిమతీకోలాహలులసమావేశరూపమగు కథాసందర్భము సంగ్రహింపఁబడలేదు. 172 వ పద్యములోని సీసచరణములు నాల్గును విడువఁబడినవి. ఆసందర్భములు ప్రకృతమున కనావశ్యకములని రామరాజభూషణునకే యున్నయెడల మూలగ్రంథములోఁగూడఁ జేర్పకయే యుండును. కాఁబట్టి వసుచరిత్రమునందలి గౌరవముచే నెవ్వరో పండితు లిట్లు సందర్భపఱచి లోకవ్యాప్తికయి రామరాజభూషణుఁడే చేసినట్లు వ్రాసియుందురని తోఁచుచున్నది. ఈపిల్లవసుచరిత్రమును తాటియాకులపుస్తకము నామిత్రులగు రావుసాహెబు గిడుగు రామమూర్తిపంతులుగారియొద్ద నున్నది. దానినుండి తీయఁబడిన పద్యములపట్టిక నీక్రింద నుదాహరించుచున్నాను. ఈపట్టికయందుఁ బిల్లవసుచరిత్రపద్యసంఖ్య మొదటిగడియందును దానికి సరియగు వసుచరిత్రపద్యసంఖ్య రెండవగడియందును వ్రాయఁబడినవి.

| పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర | పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర | పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర | పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర | పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఆ. 1. | ఆ.1. | 7 | 123 | 14 | 141 | 21 | 163 | 27 | 12 |
| 1 | 1 | 8 | 126 | 15 | 144 | | ఆ. 2. | 28 | 13 |
| 2 | 90 | 9 | 134 | 16 | 146 | 22 | 3 | 29 | 14 |
| 3 | 91 | 10 | 135 | 17 | 149 | 23 | 4 | 30 | 15 |
| 4 | 92 | 11 | 137 | 18 | 150 | 24 | 5 | 31 | 16 |
| 5 | 93 | 12 | 139 | 19 | 154 | 25 | 6 | 32 | 17 |
| 6 | 119 | 13 | 140 | 20 | 160 | 26 | 7 | 33 | 18 |

| పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర | పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర | పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర | పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర | పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 34 | 19 | 72 | 81 | 109 | 74 | 147 | 133 | 185 | 47 |
| 35 | 20 | 73 | 82 | 110 | 75 | 148 | 135 | 186 | 49 |
| 36 | 21 | 74 | 83 | 111 | 76 | 149 | 140 | 187 | 51 |
| 37 | 22 | 75 | 84 | 112 | 78 | 150 | 150 | 188 | 52 |
| 38 | 23 | 76 | 85 | 113 | 79 | 151 | 151 | 189 | 53 |
| 39 | 24 | 77 | 86 | 114 | 80 | 152 | 153 | 190 | 54 |
| 40 | 25 | 78 | 87 | 115 | 81 | 154 | 158 | 191 | 56 |
| 41 | 26 | 79 | 89 | 116 | 82 | 155 | 159 | 192 | 57 |
| 42 | 27 | 80 | 90 | 117 | 83 | 156 | 162 | 193 | 58 |
| 43 | 28 | 81 | 91 | 118 | 84 | 157 | 165 | 194 | 60 |
| 44 | 29 | 82 | 92 | 119 | 85 | 158 | 166 | 195 | 62 |
| 45 | 30 | 83 | 95 | 120 | 87 | 159 | 167 | 196 | 63 |
| 46 | 31 | 84 | 97 | 121 | 89 | 160 | 168 | 197 | 65 |
| 47 | 33 | 85 | 99 | 122 | 90 | 161 | 169 | 198 | 68 |
| 48 | 37 | 86 | 100 | 123 | 91 | 162 | 171 | 199 | 69 |
| 49 | 39 | | అ.3. | 124 | 92 | 163 | 172 | 200 | 72 |
| 50 | 40 | 87 | 36 | 125 | 93 | 164 | 176 | 201 | 73 |
| 51 | 42 | 88 | 37 | 126 | 94 | 165 | 178 | 202 | 74 |
| 52 | 44 | 89 | 38 | 127 | 96 | 166 | 179 | 203 | 76 |
| 53 | 45 | 90 | 40, 41 | 128 | 103 | 167 | 180 | 204 | 77 |
| 54 | 47 | 91 | 42 | 129 | 104 | 168 | 182 | 205 | 78 |
| 55 | 48 | 92 | 44 | 130 | 108 | 169 | 183 | 206 | 79 |
| 56 | 52 | 93 | 45 | 131 | 109 | 170 | 184 | 207 | 80 |
| 57 | 53 | 94 | 46 | 132 | 110 | 171 | 185 | 208 | 81 |
| 58 | 54 | 95 | 47 | 133 | 112 | | అ.4. | 209 | 82 |
| 59 | 55 | 96 | 48 | 134 | 116 | 172 | 3 | 210 | 83 |
| 60 | 56 | 97 | 49 | 135 | 117 | 173 | 10 | 211 | 84 |
| 61 | 57 | 98 | 50 | 136 | 118 | 174 | 17 | 212 | 86 |
| 62 | 58 | 99 | 55 | 137 | 119 | 175 | 24 | 213 | 87 |
| 63 | 62 | 100 | 58 | 138 | 120 | 176 | 25 | 214 | 88 |
| 64 | 67 | 101 | 60 | 139 | 121 | 177 | 26 | 215 | 89 |
| 65 | 69 | 102 | 63 | 140 | 122 | 178 | 27 | 216 | 90 |
| 66 | 71 | 103 | 64 | 141 | 125 | 179 | 30 | 217 | 91 |
| 67 | 73 | 104 | 65 | 142 | 126 | 180 | 36 | 218 | 92 |
| 68 | 75 | 105 | 66 | 143 | 127 | 181 | 37 | 219 | 93 |
| 69 | 76 | 106 | 67 | 144 | 130 | 182 | 39 | 220 | 94 |
| 70 | 78 | 107 | 69 | 145 | 131 | 183 | 44 | 221 | 95 |
| 71 | 79 | 108 | 70 | 146 | 132 | 184 | 45 | 222 | 96 |

| పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర | పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర | పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర | పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర | పిల్ల వసుచరిత్ర | వసు చరిత్ర |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 223 | 97 | 237 | 116 | 250 | 10 | 263 | 18 | 277 | 84 |
| 224 | 98 | 238 | 117 | 251 | 24 | 264 | 21 | 278 | 89 |
| 225 | 99 | 239 | 119 | 252 | 27 | 265 | 22 | 279 | 91 |
| 226 | 100 | 240 | 120 | 253 | 28 | 266 | 23 | 280 | 95 |
| 227 | 101 | 241 | 121 | 254 | 31 | 267 | 24 | 281 | 96 |
| 228 | 102 | 242 | 122 | 255 | 55 | 268 | 26 | 282 | 97 |
| 229 | 103 | 243 | 124 | 256 | 57 | 269 | 27 | 283 | 99 |
| 230 | 104 | 244 | 127 | 257 | 62 | 270 | 29 | 284 | 100 |
| 231 | 106 | 245 | 128 | 258 | 63 | 271 | 33 | 285 | 101 |
| 232 | 107 | 246 | 138 | 259 | 106 | 272 | 63 | 286 | 102 |
| 233 | 108 | | ఆ. 5. | 260 | 107 | 273 | 72 | 287 | 103 |
| 234 | 109 | 247 | 3 | | ఆ. 6. | 274 | 74 | | |
| 235 | 110 | 248 | 4 | 261 | 3 | 275 | 75 | | |
| 236 | 113 | 249 | 9 | 262 | 8 | 276 | 83 | | |

ఇందు శుక్తిమతీకోలాహలసమాగమాభిసందర్భము చేర్పఁబడియుండలేదు. మఱియుఁ బిల్లవసుచరిత్రమున 20, 21 పద్యములనడుమ వసుచరిత్రలోని 162వ పద్యము చేర్పనియెడలఁ బిల్లవసుచరిత్రములోని 60వ పద్యమునఁగల "మున్ను విన్న యన్నినదముకన్నఁ దిన్ననయి" యనునది యసంగతమగును. ఇట్లె యింద్రుఁడు వసురాజునకు విమానము నిచ్చుసందర్భము పిల్లవసుచరిత్రమునందుఁ జేర్పఁబడలేదు. అందువలనఁ బిల్లవసుచరిత్రములోని 99వ పద్యమునఁగల "సురరాడ్దత్తవిమానచిత్రమహిమ" లనుదానికి సంగతిలేదు. మఱియుఁ గొన్నిపద్యముల నడుమనటలో సందర్భము చాలకున్నది. అట్టివాని పట్టిక నిట నుదాహరించెదను.

14, 15; 72, 73; 98, 99; 101, 102; 108, 109; 149, 150; 152, 153; 167, 168; 197, 198; 199, 200; 202, 203; 235, 236; 254, 255; 271, 272;—

మఱియు వసుచరిత్రమునకు వెనుకఁ బుట్టిన ప్రబంధములలో సరసముగ నున్న వానికిఁ గొన్నిటికిఁ బిల్లవసుచరిత్రములని పండితులు బిరుదముల నిచ్చుచునచ్చిరి.

కనుపర్తి యబ్బయామాత్యుని పురూరవశ్చరిత్రమునకును నడిదముసూరకవి కవిజనమనోరంజనమునకును గృష్ణకవి శకుంతలాపరిణయమునకును బిల్లవసుచరిత్రములను ప్రసిద్ధి గలదని పండితలోకమునకెల్లవిదితమే! ఈగ్రంథములందలి వసుచరిత్రానుసృతు లిదివఱకే యుదాహరించియున్నాను. ఈ గ్రంథములేగాక తిమ్మకవి రసికజనమనోభిరామము మొదలగు నితరగ్రంథములును వసుచరిత్రమును విశేషించి యనుసరించుటయు సరసములగుగ్రంథములకుఁ బండితులు పిల్లవసుచరిత్రములను బిరుదముల నిచ్చుచుండుటయు వసుచరిత్రమునందలి పండితులగౌరవమును దద్గ్రంథప్రాశస్త్యమును వెల్లడిచేయుచునే యున్నవి. సంస్కృతకవులలోఁ గాళిదాసుఁడు శ్లాఘ్యతముఁ డగుటచేఁగదా గొందఱుమహాకవులభినవకాళిదాస బిరుదమును ధరించియున్నారు.

లందుసైతమనేకస్థలములందు వ్యర్థపదప్రవేశమునకు బీజమగుచున్నది. గాన నీవ్యర్థపదప్రయోగదోషమాంధ్రపద్యవాఙ్మయసామాన్యమని చెప్పనచ్చును.

"శ్రీభూపుత్త్రివివాహవేళ" యను కృత్యాదిపద్యమునందు శ్రీయను మొదటియక్షరమునకుఁ బరముగ 'భూ' యను పరుషాక్షరమును బ్రయోగించుట దోషమని యొకయైతిహ్యము గలదు. వసుచరిత్రమును గృతినందుటకై కృష్ణదేవరాయలు వినుచుండ బట్టుమూర్తి మొదటిపద్యమును జదువ నారంభింపఁగనే తెనాలిరామకృష్ణుఁడు లేచి కృష్ణదేవరాయల కభిముఖుఁడై "యోమహారాజా! దీనిని గృతినం దవలదు. ఇది యేలినవారికి హానిఁగల్గించు"నని చెప్పి చేతిలో బూడిదవేసి శ్రీకారమును వ్రాసి వెంటనే 'భూ' యని వ్రాసిచదివి యుపు డాబూడిదతో శ్రీకార మెగిరిపోవుటను జూపె ననియు నందుచేఁ గృష్ణదేవరాయలు దీనిని గృతి నందలేదనియుఁ జెప్పుదురు గాని యీస్వల్పదోషమునకు శంకించి, యిట్టి మహాప్రబంధమును గృష్ణదేవరాయలవంటి రసికుఁడు నిరాకరించెనని చెప్పుటకన్నఁ బరిహాసనీయమగు విషయము లేదు. మఱియు నరసభూపాలీయము పై కాలమునకె కృష్ణదేవరాయలు గతించి యుండుటచేఁ దత్పరభావియగువసుచరిత్ర మాకాలమునకె రచింపఁబడి యుండెననుటయు విశ్వసింపఁ దగియుండలేదు. ఇంతియకాక యయ్యది యంతదుష్టమైనదిగా నిరాకరింపఁబడియె యున్న యెడలఁ దిరుమలదేవరాయలు మాత్ర మెట్లు కృతినందును.

మఱియు నిట్లు తనగ్రంథము నిక్కృతియుకాఁగా రామరాజభూషణుఁడు రామకృష్ణుని బ్రతిమాలుకొనుట నతఁడు రాజును బోధించి దానిని మృతినొందిన తిరుమలరాజుపిండములపై ధారపోయించునట్లు చేసెననియుఁ జెప్పుదురు. ఇందునలనఁ గృష్ణదేవరాయలనసుముందె తిరుమల దేవరాయలు మృతినొందినట్లు తేలుచున్నది. కాన నీయైతిహ్యము లేమాత్రమును నప్పుదగినవి కావనియు రామరాజభూషణుఁడు బట్టుకొలమువాఁ డగుటచే నోర్వలేనిమత్సరు లివి కల్పించి యుందురనియు దృఢముగాఁ జెప్పనచ్చును.

"సీ. ఏరాజుభూరితేజోరుణాలోకంబు లోకంబులెమమ నిరాకరించు;"(వసు. ఆ. 1. ప. 30.)

అనుపద్యములోని చమత్కారమునకు మెచ్చి యిట్టి కవికేమిబహుమాన మియ్యవలెనని రాజు యోచించుచుండ తెనాలిరామకృష్ణుఁడు లేచి "మహాప్రభూ! దీని కీయవలసినబహుమానము కవియే ముందువిశదపఱచికొనును. చిత్తగింపుఁ" డని చెప్పెననియుఁ బిదపఁ బైభాగమును జదువుచుండఁగా వచ్చిన

"శా. చేతోజాతసమానమూర్తియగు నాశ్రీరంగధాత్రీధవుండాతిమ్మాంబిక" (వసు. ఆ. 1. ప. 37.)

యను పద్యభాగమును విన్నతోడనే మఱల లేచి "యిదిగో! కవి తన కీయవలసిన బహుమానమును కోర్కె" నని చెప్పెననియు నొకయైతిహ్యము గలదు. కాని మహారాజుసభలో రామరాజభూషణునియెదుట నిట్టి యసంబద్ధప్రలాపములు ప్రసంగింపఁబడెననుట హాస్యాస్పదము. వసుచరిత్రమున నిట్టి యల్పదోషములనుమాత్రమె మత్సరులుసైతమెన్నుట నరయఁగా నిక్కన్యము యొక్క నిర్దుష్టత వెల్లడియగుచున్నది. ఇట్టి యల్పదోషములు దోషములు కానేరవని స్పష్టపడుటకై యిచట దోషస్వరూపమును వివరించుచున్నాను.

కావ్యమనెడు కాంతకు రసము జీవితము. శబ్దార్థములు శరీరము. గుణములు శౌర్యాదిగుణములు. రీతు లంగసంస్థానవిశేషములు. ఉపమాద్యలంకారములు కటకకుండలాద్యలంకారములు. దోషములు కాణత్వ ఖంజత్వాదులు అని యాలంకారికులు చెప్పియున్నారు.

రసమున కపకర్షఁ గూర్చునవి దోషములని దోషసామాన్యలక్షణము. కావుననే దోషములు నిత్యములనియు ననిత్యములనియు రెండువిధములుగాఁ జెప్పఁబడినవి.

"శ్రుతిదుష్టాదయో దోషా అనిత్యా యే చ దర్శితాః,
ధ్వన్యాత్మన్యేవ శృంగారే తే హేయా ఇ త్యుదాహృతా." యని ధ్వనికావ్యమునఁ జెప్పఁబడియున్నది. కొన్నిదోషము లొకప్పుడు రసాపకర్షకములయియుండియుఁ గొన్ని యెడల నట్లుగాక రసోపస్కారకములగుటయుఁ గలదు. శ్రుతిదుష్టాదిదోషములు శృంగారాదిరసవిషయమున రసాపకర్షకములై యైనను వీరరౌద్రాదిరసవిషయమున రసోపస్కారకములై యగును. కాఁబట్టి యలంకారశాస్త్రమునఁ జెప్పఁబడిన దోషములన్నియు సదా దోషములేయని గ్రహించుట యాలంకారికసమయవిరుద్ధమని యెఱుంగునది. కావుననే యౌచిత్యమునుబట్టి దోషము నొకప్పు డదోషములగును.

"వక్తరి క్రోధసంయుక్తే తథా వాచ్యే సముద్ధతే,
రౌద్రాదౌ తు రసేఽత్యంతం దుశ్శ్రవత్వం గుణో భవేత్.
సురతారంభగోష్ఠ్యాదౌ వశ్లీలత్వం తథా పునః,
స్యాతామదోషౌ శ్లేషాదౌ......నిహతార్థాః ప్రయుక్తతే.
... ...గ్రామ్యత్వ మధమోక్తిషు
... ... ... ... ...
సమాప్తపునరాత్తత్వం న దోషో న గుణః క్వచిత్.
... ... ... ... ...
అనుకారే చ సర్వేషాం దోషాణాం నైవ దోషతా
అన్యేషా మపి దోషాణా మిత్యౌచిత్యా న్మనీషిభిః,
అదోషతాచ గుణతా జ్ఞేయా చానుభయాత్మతా"

యని యిట్లు సాహిత్యదర్పణమునఁ జెప్పఁబడియున్నది. ఈసిద్ధాంతము ననుసరించియే కాఁబోలును దారానాథతర్కవాచస్పతిగారు స్వవిరచితమగు సరళయను సిద్ధాంతకౌముదీవ్యాఖ్యానమున నపశబ్దప్రయోగమునైత మౌచిత్యవశమున సదుష్టమగునని చర్చించియున్నారు.

"హా పితః! క్వాసి హేసుభ్రు! ఇతిభట్టిః; ప్రామాదిక ఏవాయ మితి బహవ" యను సిద్ధాంతకౌముదీగ్రంథమునకు వ్యాఖ్యానము చేయునపుడు వాచస్పతిగారు ప్రామాదికము కవిప్రయోగము కాదనియు, దుఃఖమగ్నుఁడగు రామున కిట్టిప్రామాదికప్రయోగ ముచితమెయనియు సవరించిరి.

"కీటానువిద్ధరత్నాదిసాధారణ్యేన కావ్యతా, దుష్టే ష్వపి మతా యత్ర రసాద్యనుగమ స్స్ఫుట" యనురీతిని గీటానువేధాదులు రత్నముయొక్క రత్నత్వమున కెట్లు భంజకములు గానేరవో యట్లే దోషములు కావ్యతాభంజకములు కానేరవని చర్చించి విశ్వనాథపంచాననుఁడు "త దదోషౌ శబ్దార్థౌ సగుణావనలంకృతీ పునః క్వాపి" మ్మనులక్షణమును జెప్పియున్నాఁడు. కాఁబట్టి

"త దల్ప మపి నోపేక్ష్యం కావ్యే దుష్టం కథంచన,
స్యా ద్వపు స్సుందర మపి శ్విత్రే ణైకేన దుర్భగ" మ్మను దండ్యాచార్యాదుల వాక్యములు దోషహేయతావిషయకములని గ్రహించునది. అట్లికానిచోఁ గావ్యమునకు లక్ష్యమే లేకపోవలసివచ్చును. కాళిదాసాదిమహాకవులకావ్యములందును సామాన్యముగాఁ బ్రతిశ్లోకమునందు నేదో యొకదోషముండకపోదని చెప్పవచ్చును. ఉదాహరణార్థ మొకటిరెండు దోషములను జూపెదను.

"కళా చ సా కాంతిమతీ కళావతి" యనుచోట 'సా' యనుపదముతో నన్వయింపవలసిన 'చ' యనునది 'కళా' యనుపదమువెనుకఁ బ్రయోగించుటచే నక్రమత్వదోషమని యుదాహరించిరి.

"త ద్గచ్ఛ సిద్ధ్యై కురు దేవకార్య" మ్మనుచో 'ద్ధ్యై' యను పరుషవర్ణప్రయోగమున శ్రుతిదుష్ట దోషమని యుదాహరించిరి.

ఇట్టిదోషములు లేనిశ్లోక మొకటైన నుండబోదని నానమ్మకము. ఇఁక నిత్యదోషమగు చ్యుత సంస్కారతకు లక్ష్యములు వసుచరిత్రమునఁ గలవా యనువిషయము విమర్శింపవలసియున్నది.

## వసుచరిత్రములోని అపభ్రంశరూపములును వాని శుద్ధరూపములును

| | |
|---|---|
| 1. ముసలిమానులు (ఆ. 1. ప. 45) | ముసలిమ్రాఁకులు (బాలవ్యా. అచ్ఛి. సూ. 18) |
| 2. కావుకావనువారి (ఆ. 1. ప. 56) | కావుకావుమని (బాలవ్యా. సంధి. సూ. 47) |
| 3. కన్గోఁజాలక (ఆ. 2. ప. 41, ఆ. 4. ప. 136) | కన్గొనఁజాలక (క్రియా. సూ. 60) |
| 4. మనమరాలు (ఆ. 5. ప. 35) | మనుమరాలు (శబ్దరత్నాకరము) |
| 5. డించఁగన్ (ఆ. 6. ప. 12) | డింపఁగన్ } బాల. క్రియా. సూ. 88 |
| 6. దీపించమి (ఆ. 6. ప. 82) | దీపింపమి } బాల. క్రియా. సూ. 88 |
| 7. చాలించరాదె (ఆ. 6. ప. 84) | చాలింపరాదె } బాల. క్రియా. సూ. 88 |
| 8. పెంచదు (ఆ. 1. ప. 56) | పెంపదు } బాల. క్రియా. సూ. 88 |
| 9. కొమ్మంచున్ (ఆ. 6. ప. 65) | కొమ్మయంచున్ } బాల. సంధి. సూ. 4. |
| 10. అమ్మని (ఆ. 6. ప. 80) | అమ్మయని } బాల. సంధి. సూ. 4. |
| 11. అర్చిడఁగరాదు. | అర్చి యిడఁగరాదు |

పయినుదాహరించిన యపభ్రంశప్రయోగములు లక్షణవిరుద్ధము లగుటచే గ్రామ్యములు (లేక) చ్యుతసంస్కృతులు గావు నవి ప్రయోగార్హములు గావని కొందఱయభిప్రాయము. అట్లయినను నవి సర్వవ్యవహారగతములగుటంజేసి యగ్రామ్యములును బ్రయోగార్హములు ననుతలంపున రామరాజభూషణుఁడు ప్రయోగించియుండునని తోఁచుచున్నది.

1-వ యుదాహరణమున వ్యావహారస్థమగు పదాదివర్ణసంయుక్తరేఫలోపము చూపఁబడినది. మఱియు నందు, ను వర్ణాంతశబ్దములకు బహువచనమునందు వచ్చు కు జాగమము రాకుండుటయుఁ జూపఁబడినది. త్రాగు, ప్రోగు, మ్రగ్గు మొదలగు మఱికొన్నిపదములందలి పదాదివర్ణసంయుక్తరేఫలోపమును సైత మంగీకరించి శబ్దరత్నాకరమున బహుజనపల్లి సీతారామాచార్యులవా రుదాహరించియున్నారు.

2-వ యుదాహరణమున నచ్చుపరమగునపుడును మధ్యమపురుష 'ము' వర్ణలోపము గల్గునను వ్యావహారికాంధ్రభాషానియమము చూపఁబడినది. 'చూడుచూడని పిలిచె' ననుమొదలగు వాడుకలలో నీనియమ మగపడుచున్నది. ఇట్టివి మఱికొన్ని కవిప్రయోగములును గలవు "ఆడిదె నీదుపందెము" (కళా. ఆ. 6.) "భవచ్ఛిత్తేప్సితం బెద్ది చె ప్పనిపన్."(మార్కం. ఆ. 1.)

3-వ యుదాహరణమునఁ బ్రార్థనాద్యర్థక ము డుజ్జులే గాక మఱికొన్నిప్రత్యయములు పరమైనపుడుసైతము 'కొనునకుఁ' 'గో' యనునాదేశము వచ్చునను వ్యావహారికాంధ్రనియమము చూపఁబడినది. "కన్గోకున్కి" (పాండురంగమాహాత్మ్యము) ఇట్టిమఱికొన్ని కవిప్రయోగములును గలవు.

4-వ యుదాహరణమున నచ్చులశక్తివలనఁ బార్శ్వస్థములగు నచ్చులు మార్పునొందునను వ్యావహారికాంధ్రనియమము చూపఁబడినది. దీని నాంగ్లభాషలో 'వవల్ హార్మనీ' (Vowel harmony)

యనియందురు. శబ్దరత్నాకరమున నుదాహరింపఁబడిన నడుచు, పలుచు, తలుచు మొదలగు ననేకపదములం దీనియమము కనుపట్టుచున్నది.

5, 6, 7, 8 సంఖ్యలుగల యుదాహరణములందు ముత్తు పదమగునప్పుడును నాగమచకారమునకుఁ బకారము రాకపోనచ్చునను వ్యావహారికాంధ్రనియమము చూపఁబడినది.

"క. మించి మదించినరిపుల స్రుధించక ... ... ..." యని యిట్లు కేతనాదులును బ్రయోగించియున్నారు.

9, 10 సంఖ్యలయుదాహరణములందు వ్యవహారస్థమగు స్త్రీవాచకాకారసంధి చూపఁబడినది. "నెలతిచ్చె" మొదలగు కవిప్రయోగములును గలవు. "అమ్మేది" మొదలగువాడుకలును గలవు.

11-వ యుదాహరణమున వ్యవహారస్థమగు తత్సమేకారసంధి చూపఁబడినది. "లక్ష్మేది" యను మొదలగువాడుకలు గలవు.

పయినుదాహరించిన రామరాజభూషణుని ప్రయోగము లన్నియు సచ్చుతప్పులనుటకు వీలుపడదు. అయ్యవి యనుకశ్లేషప్రాసాదులచే నిబద్ధములై మార్పరానివై యున్నవి. మఱియు మనవా రనేకస్థలముల దిద్దివేసినను నింక ననేకములగు వ్యావహారికాంధ్రభాషాప్రయోగములు గలవు గాని యవి పైవానివలెఁ గాక మార్చుటకు వీలుపడియుండుటచే నుదాహరింపలేదు. ఇవియన్నియుఁ బ్రామాదికములనుట సరికాదుగదా? రామరాజభూషణునివంటి మహాకవి యివి లక్షణవిరుద్ధములని యెఱుఁగకుండఁడుగదా! కాన నిట్టివ్యవహారస్థములగు రూపము లగ్రామ్యములగుట గ్రాహ్యములేయనియుఁ జ్యుతసంస్కృతులు కావనియు రామరాజభూషణుఁడు తలంచిన ట్లగపడుచున్నది. ఇట గ్రామ్యచ్యుతసంస్కృతిత్వములను విమర్శింతము.

సంస్కృతాలంకారికులు చ్యుతసంస్కృతిత్వమును నొక నిత్యదోషమును గ్రామ్యమను నొకయనిత్యదోషమును జెప్పియున్నారు. వారిమతమునఁ జ్యుతసంస్కారత యనఁగా వ్యాకరణలక్షణశూన్యత, పామరోక్తులు గ్రామ్యములు. చ్యుతసంస్కారత సదా యగ్రాహ్యమగుటచే నిత్యదోషము. గ్రామ్యత పామరోక్తులయందు గ్రాహ్యమెయగుటచే ననిత్యదోషమని వారిసిద్ధాంతము.

ఆంధ్రవైయాకరణులు గ్రామ్యమును నొకదోషమును జెప్పియున్నారు. కేతనయనునతఁడు గ్రామ్యతకు లక్షణము చేయలేదుగాని కొన్నిలక్ష్యముల నిచ్చియున్నాఁడు.

"సీ. పంచాకుమయ్యా తోపించాకుమయ్యా వాటికి దెచ్చుతారు మమ్మా దలంచి;
రేగఁ గొంటూరమ్మ యేదాలు పోదాలు మోసేటివా రాస సేసువారు;
వాడివిరాళితో బాడిగ వోకుమీ యీడేకదా మమ్ము యినుతిసేసె;
పంపేరు తెంపేరు పాడేరు సూసేరు యిందాము కందాము పొందు మిస్తి;
ఆ. మాటుకు దవ్వు వెగడు నషునవె నిషునవె, నాడ నీడ నేడ నచ్చ నిచ్చ;
నేయ గాయ వేయ కూడ్డాడు బొమ్మడు, గద్ద గుద్ద నాగ గ్రామ్య మయ్యె."

(ఆంధ్రభాషాభూషణము)

వీనిలో సంస్కృతాలంకారికులు చెప్పినరీతి గ్రామ్యతాలక్ష్యములును జ్యుతసంస్కారతాలక్ష్యములును నగపడుచుండుటంజేసి చ్యుతసంస్కృతులలో నపభ్రంశములకును బామరోక్తులకును గ్రామ్యతయను నేకదోషమునే కేతన యంగీకరించిన ట్లగపడుచున్నది. ఈయభిప్రాయముననే కాకుబోలు "సంస్కారార్థో నియమోఽనియమా ద్గ్రామ్యం హి య త్త్వపభ్రంశ" యను నాంధ్రశబ్దచింతామణిసూక్తిలో గ్రామ్యతాపభ్రంశతలు పర్యాయములుగఁ జెప్పఁబడియున్నవి. అపభ్రంశములును

బాలాదిపామరవ్యవహారమునసె తఱచుగా సంభవించునుగాన నవియుఁ బామరోక్తులువలెనే గ్రామ్యములె యనుట లెస్సయని యాంధ్రవైయాకరణు లభిప్రాయపడినట్లు తోఁచుచున్నది. కావుననె యథర్వణుఁడు చింతామణిలోని గ్రామ్యతాలక్షణమును స్వరసముగా గ్రహించి స్వపక్షమున నన్వయించియున్నాఁడు.

వ్యవహారవశమున శబ్దార్థముల గ్రామ్యత మార్పునొందుచుండును. ఆలంకారికులు గ్రామ్యములని యుదాహరించిన కట్యాదిశబ్దము లనేకకవులచే గ్రహింపఁబడినవి. భగినీ భగవ త్యాదిశబ్దము లగ్రామ్యములయి యందఱచేతను బ్రయోగింపఁబడుచున్నవి. మఱియుఁ బ్రాచీనకవులు ప్రయోగించిన "విద్వజ్జనుల్ నిన్ను విషయించి నత్తు" (శృంగారనైషధము. ఆ. 6. ప. 110) రను మొదలగు ప్రయోగము లిప్పుడు గ్రామ్యతాస్ఫోరకములై యున్నవి. ఇట్లె భారతాదిగ్రంథములలోఁ బ్రయోగింపఁబడియున్న యీఁక, కుడుచు, మొదలగుపదము లిపు డసభ్యములై యున్నవిగాన మొదట గ్రామ్యములే యయినను సద్వ్యవహారములోనికి వచ్చినయెడల నవి యనింద్యములనియు మొదట నగ్రామ్యములె యయినను సద్వ్యవహారమున నిపుడు నింద్యములైనచో నవి గ్రామ్యములె యనియు గ్రహించునది. కొన్ని గ్రామ్యపదము లర్థవిశేషమున నగ్రామ్యము లగుచుండును.

"నిష్ఠ్యూతోద్గీర్ణవాంతాది గౌణవృత్తివ్యపాశ్రయమ్,
అతిసుందరమన్యత్ర గ్రామ్యకక్ష్యాం విగాహతే." యని దండ్యాచార్యుఁడు చెప్పియున్నాఁడు.

ఆంధ్రభాషయం దపభ్రంశములకును గ్రామ్యత యంగీకరింపఁబడినట్లె సద్వ్యవహారవశమున వానికి ననింద్యతయు నంగీకరింపఁబడిన ట్లగపడుచున్నది. వ్యవహారవశమున నీగ్రామ్యత మాఱుచుండు నను నభిప్రాయమే యథర్వణునకు లేనియెడల

" ప్రతిక్రియ మదాంతత్వం <u>ప్రతీతం తు న గీయతే,</u>
క్వచి దింప్వంతతాం కేచి దూచిరె నహి మే రుచి"

యని యిట్లు వ్యవహారస్థితములగు "చేయడము, జయింపు" మొదలగు లక్షణవిరుద్ధపదముల గ్రామ్యతాగ్రామ్యతలవిషయమునఁ జర్చింపనేల! అందును నట్టిపదములను గూడ నంగీకరింపకుండుటకుఁ "బ్రతీతం తు న గీయతే" యనియేగదా హేతువు చెప్పియున్నాఁడు. ఒకప్పు డవి ప్రసిద్ధముగా వ్యవహరింపఁబడినచో గ్రామ్యములనియేగదా యాతని యభిప్రాయము. కావుననే కేతన గ్రామ్యములని యుదాహరించినవానిలోఁ గొన్ని మహాకవిప్రయోగములలో నగపడుచున్నవి. వానిలోఁ గొన్ని కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణసారసంగ్రహమున నుదాహరించియున్నాఁడు. పైసిద్ధాంతము నంగీకరించియే కావలయును బహుజనపల్లి సీతారామాచార్యులవారును లక్షణవిరుద్ధములేయైనను వ్యవహారస్థితములగు "జెష్ఠ" మొదలగు ననేకములైన యగ్రామ్యాధికపదము లనింద్యగ్రామ్యములుగ నంగీకరించి శబ్దరత్నాకరమున నుదాహరించియున్నారు.

మఱియు నపభ్రంశములన్నియు సదా నింద్యగ్రామ్యములేయైన యెడల సంస్కృతాపభ్రంశములగు ప్రాకృతభాషలోని తద్భవములును సంస్కృతప్రాకృతాపభ్రంశములగు గ్రాంధికాంధ్రములోని తద్భవపదములును నగ్రామ్యములె కావలసియుండును.

కావున నపభ్రంశములును బామరోక్తులును గ్రామ్యములనియు వానిలో సద్వ్యవహారములోనికి వచ్చినవి యనింద్యములు లేక యగ్రామ్యములు ననియు నపభ్రంశేతరములగు లక్షణవిరుద్ధప్రయోగములు చ్యుతసంస్కృతులనియుఁ దేలుచున్నది. కావున నునుక నుదాహరించిన వసుచరిత్రములోని యపశ

భ్రంశము లనింద్యములని యెఱుంగునది. ఇటఁ బయినుదాహరించిన స్వరూపముగల చ్యుతసంస్కృతిప్రయోగములు వసుచరిత్రమునఁ గలవా యనువిషయము విమర్శింపవలసియున్నది.

"ఆత్రేయగోత్రేయుఁడై" యనుచోట (వసు ఆ. 1. ప. 23.) "నాత్రేయగోత్రీయుఁడై" యనియు, "శీతాంశో రమ్యతార్వం బనుక్రియ" న్ననుచోట (వసు. ఆ. 3. ప. 172.) "శీతాంశో రమ్యతార్వణ మ్మనుక్రియ" న్ననియుఁ గవిప్రయుక్తములైనపాఠము లయియుండును గాన నట్టియెడలఁ జ్యుతసంస్కారత గలదని శంకింపఁజనదు.

"సీ. ప్రకటితోన్మేష కీపన్మని కినకరకౌతుకావాప్తి వేగనె ఘటించు;..." (వసు. ఆ. 2. ప. 59.)

అనుచోట వేగనె యనునది గ్రుతప్రకృతికముగా నుండునన్లు వ్యాఖ్యాతచే నర్థముచేయఁబడినది.

"మ. ... ... ... ... ఆ
ధృతరాష్ట్రుం డవినీతిచేసినను సంధింపంగ రాపంచు వే
గ తెగంబాఱ ... ... ..." (భార-ఉద్యో)

కను తిక్కనసోమయాజిప్రయోగముచే నిది కళయనఁ తప్పదు. లేనిచోఁ బయిభారతపద్యమునఁ దదలఘుఁ బ్రాసమంగీకరింపవలసివచ్చును. కావునఁ బయివసుచరిత్రపద్యమునఁ జ్యుతసంస్కారత గలదని చెప్పవలసియున్నది. అట్లయినను నీదోషము వ్యాఖ్యాత తెచ్చిపెట్టినదిగాని కవిదిగాదు. ఈపద్యమునఁ దక్కినమూఁడుచరణములందును "గొబ్బున, నిత్తఱిను, తోన" నని యిట్లుగ నర్థద్వయమునందును శీఘ్రతయే చెప్పినకవి యీ చరణమందు మాత్ర మట్లు చెప్పకుండునా ? కాఁబట్టి యిచ్చట నైతము "వేగను ఘటించు" ననియే కవి ప్రయోగించియుండును. అట్లయిన నిచట దోషములేదు. వ్యాఖ్యాత యిచ్చట "వేగనె యుదయముకాఁగానే" యను నర్థాంతరమును సంపాదించుటకై యిట్లు కవికి లేని దోషమును దచ్చిపెట్టిన ట్లగపడుచున్నది కాఁబట్టి తక్కిన మూఁడుపాదములందువలెనె యిచ్చటను వేగ శబ్దమున కర్థాంతర మనావశ్యకమని యెఱుంగునది.

"సీ.... తే. ...అనలుఁ డర్కజుఁ డసురేశుఁ డబ్ధిరాజు, అనిలుఁ డర్థేశుఁ డలికలోచనుఁడు గొలువ."

అనుచోట విసంధియుండుటచేఁ జ్యుతసంస్కారతగల దనవలసియున్నది. అయినను నిచట "నబ్ధిరాజనని లుఁ"డని యిట్లు సముచ్చయసహితముగాఁ గవి ప్రయోగించియుండునని తోఁచుచున్నది. ఇచ్చట వ్యాఖ్యాత యీరీతినిననరింపక వాక్యాంతముగాని సంధిలేకపోవచ్చునని సమాధానముచెప్పెను అది సరికాదు. భారతిప్రయోగములలో వాక్యాంతపాదాంతములు రెండును నున్నచోటనె విసంధి యగపడుచున్నది.

"వారి పెంపు పరీక్షింపమొ" (వసు. ఆ. 3. ప. 6.)

యనుచో విక్రృతిశబ్దప్రథమకుఁ బరస్థసంస్కృతికపకారమునను నకారము ప్రయోగింపఁబడినది. ఇది ప్రాసస్థలముగాఁ నమ్మలెన్ననుటకు వీలుపడదు. కాఁబట్టి

"న విక్రృతిశబ్దా త్పరత స్సంస్కృతికానాం శివ న్తి గనుపవా"

యను సూత్రముచొప్పున నిచటఁ జ్యుతసంస్కారత గలదనవలసియున్నది. అట్లయినను బయిసూత్రమును వివరించుచు నథర్వణుఁడు

"పరుషావాస్వరూపేణ ప్రథమాంతోపరిస్థితాః, కాకా సంబోధనే చాపి హ్యవ్యయే కర్మధారయే;
అచేతనార్థకే శబ్దే ఇతి శృంగారభూషణే, కేచి దాద్యస్య పౌనస్వార్ధ స్య చప్రాసే యతౌతు వా;
కేచి ద్ద్వయో ర్వికల్పత్వం యతౌ సర్వత్ర కే చ న,"

యని చెప్పియున్నాఁడు గాన నిచట నచేతనార్థకశబ్దపరకమగుటచేతఁగాని ప్రాసస్థల మగుటచేతఁగాని నకారమువచ్చుట నిర్దుష్టమని యెఱుంగునది కావుననె "కం. అది మొదలుగాఁగ...... యిట్లుదపం"

బని తిక్కయజ్వయును "కం. ......ఎవ్వండు నతియించెడువాఁ..." డని శ్రీనాథుఁడును "శా. వీ,ర ల్గోపించిన" నని నాచనసోముఁడును బ్రయోగించియున్నారు.

"పూవుంబోఁడి" (వసు. ఆ. 3. ప. 183.) యనుచోట "బహువ్రీహిని స్త్రీవాచ్యంబగుచో నుపమానంబుమీఁది మేనునకుఁ బోఁడియగు." నను (బాలవ్యా. సమా. 23.) బాలవ్యాకరణ సూత్రము చొప్పునఁ బూర్ణానుస్వారము వచ్చుట కవకాశము లేనందున నిటఁ జ్యుతసంస్కారత గలదని చెప్పవలసియున్నది. కాని యిచ్చటఁ జిన్నయసూరిగారు ప్రమాదపడి శబ్దసృష్టిచేసినారనుట యుక్తము. పోఁడిశబ్దముతోఁ బూవుశబ్దము సమసించునపుడు "సరళే పరుషే చైన సమాసే ను ముతో భవే" త్తను నాథర్వణికసూక్తిచొప్పున నుమాగమము రాఁగాఁ బకారమునకు సరళాదేశమును నకారమునకుఁ బూర్ణానుస్వారమును వచ్చినవని గ్రహింపవలెను. "చిగుఱుంబోఁడి యెఱుంగుదే" (కళాపూర్ణోదయము) యని యిట్లనేకకవిప్రయోగములు గలవు.

"మ. సూరిమై సాదిశిరంబు సాదిమెయి జాత్యశ్వోత్తమాంగంబు గూ
డ రణోర్విన్ రఘునాథశౌరి యసిఁ జెండన్ దివ్యమందారవృ
ష్టి రహిం బ్రాణయుతంబులై గగనవాటిం బర్వగంధర్వకి
న్నరరూపంబులు దాల్చి సారె కవి యానందించుఁ దచ్చౌర్యమున్."

అనుపద్యమునందు గంధర్వులు మనుష్యముఖులనియుఁ గిన్నరు లశ్వముఖులనియుఁ జెప్పఁబడియున్నది.

" బింబోష్ఠం బహు మనుతే తురంగవక్త్ర శ్చుంబంతం ముఖ మిహ కిన్నరం ప్రియాయాః;
శ్లిష్యంతం ముహు రితరోఽపి తం నిజస్త్రీ ముత్తుంగ స్తనభరభంగభీరుమధ్యా" మ్మనుచోట మాఘకవి కిన్నరులు మనుష్యముఖులనియు గంధర్వు లశ్వముఖులనియుఁ జెప్పియున్నాఁడు. రామరాజభూషణుఁ డిచటఁ బ్రమాదపడెనని చెప్పవలసియున్నది.

ఇచట 'గంధర్వకిన్నరరూపంబు' లనుచోఁ గిన్నరగంధర్వరూపంబులని వ్యుత్క్రమాన్వయము గ్రహింపవలెనని వ్యాఖ్యాత చెప్పిన సమాధానము సరియైనదిగాదు. కాని రామరాజభూషణుఁ డిచ్చట మాఘునిరీతి ననుసరింపలేదు.

" కిమనేన గృహీతే నాగృహీతేన వా కిన్నరయుగళేన ...... కస్మాచ్చ మయా నిష్ప్రయోజన మిద మనుసృత మశ్వముఖద్వయ " మ్మను (కాదంబరి) బాణభట్టరీతి ననుసరించి చెప్పియున్నాఁడు. గాన నిచట నట్టిలోపము లేదు.

"చిగురుఁగొమ్మం జేవ గాకుండునే" (వసు. ఆ. 3. ప. 173)

యనుచోటఁ గొమ్మయు ననుదానికిఁ బర్యాయముగాఁ గొమ్మ నని ప్రయోగింపఁబడెను. కాన నీప్రయోగము దుష్టమని కొందఱయభిప్రాయము కాని సముచ్చయార్థక యువర్ణ మొకప్పుడు లోపింపవచ్చును. "వాలిం గెలియు వాయుపుత్త్రుసరియే" యని నిర్వచనోత్తరరామాయణమునందును "ముంగారిం జేరలేఁ డిమ్మెయి" నని యుత్తరహరివంశమునందును నింక నిట్లె యనేకగ్రంథములయందును బ్రయోగములు గలవు. మఱియుఁ జేవ యను పదమునకుఁ జేవగలదియని యర్థము. "చిగురుఁగొమ్మైనఁ జేవ" యని మనుచరిత్రమునఁ బెద్దన ప్రయోగించియున్నాఁడు. " చ. సొలసి తటిల్లతాంగి జిగినూపువెలుంగులచేఁ గలధ్వను" లనుపద్యమున " వెలుంగులచేఁ గలధ్వను " లనుచోట నొకయర్థమున సార్థానుస్వారముగను, మఱియొకయర్థమున నిరనుస్వారముగను ఘటింపఁబడెను. అట్లయినను "శ్లేషే సఖండనిర్బింద్వో ర్మ్రేళనం కుత్ర చిన్మత" మ్మను నథర్వణసూక్తిచొప్పున నయ్యది దోషముకానేరదు. అర్థద్వయఘటనావిషయమున సఖండ నిర్బిందు శబ్దసాంకర్యమును రేఫ శకటరేఫ మైత్త్రియు దుష్టములు కానేరవు.

"కం. విని యతనిం దనపై నిడుకొని యేఁగినియమికిఁ పగని ఘోరాత్రి..." (రాఘవపాండవీయము)
"సీ. ...కానలోఁ దారుమృగంబులకై వడి గైకొని యసమాస్త్రకర్మకలన;..." (రాఘవపాండవీయము)
అనియిట్టిప్రయోగములు గలవు.

"పృథ్వీ. సుపర్వగణికామణిస్ఫురణతో సుధారవ్యాపాత్ర" యనుచోఁ దొమ్మిదవయక్షరమున విశ్రమము నిల్పియున్నాఁడు. అప్పకవి పృథ్వీవృత్తమునకుఁ బండ్రెండవయక్షరము యతిస్థానమనిచెప్పి యున్నాఁడు. అట్లయినను యతి శ్రుతిసుఖమునకై కల్పింపఁబడిన దగుటచే నీవృత్తమునకుఁ దొమ్మిదవ చోటనే యతి శ్రుతిహితముగానుండునని ప్రబంధకవు లిట్లుమార్చిన ట్లగపడుచున్నది. ఈవృత్తమునకుఁ దొమ్మిదవయక్షరమె సంస్కృతశ్లోకములందు విశ్రమస్థలముగదా!

పృథ్వీ. సదాహంకి నాత్మఁ గొంకక యెదిర్చిరాఁగా ని దోఁగదా......" యని యిట్లు వసుచరిత్రమునఁ దొమ్మిదవస్థానముననె యతి నిల్పఁబడెను.

"శా. రోలంబాలక యోర్తు గ్రుంచి బిసవల్లు ల్దున్మితూఁటూడి సెం, గేలం బట్టి......" (వసు) యనుపద్యమున రేఫలకారములకు యతి ప్రయోగింపఁబడినది. అప్పకవి దీని నప్రశస్తయతులలోఁ బరిగణించుచు నీపద్యముయొక్క రెండవచరణముమొదటిభాగమున "లోలంబాలక" యని కవిప్రయోగించియుండునని సవరించెను. (అప్పకవీయము. ఆ. 3. ప. 277) పయిపాఠద్వయమునందును 'రోలంబాలక' యనుపాఠమె సరసముగనున్నదని వేఱఁ జెప్ప నక్కఱలేదుగదా! అప్పకవి యిట్లు స్వరసములు కాని ప్రయోగములను దిద్దుటలోఁ గంకణము కట్టుకొనియున్నాఁడని యాతండు సెప్పిన యీక్రింది పద్యమె నొక్కి చెప్పఁగలదు.

"ఉ. నన్నయముఖ్యసత్కవిజనంబుల కావ్యములందు లేఖకుల్
గొన్నియెుఁ బాఠకాధములు గొన్నియుఁ జొకడఁ బెట్టి తక్కసై
యున్నెడఁ గాంచి జానపదు లోడక దిద్దిన తప్పత్రోవ లె
ల్లన్నిజ మంచుఁ గైకొనిన లక్షణవేత్తలు సన్నుతింతురే." (అప్పకవీయము. ఆ. 3. ప. 201)

ఈదుష్టనుగు నలవాటు నేటికిఁ గ్రమక్రమముగాఁ బలపడినవి. వసుచరిత్రవ్యాఖ్యాతలు నీమార్గమునే యవలంబించి "లోలంబాలక" యనియే సవరించిరి. కాని రామరాజభూషణునకు 'రల' యతి యిష్టమయియున్న ట్లగపడుచున్నది. కావుననె

"సీ. ...........రాయంచకాళ్లఁ గొలకయున్న" (వసు. ఆ. 4. ప. 25)

యని వేఱొకచోటనుసయితము ప్రయోగించినాఁడు. వ్యాఖ్యాత లీపట్టునను నప్పకవిగారివేదవాక్యమునే యనుసరించి "కలహంస కాళ్ల చివులకమున్న" యనిసవరించిరి. అహోబలపతి కవిశిరోభూషణమునందు "రాయంచ" యనుపాఠమునే యుదాహరించియున్నాఁడు. "ఏతేన 'రాయంచ కాళ్లఁదొలకయమున్న' ఇత్యాదికవిప్రయోగాణాం నకించిద ప్యసామంజస్య మితిధ్యేయ"మ్మని యున్నది(138పేజీలో)

"మ. ... ... ... ... ... భా
రమునన్ బుచ్చుచు నర్థమానవిరహగ్లానిన్ మదిం గుందుచున్." (శకుంతలాపరిణయము)

అని పిల్లలమఱ్ఱిపినవీరభద్రుఁడు ప్రయోగించియున్నాఁడు. గ్రంథవిస్తరభీతిచే విరమించితిని గాని యిట్టిప్రయోగము లనేకములుగలవు. యతిప్రాసలనిర్బంధము సడలించుకొనుచు మహాకవులు కొంతవఱకు స్వేచ్ఛను దీసికొని యుండఁగా నట్టిలక్ష్యములె మూలాధారముగా గ్రహింపవలసిన లక్షణకర్తల కవి స్వేచ్ఛానుసారముగా సవరించుటలో నేమియధికారమున్నదో తెలియకున్నది. దుష్టమగు నిట్టియలవాటు వ్యాపించుటచేతనే నిజమయిన కవిప్రయోగములు మృగ్యములగుచున్నవి.

# ఎనిమిదవభాగము.

## తిరుమల దేవరాయలు - బట్టుమూర్తి.

"విద్యారణ్యులు చేసిన మహత్కార్యములలో విద్యానగరమను మారుపేరుగల విజయనగరమును గట్టించుట యొక సుప్రసిద్ధమైన చరిత్రాంశమై యున్నది. దీనినిగురించి యనేకు లనేకగాథలను జెప్పెదరు. హరిహరబుక్కరాయలు రాజ్యముచేయుచుండఁగా వా రొకనాఁడు వేఁటకై తుంగభద్రానదికి దక్షిణపుటొడ్డుననున్న యరణ్యమునకుఁ బోయిరఁట. అప్పుడు వేఁటకుక్కలు కుందేళ్లకు జంకి పారిపోవుట చూచిరఁట. ఆసమాచారము వారు విద్యారణ్యమునీశ్వరులకుఁ దెలుపఁగా నచ్చోటఁ బట్టణము గట్టిన నది జయప్రదమగునని చెప్పి వారు నూతనగరము నిర్మించునట్లు చేసిరి. ఈపట్టణము క్రీస్తుశకము 1336 కు సరియైన శాలివాహనశకము 1258 ధాతృసంవత్సర వైశాఖశుద్ధ పంచమినాఁడు నిర్మింపఁబడియె. పట్టణనిర్మాణమునకై కనిపెట్టఁబడిన యాస్థలమునుబట్టియే విద్యారణ్యుల బుద్ధివైభవము వెల్లడియగుచున్నది.

"రామాయణీయకాలములోఁ గిష్కింధయనఁబడు పర్వతప్రదేశమునందుఁ దుంగభద్రానది దక్షిణతీరమున నీపట్టణము కట్టఁబడినది. ఆప్రదేశమునందుఁ దుంగభద్రానది రామాయణములో వర్ణింపఁబడిన యంజనపర్వతము, మాల్యవంతము, మతంగపర్వతము, ఋశ్యమూకము, అనఁబడు పర్వతముల నంటుకొని ప్రవహించుచుండెను. ప్రస్తుత మీప్రదేశమును హంపీవిరూపాక్ష మనియెదరు. ఈపట్టణమునకుఁ బూర్వపశ్చిమప్రదేశములయందుఁ గ్రాణశిలాపర్వతపంక్తులును, దక్షిణమందు రామదుర్గమను గుట్టలును, ఉత్తరమునఁ గొన్నిపర్వతమాలికలును, దుంగభద్రానదియు నుండుటవలన నాపట్టణము నైసర్గికపర్వతదుర్గముగా నుండె" నని యిట్లు కె. వి లక్ష్మణరావుగారు హిందూదేశకథాసంగ్రహమున (మహమ్మదీయమహాయుగము. 299 పుట) వ్రాసియున్నారు. కాని విజయనగరము రామాయణకాలమునఁ గిష్కింధయను స్థలమునఁ గట్టఁబడినదను నిరాధారవిషయమును నిస్సందేహముగాఁ జెప్పుట సాహసమని తోఁచుచున్నది. పై నుదాహరించిన విద్యానగరనిర్మాణవిషయకమగు చరిత్రమునకీ క్రిందియాధార మగపడుచున్నది.

"అస్యాంబురాశేః కులతంతు రిందుః ... ... ... ...
హరిహరరాయకంపధరణీపతిబుక్కమహీపరివృఢమారభూరమణముఖ్యనృపాః ఖలు తే,
అనఘగుణేషు తేషు ననఖుంపమహీశ్వరతా మభజత పూర్వజ స్సతు యుధిష్ఠిరవ న్మహసా. 18
... ... ... ... ... ... 19
కదా చి దుత్తీర్య స తుంగభద్రాం క్షమాధిపాలో మృగయాభిలాషాత్,
ఆసాద్య సైన్యైస్సహ తీర మస్యా స్తద్దక్షిణం కానన మీక్షతోఽస్య. 20
తస్మి న్వనే కం చన సారమేయసందంశనైకాగ్రరతాగ్ర ముగ్రమ్,
ససంగ మాసక్తశశం శశించ విసిస్మయే వీక్ష్య దిశా మధీశః. 21
క్షోణీపాలో హరిహర ఇతి శ్రీవిరూపాక్షదేవం
పంపాదేవీ సహచర మముం వీక్ష్య భక్త్యా ప్ర నమ్రః,

సన్మూర్తిం తం మహితతపసం తస్య దేవాలయాంతే
విద్యారణ్యం యతి మభజత శ్రీమహేశాన మన్యమ్. 22
ప్రణామ్య తస్యాంతికసీమ్ని భక్త్యా తపోనిధిం జ్ఞానకళానిధానమ్,
వృత్తాంత మత్యద్భుతహేతు మేనం విజ్ఞాపయామాస విశేషసంధ్యమ్. 23
త్రికాలవిజ్ఞాననిధి ర్యతీంద్రో విహస్య కించి త్త మువాచ వీరమ్,
రాజన్ మహారాజకులానికార్యా నీమేయ మత్యంతబలైకమూలా. 24
విద్యాభిధానా మలకానవద్యాం ఇరావనం నామపురీం విదధ్యాః,
... . ... ... ... ...
... ... ... భవా నితి త్మాపతి మాదిదేశ. 26
తథా హరిహరేశ్వర స్సవిరచయ్య తచ్ఛాసనం నృపాసన ముపాస్థితో చ్ఛ్రితసితాతపత్రోజ్జ్వలః,
విధాయ ఖలు షోడశప్రతినిధీని దానా న్యహో వ్యరాజత విశాలసీమ్ని నగరే హి విద్యాభిధే.
అష్టపంచయుగశైకసంఖ్యయా ... ... (శాలివాహనశకము. 1258)
సంయుతే నృపశకస్య వత్సరే... ... ... (క్రీస్తుశకము 1336) 28
పట్టాభిషేకోత్సవతః పరస్తాత్ పంపావిరూపాక్షమహేశ్వరస్య,
సత్సన్నిధౌ సత్యపరాక్రమ స్త చక్రే మహాన్ భూపతి రగ్రహారమ్.
శంకరకేశవభట్టస్య సూనవే౽నంతసూరిణే, కావలూరుం మహాగ్రామం......
హరిహరమహారాయో... ... ... ...
సహిరణ్యపయోధారాపూర్వకం దత్తవాన్ ముదా" యని యున్నది.

(నెల్లూరుజిల్లా దానశాసనములమొదటిభాగము 109 వ పుట).

ఈశాసనములోని నందినాగర్యక్షరము లాకాలమునాఁటివిగాక మిక్కిలినవీనము లగుటనుబట్టి చూడఁగా నిది కల్పితమయినట్లు లగుపడుచున్నదని యీశాసనపీఠికలో ఎ. బట్టర్వర్తుదొరగారు వ్రాసియున్నారు. కానఁ బైచరిత్రవిషయ మెంతవఱకు నమ్మఁదగినదో చదువరులే గ్రహింతురుగాక.

"బళ్లారిజిల్లాయందు హాసుపేటకు నిరువదిమైళ్లదూరమున నిప్పటికిని విజయనగరజీర్ణప్రాకారములు కనుపించుచు దానిమహోన్నతస్థితిని బ్రకటించుచున్న"నని యూసఫ్ఖానునికథలో సరస్వతి పత్రికలో వ్రాయఁబడియున్నది.

ఈవిజయనగరరాజ్యమీహరిహరరాయలవంశమువారిచేఁ గొంతకాలము పాలింపఁబడి తుదకుఁ బదునేనవశతాబ్దాంతిమున వీరిసామంతరాజగు సాళువనరసరాజుపాలనములోనికి వచ్చునట్లు సాళువనరసరాజు కుమారుఁడగు నిమ్మడినరసింహరాజుయొక్క దేవులపల్లిశాసనమువలన స్పష్టపడుచున్నది.

"గుణాంబుధే ర్గుండవిభో స్తతో౽భూత్ స్మల్లాంబికాయాం మహనీయకీర్తిః,
నృసింహరాయో౽య మహోబలశ్రీనృసింహదేవస్య వరప్రసాదాత్.
మీసరగండకఠారీ సాళువధరణీవరాహబిరుదాంకః,
ఖడ్గైకసహాయ స్సర్వా న్నిర్జిత్య సార్వభౌమో౽భూత్. 13
ఆసీ ద్ధరావరాహో యః ఖలాబ్ధే రుద్ధరన్ ధరామ్,
సాళువ శ్శత్రుసంఘాతపక్షిఘాతం నిహత్య చ. 14

...... మూరురాయరగండో౽భూత్ ... ... ... ... 18

...... నృసింహరాయస్య తనయో వినయోజ్జ్వలః, ఇమ్మడిశ్రీనృసింహేంద్రః ...... 24

.........శాకేబ్దే పరిసంఖ్యాతే గిరినేత్రయుగేందుభిః. (శా.1427) (క్రీ. 1505.)

గ్రామం దేవులపల్లాఖ్యం ............ సహిరణ్యపయోధారాపూర్వకం దత్తవాన్ ధ్రువ" మ్మనియున్నది. (ఎపిగ్రాఫియాయిండికా. 7 వ వాల్యూము 74 వ పుట)

పిదప నీవిజయనగరసామ్రాజ్యము తుళువవంశమువారి యధీనమైనది. ఈతుళువవంశమువారిలోఁ దుళువనరసరాజుకుమారుఁడు వీరనరసింహరాయలు సింహాసనము నెక్కిన ట్లచ్యుతదేవరాయల పోడిపల్లి శాసనమువల్ల విశదమగుచున్నది.

"ఖ్యాత స్తస్య తు దుర్వసు ర్వసునిధిః శ్రీదేవకీనందనః. ...... 5

తద్వంశే దేవకీజాని ర్దిదీపే తిమ్మభూపతిః; యశస్వీ తుళువేంద్రేషు ...... 6

... ... నరసావనిపాలకః...... 8

... ... ... ... ...

చేరం చోళం చ పాండ్యం తి మపి చ మధురావల్లభం మానభూషం,

వీరోద్యద్గ్రం తురుష్కం గజపతినృపతిం చాపి జిత్వా తదన్యాన్

ఖ్యాతః క్షోణీపతీనాం స్రజ మివ శిరసాం శాసనం యో వ్యతానీత్. 11

... ... నృసింహేంద్రాత్... ...జాతౌ వీరనృసింహేంద్ర కృష్ణరాయమహీపతీ. 13

వీర శ్రీనారసింహ స్స్వవిజయనగరే రత్నసింహాసనస్థః..." 14

యని యిట్లు వీరనరసింహరాయలకే సింహాసనారోహణము చెప్పఁబడెను. (నెల్లూరుజిల్లా దానశాసనముల మొకటవభాగము 69వ పుట.)

పై శాసనములం బట్టి చూడఁగాఁ దుళువనరసరాజు సాళువనరసరాజుకుమారుఁడగు నిమ్మడినరసింహరాజును సింహాసనమునుంచి తానే రాజ్యమును పాలించుచుండెనని తోఁచుచున్నది.

హరిహరరాయలవంశమునుండి సాళువవంశమునకు దానినుండి తుళువవంశమునకును, విజయనగరసామ్రాజ్య మేరీతిని సంక్రమించెనో? యాయావంశములవారికిఁ గల సంబంధము లెట్టివో? రూఢిగాఁ జెప్పుటకుఁ దగినయాధారము లగపడవు.

సాళువనరసరాజు తనప్రభువును హరిహరవంశీయుఁడును నగు విరూపాక్షరాయలను జాఱఁ ద్రోలియుఁ దుళువనరసరాజు తనప్రభువైన సాళువనరసరాజుకుమారుని జంపియు రాజ్య మాక్రమించుకొనినట్లు కె. వి. లక్ష్మణరావుగారును, జిలుకూరి వీరభద్రరావుగారును వ్రాసియున్నారు. వెనుక నుదాహరించిన దేవులపల్లిశాసనమును బట్టి సాళువనరసరాజుకుమారుఁ డిమ్మడిరాజు సింహాసనస్థుఁడయి క్రీస్తుశకము 1505 వ సంవత్సరమునఁ బయిగాఁ దుళువనరసింహరాజుకుమారుఁడగు వీరనరసింహరాయల కాలమునందును జీవించియున్న ట్లగపడుచుండఁగాఁ దత్పూర్వమే గతించిన తుళువనరసరా జెవరిని జంపెనో తెలియకున్నది.

మఱియు వీరు తుళువవంశము సాళువవంశాంతర్గతమే యనియు సాళువనరసరాజు సోదరుఁడగు తిమ్మరాజే వీరికి మూలపురుషుఁడనియు వ్రాసిరిగాని యందుకుఁ దగిన యాధారము లగపడవు. తుళువనరసరాజునకుఁ దిమ్మరాజను నొకసోదరుఁ డున్నట్లు వరాహపురాణమునందును, జైమినిభారతమునందును నున్నదిగాని యాతిమ్మరాజే తుళువనరసరాజు పితామహుఁడగు తిమ్మరాజని యెవ్వరును జెప్పియుండ

లేదు. మనుచరిత్రాదులందు వీరివంశమును వర్ణించుటలోఁ జంద్రుని మొదలుపెట్టి యయాతివఱకును వర్ణించి యాయయాతిపుత్త్రులు యదుతుర్వసులనియు నందుఁ దుర్వసునివంశము తుళువవంశ మయ్యెననియుఁ జెప్పి యాతుళువవంశమున నీతిమ్మరాజును మొదలుపెట్టియె వర్ణించిరిగాని యాతిమ్మరాజు తండ్రి పేరు చెప్పరైరి. పైనుదాహరించిన పోడిపల్లిశాసనమునందును నిట్లే వర్ణింపఁబడియున్నది.

కాఁబట్టి హిందూదేశకథాసంగ్రహమునందును జీర్ణకర్ణాటరాజ్యచరిత్రమునందును వ్రాయఁబడిన కొన్నియంశములు సమూలములు కావనియు నూహలును జనశ్రుతులును వీరిచేఁ బ్రమాణములుగాఁ గైకొనఁబడినవనియు ననుకొనవలసియున్నది.

తుళువనరసరాజుకుమారుఁడగు వీరనరసింహరాయల యనంతరమున నతనితమ్ముఁడగు కృష్ణదేవరాయలు సింహాసనము నెక్కెను.

ఈతఁడు విజయనగరసామ్రాజ్యమును సంపూర్ణాభివృద్ధినొందించి మహమ్మదీయులచే నాక్రమింపఁబడిన యనేకస్థలములను జయించి జన్మమధ్యమున నొకమాఱును బరాజయమన్నది యెఱుఁగక కృష్ణానదిమొదలు కన్యాకుమార్యగ్రమువఱకు నేకాతపత్త్రముగ నేలి యశ్వపతి గజపతి నరపతులను వశపఱచుకొని యాంధ్రభాషాపోషకుఁడయి పాండిత్యమునను బండితాదరమునను నాంధ్రభోజుఁడనఁ బ్రసిద్ధికెక్కెను. ఈతఁడు పారిజాతాపహరణమనుచరిత్రాదిమహాప్రబంధముల కృతిపతియగు రసికశిఖామణి.

ఆముక్తమాల్యద యీతనిచే రచింపఁబడినట్లే యందు వ్రాయఁబడియున్నదిగాని యది మనుచరిత్రకారుఁడగు నల్లసానిపెద్దనార్యునిచే రచింపఁబడినదని పండితులు చెప్పుదురు. గ్రంథరచనయుఁ బెద్దనార్యునిరచన ననుసరించియేయున్నది. మనుచరిత్రములోని పద్యములే కొన్ని యాముక్తమాల్యదయం దగపడుచున్నవి. ఆంధ్రశబ్దచింతామణి వ్యాఖ్యయగు కవిశిరోభూషణమున నహోబలపతి, "ఏతత్సూత్ర మనుస్యూ త్తైవ్యహాల్లసానిపెద్దనకవినా ఆముక్తమాల్యదాయామ్" "అద్ధావాగ్విబుధ మ్మహో వచనకవ్యాహారమిత్యాదిపద్యే" యని వ్రాసియున్నాఁడు.

కృష్ణరాయలయనంతరమున నతని సవతితల్లి కుమారుఁడగు నచ్యుతదేవరాయలును నతనియనంతరమునఁ దత్పుత్త్రుఁడగు వేంకటదేవరాయలును నతనికిఁ బిదప నచ్యుతదేవరాయల సోదరుఁడగు శ్రీరంగరాయలకుమారుఁడు సదాశివరాయలును రాజ్యాధీశులయిరి.

క. వి. లక్ష్మణరావుగారు సదాశివరాయ లచ్యుతదేవరాయల తమ్ముఁడని వ్రాసియున్నారు. "కృష్ణదేవరాయలతమ్ముఁడగు సదాశివరాయలను ........... ఈసదాశివరాయలును నింతకుఁబూర్వ రాజయిన అచ్యుతరాయలును, నరసరాజున కోబాంబవలనఁ గలిగినపుత్త్రు" లని యిట్లు హిందూదేశకథాసంగ్రహమున (392 పుట) వ్రాసియున్నారు. ఈవిషయము శాసనములకు విరుద్ధముగానున్నది.

"తిప్పాజీ నాగలాదేవ్యోః కౌసల్యా శ్రీసుమిత్రయోః,
దేవ్యో రివ నృసింహేంద్రా త్తస్మా త్పం క్తిరథా దివ. 12
వీరౌ వినయినౌ రామలక్ష్మణా వివ నందనౌ,
జాతౌ వీరనృసింహేంద్రకృష్ణరాయమహీపతీ. 13
రంగక్షితీంద్రాచ్యుతదేవరాయౌ రక్షాధురీణా విహ రామకృష్ణౌ,
ఓబాంబికాయాం నరసక్షితీంద్రా దుభా వభూతాం మహేంద్రశౌర్యౌ." 14

యని యిట్లు సదాశివరాయల కృష్ణాపురపుశాసనమందును (ఎపిగ్రాఫియా యిండికా 9 వ పుస్తకమున 332 వ పుట) బ్రిటిష్‌మ్యూజియమ్ ప్లేటులందును (ఎపిగ్రాఫియా యిండికా 4 వ పుస్తకమున 1 వ పుట.) నున్న సదాశివరాయల మఱియొకశాసనమందును నచ్యుతరాయలకు సదాశివరాయలతండ్రి రంగరాయలు సోదరుఁడని స్పష్టముగాఁ జెప్పఁబడియున్నది.

అచ్యుతదేవరాయలయనంతరమున నాతనిపుత్త్రుఁడగు వేంకటరాయలు బాలుఁడయి యుండుటచే నాతనిమేనమామయగు సలకముతిమ్మయ యాబాలరాజును రాజ్యాధిపతిగాఁ జేయ యత్నించుచుండఁగా సదాశివరాయలను రాజ్యాధిపతిగఁ జేయుటకుఁ గృష్ణదేవరాయలయల్లుఁడగు నళియరామరాయలు యత్నించి విఫలమనోరథుఁడయ్యెననియు సలకముతిమ్మయ యాబాలు రాజ్యాధీశునిజేసి తుద కాబాలుని జంపి తానే రాజయ్యెననియుఁ బిదప నళియరామరాజు కొందఱు సరదారులను వశపఱచుకొని సలకము తిమ్మయను వధించి సదాశివరాయలను రాజుగాఁ జేసెననియు శ్రీలక్ష్మణరావుగారును వీరభద్రరావుగారును వ్రాసియున్నారు గాని పై విషయములకుఁ జరిత్రకారులయూహలుతప్పఁ దగినయాధారము లున్నట్లు కనఁబడలేదు. పై వానిలోఁ గొన్నివిషయములు శాసనములకు విరుద్ధము లయియున్నవి.

"క్షితిప్రతిష్ఠాపితకీర్తిదేహే ప్రాప్తే పదం వైష్ణవ మచ్యుతేంద్రే,
అధ్యాస్య భద్రాసన మస్య సూను ర్వీరో బభౌ వేంకటదేవరాయః. 27
ప్రశాస్య రాజ్యం ప్రసవాస్త్రరూపే విద్వన్నిధౌ వేంకటరాయభూపే,
అభాగధేయా దచిరాం త్ప్రజానామ్ ఆఖండలావాస మథాధిరూఢే." 28

యను సదాశివరాయలశాసనములోని ( ఎపిగ్రాఫియా ఇండికా 4 వ పుస్తకము 1 వ పుట ; 9 వ పుస్తకము 332 వ పుట) "విద్వన్నిధౌ; రాజ్యం ప్రశాస్య; ప్రజానా మభాగధేయాత్ వీరో" యను పదములను బట్టి చూడఁగా నితఁడు కేవలము బాలుఁడనిగాని బలవంతముగాఁ జంపఁబడెననిగాని చెప్పుటకు వీలుపడదు. స్వల్పకాలము రాజ్యముచేసి దైవవశమునఁ జనిపోయినట్లగపడుచున్నది.

అచ్యుతరాయలకాలమునందే సదాశివరాయలను రాజుగా లేవనెత్తుట కళియరామరాజు ప్రయత్నించినట్లును, నచ్యుతరాయలకాలమునందును సదాశివరాయల దానశాసనము లున్నట్లును 1912-వ సంవత్సరపు 919-వ నెంబ రెపిగ్రాఫిస్టురిపోర్టు (81 వ పుట) లో వ్రాసిరి. ఇట్లే సదాశివరాయ లచ్యుతరాయలకాలమునుండి తిరుమలరాయలకుమారుఁడగు పిన్నవేంకటపతిరాయలకాలమువఱకును నుండెనని 1908 వ సంవత్సరపు 574 వ నెంబరు రిపోర్టులో వ్రాసిరి.

అచ్యుతరాయలకుమారుఁడగు వేంకటరాయలయనంతరమున నతనిమేనమామయగు సలకముతిమ్మయ యంతకుముందుఁ బ్రబలుఁడై యుండుటచేత నళియరామరాజు చేయునట్టి సదాశివరాయలపట్టాభిషేకమునకుఁ బ్రతిఘటించి రాజ్యము నాక్రమించుకొనినట్లును, బిదప రామరాజు పెనుగొండకుఁ బోయి కొందఱురాజులను వశపఱచుకొని సలకముతిమ్మయను వధించి సదాశివరాయలకుఁ బట్టాభిషేకము చేసి కర్ణాటరాజ్యస్థాపకుఁడని బిరుదుగాంచినట్లును నీక్రిందియాధారములు సూచించుచున్నవి.

"ప్రశాస్య రాజ్యం ప్రసవాస్త్రరూపే విద్వన్నిధౌ వేంకటరాయభూపే,
అభాగధేయా దచిరా త్ప్రజానా మాఖండలావాస మథాధిరూఢే. 28
తిమ్మాంబావరగర్భమౌక్తికమణీ రంగక్షితీంద్రాత్మజః
క్షత్త్రాలంకరణేన పాలితమహాకర్ణాటరాజ్యశ్రియా,

శౌర్యౌదార్యదయానతా స్వభగినీభర్త్రా జగత్త్రాయినా
రామక్ష్మాపతినా ప్యమాత్యతిలకైః క్లృప్తాభిషేకక్రమః. 29
శ్రీవిద్యానగరీలలామని మహాసామ్రాజ్యసింహాసనే
... ... ... ... ...
సర్వాం పాలయతే సదాశివమహారాయ శ్చిరాయక్షమాం'' 30

అని యిట్లు వ్రాయఁబడియున్నది. (ఎపిగ్రాఫియా యిండికా. 9-వ పుస్తకము. 334-వ పుట.)

"ఉ. ఆపటుకీర్తి రామవసుధాధిపచంద్రుఁడు కృష్ణరాయధా
త్రీపతి సార్వభౌమదుహితృప్రియుఁడై వితతప్రతాపసం
తాపితశత్రుఁడై యలసదాశివరాయనిరంతరాయవి
ద్యాపురరాజ్యలక్ష్మికి నిదానము తా నయి మించె నంతయున్." (రామాభ్యుదయము.)

"సీ. పట్టాభిషేకవిపర్యయంబునఁ బ్రోలు వెడలి ప్రియానుజు ల్వెంటఁ గొలువఁ
జిత్రకూటాభిఖ్యఁ జెలఁగు పెన్గొండ సాంద్రహరిద్విషేంద్రనా వననిఁ జెంది
ఖలజనస్థానవాసులఁ బల్వురఁ వధించి మహిమసలకఖరస్మయ మడంచి
హరివీరఘటవమహోద్ధతి నబ్ధి కంపింప దుర మునఁ గదిసి తద్దోర్ధ్రోహిఁ దునిమి
తే. యనఘుఁడరపార్థి వేందిర నధిగమించి, సాధుకర్ణాటవిభవసంస్థాపనంబు
పూని శరణాగతుల నెల్లఁ బ్రోచె రాముఁ, డతఁడు నిజచరితంబు రామాయణముగ."
(వసు. ఆ. 1. ప. 44.)

పయినుదాహరించిన సదాశివరాయలశాసనములోని "స్వభగినీభర్త్రా" యనుదానిని రామాభ్యుదయములోని "కృష్ణరాయధాత్రీపతిసార్వభౌమదుహితృప్రియుఁడై" యనుదానిని నరయఁగా, రామరాజు సదాశివరాయలపెదతండ్రికొమారితమగఁడని స్పష్టపడుచున్నది. అళియశబ్దమున కల్లుఁడని యర్థము కావున సామ్రాజ్యమునియల్లుండగు రామరా జళియరామరాజని పిలువఁబడెను. ఈసందర్భము సయితము సదాశివరాయలు కృష్ణరాయలసోదరుఁడను శ్రీలక్ష్మణరావుగారియభిప్రాయమును బ్రతిఘటించుచునె యున్నది.

ఇఁక నలకమునిప్పు డచ్యుతరాయలకు స్యాలుఁడయిన ట్లీక్రిందిశ్లోకము సూచించుచున్నది.

"మహత్తరే మానవలోకమాసితు ర్మనోమహాలా మహిమపదే తదా,
కృతాభిషేకం సలకక్షితీశితు ర్వరాత్మజాని ర్వరదాంబికావధూః."
(అచ్యుతరాయాభ్యుదయము. 3-వ స. 48-వ శ్లో.)

పయినుదాహరించిన సదాశివరాయలశాసనమునుబట్టియు, రామాభ్యుదయవసుచరిత్రములనుబట్టియు నరయఁగా సదాశివరాయలను పేరునకుమాత్రము సింహాసనమున నిలిపి యళియరామరాజే విజయనగరసామ్రాజ్యము నేకాతపత్త్రముగ నేలెనని స్పష్టపడుచున్నది. కావుననే సదాశివదేవరాయలపట్టాభిషేకవిపర్యయాదులు రామరాజువర్ణనమునందును వసుచరిత్రకారుఁ డుపయోగించెను. రామరాజుపరిపాలన మీక్రిందిరీతిని శాసనములలో వర్ణితమయియున్నది.

"యస్మిన్ ప్రశాసతి మహీం జగదేకవీరే భంగో నదీషు పతగేషు చ పక్షపాతః,
పల్లీషు పల్లవరుచి ర్వనితాసు తేషు నీవీవిమోచన మభూ న్నియతం ప్రజానామ్. 90

సత్యానురక్తేరిదరామహేస్మిన్ సంపన్నకే సంభృతిసర్వలోకే,
శ్రీరామరాజే......" యని యున్నది. (ఎపిగ్రాఫియాయిండికా. 9-వ పుస్తకము 338-వ పేజీ.)

మఱియు సదాశివరాయలరాజ్యపాలనవర్ణనమంతియును రామరాజుదే యనుకొనఁ దగియుండును గాన సదాశివరాయలవర్ణనము దిఙ్మాత్ర మిచట నుదాహరించుచున్నాను.

"యు త్సేనాధూళిపాళీ శకమశకసముచ్చాటనే ధూమరేఖాః
రోమాళీ కీర్తివధ్వా ఇవ భువి మిదం సర్వ మంత ర్వహన్త్యా,
వేణీ వాణీయసీవ ప్రకటితవిహృతే ర్వీరలక్ష్మ్యా రణాగ్రే
శాంత్యై జీమూతపంక్తిః కిల సకలఖలస్తోమదావానలానామ్. 34

... ... రాజాధిరాజబిరుదాః ... ... 37

కాంభోజభోజకాళింగకిరహాటాదిపార్థివైః,
సౌవిదల్లపదం ప్రాప్తై స్సంసర్పితస్సపోషధ." యనియున్నది. 42

(ఎపిగ్రాఫియాయిండికా 4-వ పుస్తకము. 1-వ పుట.)

కృష్ణరాయలకుపెనుక నతనికంటెఁ బ్రబలుఁడై యీరామరాజు విజయనగరరాజ్యము నభివృద్ధి చేసెను. రాజాధిరాజగు నీమహాపురుషునిసభ కలంకారభూతుఁడగుటనే భట్టుమూర్తి రామరాజభూషణుఁ డను బిరుదముఁగాంచెను. ఈరామరాయలతమ్ముఁడే వసుచరిత్రకృతిపతియగు తిరుమలదేవరాయలు. ఈసంతతివారిలో ననేకు లనేకకృతుల నందిన రసికశిఖామణులు. అట్టికృతులలో నరపతివిజయమను నామాంతరముగల రామరాజీయమునందు వీరివంశము పూర్తిగా వర్ణింపఁబడెను. ఈరామరాజీయమును బయి నుదాహరించిన యళియరామరాయలమనుమని మనుమఁడగు కోదండరామరాజునకుఁ గృతియిచ్చి యందుగుల వెంకయ్యయను కవివరుఁడు రచించెను.

రామరాజీయకృతిపతియగు కోదండరామరాజునకు నళియరామరాజునకువలెనే తిమ్మరాజు వేంకటపతి యను తమ్ములు గలరు. మఱియు నీతఁ డళియరామరాజువలెనే కృష్ణరాజునకు నల్లుఁడు. ఈసామ్యములచేఁ గావలయు విల్సనుదొరగారును, డాక్టరు రాపర్టుదొరగారును భ్రమపడి నరపతివిజయకృతిపతి యళియ రామరాజని వ్రాసిరి. విజయనగరరాజ్యాధీశుఁ డగుకృష్ణరాయలకూఁతురు తిరుమలాంబ యళియ రామరాజుభార్య. పోచిరాజువంశజుఁడగు వేఱొకకృష్ణరాజుకూఁతురు నాంచారమ్మ నరపతివిజయకృతిపతియగు కోదండరాయలభార్య. ఈవిషయము నరపతివిజయమున స్పష్టపఱుపఁబడియున్నది.

"తే. అనఘుఁడౌ వైరసేని భీమాధిపేంద్రు, పట్టి దమయంతిఁ జేపట్టినట్టిరీతి
రామభూపాలకుఁడు కృష్ణరాయతనయ, యగు తిరుమలాంబ నుద్వాహమయ్యె వేడ్క."
(నరపతివిజయము. 289 ప.)

"శా. కారుణ్యాంబుధి పోచిరాట్కులసుధాకంఠీశుఁ డర్థార్థిమం
దారుం డైన విలసిల్లు కృష్ణమనుజాధ్యక్షేంద్రు సత్పుత్రి నాం
చారిమ్మ న్వరియించె రామధరణీశస్వామి ........." (నరపతివిజయము. 441 ప.)

ఇట్లె నరపతివిజయకృతిపతియగు కోదండరామరాయ లళియరామరాయలవంశజుఁడని యాగ్రంథమున స్పష్టముగాఁ జెప్పఁబడియున్నను రాయబహద్దరు కందుకూరువీరేశలింగముపంతులవారాంధ్ర కవులచరిత్రమునందుఁ దిరుమలదేవరాయని ప్రపౌత్రపుత్త్రుఁడని వ్రాసియున్నారు.

అళియరామరాజె నరపతివిజయకృతిపతియని శ్రీవీరేశలింగముపంతులవారు భ్రమపడిరని కె. వెంకటకృష్ణయ్యగారు నరపతివిజయపీఠికలో వ్రాసియున్నారు. దాని కవులచరిత్రములోని వీరేశలింగముపంతులవారివ్రాఁతలను బరిశీలింపఁగా నట్టియభిప్రాయ మెం దున్నట్లగపడదు.

వసుచరిత్రకృతిపతియగు తిరుమలదేవరాయలుసయితము కృష్ణదేవరాయలయల్లుఁడేయని ఘర్ గా టె నెంపైరునందును, కృష్ణరాయలచరిత్రము వ్రాయుసందర్భమునఁ గవులచరిత్రమందును వ్రాయఁబడి యున్నది. ఇట్లే కె. వి. లక్ష్మణరావుగారుసయితము వ్రాసియున్నారు కాని యీవిషయమునకుఁ దగిన యాధారము లగపడవు. తిరుమలదేవరాయలభార్య వెంగళాంబ చక్రవర్తియగు కృష్ణదేవరాయలకూఁతురే యయియున్నయెడల వసుచరిత్రనరపతివిజయాదులలోఁ జెప్పకుందురా? తిరుమలదేవరాయలయన్నయగు నళియరామరాయలు కృష్ణదేవరాయలయల్లుఁడైయున్నట్లు నరపతివిజయమునందును రామాభ్యుదయమునందును జెప్పఁబడియుండలేదా? వసుచరిత్రమున నళియరామరాయలకుటుంబము వర్ణింపకున్నను దిరుమలదేవరాయలభార్యి నిట్లు కవి వర్ణించియున్నాఁడు.

"తే. ఆవిభునిదేవి శ్రీవేంగళాంబ పుట్టి, నిల్లు మెట్టినయిల్లు నర్థిల్లఁ జేసెఁ
బుట్టినింటికి మధనంబు మెట్టినింటి, కమితిదోపాహతియుఁ గూర్చు కమలఁ దెగడి."
(వసుచరిత్రము. ఆ. 1 ప. 63.)

వసుచరిత్రకృతిప్రదానకాలమునకుఁ గృష్ణదేవరాయలవంశమును విజయనగరరాజ్యమును గొంతవఱకు నంతరించుటయేగాక యావంశమునుండి పరిభ్రష్టమగు రాజ్యము తిరుమలరాయలకు వశపడియుండఁగాఁ గృష్ణదేవరాయలకూఁతురే వేంగళాంబ యయియున్నయెడల నామె నెత్తిపాడిచిన ట్లీరీతిగ రామరాజభూషణుఁడు వర్ణించియుండునా యని యాలోచింపవలసియున్నది.

---

అళియరామరాయతిరుమలదేవరాయాదులతండ్రియగు శ్రీరంగరాజు జీర్ణకర్ణాటరాజ్యపునరుద్ధారి యని కందుకూరివీరేశలింగముపంతులుగారును, జిలుకూరివీరభద్రరావుగారును వ్రాసిరి. వారిననుసరించి పెూచ. కృష్ణశాస్త్రిగారును వ్రాసియున్నారు. దానిని స్థిరపఱచుటకు శ్రీవీరేశలింగముపంతులవారును వీరభద్రరావుగారును రామరాజీయములోని యీక్రిందిపద్యమును దిరుమలదేవరాయలతండ్రియగు శ్రీరంగరాయప్రతాపవర్ణనమని వ్రాసియున్నారు.

"సీ. కడువిజాపురరాజ్యకామినీగర్భముల్ భేదించు నెవ్వని ఖేరఁజము...
తే. జీర్ణకర్ణాటభూపునర్జీవనుండు, దివ్యగుణశాలి శ్రీరంగరాయమౌళి." (నరపతివిజయము. 244. ప.)

ఈపద్యము నరపతివిజయమునఁ దిరుమలదేవరాయలకుమారుఁడగు శ్రీరంగరాయలవర్ణనముగానున్నదిగాని తిరుమలదేవరాయలతండ్రియగు శ్రీరంగరాయలవర్ణనమై యుండలేద. తల్లికోటయుద్ధమునకు ముందుఁ గర్ణాటరాజ్యము జీర్ణింపనేలేదు పునరుద్ధరణమేల?

ఇట్లే వసుచరిత్రము కృష్ణదేవరాయలకే కృతియీయఁబడెనదని కొందఱును గృష్ణదేవరాయలు మృతినొందిన తనపూర్వులపిండములపై ధారపోయించెనని మఱికొందఱును వసుచరిత్రమును జూచి పిదప నంతికంటెఁ బ్రౌఢముగ రచింపఁగోరి యాముక్తమాల్యద రచింపఁబడెనని మఱికొందఱును నిట్లనేకవిధములుగఁ జరిత్రవిషయకజ్ఞానములేక చెప్పకొనుటయుఁ గలదు. కృష్ణదేవరాయలవెనుక నంతకంటె నధికుఁ డనఁదగిన నళియరామరాజుపేరైనను నిష్పటిశాసనాదికము బయలుపడకముందు మన యాంధ్రలోక మెఱుఁగదని చెప్పవచ్చును. ఇట్లెఱుగకుండుట యొకవింతగాదు. ప్రసిద్ధకావ్యములను

గృతినందిన ప్రభువులును గవులగాథలతో సంబంధించిన ప్రభువులును మాత్రమేగదా యాంధ్రలోకమునఁ జేరుగలిగియున్నారు. రాజరాజనరేంద్రునికంటె నాతనిపుత్త్రుఁడగు కులోత్తుంగచోళుఁడు గొప్పచక్రవర్తియైనను నతనిపే రాంధ్రలోకము మఱచిపోలేదా? చోడగంగుఁడు గొప్పచక్రవర్తియె యయినను భీమకవిగాథలతోడనే యాతఁడు జ్ఞప్తిలో నున్నాఁడుగాని యాతనితక్కిన ప్రభావము ప్రసిద్ధమైయున్నదా?

తే. "తరుతటాకాదిసంతతుల్ ధరణి నెచట, నిలిపి రచటనె యుండువానికిని గృతము
ఖంబునఁ నె విశ్వవిఖ్యాతిగానఁ గృతియె, సంతతినతంస మది మాకు సంఘటింపు."

(వసుచరిత్రము ఆ. 1. ప. 18.)

అని యిట్లు రామరాజభూషణుఁ డీవిషయముఁ జెప్పియున్నాఁడు.

అళియరామరాజు ప్రసిద్ధగ్రంథమును గృతి నందియుండకపోవుటచే నతనికంటె ననేకవిధములను దక్కువవారైన తిరుమలదేవరాయాదులనంటి ప్రసిద్ధియైన నాతనికి లేకపోయెను. అట్లయినను బట్టుమూర్తి మహాకవికిఁ గల రామరాజభూషణబిరుదమువల్లను, రామరాజీయవసుచరిత్రాది ప్రబంధములవల్లను గొంత వఱ కాతనిచరిత్రము గ్రహింప ననువుపడియున్నది. ఫెరిస్తాయ నెడి మహమ్మదీయచరిత్రకారుఁడు వ్రాసిన గ్రంథమును గొంతవఱకు రామరాయతిరుమలరాయలచరిత్రములను దెలుపుచున్నది. శ్రీకందుకూరి వీరేశలింగముపంతులవారు, చిలుకూరి వీరభద్రరావుగారు, లక్ష్మణరావుగారు మొదలగువా రీవిషయమున వ్రాసియున్నారు గాని తమవ్రాఁతలకుఁ దగిన యాధారముల నంతగాఁ జూపలేదు.

అళియరామరాజును దిరుమలదేవరాయలును, జంద్రవంశజులగు మహారాజులు వీరివంశములోని మహాపురుషులలో సుప్రసిద్ధులు నందుఁడు, చలిక్కుఁడు, రాజనరేంద్రుఁడు, బిజ్జలుఁడు, వీరహోమాలిరాయఁడు, తాతపిన్నమరాజు ననువారు. వీరిలో బిజ్జలుఁడు కాళ్యాణిరాజయి కల్యాణనగరము నాక్రమించి కల్యాణబిజ్జలుఁడను బిరుదు గాంచెను. వీరహోమాలిరాయఁడు మాయాపురీనాథుఁడు. పై సంగతు లీక్రిందియాధారములవల్లఁ దెలుచున్నది.

"జయతి క్షీరజలధే ర్జాతంసవ్యేక్షణం హరేః........ 3
... ... ... తస్మా త్పరీక్షి త్తతః. 4
నంద స్తస్యాఽష్టమోభూ త్సమజని నవమ స్తస్య రాజ్ఞ శ్చలిక్క-
క్ష్మాప స్తస్యాష్టమ శ్శ్రీనృపతిరుచి రభన ద్రాజపూర్వో నరేంద్రః,
తస్యాఽసీ ద్బిజ్జలేంద్రో దశమ ఇహ నృపో వీరహోమాలిరాయః
తార్తీయీకో మురారాత్కృతవతి రుపభూ త్తస్య మాయాపురీశః. 5
తత్తుర్యోజని తాతపిన్నమమహీపాలో ... ..." యనియున్నది.

(ఎపిగ్రాఫియా యిండికా. 4వ పుస్తకము. 272 వ పుట)

"సీ. క్ష్మాధరణంబగు కల్యాణపుర మేలి కల్యాణబిజ్జలాఖ్యను వహించి
... ... ... ... ... ...
వెలసె కల్యాణబిజ్జలవిభుఁడు మిగుల ... ... ..." (నరపతివిజయము. ప. 167)

వీరిలోఁ దాతపిన్నమరాజు మొదలుకొని తిరుమలరాయల పుత్త్రులవఱకును వసుచరిత్రమున వీరి వంశము వర్ణింపఁబడియున్నది. ఆవంశవృక్షము నిట నుదాహరించుచున్నాను.

- తాతపిన్నమరాజు.
  - సోమదేవుఁడు
    - రాఘవుఁడు
      - పిన్నశౌరి.
        - బుక్కరాజు.
          - రామరాజు.
            - తిమ్మరాజు
              - కోనరాజు
              - తిమ్మరాజు
            - కొండరాజు
              - అళియరామరాజు
            - శ్రీరంగరాజు
              - తిరుమలదేవరాయలు
                - రఘునాథరాజు
                - శ్రీరంగరాయలు
                - రామరాజు
                - (వీర) వేంకటపతి
              - వేంకటాద్రి

వీరిలో బుక్కరాజునకు కొక్కరామరాజే గాక మఱికొందఱు పుత్త్రులున్నట్లును వారిలో నొక్కఁడగు సిరంగరాజు శశాపూర్ణోదయకృతిపతియగు నంద్యాల కృష్ణరాజువంశమునకు మూలపురుషుఁడయి యున్నట్లును శశాపూర్ణోదయమునఁ (ఆ. 1. ప. 24) జెప్పఁబడియున్నది. ఈసిరంగరాజు నందేల కథిపతి యగుటచే వీరికి నంద్యాలవారని పేరువచ్చియుండును.

మఱియు వసుచరిత్ర కృతిపతియగు తిరుమలరాయలకు ముగ్గురుసోదరీమణు లుండిరనియు వారిలో లక్కమ్మ నరసభూపాలీయ కృతిపతియగు నహోబలనరసరాజునకుఁ దల్లియనియు (నరసభూపాలీయము. ఆ. 1. ప. 89) నోబమ్మ రామాభ్యుదయకృతిపతియగు గొబ్బూరినరసరాజునకుఁ దల్లియనియు (రామాభ్యుదయము ఆ. 1. ప. 79) గోనమ్మ పరమయోగివిలాసకృతికర్తయగు తిమ్మరాజునకుఁ దల్లియనియు (పరమయోగివిలాసము ఆ. 1. ప. 7.) నరసభూపాలీయ రామాభ్యుదయ పరమయోగివిలాసములవలన స్పష్టపడుచున్నది. ఇట్లే తిరుమలదేవరాయల పెదతండ్రియగు తిమ్మరాజుపేర బాలభాగవత పద్యకావ్యమును గోనేరునాథకవి రచించెను. ఈతిమ్మరాజు కుమారుఁడగుచినతిమ్మరాజు బాలభాగవత ద్విపదకుఁ గృతిపతి.

తిరుమలదేవరాయలపూర్వులలో సోమదేవుఁ డొక్కదినమున నేడుదుర్గములను హరించినట్లును పిన్నశౌరి యారవీటి కధిపతియైనట్లును, బుక్కరాజు సాళువనరసింహరాజ రాజ్యస్థాపకుఁ డయినట్లును వత్పుత్త్రుఁడగు రామరాజు విజాపురాజును జయించి యతనిగిరిదుర్గము నాక్రమించినట్లును, మఱియు నితఁడు కందనోలు (కర్నూలు) దుర్గమును జయించినట్లును శాసనాదులవలన స్పష్టపడుచున్నది.

“తతోఽజని హరగర్ దుర్గాణి సప్తాహితాత్,
అహ్మాకైన సహోమదేవనృపతిః......శ్రీపిన్నమోభూ న్నృపః, 6
ఆరవీటినగరీవిభో రభూ, దస్య బుక్కధరణీపతి స్సుతః,
యేన సాళువనృసింహరాజ్య మ, ప్యేధమానమహసా స్థిరీకృతమ్. 7
... ... ... రామరాజంసుతమ్. 9
స్సహాసైః స్స్వప్తత్యా సహిత మపి య స్సింధుజమహామ్
సపాదస్యానీకం సమితి భుజశౌర్యేణ మహతా,
విజిత్యాద త్తేస్మా దవనిగిరిదుర్గం విభుతయా
విధూతేంద్రః కాసప్పోడయ మపి విద్రావ్య సహసా. 10
కందనవోలీదుర్గ ముదకందలసభ్యుదయో బాహుబలేన యో బహుతరేణ విజిత్య...” 11

యనియున్నది. (సపాద=అదిల్ షా.) (ఎపిగ్రాఫికా యిండికా 4 వ పుస్తకము వీరవేంకటపతి విలపాక శాసనము 272 వ పుట).

సాళువనరసింహరాజరాజ్యస్థాపకుఁడగు నారవీటి బుక్కరాజు కృష్ణదేవరాయలయొద్దనైతము ప్రధానపురుషుఁడై యున్నట్లు కృష్ణరాయవిజయమునఁ గలదని యుదాహరించి బుక్కరాజు చిరకాలము జీవించియుండిన నుండవచ్చునని సందేహముగా హెచ్. కృష్ణశాస్త్రిగారు వ్రాసియున్నారు.

తిరుమలదేవరాయలతాతయగు రామరాజు కందనోలి కధీశుఁ డయినట్లు వసుచరిత్రమునందును గలదు.

“సీ. ...గీ. ... ... ... అ ... ...
అతులితరక్కందనోలి మహాపురిని,శాంతుఁడగు రామమేదినీకాంతుఁ డలరు.”(వసు. ఆ. 1. ప.30.)

ఈరామరాజుకుమారుఁడగు తిమ్మరా జవుకు నేలినట్లును ఆతనితమ్ముఁడు కొండరా జాదవేని నేలినట్లును (నరపతివిజయము 218-220 పద్యములలోఁ) జెప్పఁబడియున్నది.

తిరుమలదేవరాయలయన్నయగు తిమ్మరాజు ప్రభావము వసుచరిత్రమున (ఆ.1.ప.41.) వర్ణింపఁబడెను. ఈపద్యమున కీసులమువారికి శాసనాదులలో వర్ణింపఁబడినబిరుదములు వర్ణింపఁబడినవి.

“సీ. ...గీ. ... ... ... ... ఏ బిరుదరాయరాహుత్తాహితవధూభు
జంగబిరుదాంకపుంఖితసమరవిజయ, కాహళుఁడు తిమ్మవిభుఁ డాజిదోహళుండు.”
(వసు. ఆ. 1. ప. 41)

ఈతిమ్మరాజునకుఁ దమ్ముఁడును దిరుమలదేవరాయలకు నన్నయునగు నళియరామరాజు కృష్ణదేవరాయసార్వభౌముని యల్లుఁడై సదాశివరాయలను రాజ్యమున నిలిపి విజయనగరసామ్రాజ్యమును మహోన్నతదశకుఁ దెచ్చె ననుమొదలగు విషయములు వ్రాసియేయున్నాను.

రామరాజు మొదటఁ బాలియకేటి నేలుచుండెనని హెచ్. కృష్ణశాస్త్రిగారు వ్రాసియున్నారు. ఈవిషయము ఫర్గాటనెంప్పై రుసంగును (193 వ పుట) గలదు.

దక్కనురాజులగు మహమ్మదీయులచరిత్రము పర్సియాభాషలో ఫెరిస్తా వ్రాసియున్నాఁడు. దానిని బ్రిగ్గుదొరగా రాంగ్లేయభాషలోనికి భాషాంతరీకరించియున్నారు.

ఫెరిస్తామూలగ్రంథములోఁ గుతుబ్షాలచరిత్రము సంక్షిప్తముగా నున్నది. దానిని వేఱొక రాకాలపువారే విపులముగా వ్రాసిరనియు నది సంగ్రహించి భాషాంతరీకరించితి ననియు వ్రాయుచు

బ్రిగ్సుదొరగారు దానిని ఫెరిస్తాతోఁ జేర్చి భాషాంతరీకరించిరి. ఈతురకరాజులచరిత్రముతో సంబంధించిన దక్షిణహిందూదేశపుఁ దెలుఁగురాజులచరిత్రమును బయి నుదాహరించిన ఫెరిస్తానుండి సంగ్రహించి మఱికొన్ని రికార్డులను జనశ్రుతులను నూహములను దోడుచేసి సివెల్ (Sewell) దొరగారు ఫర్గాటనెంపైరను నొక గ్రంథమును వ్రాసిరి. ఈసందర్భమునఁ బయి నుదాహరించిన బ్రిగ్ ఫెరిస్తానుండియు ఫరగాటనెంపైరునుండియుఁ గొన్నివిషయములను సంగ్రహించి యుదాహరించుచున్నాను. (1910 వ సంవత్సరమునఁ గాంబ్రెఅండుకోలోఁ గలకత్తాయందు ముద్రితమగు ప్రతి నేను వాడుకచేసిన ఫెరిస్తాయని గ్రహింపఁ జదువరులను బ్రార్థించుచున్నాను.)

తిరుమలరాజు జీవితకాలములోఁ (1552) గొల్కొండకోట నేలినట్టు లిథిక్ రికార్డువల్ల నగపడుచున్నదని హెచ్ కృష్ణశాస్త్రిగారు వ్రాసిరి.

వేంకటాద్రి కందనోలి నేలిన ట్లీక్రిందిపద్యమువల్ల నగపడుచున్నది.

''ఉ. ఏలెను గందనోలిపుర మింద్రసమానుఁడు వేంకటాద్రిభూ
పాలుఁడు ... ... ... ...'' (నరపతివిజయము. ప. 266)

అచ్యుతదేవరాయతత్పుత్త్రులకాలమునందును సలకముతిమ్మయరాజ్య మాక్రమించుకొన్నకాలమందును విజయనగరరాజ్యమునకు గర్భశత్రువులగు విజాపురాదిరాజులును విజయనగరరాజ్యాంతర్గతులగు మఱికొందఱురాజులును గొన్నికొన్నిప్రదేశముల నాక్రమించుకొనిన ట్లగపడుచున్నది. కావుననే మరల నళియరామరాజు దండయాత్రలుచేసి, రాచూరు ముదుగల్లు మొదలగుదుర్గములను వశపఱచుకొనవలసివచ్చెను.

ఇచట విజయనగరసామ్రాజ్యమునకుఁ బ్రతిస్పర్ధియగు మహమ్మదీయరాజ్యవిషయము సంక్షేపముగా నుదాహరించుట యావశ్యకమని తోఁచి వ్రాయుచున్నాను.

మహమ్మదుతోగ్లాకు డిల్లీశ్వరుఁడుగా నున్నపుడల్లా యుద్దీన్ హసన్ గంగూ యనువాఁడు గంగూ యను బ్రాహ్మణునొద్ద బానిసగా నుండెననియు, వాఁడు క్రమముగాఁ బ్రభువయి, యీదక్షిణదేశమున (క్రీస్తుశకము) 1347 వ సంవత్సరమున స్వతంత్రరాజ్యమును స్థాపించెననియు, నతఁడు తన మొదటియజమానునందలి గౌరవమున నాతని రావించి తన ప్రధానమంత్రిగానుంచుకొని తనవంశమునకు బహుమనివంశమని పేరుపెట్టెననియు వ్రాసియున్నారు. దీని నె మనవారు భామినీరాజ్యమందురు. ఈరాజ్యమె యళియరామరాజుకాలమునకు నాలుగుభాగములుగా నేర్పడెను.*

మొదటిది యహమ్మద్‌నగరరాజ్యము. దీని నాహుదానగరమనియు గ్రంథములలో వాడిరి. దీనికి నిజాంసాహియనియు, దీనియధిపతికి నిజాంసాయనియుఁ బేర్లు. దీనిని (క్రీ. శ.) 1553 వఱకు బురహానువాఁడును, 1565 వఱకు హుస్సేనను వాఁడును, 1586 వఱకు మూర్తజాయనునతఁడును బాలించిరి. దీని రాజును నిజామనియు నిజాముఁడనియుఁ బ్రబంధములలో వాడిరి.

ఈయహమ్మద్‌నగరరాజ్యమునకు దక్షిణమున నున్నది బీజపూరురాజ్యము. దీనిని విజాపురరాజ్యమని ప్రబంధములలో వాడిరి. ఈరాజ్యమునకు అదిల్ సాహియనియు, దీనియధిపతికి అదిల్ సాయనియుఁ బేరులు. దీనిని క్రీ. శ. 1557 వఱకు నిబ్రహిమ్మనువాఁడును, 1580 వఱకు నలీ యనునాతఁడును

* ఫర్గాటనెంపైరు 29 వపుట ; ఫెరిస్తా 2 వ పుస్తకము 283 వ పుట మొదలుకొని చూచునది. (ఫర్గాటనెంపైరు 190; ఫెరిస్తా. 3 భాగము. 236, 237, 249, 250, 269 )

పాలించిరి. (ఫర్గాటసెంప్తైరు. 192; 218; ......పుటలు) వీనియధిపతిని సవాయియనియు సపాదుఁడనియుఁ బ్రబంధములలో వాడియున్నారు. ఈరాజ్యములోని కృష్ణాతుంగభద్రానదులనడుమనున్న యంతర్వేది విజాపురవిజయనగరరాజ్యముల సంధిభాగము. దీనినిమిత్తము హిందువులును మహమ్మదీయులును బలుమారు పెక్కుయుద్ధములు చేసిరి. ఉభయులలో నెవరు బలాధికులయియున్న నపుడు వారు దీనిని వశపఱచుకొనుచు వచ్చిరి.

అహమ్మదునగర విజాపురరాజ్యములకుఁ దూర్పుగానున్న చిన్నభాగము బీదరురాష్ట్రము. దీనికి బెరీదుషాహీ యనియు దీనియధిపతికి బెరీదుషా యనియుఁ బేరులు. ఈరాజును బరీదనియు నీరాజ్యములోని దుర్గమును పెదకోటయనియుఁ బ్రబంధములలో వాడిరి. దీని నమీరనునతఁడు క్రీ. శ. 1549 వఱకును, నలీయనునతఁడు 1562 వఱకును నిబ్రహీమ్మనునతఁడు 1569 వఱకును గాసీమనునాతఁడు 1572 వఱకును బరిపాలించిరి. (ఫరిస్తా 3 వ భాగము 497, 499. ... పుటలు.)

విజయనగరరాజ్యమున కుత్తరమునను, బీదరురాజ్యమునకుఁ దూర్పునను నున్నది గోలకొండరాజ్యము. దీనికిఁ గుతుబ్‌షాహియనియు, దీనియధిపతికిఁ గుతుబ్‌షాయనియుఁ బేర్లు. ఈరాజును గుతుపమల్కనయనియు నిందలి కోవెలకొండయనుదానిని గొయ్యలకొండయనియుఁ గవులు వాడిరి. ఈరాజ్యమును (క్రీ. శ.) 1550 వఱకు జంషీ దనునాతఁడును 1580 వఱకు నిబ్రహీమ్మనువాఁడును, 1611 వఱకు మహమ్మద్‌కూలీ యనునతఁడును బరిపాలించిరి. (ఫర్గాటెసెంప్తైరు. 169; 218 పు.)

వీరిలో నిబ్రహీమ్మనునతని నిభరామనియు మల్కిభరామనియుఁ గవులు వాడిరి. ఈయిభరామనునతఁడు తనయన్నయగు జంషీదుకుతుబ్‌షా తన్నుఁ జంపించునని భయపడి యళియరామరాజు శరణుఁజొచ్చెననియు, నతఁడు వాని సంరక్షించెననియు; జంషీదునకుఁ బిమ్మట నతఁడు గోలకొండకుఁ బ్రభువయ్యెననియుఁ జరిత్రకారులు వ్రాసియున్న విషయముల (ఫర్గాటసెంప్తైరు 188, 189, 218. ...పుటలు) నీక్రిందిపద్యము సూచించుచున్నది.

"సీ. ఖలు నతిద్రోహి నల్క యతిమ్మని హరించి సకలకర్ణాటదేశంబు నిలిపె;
నతునివర్ధితునిఁ బత్సుతునిఁ బట్టముగట్టి కుతుపనమల్కన క్షోణి నిలిపె;
... ... ... ...," (నరసభూపాలీయము. ఆ. 1. ప. 82)

ఈయిబ్రహీమ్మనునాతఁడు తెలుఁగుదేశపురాజులయొద్దఁ బెరిగినవాఁడగుటచేతనే తనరాజ్యకాలమునందుఁ దెనుఁగుకవుల నాదరించెను. అద్దంకి గంగాధరకవి యితనికిఁ దపతీసంవరణ మనుకావ్యమును గృతిచేసియున్నాఁడు. అందు గంగాధరకవి యీతనితండ్రిని నితనిని నీక్రిందిరీతిని వర్ణించియున్నాఁడు.

"సీ. పడమట సవాయిబసవనిగాఁ జేసి యెచట గొయ్యలకొండ నావరించెఁ;
సమది మల్లాఖాను దక్షిణంబునఁ గొట్టి హరియించెఁ గానుగల్లాదిగిరుల;
నుత్తరంబున బరీ దోడిపాఱఁగఁ దోలి మెతుకు దుర్గం బాక్రమించి మించెఁ;
బ్రథమదిక్కున నొడ్డెపాత్రసామంతుల ఘట్టించి కంబము నెట్టుగొనియె;
తే. నతనిఁ బొగడంగఁ దగదె యాచతురకీర్తి, రూఢిగిరిదుర్గలుంటన ప్రాప్తతేజు
వ్యాహశిఖరాధిరోహరేవంతమూర్తి, కుతుపశాహిని క్ష్మాపాలు గుణవిశాలు.
సీ. సకలవేదపురాణశాస్త్రపారగులైన యొంటరివిద్వాంసు లొక్కచోట;
సప్తభాషలయందు సాంధ్యంబు లేకుండ హొలంకారకవీంద్రు లొక్క తంక;

గజపతినరపతిక్ష్మాభర్త లంపిన యొడికంపు రాయబా రొక్కొక్కఁడంప;
మేరుమందరముల మించఁ గల్గిన మన్నియములు పంపెనాఘు లొక్కొక్కయెడలఁ;
తే. జేరి కొల్వ భద్రాసనాసీనుఁ డగుచు, రమ్యగుణహారి మల్కిభరామశౌరి
భారతక్షీరమయసింధుబంధమధ్య, లలితపుణ్యకథాసుధాలహరిఁ జేలి.''

ఈయిబ్రహీముయొక్క తురుష్కసరదారుఁడగు నమీర్ఖానునకుఁ బొన్నిగంటి తెలగనార్యుఁడు యయాతిచరిత్రను గృతియిచ్చినాఁడు.

పయినుదాహరించినరీతిని మహమ్మదీయరాజ్యము విభాగింపఁబడియుండుటచేతఁ దదధిపతులు "విషయానంతరో రాజా శత్రుః" అను చొప్పున నొకరికొకరు ప్రాకృతశత్రువు లయియుండిరి. విజయనగరరాజ్యము, వీనిలో విజాపురగోలకొండరాజ్యములకు విషయానంతరమె యయినను ద్వాదశరాజమండలపద్ధతి చొప్పున "అరేశ్చ విజిగీషోశ్చ మధ్యమో భూమ్యనంతరః" యనురీతిని బయిరెండురాజ్యములకును మధ్యస్థితిలో నుండెను. పయిరెండురాజ్యములతోను శత్రుశత్రుతారూపమైత్రియు విషయానంతరస్థితిరూపశత్రుత్వమును నుండుటచే మధ్యస్థితి దీనికి యుచితమేగదా? అహమ్మదునగరబీదరురాజులకు విజయనగరరాజు అరిమిత్త్రుఁడగుటచేఁ బ్రాకృతమిత్త్రుఁడై యుండుట సహజము.

రామరాజు నిజాంషా కుతుబ్షాలనుగలసి యదిల్షా నోడించుటయు రామరాజునకు రాచూరు ముదగల్లు మొదలగు సంతర్వేదపరగణాలిచ్చుటయును (ఫర్గాటనెంపైరు 181, 190 పుటలు) నీక్రిందిపద్యమును సూచించుచున్నవి.

"పదిలుఁడై రాచూరు ముదిగల్లు కప్పంబు, సేయఁ గాంచి సహాయు సీమనిలిపె,
... ... ... రామవిభుఁడు'' (నరసభూపాలీయము. ఆ. 1. ప. 82.)

ఈయుద్ధకాలములలో విజాపురరాజ్యమునకు మొదటియిబ్రహీము రాజై యుండెను.
(ఫర్గాటనెంపైరు. 190 వ పుట.)

"క. అబ్రాశిఖరధీరంచిత బ్రాహ్మీధవవివేక తరుణచరిణాభా
గిబ్రామశరణ సకలకవిబ్రాహ్మణకనకరణగుణసంభరణా.'' (వసు. ఆ. 4. ప. 140)

విజాపురరాజ్యాధిపతుల కదిల్షా యనుపేరువలెనే యేదులఖానను బిరుదుఁ జెల్లును గాన నీక్రింది పద్యములు, రామరాజుతమ్ముఁడగు వేంకటాద్రి యేదులఖానును (అదిల్షాను) జయించి యంతఃస్థితిని వశపఱచుకొనిన విషయమును సూచించుచున్నవి. (ఫర్గాటనెంపైరు 180, 190 పుటలు.)

"మ. బలదుర్యుం డగు వేంకటేంద్రుని మహాబాహాబలాటోపవి
హ్వలుఁడై మున్నుప్రధానక్రియా సహాదాభేఖ్యుఁడై సట్టియే
దులఖానుం డిదె నేఁడు గ్రమ్మఱ సహాయుండయ్యె నా శర్మకుం
దలఁ జత్వారమఁ దాల్చె ఫీమరిత్సాపాంతం గాఁగ నితోర్గస్నాలక్.
వ. స్థిరసంగ్రామజయాభిరాముఁడగు నా శ్రీవేంకటక్ష్మావరుం
డరయక్ రాజశిఖావళింముఁడగుఁ బద్యం బుర్విఁ గాకున్న నీ
ధరణీపాలకు లెల్ల మెచ్చఁగ సహాదక్షోణి కృతార్థి భా
సురదుర్గాదప్రశస్తవివిధసూక్ష్మ నిర్వాహంభించునే.'' (నరసభూపాలీయము. ఆ. 1. ప. 87,88)

విజాపురనవాబగు నిబ్రహీం షానునతఁడు చనిపోయినపిదప నతనిపుత్త్రుఁడగు నలీ యనువాఁడు రాజయ్యెను. ఈకాలమున నహమ్మదునగరరాజగు బురహాను షానునాతఁడు చనిపోయినందున నతనిపుత్త్రుఁడగు హుస్సేనను నతఁడు రాజయ్యెను.

అలీ అదిల్‌షా తనతండ్రి కాలమున నళియరామరాజుమూలమున బురహాన్ నిజాంషాకు వశపడియున్న తనరాజ్యములోని కళ్యాణనగరాదులు మరలఁ దాను సంపాదింపఁ దలఁచి యళియరామరాజుతో స్నేహము చేయుటకు నిశ్చయించుకొనెను. ఆకాలమున రామరాజున కొకకుమారుఁడు చనిపోయినందున నదేసమయమని తలఁచి యలీయదిల్‌షా విశ్వాసపాత్రముగా స్వల్పసైన్యముతో విజయనగరమునకుఁ బోయి రామరాజునకు దుఃఖోపశమనముగా మాటలాడి యతనిస్నేహమును సంపాదించెను. (ఫర్‌గాటనెంపైరు 192-193 పుటలు) ఈసందర్భమున నలీ యనునతఁడు తన్నుఁ బుత్త్రునిఁగాఁ జూచుకొమ్మని రామరాజుభార్యను వేఁడుకొనెననియు నామె వానిని బుత్త్రభావమునఁ బెంచుకొనెననియు నప్పటినుండియు రామరాజును నలీయును బితృపుత్త్రులవరుసలతో నొకరినొకరు పిలుచుకొనుచుండిరనియుఁ బిదప రామరాజంపకము పెట్టినందున నలీ కోపించియు మనసులో నణఁచుకొనియుండెననియు లక్ష్మణరావుగారు వ్రాసియున్నారుగాని రామరాజుభార్య యలీయదిల్‌షాను బుత్త్రుఁడని పిలిచెనని మాత్రము ఫెరిస్తా వ్రాసియున్నాఁడు (ఫెరిస్తా 3వ పుస్తకము 118 వ పుట) కాఁబట్టి యలీయదిల్‌షా మొదట నట్లు ప్రార్థించుటయు, రామరాజు వానినిఁ గుమారునివరుసతోఁ బిలుచుటయు నూహించి వ్రాసినట్లగపడుచున్నది.

పిదప రామరాజు తనమూలమున నిజాంషాకు వశపడిన యదిల్‌షాసంబంధమైన కల్యాణనగరాదులు తిరుగ నలీ కిచ్చివేయవలయునని హుస్సేను నిజాంషా కాజ్ఞాపించినట్లును నతఁ డాయాజ్ఞను లక్ష్యము చేయనందున రామరాజు వానినిజయించి కల్యాణపురమును వశపఱచుకొనినట్లును నీక్రిందిపద్యములు సూచించుచున్నవి. (ఫర్‌గాటనెంపైరు 194, 197 పుట.)

"సీ. హరిశౌర్యుఁడగు తిర్మలాధీశ్వరుండు పదవారిజుండగు వేంకటాద్రిరాజు;
భుజయుగంబుగ బలస్ఫురణతోఁ గరిహరి, వరవీరభటులతో దొరలతోడఁ;
దనయాజ్ఞ మీఱినఁ గినుక నిజాముపై దండెత్తి తటిమి యుద్ధంపుస్ఫూర్తి;
నతఁ డేలుచున్నట్టి * యాహ(మ)దానగరంబు చాలెత్తి నుఱీ యాముదాలు వేసె;
ఆ. సేతుకాశిమధ్యభూతలనుతజయ, శ్రీకరించి వేడ్కఁ జేఁ జెలంగు
రామమూర్తియైన రామరాజేంద్రుఁడు, సాంద్రవిభవజితసురేంద్రుఁ డలమి."
(నరపతివిజయము. ప. 281)

"శా. విశ్వామిత్త్రునిఁ గొల్చి రాముఁ డతఁ డుర్విం జెందెఁ గల్యాణముల్
విశ్వామిత్త్రులఁ గొల్వ రాముఁ డతఁ డుర్విం జెందెఁ గల్యాణముల్
శశ్వత్కీర్తుల రాము లయ్యురువురుల్ సాధించు కల్యాణలా
భైశ్వర్యంబులు ధర్మనిర్మథనదుర్గాలంబనవ్యక్తముల్." (వసు. ఆ. 1. ప. 47)
"క. ఖల్యాభయకర హరిఖురి, హల్యాహతజన్యజాంగలాంగణఫలసా
కల్యావహ బహుదిగ్జయ, కల్యాణ నిజామగుప్తకల్యాణహరా." (వసు. ఆ. 5. ప. 127.)

పయిగీతిని కల్యాణపురమును రామరాజు గెల్చుకొనఁగా హుస్సేన్ నిజాంషా సహింపక కుతుబ్‌షాను సహాయునిఁ జేసికొని మరలఁ గల్యాణపుర నాక్రమింప రామరాజు మఱల వారి నోడించుటయు

* అహమ్మదునగరము.

నాయుద్ధమున నిజాంషాకుతుబ్‌షా లోడి కాందిశీకు లగుటయు నందు నిజాంషా, యిబ్రహీం కుతుబ్‌షా మైత్రిని నిందించుచు రామరాజును శరణదూఱఁగా నాని కభయ మిచ్చి యహమ్మద్‌నగరరాజ్యము నిలుపుటయు మొదలగుచరిత్రాంశముల నీక్రిందిపద్యములు సూచించుచున్నవి. (ఫర్‌గాటనెంపైరు పు. 196, 197.)

"సీ. ప్రబలావలేపవిగ్రహజాయమానాగ్రహము డించి బహుధావనాప్తిఁ గాంచు;
బుర మెల్లఁ బ్రత్యగ్రభూతిపాలుగఁ జేసి యచలాసనాభ్యాసియై కృశించు;
రతి నిభరామానుగతమైత్రిపై రోసి కలనైనఁ గల్యాణకాంక్ష యిడఁడు;
సరవిఁ బ్రాణాయామసంసిద్ధికై సారెసారెకుఁ గుండలి స్థానమంటు;
తే. మానక నిజాముఁ డపవర్గమార్గవృత్తిఁ, బేరయు పరబుద్ధి నెవ్వాని పేరు వలఁచి
యతఁడు శ్రీరాముఁ డఖిలసన్నుతికిఁ దగఁడె, సేతుకాశీతలాంతరఖ్యాతయశుఁడు."

(వసు. ఆ. 1. ప. 48.)

"సీ. శరణన్న మల్కనిజాముని కభయం బొసంగి తదీయరాజ్యంబు నిలిపె..."

(నరసభూపాలీయము. ఆ. 1. ప. 82.)

అదిల్‌షా కుతుప్‌షా నిజాంషాలతో జరిగిన యుద్ధములందు రామరాజ తిరుమలరాజ వేంకటాద్రులును వారిపుత్రులును జూపినపరాక్రమముల నీక్రిందిపద్యములు సూచించుచున్నవి.

### అళియరామరాజు.

"మ. హరిశౌర్యంబగు రామభూవిభుని తీవ్రాటోపవద్వాహినీ
శరవేగంబున నాత్మమూలబలముల్ జాఱం దశాడంబరం
బరుగం గొమ్మలు వోవ లాగరి నిజామాదుల్ వజీరుల్ భజిం
తురు నమ్రత్వముఁ గానలో ముసలిమానుల్ గా వితర్కింపఁగాన్." (వసు. ఆ. 1. ప. 45.)

"సీ. ఎడలపై... ... ... ... ... ... ...
తే. అనుచు శిరముగఁ దాల్తు రెవ్వాని సమగ్ర, సైన్యధరధూళిఁ జకితులై చను సపాద
కుతుపసాహినిజామాదిక్షితిపతు లతఁడు నృపమాత్రుఁడే రామధరణివిభుఁడు."

(వసు. ఆ. 1. ప. 46.)

### రామరాజుకుమారులు.

"ఉ. ధ్యేయుఁడు రామరాజు పెదతిమ్మవిభుం డని వాజిదోలలోఁ
బాయనిభీతిచేత మొన భగ్నముగా యవనుల్ దొలంగ నా
చాయ నిజాముఁ డడ్డుపడ సామజయూథముఁ ద్రుంచెఁ జూపరుల్
వాయఁ జూఁడంచు నెంచఁగ నవార్యసముజ్జ్వలబాహుశౌర్యుఁడై." (నరపతివిజయము. ప. 299.)

"ఉ. మావులు నేనుఁగుల్ భటసమాజము పెనుఁగుపెంటగాఁగ గం
గావలి నుండి కృష్ణదనుకం బొనరించి నిజాముఁ ద్రోలి రం
మావనినాథు కొండవిభుఁ డాహవకేళిఁ జరించెఁ జూచి యా
దేవతలెల్ల నీఘనుఁడు దేవవరాత్మజుఁ డంచు నెంచఁ గాన్." (నరపతివిజయము. 302. ప.)

"ఉ. నారద! యింతె చిత్ర మిది నారకవాసులు గాక దేవతా
వారిజగంధులం గలసి వత్తురు స్వర్గ లనంగ ధేనుసం

హారులు మ్లేచ్ఛు లన్న వినుమా సురవల్లభ! యాజిభూమి రా
చూరిపురీశు తిమ్మవిభు నుగ్రకరాసిని స్వర్గ గాఁ జుమీ!" (వరపతివిజయము. ప. 310.)

## తిరుమలదేవరాయలు.

"సీ...గీ. తగవరి గదా నిజాముఁ దుద్దండజ యుప,టిష్ఠ తిరుమలరాయధాటికిఁ జలించి
పఱచు నెడ శక్తి మఱచి యు మఱనఁడయ్యెఁ, దత్తదుచితప్రదేశసంధానయుక్తి."
(వసు. ఆ. 1. ప. 58)

"సీ...గీ. అతఁడు నృపమాత్రుఁడే యరయఁగ సపాస, కుతుపసాహినిజామాదికుతిలపతులఁ
జెండెదోర్గర్వఖర్వితాఖండలుండు,రణజయవిహారి తిరుమలరాయశౌరి." (వరపతివిజయము. 235ప.)

## తిరుమలరాజపుత్త్రులు.

"శా. యాదోరాశిగభీరమూర్తి రఘునాథాధీశుఁ డుద్దండతా
హాదర్పాంధసపాద మల్కికనిజామానీకముల్ ద్రుంప జ
న్యాదూరక్షితిఁ బాఱు కృష్ణకును గృష్ణాంకంబు నాఁ దప్పె బి
బ్బీదివ్యస్త్రయనాబ్జ కజ్జలజలాభీలప్రవాహంబులన్." (వసు. ఆ. 1. ప. 69)

"సీ. కడువిజాపురరాజ్యకామినీగర్భముల్ ఛేదించు నిస్వనిభేరిరవము
దామిడిఁబోయి నిజామపట్టణముల ధూళిగాఁ జేయు నేదౌరబలంబు
గోలకొండవజీర్ణకోటులకాయముల్ చించు నేరాజేంద్రుచేతికత్తి
... ... ... ...శ్రీరంగరాయమౌళి." (వరపతివిజయము. ప. 244.)

"ఉ. రామమహీశ్వరుండు రణరంగమునందు నిజాముసేనలన్
భీమపరాక్రమస్ఫురణఁ జీఁద మఱంపఁగ సాటి కెన్నుచున్
రాముర్రణంబుచంప మిదిరా యితెఁ డాతఁడె యౌనటంచు నా
తామరసోద్భవోద్భవుఁడు తాళము లొత్తుచు నాట్యమాడుచున్." (వరపతివిజయము. 248.(a)

## వేంకటాద్రి.

"మ. కడిమిన్ వేంకటరాయశౌరి నెదురంగా లేక యత్యాహితం
బడరం గౌతమి దాటువేళ నిజకాంతాశ్రుప్రదాహోప్తిఁ గా
ల్నడదప్పన్ జడుడై నిజాముఁ దుడుపాలంబంబునన్ దాఁటి యె
క్కడఁ గన్నన్ భజియించు నయ్యుడుపశేఖన్నానమోహంబునన్." (వసు. ఆ. 1. ప. 52.)

"ఉ. ఏకసపాదలక్షమిత మింప్రజుదోశ్చరితప్రబంధ మ
స్తోకమె యంచుఁ జాపజితధూర్జటి వెంకటశౌరి శౌర్యదీ
క్షాకృతి కర్ణభీష్మజయశక్తి ననేకసపాదలక్షసం
ఖ్యాకమనీయభూరివిభవాప్తి వహించు నుదంచితోన్నతిన్." (వసు. ఆ. 1. ప. 53.)

"సీ. కందుకక్రీడగాఁ గదనరంగస్థలిఁ గడునజీరులమస్తకములఁ దునిమి
హరులను బారిగొని కరులను దునిమి తదారోహకులఁ ద్రుంచి వీరభటవి
దళనంబుఁ జేసి దుర్భరపతాకలు గూల్పఁ గనుఁగొని కాందిశీకతనహించి
పీడుపట్టనునాస విడిచి నిజాము నేదులఖాను కుతుపసాహుల దళంబు

తే. విచ్చి వెన్నిచ్చి కనుకని యిచ్చఁ బఱచి, మెచ్చఁ జొచ్చిన నభయంబు నిచ్చి విజయ
కాహళులు మ్రోయ నియమించె క్ష్మాజనంబు, లభినుతు లొనర్పఁగా వేంకటాద్రిరాజు."

(నరపతివిజయము. ప. 265)

రామరాజుపరిపాలనకాలమందె తిరుమలరాజు వేంకటాద్రులు బీదరురాజ్యముపైకి దండెత్తి బరీదుషాను జయించిన ట్లీక్రిందిపద్యములు సూచించుచున్నవి. (ఈవిషయము ఫెరిస్తాలోఁగాని ఫర్గాటెసెంపైరులోఁగాని యగపడదు.)

కవిరాజవిరాజితము.

"...విషమదమూదన మల్కవినోదన వీరబరీదధరాదహనీ !" (వసు. ఆ. 3. ప. 188)

"తరల. ...కలితహాటకకవాటసంగ్రహ వ్యగ్రిమవిశ్వసూత్ర బెదరకోటపటుకవాటపాటనా !"

(వసు. ఆ. 5. ప. 128.)

"సీ...గీ. అనుచుఁ గడుమెచ్చి జయలక్ష్మి యాజి నంగ, కాతరబరీదకేతనఘుటికాభద్ర
కిలశ మెకురుగఁ బూని యేఘనునిఁ జెందె, నతఁడు సామాన్యుఁడే వేంకటాద్రివిభుఁడు."

(వసు. ఆ. 1. ప. 51.)

"సీ...గీ. అనుచు యవనులఁ దెగడి తన్నాశ్రయించి, వారి సామ్రాజ్యలక్ష్మి నవ్వాఁడు గొనియె
నాహవోగ్రబరీద సప్తాంగహరణుఁ, డతఁడు విలసిల్లు శ్రీవేంకటాద్రివిభుఁడు."

(నరసభూపాలీయము. ఆ. 1. ప. 85.)

"ఆ. అసదృశోరుశౌర్యుఁ డాహవగాండీవి, వేంకటాద్రిరాజవిబుధరాజు
అని బరీదు గల్చి యాతనిబిరుదుమే, లమ్ముఁ గొనియె భూజనమ్ము వొగడ."

(నరపతివిజయము. ప. 264.)

పయినుదాహరించినట్టిని రామరాజు మహమ్మదీయరాజులలో నొక్కొక్కనిమా యొక్కొక్కనికి సహాయముఁజేసి వారిని జయించుచు వారి మసీదులను జెఱచుచు వారిని వారిరాయబారులను గర్వముతో నిరాకరించుచుండుటచేతను(ఫర్గాటెసెంపైరు. 197 వ పు.)నిర్హేతుకముగా నదిల్‌షా కుతుబ్‌షాల దేశములమీఁదికి సేనలనంపి వారిరాజ్యములోని కొన్నిభాగములను దీసికొనుటచేతను (ఫర్గాటెసెంపైరు 198 వ పు.) నీతఁడు వారికందఱకును గృత్రిమశత్రువాయెను. కావున నానలుగురికిని బ్రాకృతవైరముచే నిజమైనయైకమత్యము లేకున్నను గార్యవశమునఁ గృత్రిమమైత్రి కలుగవలసివచ్చెను.

"సఖా గరీయాఞ్ శత్రుశ్చ కృత్రిమస్తౌ హి కార్యతః,
స్యాతా మమిత్రే మిత్రే చ సహజప్రాకృతా వపి." (మాఘ. స. 2. శ్లో. 37.)

యను చొప్పునఁ బ్రాకృతశత్రుమిత్రత్వములకన్నఁ గృత్రిమశత్రుమిత్రత్వములు బలిష్ఠములు గదా !

మఱియుఁ నకృత్రిమమైత్రి బలపడునట్లుగా సహజమైత్రిని దోడుచేయుటకై వారు పరస్పరము బాంధవములను జేసికొనిరి. నిజాముకూఁతురగు చాందిబీబీ నలీయదిల్‌షాయును, అలీచెల్లెలిని నిజాముకుమారుఁడగు మూర్తజాయును బెండ్లియాడిరి. (ఫర్గాటెసెంపైరు. 199 వ పుట.)

ఈరీతిగా నలుగురునవాబు లేకీభవించి విజయనగరముపై దండెత్తివచ్చుచుండ నావార్తచారుల వలన విని రామరాజును దనసేనలను గూర్చుకొని వారి కెదురుగా నేగెను. ఉభయసైన్యములును గృష్ణానదికు త్తరమునున్న తాళికోటయొద్దఁ (తాళికోట ద్రోణానదియొడ్డున నున్నది. ద్రోణాకృష్ణానదులసంగమమునకుఁ బదునాలుమైళ్లమీఁదను, చెన్నపురినుండి బొంబాయికిఁ బోవు నినుపదారికిఁ గృష్ణ

యుద్ధమువచ్చినకోటికిఁ బశ్చిమమున నఱువదియైదుమైళ్లమీఁదను గలదు. (ఫర్గాటసెంప్పైరు 200 వ పుట.) గలిసికొనినవి. కృష్ణానది కుత్తరపుటొడ్డునఁ దురుష్కసైన్యములును దక్షిణపుటొడ్డున హిందూసైన్యములును నిలిచెను. తురక లీవలియొడ్డునకు రాకుండ మూఁడురోజులవఱకు హిందువులు కాచుకొనిరి. గాని తుదకు వారి నేమరించి తురుష్కులు కృష్ణానదిదక్షిణపుటొడ్డును జేరిరి. క్రీ. శ. 1565-వ సం. జనవరి తే 23 ది నాఁ డుభయసైన్యములకును ఘోరయుద్ధము జరిగెను. దీనినే తల్లికోటయుద్ధ మని చెప్పుదురు. (ఫర్గాటసెంప్పైరు 200, 201, 202, 203 పు.) ఈమహాయుద్ధములో హిందువు లుత్తరముఖముగాను దురుష్కులు దక్షిణముఖముగాను నిలిచిరి. సేనలను మూఁడుభాగములుగాఁ జేసికొని వేంకటాద్రిరామరాజ తిరుమలరాజులు వరుసగా నిలిచిరి. వారిలో వేంకటాద్రిని నదిల్‌షాయును, రామరాజును నిజాంషాయును, దిరుమలరాజును బరీదుకుతుబ్‌షాలును నెదిరించిరి. (ఫెరిస్తా 3 వ పుస్తకము 128, 247 పు.) ఫర్గాటసెంప్పైరులో నీవిషయము ఫెరిస్తానుండి సంగ్రహించి వ్రాసినట్లు (203 పుటలో) వ్రాయఁబడియున్నది గాని యేకారణముననో పొరపాటువడి యాగ్రంథకర్త, కుతుబ్‌షా వేంకటాద్రులును, నదిల్‌షాతిరుమలరాజులును బరస్పరము నెదిరించినట్లు వ్రాసెను. ఈకారణముననే కావలయును గతానుగతికముగా శ్రీ. కె. వి. లక్ష్మణరావుగారును, జిలుకూరి. వీరభద్రరావుగారును, దుగ్గిరాల. రాఘవచంద్రయ్యచౌదరీగారును ఫర్గాటసెంప్పైరులోని పొరపాటుమార్గముననే పోయియున్నారు. విజయనగరసామ్రాజ్యమున శ్రీరాఘవచంద్రయ్యచౌదరిగారు, రామరాజనిజాంషాలు కుడిప్రక్కనునిలిచి యుద్ధముచేసినట్లు పటములోఁ జూపియున్నారు. ఇది ఫర్గాటసెంప్పైరునకు సయితము విరుద్ధముగా నున్నది.

ఈమహాయుద్ధములోఁ దిరుమలరాజవేంకటాద్రులు జయముగొనియుండఁగా హిందువుల దురదృష్టవశమున జెదరివచ్చిన నొకయేనుఁగుచే రామరాజు పట్టువడెననియు రామరాజును జంపి యాతని శిరమును సేనలకుఁ జూపఁగా హిందూసేనలు పారిపోయెననియుఁ జరిత్రకారులు వ్రాసియున్నారు. ఇక్కాలమున రామరాజు ముదుసలియేయైనను ముప్పదియేండ్లవానివలెఁ బోరాడెననియు వ్రాసియున్నారు. (ఫర్గాటసెంప్పైరు 203, 204, 205 పుటలు.)

ఈయుద్ధములో రామరాజుమాత్రమె చనిపోయినట్లును దిరుమలవేంకటాద్రులు జీవించియున్నట్లును ఫెరిస్తావల్ల నగపడుచున్నది. (ఫెరిస్తా 3 వ భాగము 131 వ పుట.) అది యసత్యమయియుండు ననియు వేంకటాద్రియును జనిపోయెననియు, ఫర్గాటసెంప్పైరులో (180, 212 పుటలు) వ్రాయఁబడియున్నది. కాని యందుకుఁ దగినయాధారములు చూపలేదు. తిరుమలరాజవేంకటాద్రు లిద్దఱును జనిపోయినట్లు విజయనగరసామ్రాజ్యమున దుగ్గిరాలరాఘవచంద్రయ్యచౌదరిగారు వ్రాసియున్నారు. తిరుమలరాయ లిట్టి మహావిపద్దశలో జీవించియుండిపోవుట భ్రాతృసౌహార్దమునకు సరిగా నుండదని యూహించి వీ రిట్లువ్రాసియుందురా యని యాలోచింపవలసియున్నది. తల్లికోటయుద్ధానంతరమునఁ దిరుమలరాయలు జీవించియున్నట్లు పెక్కుశాసనములును వసుచరిత్రాదిప్రబంధములును రుజువుచేయుచున్నవి.

విజయనగరసామ్రాజ్యము తల్లికోటయుద్ధముతో క్షీణదశకువచ్చుటచేతను, నందు విజయనగరరాజులకు గొప్పనష్టమును నవమానమును సంభవించుటచేతను వారిని స్తుతించుప్రబంధములందును దానశాసనములందును నీయుద్ధవిషయము లంతస్పష్టముగా వర్ణింపఁబడలేదు గాని రామరాయలయనంతరమునఁ దిరుమలదేవరాయలు మూర్ధాభిషిక్తుఁడయినట్లు శాసనములందు వర్ణింపఁబడుటచేఁ దల్లికోటయుద్ధానంతరమునఁ దిరుమలరాయలు జీవించియుండెననక తీరదుగదా!

"శ్రీరామరాజే శ్రితసత్వశౌర్యే శౌరేః పదం శాశ్వత మభ్యుపేతే;" 91

"తిదను భువ మశేషాం పాలయన్ రాజనీత్యా
తపనతనయజేతా దానరీత్యా మహాత్మా,
భరతమహితభూమా భాతి తస్యానుజన్మా
వరతిరుమలరాజ స్సాహితీభోజరాజ." 92

యని స్పష్టముగాఁ జెప్పఁబడియున్నది.

(ఎపిగ్రాఫికా యిండికా 9 వ పుస్తకము. 338 వ పుట. సదాశివరాయల శాసనము.)

మఱియు పైయంశములు కర్ణాటశాసనములందును గలవు.

"స్వస్తిశ్రీవిజయాభ్యుదయశాలివాహనశకవర్షంగళు 1490 నెయ విభవసంవత్సర జ్యేష్ఠశు. 5 మంగళవారదల్లు శ్రీమన్మహారాజాధిరాజరాజపరమేశ్వరవీరప్రతాపవీరసదాశివమహారాయరు పృథివీరాజ్యంగైయుత్తిరలు శ్రీమన్మహామండలేశ్వర అళియరామరాజయదేవమహా అరసుగళు తురుత్తురాజకార్యక్కాగి అస్తమానవాగల్లాగి పట్టణసింహాసనరాజ్యదేశవెల్లా కెట్టు ఖిలవాగల్లాగి రాజశ్రీతిరుమలరాజయ్యదేవమహాఅరసుగళు......పాల్లిసిదమేలే........"

(ఎపిగ్రాఫికాకర్ణాటిక. 11 వ పుస్తకము. 323 పుట, హోళల్కెరి తాలుకా 7 వ నెంబరు శాసనము.)

ఈశాసనములో సదాశివరాయలు రాజ్యముచేయుచుండఁగా రామరాయలు రాజకార్యమునకై తురకలచేఁ జంపఁబడినందున రాజ్యమంతయుఁ జెడినదయియుండఁగాఁ దిరుమలరాజు రాజయి యీ దేవాలయమును మరల నుద్ధరించెనని యున్నది. ఇంచుమించుగా నీపదరచనతోడనే యీశాసనమునకు వెనుకటిదగు నాఱవ నెంబరు శాసనమును నున్నది. "తురుత్తు"నకుబోటుఁ "దురక" యని యందుఁ గలదు. కాన నిందును నట్లే యుండియుండునని సవరించి యర్థము వ్రాసిరి. కొందఱిందుఁగల తురుత్తను దానికిఁ ద్వరితమని యర్థముచేసి రామరాజు చనిపోవుటకుఁ గారణభూతమగు గజక్షోభము సూచింపఁబడినదని తలంచుచున్నారు గాని యీయర్థ మశ్లిష్టముగా నున్నది.

తిరుమలదేవరాయలును, దత్పుత్త్రులును జీర్ణకర్ణాటరాజ్యపునరుద్ధారులని వర్ణింపఁబడుటచేత వసుచరిత్రాదులందుసైత మీతల్లికోటయుద్ధవిషయము సూచింపఁబడిన దనవచ్చును. అంతకుముందు మహోన్నతిదశలోనున్న కర్ణాటరాజ్యము జీర్ణించినదనియుఁ దిరుమలరాజు మరల దాని నుద్ధరించెననియు వర్ణించుటచేతను దిరుమలరాజాదులు పెనుగొండ చంద్రగిరులలో రాజ్యముచేసినట్లు వర్ణించుటచేతను దల్లికోటయుద్ధమును విజయనగరవినాశమును నుక్తప్రాయములేగదా !

"సీ. ...జీర్ణకర్ణాటలక్ష్మీపునస్సృష్టి నెవ్వాని లోకేశ్వరత్వము పొసంగు
గీ. ... ... ... ...తిరుమలరాయశౌరి." (వసు. ఆ. 1. ప. 13.)

"క. ... ... ... ...కర్ణాటకాంధ్రధరణీపునరు
ద్ధారికిఁ దిరుమలదేవమహారాయాగ్రణికి..." (వసు. ఆ. 1. ప. 90.)

తిరుమలదేవరాయలకుమారుఁడగు శ్రీరంగరాయలను నిట్లే వర్ణించిరి.

"సీ...గీ. ...జీర్ణకర్ణాటభూపునర్జీవనుండు, రమ్యగుణశాలి శ్రీరంగరాయమౌళి."

(నరపతివిజయము. ప. 244.)

అళియరామరాజు అచ్యుతరాయల కుమారుఁడగు వేంకటరాయల యనంతరమునఁ గర్ణాటరాజ్యమును వృద్ధిచేసెనని చెప్పుటలో నాతనిఁ గర్ణాటరాజ్యవిభవస్థాపనము చేసెననిమాత్రము వర్ణించిరిగాని యిట్లు జీర్ణించిన కర్ణాటదేశమును మరల నుద్ధరించెనని చెప్పలేదు.

"సీ. ... ... ... ... ... ...

గీ. ... ... ... ... సాధుకర్ణాటవిభవ సంస్థాపనంబు
పూని శరణాగతుల నెల్లఁ బ్రోచె రాముఁ, డతఁడు... ..." (వసు. ఆ. 1. ప. 44.)

"సీ. ఖలుఁ డతిద్రోహి సల్కాయతిమ్మని హరించి సకలకర్ణాటదేశంబు నిలిపె..."

(నరసభూపాలీయము. ఆ.1. ప.82.)

కాఁన దిరుమలదేవరాయలను జీర్ణకర్ణాటపునస్సృష్టికర్తయని వర్ణించుటచేత విజయనగరసామ్రాజ్యమును తురకలు వినాశము నొందించినపిదపఁ దిరుమలదేవరాయలు పెనుగొండను రాజధానిగాఁ జేసికొని యాసంధికాలమునఁ దమతమజాగీరుల నాక్రమించుకొని స్వతంత్రముగా నేలుకొనుచున్న రాజులను మఱల వశపఱచుకొనఁ జొచ్చెనని గ్రహింపవలసియున్నది.

(ఫర్‌గాటసెంపైరు. 209, 211, 212 వ పుటలు.)

ఈరీతిగా నాయారాజులకాలములోనివారు సయితము వారిపరాజయమును సూచించి యుండఁగా నిప్పటిమనవారు సందేహించుట వింతగానున్నది. మఱియు మనవారు కొందఱు రామరాజు తురకలచే మోసమునఁ జంపఁబడె నని వ్రాసిరి. చరిత్రములు వ్రాయువారికిఁ బక్షపాత ముండుట సరికాదు.

అలీ యదిల్‌షా, యిబ్రహీం కుతుప్‌షా మొదలగువారు విజయనగర రాజ్యమునకు హానిచేసి రనుమాట నిజమేగాని యాకారణమున వారు, పిరికిపందలును, కృతఘ్నులును, మోసము చేయువారును నని వ్రాయుచు వారిని నిందించుట యుచితముకాదు. తన్నుంపకము పెట్టుటకు రామరాజు రాలేదని తప్పు పట్టుకొనిన యదిల్‌షా విజయనగరములో బసచేసికొని యెల్లప్పుడును రామరాజువద్ద నిచ్చకములు చెప్పుకొనుచుండెడివాఁడని వ్రాయుట సహజముగా నుండదుగదా !

ఆకాలములో మోసమనునది యొక నీతిశాస్త్రపద్ధతిగా రాజులచే నంగీకరింపఁ బడుచుండెను. రామరాజు తురకరాజులకు మిత్త్రుఁడువలెనుండి వారిలో వారి కంత-కలహములు పెట్టుచు నదిల్‌షా కుతుప్‌షాల రాజ్యములలోని కొన్నిభాగములను దీసికొనలేదా ! ... (ఫర్‌గాటసెంపైరు.)

అలీయదిల్‌షాయును, నిబ్రహీంకుతుప్‌షాయును గొప్పరాజులయినట్టును విద్యాపక్షపాతులయినట్టును, గొప్పకట్టడములను గట్టించినట్టును జరిత్రములవల్ల నగపడుచున్నది. (ఫెరిస్తా 3 వ పుస్తకము. 113 వ పుట. 328 వ పుట.)

మఱియు నప్పటివారి కిప్పటిమనవారియంత దేశాభిమాన మున్నట్లగపడదు. కొందఱు హిందువులు, తురకలయొద్దఁ గొలువుచేసి హిందూరాజులతో యుద్ధములుచేసిరి. వేయేల ? అళియరామరాజే మొదటఁ గుతుప్‌షాయొద్ద సరదారుఁడుగా నుండెను. (జీర్ణకర్ణాటరాజ్యచరిత్రము. 250వ పుట. ఫెరిస్తా 3 వ భాగము. 380 వ పుట.)

తెనుఁగుకవులును, దురకలనుగొట్టి విజృంభించిరని తెలుఁగురాజులను వర్ణించినట్లె తెలుఁగురాజులను గొట్టి విజృంభించిరని తురకలను బొగడియున్నారు. అద్దంకి గంగాధరకవియును, బొన్నిగంటి తెలగనార్యుఁడును దురకలకు గ్రంథములను గృతిచేసియున్నారు.

మఱియు రామరాజు తురకలచే సులభముగా మోసపుచ్చఁబడెనని మనవారు తురకలను నిందించుటకై వ్రాసిరిగాని యది రామరాజునకే గొప్పలోపమని తలంపకురి. సలకము తిమ్మయచేతిలోనున్న రాజ్యమును నేర్పుతో వశపఱచుకొని సదాశివరాయలను పేరునకు మాత్రము సింహాసనమున నిలిపి తురకరాజ్యములకుఁ బరస్పరకలహములను గల్పించి తనరాజ్యమును వృద్ధిచేసికొనిన మహానిపుణుఁడగు రామరాజు నంతసత్యకాలపువానిఁగాఁ జెప్పుట సరిగానుండునా?

విజయనగరసామ్రాజ్యవినాశకమగు తల్లికోటయుద్ధమున నళియరామరాజు చనిపోయినపిమ్మటఁ దిరుమలదేవరాయలుసైతము సదాశివరాయలనే సింహాసనమున నుంచి రామరాజువలెనే తానును మెల్లఁగ రాజులను వశపఱచుకొనుచు రాజ్యపాలనము చేయుచుండెనని శాసనములవల్ల నగపడుచున్నది.

"శ్రీరామరాజే శ్రితసత్వశౌర్యే శౌరేః పదం శాశ్వత మభ్యుపేతే. 91
తదను భువ మశేషాం పాలయన్ రాజనీత్యా... ...
...... తదనుజన్మా, వర తిరుమలరాజ స్సాహితీభోజరాజః. 92

సైవ్వరం సంహృతకంటకోథ సుకృతోత్కృష్టం విధాయాఖిలం
భూకేదార ముదారదానసలిలాసారై స్సమాపూర్యచ ;
సంవర్ధ్యానఘకీర్తిసస్యనివహం తత్పాలికాం విక్రమ
శ్రీకాంతాం భుజకాయమానశిఖరే ధత్తే హి య స్తేజసా.

ధర్మమర్మవిద స్తస్య ... ... ...
... ... ... విమతధ్వాంతభాస్వతః.

ప్రాజ్యకర్ణాటరాజ్య శ్రీస్థాపనాచార్యవిశ్రుతేః,
ఆత్రేయగోత్రపాథోజమార్తాండస్య మనస్వినః.
... ... ... ... ...

శ్రీమ త్తిరుమలక్ష్మాపశేఖరస్య దయాంబుధేః, వినయౌదార్యశీలస్య విజ్ఞప్తి మనుపాలయన్.
... ... ... ... ...

సదాశివమహారాయో మాననీయో మనస్వినాం,సహిరణ్యపయోధారాపూర్వకం దత్తవాన్ ముదా."
యనియున్నది. (ఎపిగ్రాఫికా యిండికా 9 వ పుస్తకము. 338 వ పుట.)

అట్లయినను దిరుమలరాయలు పెనుగొండలో రాజ్యముచేయుచున్నకాలమునఁ దాను సింహాసనము నలంకరించినట్లును, దనకుమారుఁడగు శ్రీరంగరాయలను యువరాజుగాఁ జేసినట్లును నగపడుచున్నది.

"గీ. ......తిరుమలరాయచంద్ర, సాంద్రపట్టాభిషేకాంబుసముదయమున." (వసు. ఆ.1.ప.62.)

"చ. హరిపదభక్తశీలుఁడగు నారఘునాథనృపాలకూర్మిసో
. దరుఁడు శిరంగరాయవసుధావరుఁ డాత్మగుణప్రమోదవ

త్తిరుమలరాయశేఖరవితీర్ణమహాయువరాజపట్టబం
ధురుఁ డయి సర్వభూభువనధూర్వహశక్తి వహించు నెంతయున్." (వసు. ఆ. 1. ప.71.)

"త్రిషు శ్రీరంగక్ష్మాపరివృఢకుమారే ష్వధిరణమ్
విజిత్యారిక్ష్మాపాన్ తిరుమలమహారాయనృపతిః,
మహారాజా స్సామ్రాజ్యే సుమతి రభిషిక్తో నిరుపమే
ప్రజా స్త్వుర్వీం సర్వా మపి తిసృషు మూర్తి ష్వివ హరిః. 18

యశస్వినా మగ్రసరస్య తస్య పట్టాభిషేకే సతి పార్థివేంద్రోః;
దానాంబుపూరై రభిషిచ్యమానా దేవీ పదం భూమి రియం దధాతి. 19

అనంతరం తత్తనయః ప్రతీతః ... ... ...
... ... ... శ్రీరంగరాయ శ్రీతభాగధేయః. 20
యథావిధి మహీసురో త్తమకృతాభిషేకోత్సవే" అని యున్నది.

(ఎపిగ్రాఫికా యిండికా 4 వ పుస్తకము 273 వ పుట.)

ఇట్లు తిరుమలరాజును దత్పుత్రుఁడును పెనుగొండసింహాసనము నెక్కినను సదాశివరాయలదాన శాసనములుపయితము (క్రీ. శ.) 1586 వ సంవత్సరమువఱకు నగపడుచున్నందున నాతఁడును గారణాంతరములచేఁ బేరునకు రాజుగా నున్నట్లు తోఁచుచున్నది. ( క్రీ. శ. ) 1908 వ సంవత్సరము 574 వ నెంబరపిగ్రాఫిస్టు రిపోర్టులో సదాశివరాయ లచ్యుతరాయలకాలముమొదలుకొని వీరవేంకటరాయల కాలమువఱకును నున్నట్లు వ్రాయఁబడియున్నది. కాఁబట్టి, 1568 వ ( క్రీ. శ. ) సంవత్సరమున సదాశివరాయలను జంపి తానే రాజయ్యెనని (హిందూదేశకథాసంగ్రహము. మహమ్మదీయమహాయుగము 408 వ పుట.) కే. వి. లక్ష్మణరావుగారును "రామరాజుయొక్క యనంతరమునఁ దిరుమలదేవరాయలు సదాశివదేవరాయని చెఱగొనిపోయి పెనుగొండఁ జేరి రాజ్య మాక్రమించుకొని యేలసాగెను. తిరుమలరాయలద్వితీయపుత్రుఁడయిన శ్రీరంగరాయలు సదాశివదేవరాయని 1568 వ సంవత్సరమునఁ జంపించెనని చెప్పఁబడినది" యని (జీర్ణకర్ణాటరాజ్యచరిత్రము. 280 పుట.) చిలుకూరి వీరభద్రరావుగారును వ్రాసినవిషయములు నిరాధారములని తోఁచుచున్నది.

ఇట్లే ఫర్గాటనెంపైరులోఁ బయివిషయము కొందఱుచెప్పుట గలదని వ్రాయఁబడియున్నది.

"In 1568 (so it is said), Tirumala murdered his sovereign, Sadasiva, and seized the throne for himself."

దీనినే సిద్ధాంతముగా గ్రహించి మఱికొన్నియూహలను దోడుచేసి వీరు వ్రాసినట్లు తోఁచుచున్నది.

శాసనములలోఁ దిరుమలరాయని నీక్రిందిరీతిని వర్ణించియున్నారు.

"శ్రీరామరాయే శ్రితభాగధేయే, శౌరేః పదం శాశ్వత మభ్యుపేతే.
తదను భువ మశేషాం పాలయన్ రాజనీత్యా తపనతనయజేతా దానరీత్యా మహాత్మా,
భరతమహితభూమా భాతి తస్యానుజన్మా వరతిరుమలరాజ స్సాహితీభోజరాజః. ॥2

స్వైరం సంప్రాతకంటకో ఽథ సుకృతోత్కృష్టం విధాయాఖిలమ్
భూకేదార ముదారదానసలిలాసారై స్సమాపూర్య చ,
సంవర్ధ్యానఘకీర్తిసస్యనివహం తత్పాలికాం విక్రమ
శ్రీకాంతాం భుజకాయమానశిఖరే ధత్తే హి య స్తేజసా. 93
... ... ... ... ...

ధర్మమార్గ మివ స్తస్య ధరణీకల్పశాఖినః,
సోమవంశావతంసస్య స్వాధీనవయసంపదః. 95
... ... ... ... ...

విజ్ఞాపితస్య వినయా ద్విమతధ్వాంతభాస్వతః,
ప్రాజ్యకర్ణాటరాజ్యశ్రీస్థాపనాచార్యవిశ్రుతేః. 97
ఆత్రేయగోత్రపాథోజ మార్తాండస్య మనస్వినః,
అంతేంబరగండస్య సింధ్వ న్తక్షితిరక్షిణః. 98
నర్తితయశసోనానావర్ణశ్రీమండలీకగండస్య,
ఏబిరుదరాయరాహుతవేశ్యైకభుజంగబిరుదధరితస్య. 99
విఖ్యాతబిరుదమన్నవిభాళలీలస్య విజయశీలస్య,
విశ్వంభరాభృతిస్ఫుటవిశ్రుతగరణీవరాహబిరుదస్య. 100
కల్యాణపురనాథస్య కల్యారిసమతేజసః,
వేంగిత్రిభువనీమల్లలింగిస్థిరయశోనిధేః. 101
శ్రీమ త్తిరుమలక్ష్మాపశేఖరస్య దయాంబుధేః,
వినయౌదార్యశీలస్య విజ్ఞప్తి మనుపాలయన్. 102
... ... ... సదాశివమహారాయో...
సహిరణ్యపయోధారా పూర్వకం ద త్తవాన్ ముదా" 104

యని యున్నది. (ఎపిగ్రాఫికా యిండికా 9 వ పుస్తకము 338 వ పుట.)

మఱియు నీశాసనమున వర్ణింపఁబడిన సదాశివరాయలప్రభావము న్నత్తము తిరుమలదేవరాయలదే యనవచ్చును. సదాశివరాయలు పేరునకుమాత్రము రాజనియు రామరాజతిరుమలరాజులె నిజమయిన రాజులనియు వ్రాసియేయున్నాను. ఈశాసనములోని సదాశివరాయలవర్ణనపద్యములు రామరాయల ప్రభావకథావసరమున నుదాహరింపఁబడిన పద్యములె యగుటచే నిట వేఱుగ నుదాహరింపలేదు.

మఱియుఁ బయినుదాహరించిన శాసనములలోని బిరుదములు కొన్ని విజయనగరరాజులకుఁ బారంపర్యాగతములును, మఱికొన్ని యాళియరామరాజువంశమువారికిఁ గులక్రమాగతములును నయి యున్న వనుటకు వీరిలో నెవరిని వర్ణించినను నీబిరుదములనే యుపయోగించుటయె నిదర్శనము. ఇట్లె కర్ణాటదానశాసనములలోని "వీరప్రతాపరాజాధిరాజరాజపరమేశ్వరాది" బిరుదములును వీరికిఁ బారంపర్యాగతములని గ్రహింపవలసియున్నది.

పయిశాసనములలోని బిరుదములును ప్రభావములును వసుచరిత్రమునందును వర్ణింపఁబడెను.

"సీ. వసుమతీభాగధూర్వహత నెవ్వని యుర్వీరాణరాహాంక మర్థము వహించు
తే. ... ... ... ...వీరప్రతాపరాజాధిరాజ
రాజపరమేశ్వరాష్టదిగ్రాజకులము, నోధయంకర బిరుద." (వసు ఆ. 1. ప. 13.)

"సీ. కటకేంద్రుఁ డంపిన గంధసింధురము లాత్మస్వామి మాఱుహస్తములు మొగుప
హయనాగుఁ డంపిన హయులు కైజామోరలార్చుచుఁ బతికి జోహారుసేయ
నావాడపతి పంపిన యమూల్యకటకముల్ కర్తపేరుగఁ బదాగ్రములఁ బెనఁగఁ
బాండ్యేశుఁ డంపిన భద్రంబు లధిపతిప్రతిగా నిజాంకముద్రలు వహింప
తే. శౌర్యకీర్తులతో నచ్చు సకలదిశలు, రేంద్రరాజ్యేందిరలమాడ్కి నిగురుఁబోండ్లు
చటులమాణిక్యమయనండ చామచామ, రములు వీవంగఁ బేరోలగమున నుండి.
(వసు. ఆ. 1. ప. 15.)

"సీ....తే. ... ... వీరప్రతాపరాజాధిరాజ
రాజదేవేంద్ర తిరుమలరాయచంద్ర, సాంద్రపట్టాభిషేకాంబుసముదయమున."
(వసు. ఆ. 1. ప. 62.)

"కం. ఉన్నతజయజన్యబిరుద, మన్నెవిభాళాదిబిరుదమాన్యునకు..." (వసు. ఆ. 1. ప. 87.)

"కం. ... ... మూరురాయరగండా!" (వసు. ఆ. 2. ప. 1.)

"పంచచామరము. ... ... ...భూమహానరాహ
... ... వారణాధిరాజవారిరాశిమంధరా." (వసు. ఆ. 2. ప. 160)

"కం. ... ... ఎం,తెంబరగండాంక..." (వసు. ఆ. 3. ప. 187.)

"శా. ... ... పాదస్రుహయరాట్ భాస్వత్ప్రపాదాంకనా!" (వసు. ఆ. 5. ప 126.)

పై బిరుదములలోఁ గొన్ని నరసభూపాలీయమునందును గవి యుపయోగించియున్నాఁడు. శ్రీరంగరాయలకుమారులలో నిద్దఱు తిమ్మరాజులుండుటచే వ్యావర్తకముగ నీతఁ డెఱతిమ్మరాజని పిలువఁ బడియుండె. క్రిందినరసభూపాలీయపద్యము వ్యక్తపఱచుచున్నది.

"సీ....తే. రాజదేవేంద్రుఁ డితఁడు దేజరిల్లు, ననఘుచాళుక్యనారాయణాంకవివిధ
బిరుదమన్నెవిభాళాదిబిరుదశాలి, ప్రాభవోపేతుఁ డెఱతిమ్మపార్థివుండు."
(నరసభూపాలీయము. ఆ. 1. ప. 84.)

ఈపేరినే ఫెరిస్తా యెల్‌తిమ్మరాజని వాడుచువచ్చెను.

పయిశాసనములలో వర్ణించినరీతినే యితఁడు మహాదాతయనియు ననేకదానశాసనములు చేసె ననియు వసుచరిత్రమునందు వర్ణింపఁబడినది.

"మ. ధర నెవ్వానికి వ్రాయుఁ బద్మజుఁడు వ్రాఁతల్ వానితో నేగు న
స్థిరముల్ శాశ్వతకీర్తి యా తిరుమలశ్రీరాయనారాయణుం
డు రహిన్ వ్రాసిన శాసనాక్షరము లుండున్ బుత్రపౌత్రాన్వయ
స్థిరవృత్తిన్ బృథుకాక్షరంబులు గురుశ్రీనక్షత్రతుల్యంబులే!" (వసు. ఆ. 1. ప. 61.)

మఱియు శాసనములలో వర్ణింపఁబడిన 'సాహితీభోజరాజ' యనుదానికి సరిగ నితఁడు జయదేవుని గీతగోవిందమునకు శ్రుతిరంజనియను వ్యాఖ్యానమును జేసియున్నాఁడని యందుఁ గలదు. ఈపుస్తక మోరియంటల్ లైబ్రరిలో నున్నది. పండితులు గ్రంథములుచేసి రాజులపేరులుపెట్టు సంప్రదాయము గలదు. గాన నేతద్గ్రంథకర్తృత్వవిషయము నిశ్చయింప నలవుపడకున్నది. ప్రబంధశిరోరత్నమగు నీవసుచరిత్రమును గృతిగొనుటయు నీతనిసాహితీభోజబిరుదమునకు వన్నెదెచ్చుచునే యున్నది.

శౌర్యౌదార్యబలపరాక్రమపాండిత్యపండితాదరణాదులం దసమానుఁడై మహావైభవము ననుభవించిన యీనీతివిశారదునియం దొకటిరెండుదోషములు నున్నట్లు చరిత్రకారులు వ్రాసియున్నారు.

తల్లికోటయుద్ధానంతరమున నీతఁడు పోర్చుగీసువర్తకులవద్ద కొన్నిగుఱ్ఱములనుగొని వానిమూల్యము వారి కీయక మోసముచేసెనఁట. (ఫర్గాటనెంపైరు 209 వ పుట.)

క్రీ. శ. 1551 వ సంవత్సరమునఁ దిరుమలరాజును వేంకటాద్రియు రామరాజుపైఁ దిరుగఁబడి యాదవానిదుర్గము నాక్రమింప రామరాజిబ్రహింకుతుబ్షాసాయమున వారిని జయించి వారు తన్ను శరణ మూఁతినందున క్షమించెనఁట. (ఫర్గాటనెంపైర్ 190 వ పుట.)

వసుచరిత్రము తిరుమలరాయల కేసంవత్సరమునఁ గృతి యీయఁబడెనో, తిరుమలరాజెంతవఱకు జీవించెనో? యనువిషయములు నిర్ణయించుటకుఁ దగిన యాధారము లగపడవు గాని యదిల్షా పెనుగొండమీఁదికి దండెత్తివచ్చినప్పటి యుద్ధవిషయములు వసుచరిత్రమున వర్ణింపఁబడుటచే క్రీ.శ.1577వ సం॥మునకుఁ బిమ్మటనే వసుచరిత్ర కృతిప్రదానము జరిగెననియు నాకాలమునకుఁ బైఁగాఁ దిరుమలదేవరాయలు జీవించెననియు గ్రహించుట కవకాశ మున్నది. మఱియు. క్రీ. శ. 1580 వ సంవత్సరమున రాజ్యమునకు వచ్చినమహమ్మదుకూలీకుతుబ్షాను వీరు జయించినవిషయములు వసుచరిత్రమునందు వర్ణింపఁబడకుండుటచే నంతకుఁబూర్వమే కృతిప్రదానకాలమనియుఁ దోఁచుచున్నది. తల్లికోటయుద్ధానంతరమున మరల నదిల్షా కుతుబ్షాలతో జరిగిన యుద్ధవిషయము లీక్రిందను వ్రాయుచున్నాను.

ముస్తాఫాఖానుని ప్రేరణమున నదిల్షా (క్రీ-శ) 1577 వ సంవత్సరమునఁ బెనుగొండమీఁదికి దండెత్తివచ్చి దానిని ముట్టడించెననియు, వేంకటాద్రి పెనుగొండను దనసామంతులకు వశపఱచి సర్వస్వమును దీసికొని చంద్రగిరికిఁ బోయెననియుఁ బిదప వేంకటాద్రి తురకపక్షములోనున్న హండీయాలంనాయకుఁ డను నొక సేనానాయకునకు 24 లక్షలహూపాయలను నైదేనుఁగులను లంచమిచ్చి వానిని విడఁదీసి యదిల్షా సేనలను జీకాకుపఱపించెననియు, నంతటితో నదిల్షా తనదేశమునకుఁ బోయెననియు ఫెరిస్తా వ్రాసియున్నాఁడు (ఫెరిస్తా 3 వ పుస్తకము 141వపుట) ఈసందర్భములోని వేంకటాద్రి తిరుమలదేవరాయల నాల్గవకుమారుఁడగు వీరవేంకటపతియని తోఁచుచున్నది. పయి యుద్ధవిషయములను వసుచరిత్రములోని యీక్రిందిపద్యము సూచించుచున్నది.

"చ. తిరుమలరాయశేఖరుని ధీరచమూభటరాజి యాజిభీ
కరయవనేశ్వరప్రహితఖానబలంబుసఁ జక్కు సేయ ని
ద్ధరఁ బెనుగొండకొండలు మదద్విపచర్మకపాలమాలికా
పరికరభూషితంబు లయి బల్విడిఁ గాంచె గిరీశభావముల్. (వసు. ఆ.1. ప. 59.)

ఫెరిస్తావ్రాఁతలనుబట్టి పెనుగొండ యదిల్‌షాకు వశపడలేదనియు: తిరుమలరాజుస్వాధీనములోనే యున్నదనియు స్పష్టపడుచుండఁగాఁ జిలుకూరి వీరభద్రరావుగారే కారణమునునో "మఱియు మూఁడవ కుమారుఁడైన వీరవేంకటపతిరాయలు తండ్రి వృద్ధుఁడయి రాజ్యభారము నంతయు తనమీఁద మోపి యున్నతర్వాతఁ దాను బీజపురసుల్తానగు ఆలీఅదిల్‌షాతో యుద్ధముచేసి పరాజితుఁడయి క్రీస్తుశకము 1577 వ సంవత్సరమునందు రాజధానిని చంద్రగిరికి మార్చిన సంగతినిగూడఁ గవి యీక్రిందిపద్యము నందు సూచించియున్నాఁ" డని (జీర్ణకర్ణాటరాజ్యచరిత్రము 212 వ పుట) వ్రాసి వసుచరిత్రము లోని యీక్రిందిపద్యము నుదాహరించిరి.

"మ. హరుఁ డాతారకశైలదుర్గమున నధ్యాసీనుఁ డై రాజశే
ఖరవిఖ్యాతి వహించుఁ జంద్రగిరిదుర్గం బందు శ్రీవేంకటే
శ్వరుఁ డొప్పెన్ బహురాజశేఖరసదాసంసేవ్యుఁ డై యారయి
ద్ధర బం టేలికవాసి తద్గిరులకుం దద్వల్లభశ్రీలకున్."

(వసుచరిత్రము. ఆ. 1. ప. 81.)

మఱియు వీరభద్రరావుగారి పైవాక్యములలో వీరవేంకటపతిరాయలు తిరుమలదేవరాయలకు మూఁడవకుమారుఁడని యుండుటచే రాజ్యాధీశుఁడు కాక మృతినొందిన తిరుమలరాయల మూఁడవకుమారుఁడగు రామరాయని వీరు మఱచినట్లు స్పష్టపడుచున్నది. ఈతఁడు సింహాసనము నెక్కినరాజు కాకున్నను సనామధేయుఁడై చనిపోలేదు. ఇతఁడు శ్రీరంగపట్టణమును జయించినట్లు వసుచరిత్రమునందుఁ జెప్పఁబడి యున్నది.

"మ. ఘనశౌర్యుండు సిరంగరాయవరలోకస్వామితోఁబుట్టు రా
మనృపాలాగ్రణి సహ్యజాంబుధిపయోమధ్యోర్వి శ్రీరంగప
ట్టనలంకానగరంబు పుణ్యజనపీడావార్త లేకుండఁ గై
కొనియెన్ మిత్త్రభవోపకారనిరపేక్షుం డై విచిత్రంబుగాన్."

(వసు. ఆ. 1. ప. 77.)

మఱియు నీరామరాయలపేర ననేకకర్ణాటదానశాసనము లగపడుచున్నవి. ఈతనికుమారులలో రామదేవరాయలు వీరవేంకటపతియనంతరమున రాజయ్యెను.

"ఈ శ్రీరంగరాయలు 1578 వ సంవత్సరమున మైసూరురాజులతో యుద్ధముచేసి చనిపోయినం గనుక నితనితమ్ముఁడైన వీరవేంకటపతిరాయలు సింహాసనమునకువచ్చి రాజధానిని పెనుగొండనుండి చంద్రగిరికి మార్చుకొని 1614 వ సంవత్సరమువఱకు పరిపాలనముచేసె" నని మఱియొకచోట శ్రీవీరభద్రరావు గారు వ్రాసియున్నారు. వసుచరిత్రములోని పైపద్యమునుబట్టి చూడఁగా నాకాలమున వీరవేంకటపతి చంద్రగిరిలో నున్నట్లుమాత్రము కనఁబడుచున్నదిగాని వీరవేంకటపతి రాజయి రాజధానిని జంద్రగిరికి మార్చుకొని యచ్చట రాజ్యముచేయుచున్నట్లు కనఁబడదు. ఫెరిస్తావ్రాఁతనుబట్టి చూచినను (3 వ పుస్తకము 141 వ పుట) నదిల్‌షాకుఁ బెనుగొండ వశపడక తిరుమలరాయలచేతిలోనే యున్నట్లు కనఁబడుచుండుటచేతను (క్రీ. శ.) 1594 వ సంవత్సరమువఱకును శ్రీరంగరాయలు పెనుగొండలో రాజ్యముచేయుచున్నట్లు కర్ణాటదానశాసనము లగపడుచుండుటచేతను వీరభద్రరావుగారి వ్రాఁత నిరాధారముగ నున్నదని తోఁచుచున్నది.

"స్వస్తిశ్రీ విజయాభ్యుదయశాలివాహనశకవరుష 1502 (క్రీ. శ. 1580.) సందున ర్తమాన విక్రమసంవత్సరద మార్గశిరశు 15 పుణ్యతిథియల్లు శ్రీమన్మహారాజాధిరాజరాజపరమేశ్వర శ్రీవీరప్రతాప శ్రీరంగదేవమహారాయరు పృథ్వీరాజ్యంగెయ్యుత్తిర" లని యున్నది.

(ఎపిగ్రాఫికా కర్ణాటిక 5 వ పుస్తకము 150 వ పుట బేలూరుతాలూకా 12 వ నెంబరు శాసనము)

"స్వస్తిశ్రీ విజయాభ్యుదయశాలివాహనశకవరుష 1505 (క్రీ. శ. 1584) స్వభానుసంవత్సరద పుష్య బ 12 సంక్రాంతిపుణ్యకాలదల్లు శ్రీరంగరాయ మహారాయరు పెనుగొండ. ... ...సామ్రాజ్యం మాడుతా'' నని యున్నది.

(ఎపిగ్రాఫికా కర్ణాటిక 5 వ పుస్తకము 339 వ పుట. బేలూరుతాలూకా 212 వ నెం. శాసనము.)

కాఁబట్టి వసుచరిత్రములో వీరవేంకటపతి చంద్రగిరిలో నున్నట్లు వర్ణించినంతమాత్రమున నప్పటికి శ్రీరంగరాజు చనిపోయెనని యు వీరవేంకటపతి సింహాసనము నెక్కెనని యు నూహించుట సరికాదు. రాజధానిలో రాజు నివసించి పాలించుచు రాష్ట్రములోని ముఖ్యపట్టణములందుఁ బుత్రులను నాప్తులను నిలుపుట యనాదిసిద్ధమగు నాచార మగుటచేఁ జంద్రగిరిలో వీరవేంకటపతి యుండెననుట విరుద్ధము కానేరదు.

"ఈ శ్రీరంగరాయలు వసుచరిత్రము కృతినందిన తిరుమలదేవరాయని కుమారుఁడు. ఇతఁడు 1574 వ సంవత్సరము మొదలు 1585 వ సంవత్సరమువఱకును రాజ్యముచేసినందున'' నని కందుకూరి వీరేశలింగముపంతులవారు సైతము కవులచరిత్రము రెండవభాగమున రాయసము వేంకటపతికవిచరిత్రమున (104 పుట) వ్రాసియున్నారు. మఱియు వీరు నీసందర్భమున వేంకటపతి శ్రీరంగరాయలకుఁ గృతి యిచ్చిన లక్ష్మీవిలాసములోని యీక్రిందిపద్యము నుదాహరించియున్నారు.

"మ. అలఘుప్రాభవభవ్యుఁ డాకుతుపశాహా మేయసైన్యంబు న
గ్గలికం బాహులచేతఁ గెల్చి బిరుదుల్ గైకొన్న శ్రీరంగరా
యలచిత్తం బిగురింప రాయసము వ్రాయం జాలితౌనా సుధీ
తిలకా యక్కయమంత్రి వేంకటపతీ! దీవ్యత్కళానాశ్వతీ!''

ఈపద్యము విజయనగరరాజ్యవిధ్వంసానంతరమునఁ గుతుబ్షాచే నాక్రమించుకొనఁబడిన కొండవీడు, వినుకొండ మొదలగువానిని మఱల శ్రీరంగరాయలు వశపఱచుకొనినవిషయమును సూచించుచున్నది. ఈవిషయమునఁ గొంతివఱకు శాసనముల నిదర్శనమును గలదు.

" ... ... ... ... శ్రీరంగరాయ శ్శ్రితభాగధేయః.
ఉద్దగిరౌ స్థితః పరివిజిత్య చ దుర్జయాన్, దుర్గమకొండవీడు వినుకొండ పురప్రముఖాన్,
భూవలయకరత్న పెనుగొండపురే నివసన్, రాజతి యః స మకరాదిలాంఛనత'' యని యున్నది.

(ఎపిగ్రాఫికా కర్ణాటిక 7 వ పుస్తకము 86 వ పుట షీమొగతాలూకా 83 వ నెంబరు శాసనము.)

కుతుబ్షాతో జరిగినయుద్ధములందును బయినుదాహరించిన పెనుగొండవిషయికమగు నదిల్షాయుద్ధమునందును వీరవేంకటపతి ప్రబలముగ విక్రమించిన ట్లీక్రిందియాధారములవల్ల నగపడుచున్నది.

" యస్యాతిప్రథితౌజసో రణముఖే సేనాథస్తై రుద్ధతై
స్సాటోపాహృతసైంధవద్విపఘటాశస్త్రాతపత్రాదిమః,
నిర్విణ్ణో మలికీభరామతనుభూ స్సంప్రాప్య గేహం మహే
ర్శ్మందస్సక్ మహమందశాహి రయతే సార్థాభిధా మన్వహ"మ్మని యున్నది.

(ఎపిగ్రాఫికా కర్ణాటిక 7 వ పుస్తకము 86 వ పుట షిమొగతాలూకా 83 వ నెంబరు శాసనము)

ఈకర్ణాటకదానశాసనము (క్రీ.శ.)1587 వ సంవత్సరములోనిది. మఱియు నీశ్లోక మెపిగ్రాఫికా యిండికాలోని నాల్గవపుస్తకమునందలి (274 వ పుట) వీరవేంకటపతిరాయల వేలూరుశాసనమందును నున్నది. ఈశ్లోకములో మహమ్మద్‌కూలీకుతుబ్‌షా జయింపఁబడినట్లు వర్ణితమయియున్నది.

"సీ. బలముగూడినఁ జూచి నిలువని యిభరాము కొడుకుభీతికి గోలకొండ సాక్షి
వెన్నాడి తత్సేన వీఁగఁద్రోలుటకును బ్రథురక్తమున నుబ్బు పెన్న సాక్షి
నీవాఁడ నవఁ బ్రోచి నిర్భయంబుగ వానికిని మేరయిడుటకుఁ గృష్ణ సాక్షి......

గీ. వీరవేంకటపతిరాయఁడు ... , ధరణిఁ బాలించె ..."

(నరపతివిజయము. 259 ప.)

(217) ఫర్‌గాటనెంప్పైరున నిజాంషా కృష్ణానది దక్షిణభాగముజోలికి రాకుండునట్లుగ ఖరారు (సెగ్రిమెంటు) చేసెనని యున్నది.

కుతుబ్‌షా 1579 (క్రీ. శ.) లో విజయనగరరాజులనుండి వినుకొండకొండవీడులను దీసికొన్నట్లు ఫర్‌గాటనెంప్పైరులో (218 పుట) వ్రాయఁబడియున్నది.

కుతుబ్‌షాను వీరవేంకటపతి చిక్కులు పెట్టినట్లు ఫెరిస్తాలో (ఫెరిస్తా 3 వ భాగము 436, 449, 459, 467 పుటలు) వ్రాయఁబడియున్నది.

వీరవేంకటపతిరాయలు (క్రీ. శ.) 1588 వ సంవత్సరమునకు ముందే పట్టాభిషిక్తుఁ డయిన ట్లీ క్రిందిశాసనమువల్ల స్పష్టపడుచున్నది.

"... ... ... ... ... ...
శ్రీరంగరాయక్షితిపాలకేస్మిన్ పదం మురారేః పరమం ప్రయాతే.
... ... ... ... ... ...
విద్వత్త్రాణపరాయణ స్తనుజః... ... స్థితః ...
... ... ... సామ్రాజ్యసింహాసనే.
సర్వాం శాస్తి నయేన వేంకటపతి శ్రీదేవరాయః క్షమామ్.
... ... స్వగోత్రగురుణా సుధీతిలకతాతయార్యేణ యః;
... ... యథావిధి యశస్వినా విరచితాభిషేకః క్షణాత్.
... ... దశబాణేందుసంఖ్యాతే కాలే తు శకవత్సరే."(శా.శ.1510 క్రీ.శ.1588.)
"కలిదేవపురం ... ... ... ... ...
వందణూరుమహాగ్రామం ... ... ... ...
సహిరణ్యపయోధారాపూర్వకం దత్తవాన్ ముదా" యని యున్నది.

(ఎపిగ్రాఫికా కర్ణాటిక 7 వ పుస్తకము షిమొగతాలూకా 83 వ నెంబరు శాసనము.)

పయి నుదాహరించినరీతి మహావైభవము ననుభవించిన విజయనగరరాజుల యధికారము క్రమక్రమముగ క్షీణించి మనయాంధ్రలోకమున నానాఁటికి విస్మృతప్రాయ మయ్యెను.

చంద్రగిరికి రాజుగానున్న యాఅవశ్రీరంగరాయలచేతిక్రింది నాయకునిచేనిండియాగవర్న్మెంటువారొక మైలువెడల్పును నైదుమైళ్లపొడవును గలప్రదేశము (క్రీ. శ.) 1639 వ సంవత్సరమున నీయఁబడెననియు నందె సుప్రసిద్ధమైన ఫోర్టుసెంటుజార్జియను చెన్నపురికోట కట్టఁబడెననియు ఫర్గాటసెంపైరులో (221, 233 పుటలు) వ్రాయఁబడియున్నది.

అళియరామరాజు మనుమఁడు చినవెంకటపతిరాజున కౌరసపుత్త్రుఁడును, అళియరామరాజుసోదరుఁడు వెంకటాద్రికి మనుమఁడగు గోపాలరాయనికి దత్తుఁడునునైన శ్రీరంగరాజె పైనుదాహరించిన శ్రీరంగరాజని గ్రహింపవలసియున్నది.

"... ... ... ... ... ...

సర్వోర్వీం ప్రచకాస్తి సింధుపరిఖాం శ్రీరంగరాయాగ్రణీః. 48

గ్రహర్తుబాణచంద్రాఖ్యగణితే శకవత్సరే......" (శా. శ. 1569 క్రీ. శ. 1647)

శ్రీచంద్రగిరిరాజ్యస్థం ... ... ... ... 56

... ... ... ... ... ...

పుత్తూరుగ్రామరత్నం తత్ సర్వసస్యసమన్వితమ్,

శ్రీవిలాసపుర మితి ప్రతినామసమన్వితమ్. 59

... ... ... ... ... ...

శ్రీరంగరాయభూపాలో మాననీయో మనస్వినామ్,

సహిరణ్యపయోధారాపూర్వకం దత్తవాన్ ముదా." 63 యని యున్నది.

(నెల్లూరుజిల్లా దానశాసనముల మొదటిభాగము 60 వ పేజీ.)

ఈశాసనములో నళియరామరాజ తిరుమలరాజవేంకటాద్రుల వంశముల మూఁడుశాఖలును వర్ణింపఁబడెను. ఈవంశములోని శ్రీరంగరాజులలో నితఁడె యాఅవవాఁడు. మఱియు నితనిచే దానము చేయఁబడిన యీయుత్తూరుగ్రామము చంద్రగిరిమండలములోని దని పైశాసనములో నుండుటచేతను ఫర్గాటసెంపైరులోఁ జంద్రగిరిరాజగు నాఅవశ్రీరంగరా జాస్థలము నిచ్చె నని చెప్పుటచేతను గాలసామ్యముచేతను నితఁడే యతఁడని దృఢముగాఁ జెప్పవచ్చును.

వీరివంశస్థు లిప్పటికిని హైదరాబాదునబాబులకుఁ బన్ను చెల్లించునట్టి యానెగొందిసంస్థానమున కధీశులయి యున్నట్లు ఫర్గాటసెంపైరులో (215 వ పుట) వ్రాయఁబడియున్నది.

## బట్టుమూర్తి లేక రామరాజభూషణుఁడు.

రామరాజభూషణుఁడు లేక బట్టుమూర్తి యనునీతని జన్మస్థానము బట్టుపల్లెయనియు,నీగ్రామము కవితాప్రవీణులయి ప్రబంధాంకమువారని ప్రసిద్ధిగాంచిన యీతనిపూర్వులకుఁ గృష్ణరాయలచే నీయఁబడినదనియు శ్రీవీరేశలింగముపంతులవారు వ్రాసియున్నారు. ఈగ్రామము బల్లారిమండలములోని పాలమండలమునకు సమీపమున నున్నదని కొందఱును, గడపమండలములోని పులివెందలతాలూకాలో నున్నదని మఱికొందఱును జెప్పుచున్నట్లు వ్రాసియున్నారు. కొందఱు కృష్ణామండలములోని మొదుకూరనుగ్రామ మీకవిజన్మస్థలమని చెప్పుచున్నారు గాని వీనిని నిర్ణయించుటకుఁ దగినయాధారము లేవియు నగపడవనియు వ్రాసిరి.

రామరాజభూషణుఁడె బట్టుమూర్తియని యింతకుముందు వ్రాసియేయున్నాను.

ఇఁక బట్టుమూర్తియను నామసామ్యముచేఁ గొందఱు భ్రమించి కాకమానిమూర్తియు నితఁడే యని యభిప్రాయపడిన ట్లీక్రిందిచాటుపద్యము సూచించుచున్నది.

"ఆ. అల్లసానివాని యల్లికబిగిసొంపు, ముక్కుతిమ్మనార్యు ముద్దుపలుకుఁ
బాండురంగవిభుని పదగుంఫనంబును, గాకమానురాయ నీ (కె కలదు) కుఁ దగుర."

బట్టుమూర్తి కృష్ణరాయల మెప్పించి యొకముత్యాలహారమును బహుమాన మందఁగా దక్కిన కవులు మత్సరించి దానిని హరింపఁ దెనాలిరామకృష్ణునిఁ బ్రేరించిరనియు నతఁ డీపద్యముతో బట్టుమూర్తిని స్తుతించి యాహారము నాతనినుండి బహుమతిగాఁ గొనెననియు, మూర్తి కృష్ణరాయలసన్నిధి కేగి బ్రాహ్మణకవులందఱును మునుపటిమాత్సర్యమును విడిచి తనకు లోఁబడిరని చెప్పుచు రామకృష్ణుఁడు తన్ను స్తుతించి చెప్పినపద్యమును జదువఁగా రాజు సంతోషించెననియు మఱునాఁటిసభలో రామకృష్ణుఁ డాపద్యమున కర్థాంతరముచెప్పి బట్టుమూర్తికంచుకమును దీయించి యాతనివీపుననున్న తామరను జూపి పరిహసించె ననియుఁ జెప్పుదురు. పై విషయములు గురుజాడ శ్రీరామమూర్తిపంతులుగారు తమకవిజీతములలో వ్రాసియున్నారు. ఈవిషయములు విశ్వసింపఁదగినవి కావనియు, రాజవాహనవిజయపాంచాలీపరిణయకర్తయు బ్రాహ్మణుఁడును నగు కాకమానిమూర్తి బట్టువంశజుఁడగు మూర్తికంటె నన్యుఁడనియు వ్రాయుచు శ్రీపూండ్లరామకృష్ణయ్యపంతులుగారు పరిహసించిరి.

పిదప శ్రీరామమూర్తిపంతులుగారు తెలినాలిరామకృష్ణకవిగాథలలో నీదైతిహ్యము వాడుకలో నున్నరీతిని వ్రాసినంతమాత్రమున నది యపహసనీయము గాదనియుఁ బ్రాస్తావికపద్యములవలెనే యన్యవిషయకమగు నీచాటుపద్యమును బట్టుమూర్తివిషయమునఁ దెనాలిరామకృష్ణుఁ డుపయోగించియుండ వచ్చుననియు సమర్థించుకొనిరి. కాని యీ పద్యము కాకమానిమూర్తికృతమగు పాంచాలీపరిణయములో నున్నదనియు నీమూర్తి, బట్టుమూర్తి తెనాలిరామకృష్ణులకుఁ దరువాతివాఁడనియు శ్రీవీరేశలింగముపంతులవా రాంధ్రకవులచరిత్రములో వ్రాసియున్నారు. ఇది శ్రీరామమూర్తిపంతులవారి సమర్థనమునకు బాధకముగనున్నది. అయినను గాకమానిమూర్తి తన కృతులను నరాంకితములుగఁ జేయకుండుటచేతను గవిత్రయమువారినిదప్పఁ దక్కిన యాంధ్రకవులను స్తుతింపకుండుటచేతను నీతనికాలము నిర్ణయింపఁ దగియున్నదా యని యాలోచింపవలసియున్నది.

అల్లసాని పెద్దనార్యుఁడు తనకొమారుఁడు చదువుకొనక తిరుగుచుండఁగాఁ జూచి శిక్షించెనని యు నందుమీఁదఁ బెద్దనార్యునిభార్య మాశిష్యుఁడగు బట్టువానిపాటి శ్లేషముక్కలు చెప్పుకొనుశక్తి కలుగకపోదు. ఏల శిక్షించెద రని పలిక ననువాడుక గలదు.

రామరాజభూషణుఁ డొకప్పు డీక్రిందిపద్యముతోఁ గృష్ణదేవరాయలస్తుతించినట్లు వాడుకగలదు.

"ఉ. అబ్జముఖీమనోజసరసాధిపనందనకృష్ణ నీయశం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీపరాక్రమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీవితీర్ణిమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము చిత్ర మిద్ధరన్"

రామరాజభూషణుఁడు తిమ్మరసుపైఁ గోపించి గుత్తిలో విస్తరాకులు కుట్టుట చంద్రగిరిలో

మధుకరముచేసికొనుట మొదలగు నాతని బాల్యపు నీచస్థితిని వెల్లడించుచుఁ బద్యము చెప్పఁదొడఁగి తిమ్మరసుప్రార్థనచే మరల దానిని మళ్లించెననియుఁ జెప్పుచు నీక్రిందిపద్యమును జదువువాడుక గలదు.

"శా. గుత్తిం బుల్లెలుగుట్టి చంద్రగిరిలోఁ గూడెత్తి పెన్గొండలో
హత్తిన్ సత్రమునంకు వెండి బలుదుర్గాధీశుతాంబూలపుం
దిత్తుల్ మోసి పదస్థులైనఘనులం దీవించ దీవించెదన్
మత్తారాతియయాతి నాగమసుతున్ మంత్రీశ్వరుం దిమ్మరున్."

పయిరైతిహ్యములును జాటుపద్యములును రామరాజభూషణుఁడు కృష్ణదేవరాయలకాలమునందును నుండెననియు నీతఁ డల్లసానిపెద్దనార్యునిశిష్యుఁ డనియు సూచించుచున్నవి. బట్టుమూర్తి యల్లసానిపెద్దనార్యుని శిష్యుఁ డని "ముప్రత్యయాభావస్యాల్లసాని పెద్దనార్యశిష్యేణ బట్టుమూర్తి మహాకవినా విరచితే వసుచరిత్రే" యను నాంధ్రకౌముదీగ్రంథములోని వాక్యము (ఆంధ్రకవులచరిత్రము ద్వితీయభాగానుబంధము 197 వ పుట) స్పష్టపఱచుచున్నది. మఱియు బట్టుమూర్తి కృష్ణదేవరాయల యాస్థానమునందలి యష్టదిగ్గజములలో నొకఁడను ప్రసిద్ధియుఁ గలదు.

పైవిషయముల నీక్రింద నుదాహరించు నుత్పలమాలికయుఁ గొంతవఱకు బలపఱచుచున్నది.

"ఉ. లొట్టయి దేటిమాట పెనులోభులతో మొగమోటయేల? తాఁ
గుట్టకయున్న వృశ్చికముఁ గుమ్మరపుర్వని యందురే కదా
పట్టపురాజుపట్టి సరిపల్లెసరాసరి యీయకున్న నేఁ
దెట్టకమాననామతము తీవ్రమహోగ్రభయంకరంబుగాఁ
జిట్టితినా మహాగ్రహపతిన్ మకరగ్రహజర్జరీభవత్
పట్టపుధట్టఫాలఘణిభర్తృజహూక్కృతిపర్జటస్ఫుటా
ఘట్టనఘట్టనాలకవిఘట్టకనిర్గళరాజభృత్యకీ
చట్టచటార్భటీనయనజర్జరకీలలు రాలఁ గావలెన్
జుట్టరికంబునన్ బొగడఁ జూచితినా రజితాద్ర్యధిత్యకా
పట్టణమధ్యరంగగతభవ్యవధూవదనానుషంగసం
ఘట్టశిరస్స్నగాంగఝుషహల్లకజాలసుధాతరంగముల్
చుట్టుకొనన్వలెన్ భవనచోద్యముగా భయదంబుగా మఱిం
దిట్టితినా సభాభవనధింకృతభీమనృసింహరాడ్ద్వజా
తాట్టమహాట్టహాసచతురాస్యసముద్ఘృకుటీతటీసటీ
కోట్టణరోషజాలహృతకుంతితకంఠగభీరనాదసం
ఘట్టవిజృంభమాణగతిఁ గావలె దీవనపద్య మిచ్చి చే
పట్టితినా మణీకనకభాజనభూషణ భాసురాంబరా
రట్టతురంగగంధగజరాజదమూల్యఘనాతపత్రభూ
పట్టణభర్మహర్మ్యఘటపంక్తి చిరాయువనామయంబునై
గట్టిగఁ దోడుతో వెలయఁగావలె నక్కవతీవిఁ జూడుఁడీ
యట్టిటు మందెమేలముల నందఱినింబలెఁ జుల్కఁజూచి యే
పట్టున నైనఁ గేరడము పల్కకుఁడీ పయినమ్మునందులన్

గొట్టుదు దుష్కవిద్విరదకోటులఁ బంచముఖోద్భటాకృతిన్
బెట్టుదు దంష్ట్రముల్ సుకవిబృందముకే నతిభక్తి సారెకున్
గట్టితి ముల్లె లేఁబదియుఁ గాఁ గల నూటపదాఱు లెయ్యెడన్
రట్టడిబట్టుమూర్తి కవిరాయనిమార్గ మెఱుంగఁ జెప్పితిన్."

ఈపద్య మల్లసాని పెద్దనార్యుని కవిగండపెండేరవిషయకమగు నుత్పలమాలికకుఁ బ్రతిగా నగపడుచున్నది.

"ఉ. పూఁత మెఱుంగులుం బసరుపూఁప బెడంగులు సూపునట్టి వా
క్కైతలు జగ్గునెగ్గు నెనఁగావలెఁ గమ్మనఁ గమ్మనవ్వలెన్
రాతిరియుం బవల్ మఱపురాని హొయల్ వెలియారజంబు ని
ద్దాతరితీపులంబలెను దారసిలన్వలె లోఁ దలంచినన్
బ్రాఁతిగఁ బైకొనన్వలెను బైదలికుత్తుకలోని పల్లటీ
కూఁత లనన్వలెన్ సొగసుకోర్కులు రానలె నాలకించినన్
జేతికొలందిఁ గౌఁగిటను జేర్చిన కన్నియ చిన్నిపొన్నిమే
ల్మూఁతల చన్నుదోయివలె ముచ్చటగావలెఁ బట్టిచూచినన్
డాతొడ నున్న మిన్నులమిటారపుముద్దులగుమ్మ కమ్మనౌ
వాతెఱదొండపండువలె వాచవిగావలెఁ బంట నూఁదినన్
గాతలఁ దమ్మిచూలిదొర కైవసపుంజవరాలి సిబ్బెపు
న్మేతెలి యబ్బురంపు జిగి నిబ్బరపుబ్బుగుబ్బిగుబ్బపొం
బూఁతలనున్న కాయసరిపోఁడిమికిన్నెర మెట్లబంతిసం
గాతపుసన్నబంతిబయకారపుఁ గన్నడగౌళపంతుకా
సాతతతానతానలపసందివుటాడెడుగోటమీటుటల్
మ్రోఁతలునుంబలెన్ హరువు మొల్లముగానలె నచ్చతెన్గు రీ
రీతిగ సంస్కృతంబు పచరించెడుపట్టున భారతీవధూ
టీతపనీయగర్భనికటీభవదానపర్వసాహితీ
భౌతికనాటకప్రకరభారతభారతసమ్మతప్రభా
పాతసుధాప్రపూరబహుభంగఘుమంఘుమఘుంఘుమార్భటీ
పాతకతాళయుగ్మలయసంగతిమంచువిపంచికామృదం
గాతతతేహితత్తహితహాథితధంధణుధాణుధింధిమీ
వ్రాతనయానుకూలపదవారకుహూహ్వహహారికింకిణీ
నూతనఘల్లులాచరణనూపురఝూళఝుళీమరందసం
ఘాతవియద్ధునీచకచకద్వికచోత్పలసారసంగ్రహో
యాతకుమారగంధవహహారిసుగంధవిలాసయుక్తమై
చేతము చల్లఁజేయవలెఁ జిల్లునఁ జల్లవలె న్మనోహర
ద్యోతకగోస్తనీఫలమధుద్రవగోఘృతపాయసప్రసా
రాతిరసప్రసారుచిరప్రసరంబుగ సారెసారెకున్."

పయియుత్పలమాలికల రచనను బట్టిచూడఁగా బట్టుమూర్తియుత్పలమాలికయే మొదటిదనియుఁ, పెద్దనయుత్పలమాలిక దాని ధిక్కరించుచుండుటచే నిది తత్పరభావియనియు స్ఫురించుచున్నది. కాన నిదియు బట్టుమూర్తి పెద్దనకాలముననుండి యుండునని సూచించుచున్నది.

వసుచరిత్రపీఠికలో (క్రీ. శ.) 1577 వ సంవత్సరమున జరిగిన పెనుగొండయుద్ధము సూచింపఁబడుటచే బట్టుమూర్తి యంతకుఁ బయిగా జీవించియుండెననక తీరదు. కాఁబట్టి (క్రీ.శ.) 1530 వ సంవత్సరమునకె చనిపోయిన కృష్ణరాయలయాస్థానమున బట్టుమూర్తి యుండుట యసంభవమని కొందరీవిషయమున సందేహించుచున్నారు. చిలుకూరి వీరభద్రరావుగారు జీర్ణకర్ణాటరాజ్యచరిత్రములో (232 వ పుట) రామరాజభూషణుఁడు కృష్ణదేవరాయలకాలములోనివాఁడు కాఁడని స్పష్టముగాఁ జెప్పియున్నారు.

బట్టుమూర్తి (క్రీ. శ.) 1500 వ సంవత్సర ప్రాంతమున జన్మించియున్నను గృష్ణరాయల యాస్థానమున నుండెనని చెప్పుట కవకాశ మున్నదిగదా! ఇట్టి స్థితిలో నితఁడు క్రీ.శ. 1580 వ సంవత్సరమునకుఁ బయిగా జీవించెననుట యెట్లసంభవమగును? ఎనుబదితొంబదిసంవత్సరములవఱకు జీవించినవారిప్పుడును గలరని యెల్లరకును విదితమేగదా! అళియరామరాజు తల్లికోటయుద్ధకాలమునకుఁ దొంబదియేండ్లవాఁడని ఫర్ గాటనెంపైరులో (203 వ పుట) నున్నది. అళియరామరాజు మొదటఁ గుతుబ్ షాయొద్ద సేనానిగా నుండి పిదపఁ గృష్ణరాయల నాశ్రయించెనని వీరభద్రరావుగారే వ్రాసియున్నారు. (జీర్ణకర్ణాటరాజ్యచరిత్రము 250 వ పుట) కృష్ణరాయలకాలమునందు యుక్తవయసులోనున్న యళియరామరాజు తల్లికోటయుద్ధకాలమునకును (క్రీ.శ. 1565) యుద్ధము చేయుటకుఁ దగినశక్తి గలిగియుండలేదా!

బట్టుమూర్తి యిట్లు మొదటఁ గృష్ణరాయల యాస్థానమునందు సన్మానింపఁబడి పిదప నరసభూపాలీయమును రచించెను. రామరాజు సభ నలంకరించి రామభూషణబిరుదముం గాంచెను. పిదప వసుచరిత్రహరిశ్చంద్రనలోపాఖ్యానములను రచించి వసుచరిత్రమును దిరుమలరాయలకును హరిశ్చంద్రనలోపాఖ్యానమును శ్రీరామదేవతకును గృతియిచ్చి యిహపరములను సాధించుకొనెను.

“శా. శ్రీరామక్షితిపు న్మదగ్రజు జయశ్రీలోలు నానాకళా
పారీణుం బహుసంస్కృతాంధ్రకృతులం బల్మారు మెప్పించి త
త్కారుణ్యంబున రత్నహారహయవేదండాగ్రహారాదిస
త్కారం బందితి రామభూషణకవీ! ధన్యుండ వీ వన్నిటన్.” (వసు. ఆ. 1. ప. 16.)

అను వసుచరిత్రములోని పద్యమును బట్టి చూడఁగా నీతఁ డింకను ననేకకృతులు రచించినట్లు విశదమగుచున్నది.

బంగారమునకు వెలిగారమువలె నీమహాకవి కవితాధారకు సంగీతనైపుణి తోడుపడుటచే నీతఁడు బహిరంతస్స్ఫురద్రసములగు పద్యములు రచింపఁగలిగెను.

ఉ. తేనియలొల్కు మాటలును దీసినతీఁగెలుపోని కూర్పులున్
వీనులవిందుచేసెడు నవీనమృణాళమృదూక్తివైఖరుల్
తో నరుదెంచు వ్యంగ్యములతో నలరారెడు నైజభాషణల్
పూనక కూర్చు రామనృపభూషణునైపుణ మెన్న శక్యమే.

వజ్ఝల. చినసీతారామస్వామిశాస్త్రి,
శ్రీవిజయనగరమహారాజావారి సంస్కృతకళాశాలాపండితుఁడు.

# తప్పొప్పుల పట్టిక.

| పుట. | పంక్తి | తప్పు. | ఒప్పు. | పుట. | పంక్తి | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|---|---|---|---|
| 4 | 9 | ప్రశస్తం | ప్రశస్తిం | 32 | 13 | లఁతి | లలఁతి |
| 5 | 14 | రత్నమయంబును, | రత్నమయంబును | ,, | 18 | మెలికిన | లొలికిన |
| ,, | 18 | ప్రీతుండు | ప్రియుండు | ,, | 30 | మోహవాశ | మోహపాశ |
| 6 | 29 | ఓరఁగా | ఓరగా | 33 | 3 | పదములు | పద్యములు |
| 7 | 4 | మహీబాలుని | మహీపాలుని | ,, | 25 | మాడాడదు | మాటాడదు |
| 9 | 28 | చెప్పున | చొప్పున | ,, | 30 | వన్న | వన్నె |
| | 29 | నిమర్ష | విమర్ష | 34 | 14 | బింబానన్ | బింబాననన్ |
| 10 | 15 | చెప్పున | చొప్పున | 34 | 30 | గొప్పు | గప్పు |
| 12 | 13 | 2-30 | 2-20 | 35 | 1 | గెమలించు | దెమలించు |
| ,, | 36 | 3-119 | 3-19 | 35 | 4 | బ్బిస | వ్విస |
| 14 | 9 | ఏడ్పు | యేడ్పు | ,, | 7 | ఁబఱ | ఱర |
| ,, | ,, | 48-87 | 4-87 | ,, | 6 | గోరుఁ | గోరు |
| 16 | 7 | పూర్వకవుల | పూర్వపూర్వకవుల | 36 | 14 | సైపన్ | సైఁపన్ |
| ,, | 13 | సంగతి | విషయము | ,, | 26 | కాంతులను | కాంతులును |
| ,, | 29 | 3. ప. 35 | 2. ప. 35 | ,, | ,, | నాయికకు | నాయికను |
| 17 | 3 | ప్రకాశంబు | ప్రతీకాశంబు | 37 | 17 | కన్యకన్ | కన్యకున్ |
| 18 | 12 | ఉత్తరహరివంశము | ఉత్తరహరివంశము 5-98 | 38 | 17 | మలది | మలఁది |
| | | | | ,, | 19 | లెన్నని | లెన్నేని |
| ,, | 18 | జిలక | జిలుక | 39 | 22 | హాసనీయు | హసనీయ |
| 21 | 19 | భిత్తికఁగా | భిత్తికగా | ,, | 32 | యాకడింది | నాకడింది |
| 22 | 8 | జిలుకకు | చిలుకకు | 40 | 6 | నసుచరించియున్నది | ననుసరించియున్నవి |
| ,, | 14 | సంగతి | విషయము | ,, | 14 | కురూపి | కురూపియగు |
| 23 | | కాళిదాసు | కాళిదాసుని | ,, | 30 | దోచినట్లుఁ | దోఁచినట్లు |
| 25 | 1 | మాతస్య | దూతస్య | 41 | 21 | మోఁగెదు | లోఁగెదు |
| ,, | 8 | బాతి | జాతి | 42 | 25 | దోడ్వాడై | దోడ్వాటై |
| 26 | 26 | 5 ప 43 | 5 ప 45 | 43 | 18 | మఱలఁ | వఱలఁ |
| ,, | 30 | పుట్టె | పుట్టెఁ | 44 | 4 | గొనుదీఁగ | గొనుఁదీఁగ |
| 27 | 2 | మహాపాల | మహీపాల | 45 | 24 | పరిణయమును | పరిణయము |
| ,, | 32 | మేఁగఁ | వేఁగఁ | ,, | ,, | పిల్లపసుచరిత్రము | వసుచరిత్రము |
| ,, | 27 | నకేకచోట్ల | ఁగొన్నిచోట్ల | 46 | 6 | నక్కగ | నక్కఱ |
| 28 | 23 | క్రీడా | గ్రీడా | 47 | 4 | దేల్పుచు | దేల్చుచు |
| ,, | 27 | నున్నయది | నున్నయవి | ,, | 21 | సారమ్మై | సారమై |
| 29 | 12 | నిడున్ | నిడన్ | 48 | 23 | పలుమారు | పలుమాఱు |
| 30 | 11 | దప్పుచేసి | దప్పుఁజేసి | 49 | | కాఁగఁ | కాఁగ |
| ,, | 28 | జిష్మేటి | జష్మేటి | 51 | 5 | చిరకాలమునుంచి | చిరకాలమునుండి |

# తప్పొప్పుల పట్టిక.

| పుట. | పంక్తి | తప్పు. | ఒప్పు. | పుట. | పంక్తి | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|---|---|---|---|
| 51 | 22 | మూర్తి | "మూర్తి | 77 | 19 | లిదివఱను | లీవఱకు |
| 53 | 15 | యుతుఁడు | యుతుఁడ | ,, | 23 | యుతము | భూతము |
| 54 | 10 | చరిత్రము | చరిత్రము" | ,. | 27 | భీభత్స | బీభత్స |
| 57 | 10 | విశ్వనసీయము [వి | విశ్వసనీయము" | 78 | 4. | భీభత్స | బీభత్స |
| ,, | 29 | నరసభూపాలీయక | "నరసభూపాలీయ | | 31 | | |
| 58 | 7 | పొట్టయిదేటి | లొట్టయిదేటి [కవి | ,, | 16 | ఆ 2. 1. ప 72 | ఆ 2 ప 72 |
| 58 | 8 | పోయినవి | పోయినవి" | 79 | 6.7 | భీభత్స | బీభత్స |
| 59 | 33 | సంగతి | విషయము | | 8.8 | | |
| 60 | 8 | దోచుమున్నది | దోఁచుచున్నది | | 9 | | |
| 63 | 6 | ఆదివఱకు | ఆనఱకు | ,, | 24 | నట్టినికృష్ట | నదినికృష్ట |
| 64 | 20 | విప్లవమున | పిప్లవముగాని | ,, | 28 | నిష్టాయామ్ | నిష్ఠాయామ్ |
| 65 | 4 | పునరుద్ధారణమే | పునరుద్ధరణమే | ,, | 29 | నిష్ట | నిష్ఠ |
| ,, | ,, | యదివఱకు | యావఱకు | | 31 | | |
| ,, | 18 | గొంతవఱకు | గొంతవఱకుఁ | 80 | 3 | రసాభావౌ | రసభావౌ |
| ,, | 25 | ఆ. 2 ప 43 | ఆ. 3. ప. 7. | ,, | 4 | ఊర్జస్వీ | ఊర్జస్వి |
| 66 | 26 | కల్పనము | గల్పనము | ,, | 6 | ఉదహరించి | ఉదాహరించి |
| 68 | 13 | గుండవి | గుండలి | ,, | 34 | పూన | పూని |
| ,, | 24 | వలసి | వలచి | 81 | 11 | నాయకునొద్దనుంచి | నాయకునొద్దనుండి |
| 69 | 22 | యిదివఱకు | యీవఱకు | ,, | 22 | కర్మజ్ఞః" అని | కర్మజ్ఞ" యని |
| ,, | 28 | అగా | అభూ | | 23 | | |
| 70 | 9 | దీర్ఘాలయా | దీర్ఘాలయాం | 85 | 29 | సచివుని...య | సచివుని...అ |
| ,, | 19 | మార్పున | మార్పునఁ | 86 | 5 | ప్రకృత | బ్రకృత [య్యో |
| ,, | 31 | ఆ. 5. ప 201 | ఆ. 5. ప. 207 | ,, | 8 | నుపయోగించెను | నుపయోగింపఁడ |
| 71 | 2 | లక్ష్యంబులో | లక్ష్యంబులా | ,, | 24 | శ్లేషములని | శ్లేషమని |
| 72 | 14 | సంగతులిది | విషయములీ | 87 | 19 | శేషః | శ్లేషః |
| ,, | 15 | వారలు | వారగు | ,, | 21 | మరార్ధం | మపరార్ధం |
| 74 | 4 | లేవుగదా! కాఁబట్టి | లేవుగదా! పైడిమఱ్ఱి | 88 | 26 | సంగతులు | విషయములు |
| | | | వేంకటపతి పేరొ్క- | 89 | 13 | యకా | యికా |
| | | | నిన (చంద్రాంగ చరి | | 3 | యొకటియు | మొకటియుఁ |
| | | | త్రమున) కృష్ణరాయ | 90 | 10 | యోహో | నోహో |
| | | | భూషణుఁడప్రసిద్ధ | ,, | 18 | బడుట | బడుటఁ |
| | | | డయి యుండలేదా? | ,, | 19 | గనుట | గనుటఁ |
| | | | చూ॥ కవులచరిత్ర | ,, | 32 | కవి | ఁగవి |
| | | | ఇష్టే | 91 | 16 | యందంతటను | మందంతటను |
| 76 | 12 | సాధకమగునా | బాధకమగునా | 92 | 3 | అనియిట్లు | యనియిట్లు |
| ,, | 31 | దదివఱకే | డావఱకే | 93 | 3 | దేవతలను | దేవతను |
| 77 | 5 | కావ్యమునఁ | కావ్యమునఁ | ,, | 15 | యుక్తమ్" | యుక్త"మ్మను |
| ,, | 16 | బరగు | బరఁగు | ,, | 16 | అనువీనికి | వీనికి |

# తప్పొప్పుల పట్టిక.

| పుట | పంక్తి | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 93 | 31 | హుతవహాదుల | హుతవహాది |
| 94 | 2 | మునమా | ముపమా |
| ,, | 3 | ఆ. 4. | ఆ. 5. |
| ,, | 20 | శ్లో. 20 | శ్లో. 18 |
| ,, | 25 | అను | యను |
| ,, | 26 | నలుగురి | నలుఁగుర |
| 95 | 11 | నిదివఱకే | నీవఱకే |
| ,, | 14<br>15 | విస్తరమ్'' అనుదాని | విస్తర'' మ్మనుదాని |
| ,, | 16 | మృతబాక | మృతపాక |
| ,, | 17 | పఱచి | పఱచి'' యనియు |
| ,, | 20 | ననుదాని | న్ననుదాని |
| ,, | 26<br>27 | అడరున్'' అనియు | అడరు''ననియు |
| 96 | 20 | వ్రాయఁబడినవి | వ్రాయఁబడెను |
| 98 | 17 | సమాగమాభి | సమాగమాది |
| ,, | 30 | లిదివఱకే | లీవఱకే |
| ,, | 34 | కాళిదాసుఁగు | గాళిదాసుఁడు |
| 99 | 21 | అనుదానికి | యనుదానికి |
| ,, | 23<br>24 | లీలాన్''అనియు | లీలా''యనియు |
| ,, | 27 | జాలియున్నది | జాలియున్నవి |
| 100 | 11 | కర్తసదము | కర్తృపదము |
| ,, | 25 | నిదివఱకు | నీవఱకు |
| 101 | 5 | గిరికా | గిరిక |
| ,, | 17 | న్యత్ర్య | న్యత్ర |
| 102 | 30<br>31 | పత్''అను | ప''త్తను |
| 103 | 15 | నికృతము | నిరాకృతము |
| ,, | 22 | తెనాలి | ఁదెనాలి |
| ,, | ,, | యోచించు | యోజించు |
| ,, | 26 | కవి | ఁగవి |
| ,, | 34 | అని | నని |
| 104 | 1 | కపకర్ష | కపకర్షముఁ |
| ,, | 7 | స్కారములే | స్కారకములె |
| ,, | 9 | నొకప్పు | లొకప్పు |
| ,, | 13 | నిహతార్థా ర్థి | నిహతార్థా |
| 105 | 3 | సిద్ధ్యి | సిద్ధైర్యి |
| 105 | 5 | నుండబోదని | నుండఁబోదని |
| ,, | 7 | అపభ్రం | యపభ్రం |
| 106 | 9 | లక్ష్మీది | లక్ష్మ్యాది |
| ,, | 30 | కూడ్డాడు | కూడ్దాడు |
| 107 | 1 | స్తులువలె | స్తులవలె |
| ,, | 3 | చింతామణి | కావ్యాదర్శము |
| ,, | 7 | కవులు | కవులుశ్లేషించి |
| ,, | 9 | లిప్పుడు | లిప్పుడు కేవల [ములై |
| ,, | ,, | కములై | కములై యగ్రాహ్య |
| ,, | 10 | యింక | యింక, యనుష్ఠించు |
| ,, | 14 | శ్రయమ్ | శ్రయాత్ |
| ,, | 15 | కత్ష్యం | కత్షం |
| ,, | 19 | మదాం | మడాం |
| ,, | 28 | గ్రాథిక | గ్రాంథిక |
| 108 | 4 | ర్వంబను | ర్వణంబను |
| ,, | ,, | న్ననుచోట | ననుచోట |
| ,, | 5 | న్ననియుఁ | ననియు |
| ,, | 7 | ప. 59 | ప. 89 |
| ,, | 24 | వాక్యాంత | పాదాంత |
| 109 | 8 | మునగు | మునకు |
| 110 | 7 | చోటదే | చోటసే |
| ,, | 11 | గ్రుంచి | గ్రుంకి |
| ,, | 22 | ఁబలపడినవి | బలపడినది |
| 112 | 25 | పచ్చునట్లు | నచ్చినట్లు |
| ,, | 27 | స్తతోఽభూత్ | స్తతోఽభూ |
| ,, | 30 | ఖడ్గై | యఃఖడ్గై |
| 114 | 11 | జన్మమధ్యమున నొకమాఱు | యొకమాఱు |
| ,, | 20 | త్రైవ్యహాల్ల | త్రైవ్యవాల్ల |
| 116 | 5. 6 | క్షమాః'' అని | క్షమా'' మ్మని |
| 117 | 5 | రేఖాః | రేఖా |
| ,, | 9 | బిరుదాః | బిరుదః |
| 118 | 2 | దాని | కాని |
| ,, | 22 | రాయప్రతా | రాయలప్రతా |
| 119 | 19 | సంగతు | విషయము |
| ,, | 6 | గృతము | గృతిము |
| ,, | 21 | డేలుచున్నది | దేలుచున్నవి |
| ,, | 25 | ద్విజ్జలేంద్రో | ద్విజ్జలేంద్రో |

# తప్పొప్పుల పట్టిక.

| పుట. | పంక్తి | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 119 | 29 | కల్యాణ | ఁగల్యాణ |
| 120 | 16 | యనియు | యనియుఁ |
| ,, | 24 | యతనిగిరి | యవనిగిరి |
| 121 | 23 | బడినవి | బడినవి. (చూ 134 పుట) |
| ,, | 31 | పెరిస్తా | ఫెరిస్తా |
| 122 | 26 | నామదా | నాముదా |
| ,, | 29 | బాలించిరి, | బాలించిరి * |
| ,, | 31 | మునకుఅదిల్ | మునకదిల్ |
| ,, | ,, | పతికిఆదిల్ | పతికదిల్ |
| ,, | 34 | మూచునది. | చూచునది * |
| 123 | 23 | బెరిగిన | బెరఁగిన |
| ,, | 34 | హోతం | హొంత |
| 124 | 12 | యుచితమే | =నుచితమే |
| ,, | 16 | మునసూచించుచున్నవి | మసూచించుచున్నది |
| 125 | 4 | అదిల్షా | యాదిల్షా |
| 126 | 4 | గాంచు; | గాంచుఁ; |
| ,, | 8 | పరబుద్ధి | ఁబరబుద్ధి |
| 127 | 10 | దివ్య | దీవ్య |
| ,, | 13 | పజీర్ణ | పజీర్ల |
| ,, | 21 | ప్రదాహ | ప్రవాహ |
| ,, | 22 | జదుడై | జడుఁడై |
| 128 | 19 | రికిని | రకును |
| ,, | 25 | పాయునను | పాయున |
| ,, | 30 | చెన్నపురి | జైన్నపురి |
| 130 | 8 | పై యంశ | ఁబై యంశ |

| పుట. | పంక్తి | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 131 | 8 | జ్యమును | జ్యము |
| ,, | 21 | మిత్రుఁడు | మిత్రుని |
| ,, | 22 | దీసికొనలేదా! | దీసికొనలేదా? (చూ 128 పుట) |
| 132 | 3 | యున్నారు. | యున్నారు (చూ 123 పుట) |
| 133 | 11 | అనియున్నది | యనియున్నది |
| 134 | 6 | శోమ | సోమ |
| ,, | 16 | భునీమల్ల | భువనీమల్ల |
| ,, | 26 | కథావసర | కథనావసర |
| ,, | 8 | విశృతేః | విశ్రుతేః |
| 136 | 8 | వద్దకొన్ని | యొద్దఁగొన్ని |
| ,, | 30 | బలంబునఁ | బలంబులఁ |
| 138 | 2 | మార్గశర | మార్గశిర |
| ,, | 31 | విషయిక | విషయక |
| 139 | 3 | మహే | మహై |
| 140 | 4 | వారోక | వారికోక |
| ,, | 21 | పర్గా | ఫర్గా |
| ,, | 31 | మోదుకో | మోదుకూ |
| 141 | 1 | యున్నారు. | యున్నారు (చూ 51 పుట) |
| ,, | 25 26 | శిక్షించెననియు | శిక్షింప |
| 142 | 25 | భవన | భువన |
| 143 | 27 | పాతక | జాతక |
| ,, | 35 | సారుచి | సారరుచి |
| 144 | 33 | పజ్ఝల | పజ్ఝల |